Islam ka Tasavvure Masavat
(Telugu)

సత్యధర్మంలో సమతాభావం

రచన

సుల్తాన్ అహ్మద్ ఇస్లాహీ

అనువాదం

అబ్దుల్ వాహెద్

يَاَيُّهَا النَّاسُ اِنَّا خَلَقْنٰكُمْ مِّنْ ذَكَرٍ وَّاُنْثٰى وَجَعَلْنٰكُمْ شُعُوْبًا وَّقَبَآئِلَ لِتَعَارَفُوْا اِنَّ اَكْرَمَكُمْ عِنْدَ اللّٰهِ اَتْقٰكُمْ ۔ اِنَّ اللّٰهَ عَلِيْمٌ خَبِيْرٌ

(القرآن الحکیم)

"ఓ ప్రజలారా! మేము మిమ్మల్ని ఓ స్త్రీ పురుషుల (జంట) ద్వారా పుట్టించాము. మీ పరస్పర గుర్తింపు కొరకు మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా విభజించాము. మీలో దైవం పట్ల అత్యంత భయభక్తులు గలవారే దైవానికి అతి సన్నిహితులు. అల్లాహ్ అన్నీ తెలిసినవాడు (అన్నింటి) జ్ఞానం కలవాడు"

(దివ్య ఖుర్ఆన్)

"ప్రజలారా! మీ అందరి దేవుడు ఒక్కడే. మీరందరూ ఒకే తండ్రి సంతానం. అరబ్బుకు అరబ్బేతరునిపై ఎలాంటి ఆధిక్యం లేదు. అలాగే అరబ్బేతరునికి అరబ్బుపై కూడాను. తెల్లవారికి నల్లవారిపై, నల్లవారికి తెల్లవారిపై ఎలాంటి ఆధిక్యం లేదు. కేవలం దైవం పట్ల భయభక్తులు గలవారు తప్ప. మీలో దైవం పట్ల అత్యధిక భయభక్తులు గలవారే దైవానికి అతి సన్నిహితులు."

– *మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)*

విషయసూచిక

1. **నేపథ్యం** 9

అమెరికాలో స్వేచ్ఛ 9

యూరప్‌లో సమానత్వం 10

లోపాలు – వ్యతిరేక భావనలు 13

జర్మన్ ఐడియలిజం 14

రోమాన్సిజం 15

నేషనలిజం 15

రేసిజం 16

ఫాసిజం ఉచ్ఛదశ 18

బోల్షివిజం 19

మతాల పాత్ర 21

హైందవం 22

యూద మతం 29

బౌద్ధమతం 32

క్రయిస్తవం 34

సిద్ధాంతాలు, మతబోధనల వైఫల్యం 36

ప్రపంచ పరిస్థితులు 38

2. **సమానత్వ సాధనలో ఇస్లాం పాత్ర** 40

ఇస్లాంలో సమానత్వ భావన 40

సమతాభావానికి పునాదులు 41

1. సమస్త మానవులు ఆదం (అస) హవ్వాల సంతానం 42

2. సమస్త మానవులను సృష్టించిన విధానం ఒక్కటే 42

3. సమస్త మానవుల సృష్టి ఒకేవిధమైన శ్రద్ధతో జరిగింది 44

4. దైవదాస్య ప్రమాణంలో మానవులందరూ ఉన్నారు 44

5. ప్రాతినిధ్య బాధ్యత మానవులందరిపై సమానంగా ఉంది 46

6. సమస్త మానవులకు గౌరవమర్యాదలు 47

7. బౌద్ధిక శక్తిసామర్థ్యాల సమానత్వం 47

జాతుల విభజనలోని వివేచన 48

సామాజిక బాధ్యతలు 49

నాగరికత వికాసం 50
నేరనిరోధన 52
కుటుంబ వ్యవస్థను స్థాపించడం 54
సంబంధ బాంధవ్యాలు 54
వారసత్వం 56
ధర్మబద్ధమైన, నిషిద్ధమైన బాంధవ్యాలు 56
వంశ పరిరక్షణ 57
ప్రవక్తలతో సంబంధం 58
ఔన్నత్యానికి ప్రమాణం దైవభీతి 60
నైతిక ఔన్నత్యం 64
అసమానతలు 65
జాతి, వర్ణం 68
భాష 69
ప్రాంతీయతత్వం 71
వృత్తి 72
వివక్షకు వ్యతిరేకంగా ఇస్లాం పోరాటం 74
తాత్కాలిక కారణాలు 76
స్థాయి భేదాలు పరీక్షలే 85
ఇస్లాం దృష్టిలో అసమానతల కారణాలు 86
ధార్మిక విశ్వాసం దైవసాన్నిహిత్యం 92
జాత్యాహంకారానికి పునాది 93

3. జీవనరంగాల్లో నైతిక ఔన్నత్యం 95

1. ప్రవక్తల వారసత్వం 95
2. నమాజుకు ఇమామత్ చేయడం, అజాన్ ఇవ్వడం 96
3. ఇమామ్‌తో సామీప్యం 97
4. ప్రభుత్వం రాజకీయం 98
5. సాక్ష్యం 99
6. వివాహం 101
7. అంతిమ సంస్కారాలు 102
8. సామాజిక సంబంధాలు 103

	ప్రతి వర్గంతోను మంచి వ్యవహారశైలి	103
	చట్టపరమైన రక్షణలు	111
	విశ్వాసాలు	111
	దేవుడు	112
	ప్రవక్త	112
	ఖుర్‌ఆన్	114
	ఆరాధనలు	115
	ఆరాధనల కేంద్రం	116
	సామాజిక సంబంధాలు	117
	పౌరహక్కులు	119
	న్యాయం	132
	పరిహారం	134
	అవయవాల విషయంలో సమానత్వం	136
	పరిహారం విషయంలో సమానత్వం	138
	నేరస్మృతి	139
	చారిత్రక సాక్ష్యాలు	141
	సైన్యానికి నాయకత్వం	143
	నమాజుకు నాయకత్వం	143
	ఖుర్‌ఆన్, ధార్మిక విద్యాబోధన	145
	గవర్నర్ పదవి	146
	శరణు	147
	సాధారణ జీవితం	147
4.	**ఇస్లామీయ సమతాభావంపై విమర్శలు – జవాబులు**	150
	జిజియా	153
	కిఫాలత్	155

ముందుమాట

మానవులంతా సమానులన్న నినాదం నేడు ప్రపంచంలో మిన్నంటుతోంది. ప్రపంచం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్య కూడా సమానత్వానికి సంబంధించినదే. సమస్త ప్రపంచ మానవాళిని సమానంగా చూడాలి. ఒకేలా వ్యవహరించాలి. జాతి, రంగుల ఆధారంతో మానవుల మధ్య అసహజ తారతమ్యాలు ఉండరాదన్న నినాదాలు ఉచ్ఛస్థాయిలో వినిపిస్తున్నాయి. ఈ పుస్తకంలో మేము ఇస్లామీయ దృక్పథాన్ని వివరిస్తూ, ఇస్లాంలోని వివేచనతో నిండిన సుగుణాలు మీ ముందుంచే ప్రయత్నం చేసాము. నైతికంగాను, చట్ట పరంగాను అన్ని కోణాలలోనూ మానవ సమాజాలలో స్వేచ్ఛను సమానత్వాన్ని సాధించడం, సామాజిక నిమ్నోన్నతలను, విభజనలను, అంతం చేయడం కేవలం ఇస్లామీయ బోధనల ద్వారా మాత్రమే సాధ్యమని చాలామంది అంగీకరిస్తారు. నేటికి 1400 సంవత్సరాల పూర్వం ఇస్లాం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా ఇస్లాంలోని మనోహర సామాజిక చిత్రాన్ని దర్శించే భాగ్యం ప్రపంచ మానవాళికి కలిగింది. చరిత్రలో అలాంటి మహోజ్వలమైన ఘటనకు మరో ఉదాహరణ లేదు. అంతకు ముందు గాని, ఆ తర్వాత గాని ప్రపంచం అలాంటి చరిత్ర చూడలేదు. చివరికి శతాబ్దాల తరబడి జరిపిన మేధో అన్వేషణల ఫలితంగా ఇటీవలి కాలంలో రూపుదిద్దుకున్న తీర్మానాలు, పత్రాలు సయితం ఇస్లామీయ సామాజిక వ్యవస్థ ముందు దిగదుడుపుగానే మిగిలిపోయాయి. ఈ మానవ కాల్పనిక వ్యవస్థలు కేవలం కొన్ని ప్రత్యేక పరిస్థితుల ఫలితంగా పుట్టినవిగా, పరిమిత పరిధిగలవిగా, యావత్ ప్రపంచానికి వర్తించే శక్తిలేనివిగా మాత్రమే మిగిలిపోయాయి. ఇస్లాం తప్ప ఇతర మత ధర్మాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇవన్నీ మానవ సమాజాలకు స్వేచ్ఛను, సమానత్వాన్ని ప్రసాదించడంలో విఫలమయ్యాయి. కొన్ని సందర్భాల్లో మత ధర్మాలు బోధించే వ్యవస్థలు లౌకికవాద వ్యవస్థకు కన్నా ఎక్కువగా వివక్షల దౌర్జన్యాలకు పాల్పడ్డాయి.

మానవ సమాజాలకు స్వేచ్ఛను, సమానత్వాన్ని ప్రసాదించడంలో ఇస్లామీయ దృక్పథం విశ్వజనీనమైనది. స్వేచ్ఛ, సమానత్వాల స్థాపనకై ఇస్లాం అత్యంత దృఢమైన

నియమాలను విధించింది. అందుకు అవసరమైన పునాదులు వేసింది. ఇస్లాం కేవలం నైతిక ప్రేరణను ప్రసాదించి ఊరుకోలేదు. సమగ్రమైన శాసనాలతో చట్టపరమైన భద్రత కల్పించింది. ఆ విధంగా నిమ్నోన్నతలను సంపూర్ణంగా సమూలంగా పెకలించింది. ఒక అంతర్జాతీయ సమానత్వ భావనకు రూపమిచ్చింది. సౌభ్రాత్రత, సమానత్వం, సమతా భావాలకు నిరుపమానమైన ఉదాహరణగా నిలిచింది. కాగా, స్వేచ్ఛ, సమానత్వం అన్న భావనలను ప్రచారం చేసే సమాజాలు నిజానికి సమానత్వాన్ని పూర్తిస్థాయిలో సాధించలేక పోయాయి. నిమ్నోన్నతలు, అన్యాయాలకు నిలయాలుగానే కొనసాగాయి. ఈ సందర్భంగా ఇస్లాంలోని స్వేచ్ఛ, సమానత్వాల విశ్వజనీన భావనల గురించి పుట్టే కొన్ని ప్రశ్నలకు ఈ పుస్తకంలో జవాబీయడానికి ప్రయత్నించాము.

ఈ పుస్తకంలోని ప్రతిమాట ఆధారపూర్వకంగా రాయబడింది. సాధ్యమైనంత వరకు విషయాన్ని గురించిన పూర్తి వివరాలు పొందుపరిచే ప్రయత్నం చేసాము. ఏమైనా లోపాలు ఉండే అవకాశం ఉండకపోదు. శ్రేయోభిలాషులు లోపాలను సూచిస్తే రానున్న ముద్రణలో సవరించగలము. అలాంటి వారికి మా కృతజ్ఞతలు. వారికి దైవం కూడా తగిన ప్రతిఫలం తప్పక ప్రసాదిస్తాడు.

ఈ పుస్తకంలోని అధికశాతం వ్యాసాలు తహ్ఖీఖాతె ఇస్లామీ, జిందగీ, ముహద్దిస్, హయాతె నౌ, రఫీఖె మంజిల్ తదితర పత్రికలలో ప్రచురిత మయ్యాయి. ఆయా పత్రికల సంపాదకులకు నేను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

గౌరవనీయులు మౌలానా సద్రుద్దీన్ సాహెబ్ ఇస్లాహీ గారికి నేనెంతయినా రుణపడి ఉన్నాను. ఆయన మార్గదర్శకత్వం నా మార్గాన్ని సుగమమం చేసింది. మౌలానా జలాలుద్దీన్ సాహెబ్ ఉమ్రిగారికి కృతజ్ఞతలు తెలుపడం నాకు పదాలలో సాధ్యపడదు. ఆయన చూపిన మార్గం వల్ల నా లోని లోపాలను దూరం చేసుకునే అవకాశం దొరికింది. పేరు తెలియని ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు. వారి వల్లనే నాకు జ్ఞానంతో పరిచయం కలిగింది. దైవం వారికి దీర్ఘాయుష్షు ప్రసాదించు గాక. వారిలో మరణించిన వారికి దైవం ఉత్తమగతులు ప్రసాదించుగాక.

దైవం నా ఈ ప్రయత్నాన్ని స్వీకరించాలని, భవిష్యత్ పయనంలో ఆటంకాలను దూరం చేయాలని ప్రార్థిస్తున్నాను... ... .. ఆమీన్.

పాన్‌వాలి కోఠీ, అలీగఢ్
10 రబీఉల్ అవ్వల్ 1404
16 డిసెంబర్ 1983

- సుల్తాన్ అహ్మద్ ఇస్లాహీ

మొదటి అధ్యాయం

నేపథ్యం

మానవ జీవితంలో కొన్ని విలువలకు ఎల్లప్పుడూ గౌరవప్రదమైన స్థానం లభిస్తూ వచ్చింది. వాటిని పొందడం జీవితంలో అతిముఖ్య ధ్యేయంగా మనిషి పరిగణిస్తూ వస్తున్నాడు. నేటి నాగరిక ప్రపంచంలో ఈ విలువల ప్రస్తావన ఉధృతంగా ఉందన్నది వేరే విషయం. నలుదిక్కులూ ఈ ప్రస్తావన తోనే మారుమ్రోగుతున్నాయి. ఉదాహరణకు శాంతి, స్వేచ్ఛ, సామాజిక న్యాయం, మౌలిక హక్కులు వగైరా నినాదాలను పరిశీలిస్తే, ప్రస్తుత ప్రపంచంలో ఇలాంటి విలువలు కేవలం మాటలకే పరిమితమైపోయాయి. నేటి నాగరిక ప్రపంచంలోని ప్రతి వ్యక్తి ఈ విలువలను ఒప్పుకుంటున్నాడు. ఈ విలువల గురించి వాదించడం తన బాధ్యత అని అనుకుంటున్నాడు. జన సామాన్యంలో వీటి గురించి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వాల స్థాయిలో కూడా ఈ చర్చల ప్రతిధ్వని వినిపిస్తూనే ఉంది. ప్రస్తుత ప్రపంచం ఆమోదించిన విలువల్లో సర్వమానవ సమానత్వం ముఖ్యమైనది. సమానత్వం అంటే ప్రపంచం లోని సమస్త మానవులు పుట్టుకరీత్యా సమానులే కాబట్టి వారికి సమాన హక్కులు, అధికారాలు లభించాలి. సమానత్వంతో పాటు సాధారణంగా స్వేచ్ఛ, సౌభ్రాత్రల ప్రస్తావన కూడా వస్తుంది. ఎందుకంటే ఇవి కూడా సమానత్వానికి సంబంధించినవే. స్వేచ్ఛ, సౌభ్రాత్ర ల భావనలు లేనిదే సమానత్వ భావన అసంపూర్ణంగా మిగిలిపోతుంది.

అమెరికాలో స్వేచ్ఛ

ఇటీవలి కాలంలో ప్రభుత్వపరంగా పైన చెప్పిన విలువల ప్రస్తావన ప్రప్రథమంగా మనకు అమెరికాలో జులై 4, 1776లో చేసిన స్వేచ్ఛా ప్రకటన (అమెరికన్ డిక్లరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్)లో కనబడుతుంది. ఈ ప్రకటనలో స్వేచ్ఛ అన్నది స్వతస్సిద్ధమైన వాస్తవంగా ఆమోదించారు.

"సమస్త మానవులు ఒకేలా జన్మించారు. మానవులకు వారి సృష్టికర్త తరఫున కొన్ని

హక్కులు ప్రసాదించబడ్డాయి. ఈ హక్కులు నిరాకరించలేనివి. ఉదాహరణకు జీవించే హక్కు, స్వేచ్ఛ, సంతోషంగా ఉండే హక్కు వగైరాలు."[1]

అప్పుడు ఈ విలువలను సమర్థించిన వారిలో జాన్ ఆడమ్స్, థామస్ జాఫర్‌సన్, థామస్ పైన్‌ల పేర్లు ప్రత్యేకంగా ప్రస్తావించదగినవి.

యూరప్‌లో సమానత్వం

అమెరికా సంయుక్త రాష్ట్రాలు బ్రిటన్ నుంచి స్వేచ్ఛ పొందడం, దానితో పాటు స్వేచ్ఛ గురించిన ప్రకటన వెలువడడంతో సమానత్వ భావన ప్రారంభ మైందనుకుంటే పొరబాటు. నిజానికి సమతా భావం గురించిన చిహ్నాలు మనకు యూరప్‌లో రోమన్ కాలం నుంచి లభిస్తాయి. రోమన్ శాసనాల్లో స్టూయిజం కాలంలో మానవ స్వేచ్ఛ, సౌభ్రాత్రత, సమానత్వాల భావనలు ఉన్నాయి. ఆ తరువాత రోమన్ సామ్రాజ్యంలో మరో రెండు ముఖ్యఅంశాలు చోటు చేసుకున్నాయి. ఓ వైపు క్రయిస్తవం వచ్చింది. మరోవైపు ట్యూటానిక్ జాతుల ప్రాబల్యం పెరిగింది. ఈ రెండు మానవ స్వేచ్ఛా సమానత్వాలను సమర్థించాయి. క్రయిస్తవ ధర్మం పునాదులు ఈ విలువలపై నిర్మించబడ్డాయి. ఏసుదృష్టిలో మానవులంతా ఒక్కటే. మానవ జీవితంలో అసలు ప్రాముఖ్యం వ్యక్తికే ఉంది. కొత్త నిబంధన ప్రకారం.

"యూదుడెవరు లేడు, గీక్రులెవరూ లేరు. బానిస ఎవరూ లేడు, యజమాని లేడు, స్త్రీ లేదు, పురుషుడు లేడు. ఎందుకంటే మీరంతా ఏసులో ఒక్కటే" (గలిత్ పేరిట లేఖ.. భాగం 3, 28,29)[2]

అందువల్ల ఆ కాలంలో క్రయిస్తవ ఫాదరీలు చేసే బోధనల్లో సాధారణంగా మనుష్యులందరూ స్వతస్సిద్ధంగా సమానులనీ, స్వేచ్ఛగలవారని చెప్పేవారు.[3]

ఇక ట్యూటానిక్ జాతుల విషయానికి వస్తే రోమన్ సామ్రాజ్యమ పునాదులనే కదిలించి, కొత్త రక్తాన్ని ఎక్కించిన పోరాట జాతులివి. అందువల్ల వారిలో సహజంగానే స్వేచ్ఛ సమానత్వాలు కనిపించేవి. అంతేకాదు, స్వేచ్ఛా సమానత్వ భావాలను వారు చాలా గౌరవించేవారు. వ్యక్తిగత స్వేచ్ఛకు చాలా ప్రాముఖ్యం ఇచ్చేవారు. స్వతంత్రుడైన మనిషికి పూర్తి స్వేచ్ఛ ఉందని భావించేవారు. వ్యక్తి స్వేచ్ఛలో జోక్యం చేసుకోవడాన్ని సహించేవారు

---

1. *ఛాంబర్స్ ఎన్‌సైక్లోపీడియా, లండన్ 1874, లిబర్టీ (ఫ్రాటర్నిటి, పేజీ 113)*
2. *కొత్త నిబంధన పేజీ 253, బ్రిటీష్ అండ్ ఫారీన్ బైబిల్ సొసైటి, లాహోర్ 1912*
3. *లారెన్స్ సి వాన్లాస్, హిస్టరీ ఆఫ్ పొలిటికల్ థాట్, పేజీ 99*

కాదు. అందువల్ల ఈ జాతుల ప్రభుత్వ వ్యవస్థలో కూడా స్వేచ్ఛ, వ్యక్తిగత హక్కుల భావాలు పుష్కలంగా ఉండేవి.[1]

అయితే క్రయిస్తవం ఈ జాతల్ని తనలో లీనం చేసుకోవడానికి ఎక్కువ కాలం పట్టలేదు.[2]

అంతేకాదు, తన పాత ప్రకటనలకు పూర్తి భిన్నంగా మానవజనాభా గురించిన ఓ మార్పు చెందిన కొత్త ధోరణితో ముందుకు వచ్చింది.

ఆ తరువాత ఐరోపా చరిత్ర సమస్తం భూస్వాముల ఫ్యూడల్ వ్యవస్థ, క్రయిస్తవ మత విస్తరణతో నిండిపోయింది. చివరకు ఈ క్రమంలో స్వేచ్ఛా సమానత్వాల చిహ్నాలు కనుమరుగైపోయాయి. ఈ కాలంలో ఐరోపా జనాభా రెండు వర్గాలుగా విడిపోయింది. ఓ వైపు భూస్వాములు, రాజు, చర్చిలు తమ అధికారాన్ని చలాయిస్తూ ఉండేవి. మరోవైపు పాలితులైన ప్రజల ఇహపర లోకాల సాఫల్యం కులీన వర్గాలకు కిక్కురుమనకుండా సేవచేయడంతో ముడిపడి ఉండేది. స్వేచ్ఛా సమానత్వం లాంటి ఇతర మానవహక్కుల గురించి పొరబాటున కూడా మాట్లాడే అవకాశం ఉండేది కాదు. ఈ విధంగా కాలచక్రం గిర్రున తిరుగుతూ 16వ శతాబ్దం, 17వ శతాబ్దం గడిచిపోయాయి. ఆ పిదప భూ స్వాములు, రాజు, చర్చిల అధికారపీఠం తలక్రిందులైంది. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సర్వ మానవ సమానత్వ యుగం ఆరంభమైంది. యూరప్ భూభాగంలో కులీనులకు ప్రజలకు మధ్యజరిగిన ఈ సంఘర్షణల ప్రకరణం ఒక సుదీర్ఘ పరంపర. ఈ పరంపర క్రీ.శ. 5వ శతాబ్దంలో ఆరంభమైంది. క్రీ.శ. 5వ శతాబ్దంలో రోమన్ సామ్రాజ్య పతనానంతరం యూరప్ చిన్న చిన్న రాజ్యాలుగా ముక్కలైపోయింది. ఈ రాజ్యాల మధ్య పరస్పర ఘర్షణలు, అస్తవ్యస్త ఆర్థిక వ్యవస్థ, దిగజారిన శాంతి భద్రతల నేపథ్యంలో భూమిపై ఒక ప్రపంచ చర్చి (వరల్డ్ చర్చ్), ఒక ప్రపంచ ఏకఛత్రాధిపత్యం ఉండాలన్న క్రయిస్తవ భావనతో ప్రేరితులై 10వ శతాబ్దంలో పవిత్ర రోమన్ సామ్రాజ్యానికి మరోసారి ప్రాణం పోసి నిలబెట్టే ప్రయత్నాలు జరిగాయి. అయితే ఈ ప్రయత్నాలు చివరకు భూస్వాములు, కులీనుల ప్రాబల్యం వల్ల నిష్ఫలమయ్యాయి. రోమన్ సామ్రాజ్య చివరి దశ మొదలు కొని ఆ తరువాతి కాలం అంతా చర్చికి, భూస్వాములకు ప్రభుత్వంలో అసాధారణ ప్రాబల్యం ప్రాధాన్యం ఉండేవి. అయితే 11వ, 12వ శతాబ్దాల్లో భూస్వామ్య వ్యవస్థకు మరింత విస్తరణ

1. *లారెన్స్ సి వాన్లాస్, హిస్టరీ ఆఫ్ పొలిటికల్ థాట్, పేజి 22*
2. *తారీఖ్ మగ్‌రిబీ యూరప్: పేజి 23*

లభించినప్పుడు చర్చి అధికారాలు కూడా అసాధారణ రీతిలో పెరిగాయి. చివరకు చర్చి అధిపతి పోప్‌కు, రాజుకు మధ్య పోటీ ఏర్పడింది. ఈ పోటీలో చివరికి చర్చి జయించింది. ఆ పిదప నెమ్మదిగా భూస్వాముల పతనం ఆరంభమైంది. ఆ వెంటనే చర్చి ప్రాబల్యం కూడా తగ్గుముఖం పట్టింది. ఈ పరిస్థితిలో భూస్వాముల స్థానే జాతీయప్రభువులు పుట్టుకొచ్చారు. ఈ ప్రభువుల ప్రాబల్యాన్ని నిరోధించడానికి గాను ఉన్నత వర్గాలు సాధారణ ప్రజలతో కలసి ప్రభువుల అధికారాలకు కళ్ళెం వేయాలని భావించారు. ప్రజలకు స్వేచ్ఛా ఇవ్వాలని తలపోశారు. అందువల్ల క్రీ.శ.1215లో బ్రిటన్‌లో మాగ్నాకార్టా రూపంలో పరిమితంగా ప్రజల స్వేచ్ఛలకు హామీ లభించింది.

ఈ దశలో యూరప్ నగరాలలో నివసించే వ్యాపార వర్గాలకు సమాజంలో అత్యధిక ప్రాధాన్యం ఉండేది. వారిని విస్మరించడం అసాధ్యంగా మారింది. ఈ పరిస్థితిని చూసి చర్చి మళ్ళీ జాతీయ ప్రభువుల వైపు మొగ్గు చూపింది. వారితో కలసి సాధారణ ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడింది. ఈ అత్యాచారాలు ఎంతగా జరిగాయంటే ఈ లూటీలను, హత్యలను చూసి స్వయాన చర్చి భరించలేకపోయింది. ఫలితంగా చర్చి చీలిపోయి 16వ శతాబ్ధంలో ప్రొటెస్టెంట్ సంస్కరణల ఉద్యమం తలెత్తింది. ప్రొటెస్టెంట్ ఉద్యమం కాథలిక్ చర్చి ప్రాబల్యాన్ని అరికట్టడానికి గాను జాతీయ ప్రభువులతో చేయి కలిపింది. ఈ లక్ష్యసాధనకు గాను మానవ సమానత్వం అన్న నినాదాన్ని ఛ్చింది. ఈ నినాదం వెనువెంటనే రాజ్యాలు బలపడడానికి కారణమైనప్పటికీ దీన్ని ఆధారంగా చేసుకుని చర్చి మళ్ళీ అధికార పీఠాన్ని చేజిక్కించుకోగలిగింది. ఏమైనప్పటికీ చివరికి ఈ మానవసమాన వత్వం అన్న భావన వల్ల స్వేచ్ఛ ప్రజాస్వామ్య భావాలు బలపడ్డాయి. ఈ నేపథ్యంలోనే రాజులకు, సాధారణ ప్రజలకు మధ్య ఘర్షణల వాతావరణం నెలకొంది.

అప్పటి నుంచి 18వ శతాబ్ధం ఆఖరు వరకు చరిత్రను పరిశీలిస్తే, రాజులు దైవికంగా ప్రజలను పాలించే హక్కు కలిగి ఉన్నారన్న భావనను, ప్రజలు పాలకుల ఆదేశాలను కిక్కురుమనకుండా శిరసావహించాలన్న భావనను ఒకే ఒక్క వర్గం మాత్రమే సమర్థించడం మనకు కనబడుతుంది. ఈ భావనలను వ్యతిరేకించే వారి సంఖ్య క్రమేణా పెరగడాన్ని కూడా మనం చూడవచ్చు.

మానవులందరూ సమానులు, ప్రతి మనిషికి కొన్ని సహజ హక్కులు ఉన్నాయి. ప్రజలకు పాలకులకు మధ్య సంబంధం అదేశించే, శిరసావహించే సంబంధం కాదు, అది ఒక సామాజిక ఒప్పందం. ఆ ఒప్పందం ప్రకారం ప్రతి ఒక్కరికి కొన్ని హక్కులు కొన్ని

బాధ్యతలు ఉంటాయి. ఈ భావాలు మనకు 14వ, 15వ శతాబ్ధపు తాత్వికులలోనూ కనబడ తాయి. ఉదాహరణకు జాన్‌వై క్లిఫ్ (1384), జాన్ హాస్(1369–1415), నికోలస్ ఆఫ్ క్యూస్ (1401–1464) తదితరులు. అయితే 16వ శతాబ్ధం మొదలు 18వ శతాబ్ధం వరకు ఈ నినాదం మరింత బిగ్గరగా వినవచ్చింది. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావిం చదగ్గ పేర్లు థామస్ హాబ్స్ (1588–1679), జాన్‌లాక్ (1632–1704), బెనెడిక్ టి స్పినోజా (1632–1677), జాన్ జాక్వస్ రూసో (1712–1787), కాండె హెలోటిస్ (1715–1771), డిటెరాట్ (1713–1784), డి.ఎలంబర్ట్ (1717–1783)తదితరులు. బ్రిటన్‌లో ఈ భావనల ప్రస్తావన మాగ్నాకార్ట (1215)లో కనబడుతుంది. ఆ తరువాత 1628లో పిటీషన్ ఆఫ్ రైట్స్, ఆ పిదప 1679లో, 1689లో హెబియస్ కార్పస్ యాక్ట్, బిల్ ఆఫ్ రైట్స్ తదితర పత్రాలలో కనబడుతుంది. అయితే ఈ స్వేచ్ఛా సమానత్వాల భావనలు సంపూర్ణ ప్రదర్శన అమెరికాలోని స్వేచ్ఛా ప్రకటనలో కనబడుతుంది. ఈ ప్రకటన గురించి ఇంతకు ముందే వివరించాము. ఈ ప్రకటన ప్రతి ధ్వని కొద్దికాలానికే అంటే 1789లో ఫ్రాన్స్ విప్లవ సందర్భంగా డిక్లరేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ మ్యాన్ అండ్ సిటిజన్‌గా మన ముందుకు వచ్చింది.[1]

లోపాలు - వ్యతిరేక భావనలు

యూరప్ భూభాగంలో తలెత్తిన ఈ స్వేచ్ఛాసమానత్వాల భావనలో ఉన్న లోపాలు ఆచరణలో బయటపడ్డాయి. స్వేచ్ఛాసమానత్వాలకు సంబంధించిన ఈ లోపపూరితమైన భావనలు ప్రయోజనకరమైనవి కాదని దీనివల్ల అర్థమవుతోంది. ఎందుకంటే ఈ భావన విశ్వజనీనమైన భావన కాదు. దీన్ని బలపరిచే, దీని విశ్వజనీనతను ధృవీకరించే సమాజ వ్యవస్థ ఏదీ ఉనికిలోకి రాలేదు. పైగా అందుకు వ్యతిరేకంగా ఈ భావన యూరప్‌లోని కొన్ని ప్రత్యేక పరిస్థితుల ఫలితంగా పుట్టింది మాత్రమే. పాలకులకు ప్రజలకు మధ్య

---

1. వివరాలకు లారెన్స్ సి వాల్లెస్ పుస్తకంలో పేజీలు 138 నుంచి 300. ఈ పరంపరలోనిదే ప్రపపంచ మానవహక్కుల ప్రకటన కూడా. ఇది డిసెంబర్ 8, 1948లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తరఫున వెలువడింది. ప్రపంచంలోని 58 దేశాల ప్రభుత్వాల తరఫున ఇలాంటి ప్రకటన వెలువడడం మానవ చరిత్రలో అదే మొదటిసారి. ఇందులో అధికరణం 1. ప్రపంచంలోని సమస్త మానవులు పుట్టుకరిత్యా సమానులు, స్వేచ్ఛ గలవారు. గౌరవ మర్యాదలు, హక్కులు పొందడంలో అందరూ సమానులు. ప్రతి మనిషి సాటివానితో సౌభ్రాత్రంగా మెలగాలి, జె.యస్. సెహాపిరో, లిబరలైజేషన్ ఇట్స్ మీనింగ్ అండ్ హిస్టరీ, పేజి 139

ఘర్షణల్లో పుట్టిన భావన ఇది. ఈ పాశ్చాత్య భావనకు విశ్వజనీనత ఎన్నడూ ప్రాప్తం కాలేదు. అలాంటి విశ్వజనీనత దీనికి లభిస్తుందని ఆశించడం కూడా సరికాదు. ఆరంభంలో క్రయిస్తవం ఈ భావనకు మద్దతు పలికింది. దీన్ని అంతర్జాతీయ భావనగా ముద్ర వేయడానికి ప్రయత్నించింది. కాని ఆ విశ్వజనీన స్థాయి కొద్దికాలం కూడా నిలువలేదు. అంతకన్నా దురదృష్టమేమంటే, ఈ అసమగ్ర స్వేచ్ఛాసమానత్వాల భావనను మట్టిలో కలిపే ధోరణులు స్వయంగా యూరప్‌లోనే పుట్టుకొచ్చాయి. ఈ ధోరణులు సమానత్వ భావనకు పూర్తిగా వ్యతిరేకమైనవనే చెప్పాలి. ఈ ధోరణులు సమానత్వాన్ని సమాధి చేసాయి. ఫాసిజం, రేసిజం, బోల్షివిజం తదితర ఇజాలే ఈ కొత్త ధోరణులు. మనిషి వ్యక్తిస్వేచ్ఛను రాజ్యాధికారం పరిధిలో కలిపేసిన ఇజాలు ఇవి. రాజ్యం కోసం వ్యక్తి తన హక్కులను వదులుకోవడం ఈ ధోరణికి పరాకాష్ఠ. ఈ పరిస్థితిలో ఇతర మానవ హక్కులతో పాటు స్వేచ్ఛా సమానత్వాలు కూడా సమాధి అవుతాయన్నది వేరే చెప్పనవసరం లేదు. సమానత్వ భావన అన్నది సుదీర్ఘ ప్రయాణం తర్వాత చివరి దశకు చేరినట్లే, సమానత్వ భావనను వ్యతిరేకించే ధోరణుల వికాస చరిత్ర కూడా సుదీర్ఘమైనది. ఇది జర్మనీలోని ఐడియలిజంతో ప్రారంభమవుతుంది.

జర్మన్ ఐడియలిజం

ఫ్రాన్స్ విప్లవానంతరం ఐరోపాలో తలెత్తిన పరిస్థితుల ఫలితంగా పాశ్చాత్య దేశాల్లో మతరాహిత్యం, వ్యక్తితత్వం (ఇండివిద్యులిజం) తదితర ధోరణులు పుట్టుకొచ్చాయి. ఈ ధోరణులకు వ్యతిరేకంగా మతవర్గాలు, సమాజంలోని మధ్యతరగతి ప్రజలు అవలంబించిన విధానం ఫాసిజంగా రూపుదిద్దుకుంది. జర్మనీ ఇటలీలు ఫాసిజానికి ముఖ్య కేంద్రాలయ్యాయి. ఈ భావనకు మూలం జర్మన్ ఆదర్శవాదం (జర్మన్ ఐడియలిజం).

ఈ భావాల ప్రకారం వ్యక్తిని రాజ్యంలో లీనం చేసేయడం జరిగింది. ఈ ఐడియలిజంలో వ్యక్తి స్వేచ్ఛ కన్నా స్వయం విధిత నిబంధనలకు, బుద్ధివివేకాల కన్నా భావావేశాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ భావనకు పునాదులు వేసిన వారిలో ఇమ్మాన్యుయేల్ కాంట్ (1724-1804), జాన్ ఫిష్ (1762-1814), హెగెల్ (1770-1831)ల పేర్లు ముఖ్యమైనవి. ముఖ్యంగా హెగెల్‌ను ఫాసిజానికి పితామహునిగా పరిగణిస్తారు.

ఈ మేధావులు తమ రాజకీయ సిద్ధాంతాలను అనుభవాలు, విశ్లేషణలపై ఆధారపడి కాకుండా శుద్ధఆలోచన ఆధారంగా రూపొందించారు. రాజకీయాలలో మనస్సాక్షి అన్న

భావనకు ప్రాముఖ్యం ఇచ్చారు. ఈ మేధావులు తమ ఆలోచనలను ఫ్రాన్స్ విప్లవంలోని స్వేచ్ఛాయుత, విశ్వజనీన భావనల నుంచి ప్రారంభించారు. కాని తరువాత అందుకు పూర్తి విరుద్ధదిశలో ఆలోచించారు. దేశప్రతిష్ఠను పెంచడం (గ్లోరిఫికేషన్) జర్మన్ పథకాలలో ఒకటిగా మారింది. ఈ క్రమంలో స్వేచ్ఛా సమానత్వం లాంటి విలువలకు ఎలాంటి స్థానం లేకుండా పోయింది. ఇదే ఐడియలిజంలో ముఖ్యమైన అంశంగా మారింది. దేశప్రతిష్ఠ అతిముఖ్యం. పౌరులు దేశప్రతిష్ఠను పెంచే పనిముట్ల కన్నా ఎక్కువ కాదు. తర్వాతి కాలంలో ఈ సామూహిక వాద బృందాలు మరో అడుగు ముందుకేసాయి. రోమాన్సిజం పుట్టుకు వచ్చింది.

రోమాన్సిజం

ఫాసిజం పురోగతిలో రెండో దశ రోమాన్సిజం. ఫ్రాన్స్ విప్లవానికి వ్యతిరేకంగా యూరప్‌లో తలెత్తిన ధోరణులు రోమాన్సిజంగా మారాయి. ఈ సిద్ధాంతం వ్యక్తిపూజకు బీజం వేసింది. తమ జాతికి ప్రత్యేక విశిష్టస్థానం ఉందని, ప్రపంచవేదికపై ప్రత్యేక పాత్ర పోషించే జాతి తమదే అన్న భావనను ప్రచారంలోకి తెచ్చింది. ఫలితంగా ప్రజలు తమ జాతి మూలాల పట్ల ఎక్కువగా గర్వించే ధోరణి ప్రబలింది. తమ జాతిని మించినది మరొకటి లేదన్న భావం ఎక్కువయ్యింది. ఈ భావన వల్ల ప్రజలు తమ జాతి చరిత్ర గురించి సరికొత్తగా ఆసక్తి చూపడం ప్రారంభించారు. రాజకీయ సమస్యలను చారిత్రక కోణంలో చూసే ధోరణి ప్రారంభమయ్యింది.

నేషనలిజం

ఈ భావనలు మరింత తీవ్రమై నేషనలిజం అంటే జాతీయతత్వంగా మారాయి. దీనికి అంకురార్పణ చేసింది కూడా జర్మన్ మేధావులే. హెవన్ ట్రాటిస్కీ (1834-1896), ఫ్రెడరిక్ కరల్‌వాన్ సెవిని (1770-1861) అనే ఇద్దరు జర్మన్ మేధావులు నేషనలిజానికి ఆద్యులు. ఈ నేషనలిజాన్ని ఖచ్చితంగా చెప్పాలంటే దౌర్జన్యపూరిత జాతీయతత్వంగా చెప్పాలి. ఎందుకంటే, ట్రిటిస్కీ ప్రకారం జర్మనీ తన నైసర్గిక ఎల్లలను అలాగే విడిచిపెట్ట రాదు. అలాగే జర్మనీ జనాభాలోని విభిన్న జాతులను ఒకే చట్రంలో లీనం చేయాలి. తమ సంస్కృతీ పరిధిని అల్పజాతుల వరకు విస్తరించాలి. అందుగ్గాను యుద్ధం చేయవలసిన అవసరం వచ్చినా సరే. ట్రిటిస్కీ తన పుస్తకాల ద్వారా ఈ భావాలను నిరంతరం ప్రచారం చేసాడు. రాజ్య నిర్మాణంలో ఏ పద్ధతి అనుసరించినా ఏలాంటి పథకాలు వేసినా అన్ని

సముచితమేనన్న ప్రచారం మొదలైంది. ఈ సిద్ధాంతం ప్రకారం రాజ్యం అవసరమైతే తన ప్రజలను బలి చేయవచ్చు. ఇతర జాతుల్ని సయితం నులిమేయవచ్చు. ట్రిట్‌స్కీ ప్రకారం ఓ ధృఢమైన రాజ్యం ఏర్పడితే జర్మన్ సంస్కృతిని పరిరక్షించగలదు. అలాంటి రాజ్యం ప్రజలను ధృఢచిత్తం గలవారిగా రూపుదిద్ది సమైక్యంగా ఉంచగలదు. ఈ భావాలను ప్రచారం చేస్తూ ఆయన జర్మనీ చారిత్రక ప్రాశస్త్యం గురించి బోధించేవాడు. జర్మనికి అత్యున్నత వైభవం కళ్ళముందుందని కళ్ళకు కట్టినట్లు వివరించేవాడు.

సెవగ్నీ భావాలు కూడా ఇలాగే ఉండేవి. పౌరులకన్నా రాజ్యానికి అధిక ప్రాధాన్యం ఉండాలని ఇతడి ధృఢవిశ్వాసం. తన భావాల ద్వారా ఈయన ప్రోత్సహించిన ధోరణుల వల్ల ఆబ్సాల్యుటిజం జన్మించింది. సెవగ్నీ ప్రకారం ప్రజలకు కొద్దిపాటి రాజకీయ అధికారం కూడా ఉండరాదు. చివరికి ప్రజలను రాజ్యానికి అనుగుణంగా మార్చుకోవాలి. రాజ్యం వల్లనే ప్రజలకు వారి వ్యక్తిత్వం లభిస్తుంది. రాజ్యం అధీనంలో అనేక జాతులు ఉంటాయనీ, గతంలో పుట్టిన జనాభా మాత్రమే కాదు పుట్టబోయే జనాభా కూడా రాజ్యం అధీనంలో ఉంటుందని, అయితే రాజ్యనిర్మాణం అన్నది ఒకజాతి చరిత్ర ఆధారంగా, జాతి జీవనం ప్రాతిపదికన జరుగుతుందని చెప్పేవాడు.

రేసిజం

ఈ పరంపరలో ఫాసిజం మరింత పురోగమించి రేసిజంగా అంటే జాతివాదంగా మారింది. ఐరోపాలో అప్పటికే పాదెపై చేరుకున్న సమానత్వ భావనను రేసిజం చితిపైకి చేర్చేసింది. ఫాసిజానికి సంబంధించిన వివిధ రూపాల్లో రేసిజం మాదిరిగా జాతి ఆధిక్య భావనతో విప్లవాత్మక ఫలితాలు సాధించిన రూపం మరొకటి లేదు. ఈ వివరాలను ఆర్థర్ డి గాబిన్యో (1816), హేస్టన్ స్టూవర్ట్ చంబర్‌లేన్ (1855)లు పేర్కొన్నారు. ఈ జాతివాదం ఫలితంగా జర్మనిలో లక్షలాది యూదులను మృత్యు గహ్వారంలోకి త్రోయడం జరిగింది. ఇంకా అనేకమందిని దేశం నుంచి వెళ్ళగొట్టడం జరిగింది. దేశ దిమ్మరులుగా మార్చేసింది.

రేసిజంకు నాయకుడైన గాబిన్యో ఓ శాస్త్రవేత్త, కాని ఆయన శాస్త్రవేత్త తక్కువ, కవి ఎక్కువ. ఆయన కనిపెట్టిన శాస్త్రవిషయం మానవజాతుల్లో సమానత్వరాహిత్యం. గోబిన్యో ప్రకారం మానవాళిని మూడు విభిన్న జాతులుగా విభజించవచ్చు. అవి – నీగ్రో, చైనీస్, యూరోపియన్ జాతులు. ఇతడి ప్రకారం ప్రతి జాతికి దాని ప్రత్యేకతలున్నాయి. ఈ ప్రత్యేకతల ఆధారంగా కొన్ని జాతులు అధికమైనవి, కొన్ని అల్పమైనవి. మేధోశక్తి పరంగా నీగ్రోలు అల్పులు. యూరోపియన్లు అందరికన్నా అధికులు. అయితే కళలు, సంగీతగానాల్లో

నీగ్రోలు ఇతరుల కన్నా ముందున్నారు. చైనా వారి గురించి గోబిన్యో అభిప్రాయం ఏమంటే, ఈ ప్రజలు కార్యశీలురు. వీరిలో చట్టవిధేయత ఎక్కువ. అయితే ఈ జాతికి పెద్ద పెద్ద నాయకులు, మేధావులకు జన్మనిచ్చే శక్తిలేదు. ఇతడి అభిప్రాయం ప్రకారం శ్వేతజాతీయులు బుద్ధి, శక్తి,, సామర్థ్యం, సృజనాత్మకతలలో అందరికన్నా అధికులు. అయితే వారిలో అందరూ సమానం కాదు. ఉదాహరణకు సెమెటిక్ జాతులు ఇతర శ్వేతజాతుల కన్నా తక్కువ సామర్థ్యం కలిగినవారు. దీనిక్కారణం ఈ ప్రజలు తెల్ల నల్ల జాతుల కలయిక వల్ల ఏర్పడిన మిశ్రమ జాతి. శ్వేత జాతీయులలో అందరికన్నా అధికులు ఆర్యులు. ఈ జాతి జర్మని, ఇంగ్లాండ్‌లలో కనబడుతుంది. కొద్దోగొప్పో ఫ్రాన్స్‌లో కనబడుతుందని అతడి వాదన.

గోబిన్యో ప్రకారం జాతిని సంకరరహితంగా పూర్తిశుద్ధంగా ఉంచడం బహుశా సాధ్యం కాదు. కాని ప్రస్తుత పరిస్థితుల్లో అల్పజాతులతో రక్త సంబంధం వల్ల ఆర్యజాతి నాశనమైపోతోంది. అందువల్ల ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఐరోపా సంస్కృతి ప్రమాదంలో పడిపోతుందని గోబిన్యా అన్నాడు.

ఇక చాంబర్‌లేన్ విషయానికి వస్తే ఇతడు జన్మరిత్యా బ్రిటీషువాడు. కాని తరువాత జర్మన్ పౌరసత్వం స్వీకరించాడు. జాతివాద భావాలను జర్మనీలో తీవ్రంగా ప్రచారం చేసాడు. గోబిన్యోలాగే ఇతడు కూడా మానవజాతుల నిమ్నోన్నతలను బలపరిచాడు. జంతువుల్లో జాతులు ఎలా విబిన్నంగా ఉంటాయో అదేవిధంగా మానవజాతులు కూడా విభిన్నమైనవని ఇతడి అభిప్రాయం. "అలవాట్లు పద్ధతుల రీత్యా విభిన్న జాతుల కుక్కల మధ్య ఎంతగా భేదాలున్నాయో అంతే భేదాలు మానవ జాతుల మధ్య కూడా ఉన్నాయి. ఉదాహరణకు అరేబియన్ కుక్కలు, పెద్ద తలగల కుక్కలు. ఉంగరాల వెంట్రుకలు కలిగిన కుక్కలు. ఇస్పానిక్ కుక్కలు ఇలా వివిధ భేదాలుంటాయి. అలాగే మనుష్యుల్లో ఆర్య జాతి అందులోను ట్యూటానిక్ తెగ విశిష్టమైనది. మిగిలిన అన్ని జాతుల కన్నా ఆధిక్యం కలిగినది. ఎందుకంటే కళలు, తత్వశాస్త్రం, మతం, రాజకీయాలు తదితర రంగాలలో సమస్తం ఈ జాతివారి సృష్టియే" . చాంబర్‌లేన్ ప్రకారం మానవ సంస్కృతికి ప్రాణం నిజానికి ట్యూటానిక్ తెగవారి రక్తమే. ప్రకృతిలో కనబడే దృష్టాంతాలు కూడా దీనికి సాక్ష్య మిస్తున్నాయంటాడు. ఏ జాతి విషయంలో అయినా గాని, ఆ జాతి ప్రజలలో ఎంత శాతం ట్యూటానిక్ రక్తం ఉందో అంత శాతం ఆధిక్యం కలిగి ఉంటుందని అతడి అభిప్రాయం. అందరికన్నా అధికంగా ట్యూటానిక్ రక్తం జర్మన్లలో ఉంది. ఆ విధంగా జర్మన్ జాతికి

ప్రత్యేక ఆధిక్యం ఉంది. ఆ జాతి ద్వారా ఒక మాస్టర్ జాతి రూపొందుతుంది. రానున్న శతాబ్దాలలో ప్రపం చానికి రాజకీయంగా, సాంస్కృతికంగా మార్గదర్శకత్వాన్నిచ్చే ఏకైక జాతి అదే.[1] అని ప్రచారం చేశాడు.

ఫాసిజం ఉచ్ఛదశ

స్వేచ్ఛా సమానత్వాల ఉన్నత మానవ విలువల గొంతు నులిమే ఫాసిజం భావన ప్రపంచ మానవాళిని ఎంతటి భయానక విధ్వంస కూపంలో త్రోసిందో తెలుసుకోవాలంటే మనం ఫాసిజం ఉచ్ఛదశపై దృష్టిసారించక తప్పదు. 1922లో ఫాసిజం అసలు రూపంలో మన ముందుకు వచ్చింది. అప్పటి నుంచి ఫాసిజం రాజకీయ పాత్ర ప్రారంభమయ్యింది. ఇప్పటి వరకు ఫాసిజం పోషించిన విభిన్న పాత్రల్లో ఏవీ తక్కువ భయానకమైనవి కావు. కాని 1918లో రష్యా విప్లవం తర్వాత ఫాసిజం ఉచ్ఛస్థాయిలో తన భయానక రూపాన్ని ప్రదర్శించింది. రష్యాలోని ఎర్ర విప్లవానికి జర్మని, ఇటలీలలోని ఉన్నత తరగతి వారి చెవులు నిక్కబొడుచుకున్నాయి. వారి కాళ్ళ క్రింది నేల కదలిపోయింది. మధ్యతరగతి వారిలో భయం, ఆందోళన చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదం నుంచి బయటపడాలంటే ఫాసిజాన్ని ఆయుధంగా ఉపయోగించాలనుకున్నారు. పైగా పరిస్థితులు ఫాసిజానికి మరింత పదును పెట్టాయి. ఈ నేపథ్యంలోనే ఇటలీలో ముస్సోలిని (1883–1945), జర్మనిలో హిట్లర్ (1889–1945)లు వెలుగులోకి వచ్చారు. వారి చేతుల్లో ఫాసిజం తన పూర్తి బీభత్స భరిత రూపాన్ని వికృతంగా ప్రదర్శించింది. స్వేచ్ఛా సమానత్వం లాంటి ఉన్నత మానవ విలువల మాట దేముడెరుగు స్వయాన మానవత్వమే సమాధి అయ్యింది.

ఫాసిజాన్ని చేతబట్టిన ఈ నేతలు ఓ వైపు తమ జాతిలో జాత్యాహంకారాన్ని రెచ్చగొట్టారు. జాతిప్రజల్లో ఓవిధమైన ఉన్మాదాన్ని సృష్టించారు. మరోవైపు ప్రభుత్వ హక్కులను కొండంత చేసి వాటి ముందు పౌరుల హక్కులు, వ్యక్తిత్వం శూన్యమయ్యేలా చేసారు.

వాళ్ళిచ్చిన నినాదాలు కూడా ఇక్కడ గమనార్హమైనవి.
చరిత్రకు ఆవల వ్యక్తికి ఎలాంటి స్థానమూ లేదు.
స్వేచ్ఛ ఒక హక్కు కాదు ఒక బాధ్యత
రాజ్యం ఇచ్చిన స్వేచ్ఛ తప్ప మరో స్వేచ్ఛ ఏదీ లేదు.
ఇలాంటి అనేక నినాదాలు పుట్టుకు వచ్చాయి.

---

1. *స్కాఫిరో, లిబరలిజం ఇట్స్ మీనింగ్ అండ్ హిస్టరీ, పేజి 55 ఉంచి 173*

ఈ విధంగా జాతీయతను బోధిస్తూ దేశంలోని సమస్తం, వ్యక్తులందరూ జాతీయతకు లోబడి ఉండాలని నిర్ధారించారు. కేవలం రాజ్యం వల్లనే పౌరులకు వ్యక్తిత్వం ప్రాప్తమవుతుందని ఉద్ఘాటించారు. జాతీయ బాధ్యతలనేవి ప్రజలపై ఉంటాయనడంలో సందేహం లేదు. కాని జాతి తన వ్యవహారాలలో ఎవరికీ బాధ్యత వహించనక్కర్లేదనడమే ఇక్కడ గమనించవలసిన విషయం. ఈ విధంగా రాజ్యంలో పౌరుల స్థాయిని తగ్గించారు. రాజ్యంలో లీనమైపోతేనే ప్రజలు తమ వ్యక్తిత్వాన్ని సమకూర్చుకోగలరన్న నిర్వచనం ఇచ్చారు. ప్రతిదీ రాజ్యానికి లోబడి ఉండాలి. రాజ్యానికి భిన్నంగా ఏదీ ఉండరాదు. రాజ్యానికి వెలుపల ఏదీ లేదు అన్నారు.

ఓ వైపు ముస్సోలిని రాజ్య భావనను ఈ విధంగా ప్రతిపాదిస్తే మరోవైపు హిట్లర్ తన జర్మన్ జాతి రాజజాతి (మాస్టర్ రేస్) అని ప్రకటించాడు. ప్రపంచంలోని ఇతర జాతులన్నీ జర్మన్ల ముందు దిగదుడుపని నిర్ధారించాడు. ఈ జాత్యాధిక్య భావన వల్ల యూదులు నాజీలకు జాతి శత్రువులుగా కనబడ్డారు. యూద జాతిని దేశం నుంచి వెళ్ళగొట్టడమో లేక వారిని మూకుమ్మడిగా చంపడమో చేసారు. ఈ మారణకాండపై అమెరికా బ్రిటన్‌లలో ఆందోళన చెలరేగినప్పుడు ఆ ఆందోళనలను అవివేకపూరిత చర్యలుగా పరిగణించి లక్ష్యపెట్టలేదు. జాత్యాహంకారంతో జర్మనీలో ఒకే ప్రజ, ఒకే వ్యవస్థ, ఒకే పాలకుడు అన్న నినాదం ప్రతిధ్వనించింది. అంతేకాదు, మేం మా రక్తంతో ఆలోచిస్తాం అన్న నినాదం మిన్నుముట్టింది. జర్మన్ నియంత హిట్లర్‌ను దోషరహితుడిగా, అపరాజితుడిగా భావించసాగారు.[1]

ఫాసిజం ఫలితంగా హిట్లర్ ముస్సోలినీలు తమ దేశంలో భేదాభిప్రాయం గలవారినందరినీ ఏరివేసారు. తరువాత ప్రపంచంలోని ఇతర జాతులను అధములుగా జమకట్టి మహా ఇటలీ, మహా జర్మనీల కలలను నిజం చేసుకోడానికి ఉన్మాదంతో యుద్ధ కాహళీ పూరించారు. ఈ ఉన్మాద ఫలితాలను రెండవ ప్రపంచయుద్ధ రూపంలో ప్రపంచ మానవాళి చవిచూడక తప్పలేదు. ఈ ఉన్మాదం మానవ సమానత్వాన్ని, స్వేచ్ఛను భరించలేకపోవడమే కాదు మానవులకున్న బ్రతికే హక్కును సయితం కాలరాసింది.

బోల్షివిజం

యూరప్‌లో తలెత్తిన ఈ ఫాసిస్టు ధోరణుల గురించి చెప్పేటప్పుడు బొల్షివిజం గురించి ప్రస్తావించకపోతే చర్చ అసంపూర్ణంగా మిగిలి పోతుంది. దీన్నే సోషలిజం,

---

1. *లారెన్స్ సి. విన్లాస్ పుస్తకం పేజి 4-381, డాక్టర్ వి.ఆర్. భండారి పుస్తకం హిస్టరీ ఆఫ్ యూరోపియన్ పొలిటికల్ ఫిలాసఫీ, పేజి 417-419*

కమ్యూనిజం అన్న పేర్లతో కూడా పిలుస్తారు. మానవ సమాజాల్లో ఆర్థిక సంస్కరణకు దీనిలో ఉన్న విప్లవాత్మక భావాల వల్ల బోల్షివిజానికి విశేష స్థాయి ప్రాప్తమైనప్పటికీ, మానవాళి దాస్యశృంఖలాలను బద్దలు చేసి వారికి విముక్తి ప్రసాదించిన సిద్ధాంతంగా పేరుపొందినప్పటికీ వాస్తవానికి ఈ సిద్ధాంతంపై ఫాసిస్టు భావాల ప్రభావం అత్యధికంగా ఉంది. తన లక్ష్యసాధనకు ఈ సిద్ధాంతం అనుసరించే పద్ధతులు బోల్షివిజంలోని సైద్ధాంతిక భావాలు వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుంటే ఈ సిద్ధాంతంలో దాగి ఉన్న ఫాసిస్టు ప్రభావాన్ని విస్మరించి మాట్లాడ్డం నిజానికి ఈ సిద్ధాంతానికి అన్యాయం చేయడమే అవుతుంది. కమ్యూనిజం లక్ష్యం వర్గరహిత సమాజాన్ని ఏర్పాటు చేయడం. మానవులంతా సమానులుగా ఉన్న సమాజాన్ని, ధనిక బీద వ్యత్యాసాలను సమూలంగా పెకలించి వేసిన సమాజాన్ని ఏర్పరచడం, ఉత్పత్తి సాధనాలపై మానవులందరికీ సమాన యాజమాన్య హక్కులు సాధించడం, నిమ్నోన్నతా భావాలేవి సమాజంలో లేకుండా చూడడం ఈ సిద్ధాంత లక్ష్యం. ఈ లక్ష్య సాధనకు గాను కమ్యూనిజం రెండు మూలసూత్రాలను ప్రతిపాదించింది. అవి (1) వర్గ శత్రు నిర్మూలన (2) శ్రామికుల సామూహిక నియంతృత్వం.[1]

ఈ మూలసూత్రాలు వినడానికి బాగున్నాయి. సమాజంలో వర్గ తారతమ్యాలు రూపుమాసిపోవడం, మానవులంతా సమానులయిపోవడం, వారి మధ్య ఎలాంటి విచక్షణలూ లేకపోవడం ఇదంతా వినడానికి బాగానే ఉంది. కాని, ఈ లక్ష్యసాధనకు అనుసరించే పద్ధతులలో బలప్రయోగాన్ని, విధ్వంసాన్ని, బలవంతాన్ని సమర్థించడం, శ్రామిక ప్రతినిధుల నిరంకుశ ప్రభుత్వాన్ని ప్రతిపాదించడం, దాన్ని శ్రామికుల విప్లవ నియంతృత్వంగా పేరుపెట్టి పిలువడం – ఈ అంశాల దృష్ట్యా ఈ సిద్ధాంతాన్ని శ్రామికవర్గ ఫాసిజంగా పేర్కొనడంలో తప్పులేదు. లక్ష్యసాధనలో కమ్యూనిజం అనుస రించిన పద్ధతులు, విధానాలలోని తీవ్రవాదాన్ని మనం కమ్యూనిస్టు మ్యానిఫెస్టోలోని క్రింది పంక్తుల ద్వారా అంచనా వేయవచ్చు.

“తమ భావాలను, ఉద్దేశ్యాలను రహస్యంగా ఉంచడాన్ని కమ్యూనిస్టులు అవమాన కరంగా భావిస్తారు. ప్రస్తుత సమాజవ్యవస్థను పెకలించిపార వేసినపుడే తమ లక్ష్యం సిద్ధిస్తుందని స్పష్టంగా ప్రకటిస్తున్నారు. కమ్యూనిస్టు విప్లవాన్ని చూసి ప్రభుత్వ వర్గాలు గజగజలాడాలి. శ్రామికుల వద్ద పోగొట్టు కోడానికి దాస్య శృంఖలాలు తప్ప మరేమీ లేవు. వాళ్ళు ప్రపంచాన్ని జయించ వలసి ఉంది. ప్రపంచ కార్మికులారా ఏకం కండి”[2]

---

1. *డా. భండారి పుస్తకం, పేజి 421*
2. *మ్యానిఫెస్టో ఆఫ్ కమ్యూనిస్ట్ పార్టీ, పేజి 98,99*

కమ్యూనిస్టు భావాలలోని ఈ తీవ్రవాదం లెనిన్ మాటల్లో కూడా తొణికిసలాడు తుంది.

“పరలోక భావనలపై ఆధారపడి ఉన్న ప్రతి ఒక్క నైతికతను మేం రద్దు చేస్తున్నాం. లేదా వర్గ భేదాలపై ఆధారపడి ఉన్న ప్రతి వ్యవస్థను రద్దు చేస్తున్నాం. మావద్ద నైతికత అన్నది సంపూర్ణంగా వర్గ శత్రు నిర్మూలనమే. పాత వ్యవస్థను నిర్మూలించడానికి శ్రామికు లను ఐక్యం చేయడానికి అవసరమైన ప్రతిదీ సమ్మతమైనదే. మేం ధృఢంగా వ్యవస్థీకృతం కావడం, వర్గ శత్రువులతో పూర్తి ఉత్సాహంతో యుద్ధం చేయడం ఇదే మా నైతికత. నైతికత అన్నది నిత్యమైనదనీ, సత్యమైనదనీ మేం ఒప్పుకోం. ఈ వంచనాశిల్పాన్ని మేం బట్టబయలు చేస్తాం. శ్రామికవర్గ నియంతృత్వ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి యుద్ధం చేయడం తప్ప సామ్యవాద నైతికత మరొకటి లేదు.

ఎత్తుగడలు, వంచన, చట్టాన్ని అతిక్రమించడం, యుక్తులు, అసత్యాలు లక్ష్య సాధనకు అనివార్యం”[1]

ఈ సిద్ధాంతానికి ఊపిరి ఊదిన ఆది నాయకుల ధోరణులు మాటలు ఇలా ఉన్నప్పుడు ఈ సిద్ధాంతాన్ని అనుసరించే సాధారణ శ్రామికుల్లో శ్రామికేతర వర్గాల పట్ల ద్వేషం, వైరం ఏ స్థాయిలో ఏర్పడుతాయో తేలిగ్గా ఊహించగలం. రాజ్యాంగ హామీలున్నప్ప టికీ ఇలాంటి వర్గాలు సాధారణ ప్రజల పట్ల న్యాయంగా వ్యవహరించలేదని, స్వేచ్ఛా సమానత్వాల విలువలను పాటించలేదనడానికి చరిత్ర సాక్ష్యం చెబుతోంది. ఇటీవలి చరిత్రలో సోవియట్ యూనియన్ లోని ఎర్ర విప్లవం, రష్యాకు పొరుగున ఉన్న రుమేనియా, బల్గేరియా, పోలండ్, చెకెస్లోవేకియా తదితర దేశాలలో చివరికి ఆఫ్ఘనిస్తాన్‌లోను కమ్యూనిస్టు ధ్వజవాహకులు సాధారణ ప్రజలపై చేసిన దౌర్జన్యాలు, దుర్మార్గాలు, మానవ రక్తంతో హోలీ ఆడిన వైనం ఇందుకు సాక్ష్యం.

మతాల పాత్ర

స్వేచ్ఛా సమానత్వాల గురించి వాదించే యూరప్‌లోని సిద్ధాంతాల గురించి ఇంత వరకు చూసాం ఇప్పుడు ఈ విలువల పట్ల మతాలు వ్యవహరించిన తీరు ఎలాంటిదో చూద్దాం. నేటి ప్రపంచంలో మతరాహిత్య ఆలోచనలకు, సిద్ధాంతాలకు ఎంత ఆదరణ లభిస్తున్నప్పటికీ ఇప్పుడు కూడా మానవ సమాజాలపై మతం పట్టు సడలలేదు. మతాను యాయుల మనోమస్తిష్కాలపై ప్రభావం వేయగలిగిన శక్తి నేటికి మతానికి ఉంది. అందు వల్ల స్వేచ్ఛా సమానత్వాల పట్ల వివిధ మతాల ధోరణులపై కూడా దృష్టి సారించవలసిన

1. *ఇస్లాం ఔర్ జదీద్ మాషీ నజరియాత్, పేజి 69*

అవసరం ఉంది. మతరహిత సిద్ధాంతాలు, ఆలోచనల మాదిరిగానే మతసిద్ధాం తాలు కూడా మానవాళికి శాంతి సౌఖ్యాలను ప్రసాదించడంలో విఫలం కావడం నిజంగా శోచనీయం. ఇలాంటి మతాల ఛత్రఛాయల్లో గడుపుతూ మనిషి జీవనంలోని అనేక ఉన్నత విలువలకూ, స్వేచ్ఛా సమానత్వాలు, న్యాయం ధర్మంలాంటి సౌభాగ్యాలకూ నోచుకోవడం లేదు. మతాల ఈ పట్టిక చాలా పొడవుగా ఉంది. అందువల్ల ప్రపంచంలోని అతిపెద్దవైన నాలుగు మతాల గురించి మాత్రమే ప్రస్తావిస్తున్నాము. అవి-హిందూమతం, యూదమతం, బౌద్ధమతం, క్రయిస్తవ మతం. వీటి ఆధారంగా ఇతర మతాల పరిస్థితులను అంచనా వేయవచ్చు.

హైందవం

ప్రపంచ మతాల్లో చారిత్రకంగా హైందవం అన్నింటి కన్నా ప్రాచీన మైనది. ఈ మతంతో మన సంబంధం కూడా ఎక్కువగానే ఉంది. కాబట్టి ముందుగా ఈ మతం స్వేచ్ఛా సమానత్వాలను ఎంతగా ప్రోత్సహించిందో చూద్దాం. హైందవానికి స్వేచ్ఛా సమానత్వాలకు మధ్య ఉన్న సంబంధం నీటికి నిప్పుకు మధ్య ఉన్న సంబంధం లాంటిదంటే తప్పులేదు. ఈ మతంలో వ్యవస్థ యావత్తు బ్రాహ్మణ్యం చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంది. ఈ వ్యవస్థలో బ్రాహ్మణులకు మానవోత్తములుగా ప్రత్యేక హక్కులు అధికారాలు ఉన్నాయి. బ్రాహ్మణులు కాక ఇతర వర్గాల బాధ్యత ఒక్కటే, అది వివిధ స్థాయిల్లో విభిన్న తరగతులుగా బ్రాహ్మణులకు సేవ చేయడం. వివరాలు తెలుసుకోవడానికి మనం హైందవ ధర్మశాస్త్రంగా గణుతికెక్కిన మనుస్మృతిని చదివితే చాలు. హైందవ ప్రాచీన గ్రంథాలైన వేదాలను వివరించేదిగా, సంరక్షించేదిగా మనుస్మృతి వర్ణించబడింది.

మనుస్మృతి దాదాపు మానవజీవన రంగాలన్నింటికీ సంబంధించిన ఆదేశాలను, బోధనలను ప్రతిపాదిస్తుంది. అయితే, మనుస్మృతిలో అతిముఖ్యమైన అంశం – వర్ణవ్యవస్థ. దీన్ని వర్ణాశ్రమవ్యవస్థగా అని కూడా అంటారు. వర్గవిచక్షణ ప్రోత్సహించే బోధనలే ఇవన్నీ. బ్రాహ్మణుల గుత్తాధిపత్యాన్ని నెలకొల్పడానికి గాను ప్రభుత్వం నుంచి ప్రజల వరకు ప్రతి ఒక్కరిని బ్రాహ్మణుల సేవలు చేయడానికి, వారికి విశ్వాస పాత్రులుగా మలచడానికి మాత్రమే ఉద్దేశించబడింది. ఉదాహరణకు మనుస్మృతి లోని ఓ భాగాన్ని చూద్దాం. ఈ వ్యవస్థలోని విభజన ఎంత నిర్దయగా, ఎంత దౌర్జన్యపూరితంగా, ఎంత అక్రమంగా ఉందో తేలిగ్గా అంచనా వేయవచ్చు.[1]

---

1. *మనుస్మృతి అధ్యాయం 1-4*

మనుస్మృతి ప్రజలను నాలుగు వర్గాలుగా విభజిస్తుంది. బ్రాహ్మణులు, క్షత్రీయులు, వైశ్యులు, శూద్రులు. పుట్టింది మొదలు గిట్టే వరకు శూద్రులను అల్పులుగా జమకట్టి, తరతరాలుగా వారిని అవమానకర పరిస్థితుల్లో జీవించేలా చేస్తుంది.[1]

మనుస్మృతి ప్రకారం 'ప్రపంచ ప్రగతి కోసం బ్రహ్మ ముఖం నుంచి బ్రాహ్మణులను, బాహువుల నుంచి క్షత్రీయులను, తొడల నుంచి వైశ్యులను, పాదాల నుంచి శూద్రులను పుట్టించాడు.

> "ఈ పూర్తి విశ్వాన్ని సంరక్షించడానికి మహాతేజస్వి బ్రహ్మ తన ముఖం నుంచి, బాహువుల నుంచి, తొడల నుంచి, చరణాల నుంచి పుట్టిన చతుర్వర్ణాలన కర్మలను వేరువేరుగా నిర్ధారించాడు." *(1:87)*
>
> "వేదాలను చదువడం, వేదాలను చదివించడం, యజ్ఞాలు చేయడం, యజ్ఞాలు చేయించడం, దానమీయడం, దానం పుచ్చుకోవడం – ఈ ఆరు కర్మలు బ్రాహ్మణులకు ప్రత్యేకం." *(1:88)*
>
> "ప్రజలను రక్షించడం, దానమీయడం, యజ్ఞాలను చేయించడం, వేదాలు చదివించడం, ప్రాపంచిక సౌఖ్యాల పట్ల నిరాసక్తత చూపడం – ఈ ఐదు కర్మలు క్షత్రీయులకు ప్రత్యేకం." *(1:89)*
>
> "పశువులను సంరక్షించడం, దానమీయడం, యజ్ఞాలు చేయించడం, వేదాలు చదివించడం, వ్యాపారం చేయడం, వడ్డీ పుచ్చుకోవడం, వ్యవసాయం చేయడం – ఈ ఏడు కర్మలు వైశ్యులవి."*(1:90)*
>
> "శూద్రుల కర్మ ఒక్కటే. పై మూడు వర్ణాల వారికి మనస్ఫూర్తిగా సేవ చేయడం." *(1:91)*

మనువు ప్రకారం శూద్రులకు అవమానాలు, అగౌరవం తప్ప మరేమీ లేదు. ఆధిక్యం కేవలం బ్రాహ్మణులదే.

> శరీరంలో అత్యంత పరిశుద్ధ భాగం ముఖం నుంచి జన్మించారు కాబట్టి బ్రాహ్మణులు వేదాలను ఆచరిస్తారు, అందువల్ల ప్రపంచంలో బ్రాహ్మణులు ధార్మికంగా అత్యున్నతులు. *(1:93)*

---

1. లాలాస్వామి దియా ఉర్దూలో అనువాదం చేసిన మనుస్మృతి సంస్కృతపాఠంతో సహా కాన్పూర్‌లో రెండవసారి ముద్రితమైంది. అయితే ఈ అనువాదంలో హిందీ పదాలెక్కువ. ఆ హిందీ పదాలను ఉర్దూలోకి మార్చి 'ఇస్లాంకా తసవ్వురె మసావాత్' లో ఉటంకించడం జరిగింది. వాటికి తెలుగు అనువాదం ఇది.

"ప్రపంచంలో ఉన్నదంతా బ్రాహ్మణుల సొంతం. ఎందుకంటే బ్రహ్మ ముఖం నుంచి పుట్టిన వాళ్ళు అందరి కన్నా అత్యున్నతులు. అందువల్ల సమస్త వస్తువులకు యజమాని బ్రాహ్మణుడే" *(1:100)*

"బ్రాహ్మణుల పేరు మంగళదాయకమైనది. క్షత్రీయుల పేరులో శక్తి ఉంది. వైశ్యుల పేరులో ధనం ఉంది. శూద్రుల పేరు నిందానీయమైనది" *(2:31)*

"దివ్యకులాలు మూడే. అవి– బ్రాహ్మణ, క్షత్రీయ, వైశ్య కులాలు. నాలుగవ కులం శూద్రులది. కేవలం ఓ జన్మ మాత్రమే. అయిదవ వర్ణం అంటూ ఏదీ లేదు." *(10:4)*

సామాజికంగా శూద్రులకు వారితో పాటు చండాలురకు మనువు ఇచ్చిన స్థానం.. 'శూద్ర కన్యను తన మంచంపై కూర్చుండబెట్టిన బ్రాహ్మణుడు నరకానికి పోతాడు. ఆ కన్యద్వారా బాలుడిని పొందితే ధర్మ, కర్మల నుంచి బహిష్కృతుడవుతాడు' *(3:17)*

"చండాలుడు, శూద్రుడు, కోడిపుంజు, కుక్క, రుతుస్రావంలో ఉన్న స్త్రీ, నపుంసకుడు – వీళ్ళంతా బ్రాహ్మణులు భోజనం చేస్తున్నప్పుడు చూడరాదు." *(3:37)*

"భోజనం తర్వాత ఎంగిలికూటిని శూద్రునికి ఇచ్చినవాడు కాలసూత్ర నరకానికి పోతాడు" *(3:249)*

"శూద్రులకు (తన దాసులుగా ఉన్న వారికి తప్ప) సలహా ఇవ్వరాదు. శూద్రులకు ఎంగిలి కూటిని ఇవ్వరాదు. ధర్మం, వ్రతాల ఉపదేశాలను శూద్రులకు ఇవ్వరాదు" *(4:80)*

"బ్రాహ్మణులు ఉండగా, మరణించిన బ్రాహ్మణుని శూద్రులు ఎత్తరాదు. ఎందుకంటే శూద్రులు తాకడం వల్ల ఆ మృతుడి శరీరాన్ని మండించడం స్వర్గంలో వీలుపడదు." *(5:104)*

"న్యాయంగా బ్రతికే శూద్రులు నెలకోసారి క్షవరం చేయించుకోవాలి. శూద్రుల పరిశుభ్రత వేశ్య వంటిది. బ్రాహ్మణులు మిగిల్చిన ఎంగిలికూడు వారికి ఆహారం' *(5:140)*

శూద్రులకు ధార్మిక విద్య నేర్చుకునే అవకాశాన్ని కూడా మనువు నిరాకరించాడు.

"శూద్రులకు ధర్మవ్రత ఉపదేశాన్ని ఇచ్చినవాడు ఆ శూద్రునితో పాటు నరకానికి పోతాడు" *(4:81)*

"చదువుతున్నప్పుడు ప్రతి అక్షరం స్పష్టంగా నోటిలో వెలువడాలి. శూద్రుల ముందు చదువరాదు." (4:99)[1]

ఈ విధంగా మనువు బ్రాహ్మణులకు శాశ్వత ఆధిక్యం గురించి ప్రకటించాడు. బ్రాహ్మణుల గురించి రాజులకు క్రింది ఉపదేశాలిచ్చాడు.

"రాజు ఉదయాన్నే లేచి రుగ్, యజుర్, సామవేదాల అర్థాన్ని ఎరిగిన బ్రాహ్మణుల దర్శనాన్ని చేసుకోవాలి. పూజలు చేయాలి. వారికి విధేయుడై ఉండాలి."*(7:37)*

"బ్రాహ్మణుల పారాయణాన్ని వారి ఆచరణలను అర్థం చేసుకుని (అంటే వారి జ్ఞాన ఆచరణల స్థాయిని బట్టి) వారికి ప్రత్యేక ఆర్థిక ప్రతిపత్తిని కల్పించాలి. వారిని తండ్రి సంతానాన్ని రక్షించినట్లుగా కాపాడాలి." *(7 : 135)*

"బ్రాహ్మణ కర్మలను ఆచరించని వాడైనా, మూర్ఖుడైనా సరే బ్రాహ్మణుడు రాజుకు ధర్మోపదేశం చేయగలడు. శూద్రుడు ఎలాంటి వాడయినప్పటికీ ఉపదేశం చేయలేడు" *(8 : 20)*

మనువు శూద్రుల గురించి ఇంకా ఇలా ప్రకటించాడు.

"శూద్రుడు ధార్మిక విచారం చేస్తుంటే రాజ్యం ఊబిలో చిక్కుకుని మరణించే ఆవు మాదిరిగా చూస్తుండగానే కుప్ప కూలిపోతుంది."*(8 : 21)*

శూద్రులు, నాస్తికులు అధికంగా ఉన్న రాజ్యం, బ్రాహ్మణ, క్షత్రీయ, వైశ్యులు లేని రాజ్యం సమస్త కష్టనష్టాలతో సతమతమై చివరకు సమసిపోతుంది. *(8:22)*

నేరస్మృతిలో శూద్రుల స్థానం క్రింది శ్లోకాల్లో చూడండి.

"బ్రాహ్మణులతోగాని, క్షత్రీయులతో గాని, వైశ్యులతో గాని శూద్రులు కఠినంగా మాట్లాడితే వారి నాలుకకు రంధ్రం వేయాలి. ఎందుకంటే వాళ్ళు నీచాయవయవం కాళ్ళ నుంచి జన్మించారు." *(8 : 27)*

---

1. *ఇదేవిధంగా గౌతమ్ (12:4–6)లో ఇలా ఉంది. ఎవరన్నా శూద్రుడు వేద శబ్దాలను వింటే అతడి చెవుల్లో కరగించిన తగరాన్ని లేదా లక్కను పోయాలి. శూద్రుడు వేదాల భావాన్ని చదివితే అతడి నాలుక కోయాలి. వేదాలను కంఠస్థం చేస్తే అతడి శరీరాన్ని రెండు ముక్కలు చేయాలి. అల్ జిహాద్ ఫిల్ ఇస్లామ్ పేజి 366.*

"నువ్వు ఫలానా బ్రాహ్మణుడి కన్నా నీచుడివి – ఇలా పెద్ద గొంతుతో బ్రాహ్మణుల పేరును, కులాన్ని ప్రస్తావించిన శూద్రుడి నోటిలో పన్నెండు అంగుళాల ఎర్రగా కాల్చిన చువ్వ గుచ్చాలి." *(8:271)*

"అహంకారంతో బ్రాహ్మణులకు ఉపదేశమిచ్చిన శూద్రుడి నోటిలో, చెవుల్లో వేడి వేడి నూనెను రాజు పోయాలి." *(8:272)*

"చండాలుడు తదితరులు ఉన్నత వర్ణాల వారిని కొడితే వారు ఏ అవయవంపై కొట్టారో వారికి సంబంధించిన ఆ అవయవాన్ని ఖండించి వేయాలి." *(8:279)*

"చేతులతో కొడితే చేతులు నరకాలి. కాళ్ళతో కొడితే కాళ్ళు నరకాలి" *(8:270)*

"అల్పులు, అధికులతో పాటు ఒకే ఆసనంపై కూర్చుంటే అతడి నడుంపై ముద్రవేసి అతడు మరణించని విధంగా పిరుదలను కోసివేయాలి." *(8:271)*

"శూద్రుడు అహంకారంతో మీద ఉమ్మివేస్తే అతడి పెదాలను ఛిద్రం చేయాలి. మూత్రం పోస్తే మర్మాంగాన్ని ఖండించివేయాలి." *(8:282)*

కేవలం బ్రాహ్మణులను సేవించడం మాత్రమే ప్రపంచంలో శూద్రుల కర్తవ్యం. ఆ కర్మను మరిచి సంపాదించాలన్న భావన కూడా అతడి మనస్సులో రాకూడదు.

"కొనబడిన శూద్రుడైనా లేక కొనబడని శూద్రుడైనా అతడితో బానిసగా పని చేయించాలి. ఎందుకంటే బ్రాహ్మణులకు దాసులుగా పనిచేయడానికే శ్రీ బ్రహ్మ శూద్రులను పుట్టించాడు" *(8:413)*

"శూద్ర బానిసకు స్వేచ్ఛనీయాలని యజమాని భావించినప్పటికీ అతడు స్వతంత్రుడు కాలేడు. ఎందుకంటే దాస్యం అతడి సహజ స్వభావంలో ఉంది. ఆ స్వభావాన్ని ఎవ్వరూ మార్చలేరు." *(8:414)*

"శూద్ర బానిస నుంచి బ్రాహ్మణుడు సంపద తీసుకోవాలి.. ఎందుకంటే ఆ సంపద శూద్రుడిది కాదు. అది దోషరహితము. శూద్రుడు సమకూర్చిన సంపద అతడి స్వామిదే." *(8:417)*

బ్రాహ్మణుడికి గౌరవం పుట్టుకరీత్యా లభిస్తుంది. అతడి ఆచరణలు ఎలాంటివైనా సరే అతడి గౌరవ మర్యాదలకు ఎలాంటి భంగమూ వాటిల్లదు.

"అగ్ని కాల్చినా కాల్చకపోయినా అది ఏవిధంగా దైవమో అదేవిధంగా బ్రాహ్మణుడు పండితుడైనా లేక మూర్ఖుడైనా అతడు దైవమే" *(9:317)*

"బ్రహ్మ వైశ్యులను పుట్టించి వారికి పశువులను ఇచ్చాడు. బ్రాహ్మణ క్షత్రీయులకు సమస్త యాజమాన్యాన్ని ఇచ్చాడు" *(9:327)*

ఉన్నత కులం, ఉన్నత జన్మస్థానం, నియమపాలన, ఉన్నత చరిత్ర –ఈ కారణాల వల్ల బ్రాహ్మణుడు అందరికన్నా అధికుడు. సమస్త వర్ణాల వారికి గురువు, ప్రభువు." *(10:3)*

"బ్రాహ్మణుడికి సేవ చేయడంలోనే శూద్రులకు సాఫల్యం ఉంది. ఎందుకంటే, వారు పుట్టింది సేవ చేయడానికే కాబట్టి. వేదాలను పారాయణం చేసే, గృహస్థాశ్రమంలో ఉన్న పుణ్య బ్రాహ్మణుల సేవ శూద్రులకు సాఫల్యాన్ని ఇస్తుంది." *(9:334)*

"పరిశుభ్రత, బ్రాహ్మణసేవ, మృదుభాషణం, అహంకారాన్ని చూపకుండడం, ఎల్లప్పుడు బ్రాహ్మణ శరణులో ఉండడం – ఈ పనులు శూద్రులకు ఉన్నత వర్ణాన్నీ యగలవు" *(9:335)*

"బ్రాహ్మణుల సేవ శూద్రుల అత్యుత్తమ కర్మ. ఈ కర్మను మరిచి అతడు చేసేదంతా నిష్ఫలం." (10:123)

ఇది శూద్రుల పరిస్థితి. ఇక చండాలుడు తదితరుల విషయానికి వస్తే, వీళ్ళు ఊరికి బయట ఉండాలి. పళ్ళాలను వాడరాదు. వీళ్ళ సంపద గాడిదలు, కుక్కలు మాత్రమే. (10:51)

"శవాల దుస్తులు ధరించాలి. పగిలిన పళ్ళేలలో అన్నం తినాలి. ఇనుప వస్తువులతో అలంకరించుకోవాలి. ఎల్లప్పుడు గస్తీ తిరగాలి." (10:52)

"ధర్మాత్ములైన వారు వీరిని కలువడం, చూడడం చేయరాదు. వీరి వివాహాలు వారి సమూహంలోనే జరగాలి. కలువడం, మాట్లాడడం కూడా వారి సమూహానికే పరిమితం" (10:53)

"వీరి ఆహారం ఇతరుల దయపై ఉంటుంది. పగిలిన పళ్ళేలలో వీరికి అన్న మీయాలి. వీళ్ళు రాత్రి ఊరిలో తిరగరాదు" (10:54)

"వీళ్ళు తమ కులాన్ని సూచించే చిహ్నాలు ధరించి, రాజాజ్ఞానుసారం పనులు చేయడానికి పగటి పూట మాత్రమే ఊరిలో తిరగాలి. ఎవరి బంధువైనా చనిపోతే ఆ శవాన్ని తీసుకెళ్ళాలి. ఇది మతాదేశం." (10:55)

"వీళ్ళు రాజు ఆదేశంతో, సముచితమైన రీతిలో శాస్త్రపరంగా చంపవలసిన వ్యక్తులను చంపాలి. ఆ హతుల దుస్తులను, మంచాన్ని, నగలను తీసుకోవాలి." *(10:56)*

మనుస్మృతి ప్రకారం బ్రాహ్మణ శూద్ర వర్ణాల మధ్య భేదాన్ని మరోసారి చూద్దాం.

"తన శరణులో ఉన్న, తనకు సేవ చేస్తున్న శూద్రుడికి ఎంగిలి కూటిని, పాత బట్టలను, బాగుచేయని ధాన్యాన్ని, పాత మంచాన్ని, ఇంటిలోని పాతసామాన్లను ఇవ్వాలి." *(10:125)*

"శూద్రుడు శక్తివంతుడైనప్పటికీ సమర్థుడైనప్పటికీ సంపద కూడబెట్టరాదు. ఎందుకంటే, సంపద పొంది అతడు బ్రాహ్మణులను కష్టపెడతాడు." *(10:129)*

"బ్రాహ్మణులు యజ్ఞాల కోసం శూద్రుల నుంచి ఎప్పుడు ధనాన్ని అడుగరాదు. అలా శూద్రుడి వద్ద ధనాన్ని అడిగి ఆ ధనంతో యజ్ఞం చేస్తే తరువాతి జన్మలో చండాలుడిగా పుడతాడు" *(11-24)*

"శూద్రుడి వద్ద ధనాన్ని పుచ్చుకుని అగ్నిహోత్రం చేసిన వాడు శూద్రుడికి యజ్ఞం చేయించేవాడు (రుత్విక్కు) అవుతాడు. అతడికి ఎలాంటి ప్రతిఫలమూ లభించదు. అంతేకాదు వేదపారాయణం చేసే బ్రాహ్మణులలో అతడు నిందానీయుడు అవుతాడు." *(11-42)*

"బ్రాహ్మణుడు తన పుట్టుకరీత్యా దేవతలకే దైవసమానుడు. అతడి ఆదేశం అందరూ పాటించదగింది. వేదాలలో పేర్కొన్న మాటలివి. దీనికి కారణం వేదాలే" *(11-84)*

"శూద్రుడిని చంపిన దానికి పరిహారం పిల్లి, కప్ప, కుక్క, ఆవు గుడ్లగూబ, కాకి మొదలైన వాటిని చంపిన దానికి పరిహారంతో సమానం" *(11-131)*

"బ్రాహ్మణుడి తపస్సు బ్రహ్మజ్ఞానం. క్షత్రియుడి తపస్సు ప్రజారక్షణ. వైశ్యుడి తపస్సు వ్యవసాయం. శూద్రుడి తపస్సు సేవ." *(11-235)*

మనుస్మృతిలోని శ్లోకాలకు ఎలాంటి వివరణ అవసరం లేదు. వీటిని చదివితే ఫాసిజం ధ్వజవాహకులు కూడా తమకు ఇలాంటి ఆలోచనలు తట్టనందుకు బాధపడతారు. ఇలాంటి ఉపదేశాలున్నప్పుడు సాధారణ ప్రజల పట్ల న్యాయంగా వ్యవహరించి స్వేచ్ఛా

సమానత్వాలను ఇవ్వడం సాధ్యం కాదు. ఇలాంటి ఉపదేశాలున్నప్పుడు స్వంత ప్రజల పట్ల మానవత్వంతో వ్యవహరించలేరు. అలా ఆశించడం మంటలతో దాహాన్ని తీర్చుకోవడమే అవుతుంది. భారతదేశంలో దళితులు తదితర అణగారిన జాతుల స్థితిగతులు ఈ వాస్తవానికి సజీవ సాక్ష్యాలు.

యూద మతం

హైందవం తరువాత ప్రపంచంలో అతి ప్రాచీన మతం యూదమతం. ఈ మతాను యాయులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు. అయితే ఈ మతంలో జాత్యాధిక్యభావం పాతుకుపోయి ఉంది. అందువల్ల ఇతర జాతుల పట్ల న్యాయంగా, ధర్మంగా వ్యవహరిస్తుందని, సౌభ్రాత్రత, సమానత్వాలు చూపుతుందని ఏమాత్రం ఆశించలేం. ఈ కారణం వల్లనే స్వేచ్ఛా సమానత్వాల లాంటి ఉన్నత విలువలను ప్రోత్సహించడంలో యూదమతం అంతర్జాతీయంగా ఎలాంటి పాత్రను పోషించలేదు. ఈ విలువలను ప్రోత్సహిస్తానని కూడా ఆ మతం ఎన్నడూ అనలేదు. పైగా యూదుల పవిత్ర గ్రంథంలో యూదులు సృష్టించుకున్న జాత్యాధిక్య భావాలను ప్రబోధించే వాక్యాలు లెక్కలేనన్ని ఉన్నాయి. సమస్త విశ్వాన్ని సృష్టించిన యావత్ మానవాళిని పోషిస్తున్న ఆ అత్యున్నత దైవం కేవలం బనీ ఇస్రాయీల్, ఇబ్రానీల సొంతమని యూదుల పవిత్రగ్రంథం పేర్కొంటుంది. ఆ గ్రంథంలోని క్రింది వాక్యాన్ని చూడండి.

> "వాళ్ళు నీ మాట వింటారు. నీవు బనీఇస్రాయీల్‌తో కలిసి ఈజిప్టు పెద్ద రాజు వద్దకు వెళ్ళండి. అతడితో ఇబ్రానీల దైవం మిమ్మల్ని పిలిచాడు, మేము మూడు రోజుల ఏడారి మార్గంలో వెళతాము. మా దైవానికి బలినిస్తామని చెప్పండి"
>
> *(ఖరూజ్ : 3:18)*

> ఆ తర్వాత మూసా, హారూన్‌లు లోపలికెళ్ళి ఫిర్ఔన్‌తో "ఇస్రాయీలీల దైవం తన వాళ్ళకు ఎడారిలో పండుగ చేసుకోడానికి వెళ్ళనీయమన్నాడని చెప్పారు. అప్పుడు ఫిర్ఔన్ "ఆ దేముడెవరు? నేను అతడి మాట విని బని ఇస్రాయీలీలను ఎందుకు వెళ్ళనీయాలి? ఆ దేముడెవరు? నాకు తెలియదు. నేను బనీ ఇస్రాయీలీలను వెళ్ళనిచ్చేది లేదు" అన్నాడు. అప్పుడు వాళ్ళు "ఇబ్రానీల దైవం మాతో కలిసాడు. అందువల్ల మేం మూడు రోజుల ఎడారి మార్గంలో వెళతాము. మా దైవానికి బలిఇస్తాము. తద్వారా అతడు తన ఖడ్గంతో మిమ్మల్ని కొట్టకుండా ఉండడానికి" అన్నారు"
>
> *(ఖరూజ్ అధ్యాయం 5:1-3)*

"అతడితో అనండి ఇబ్రానీల దైవం నన్ను నీ వద్దకు పంపాడు. "నా వాళ్ళను వెళ్ళనీయమని ఎడారిలో నా ఆరాధన చేయమని .. అయినా నువ్వు నా మాటను వినలేదు అని చెప్పాడు" (7:16)

అంతేకాదు యూదుల గ్రంథంలో దైవం ఇస్రాయీల్ ప్రజలను తన దత్తపుత్రులుగా పేర్కొన్నాడు.

"అలా అయితే నువ్వు ఫిర్ఔన్‌తో "ఇస్రాయీలీలు నా దత్త కుమారులని దైవం చెప్పాడని చెప్పు. కాబట్టి నా కుమారులను వెళ్ళనీయమను. అలా వెళ్ళనీయక పోతే నేను అతడి దత్తపుత్రుడిని పరిమార్చుతానని చెప్పు" *(ఖరూజ్: అధ్యాయం 4)*

బహుశా అందువల్లనే కాబోలు వాళ్ళు తమను తాము దైవపుత్రులుగా దైవానికి ఇష్టులైన వారిగా లెక్క వేసుకుంటారు.[1]

అంతేకాదు, ప్రపంచంలో తాము ఏం చేసినా పరలోకంలో నరకాగ్ని కేవలం కొన్ని రోజుల కన్నా ఎక్కువ తమను కాల్చబోదని భావించేవారు[2]

ఇలాంటి భావాలున్న ప్రజ ఇతర ప్రజల పట్ల సోదర భావాన్ని సమానత్వాన్ని న్యాయ బద్ధతను ప్రదర్శిస్తుందని ఆశించలేము. ఇది ఊహాగానం కాదు. ఈ విషయాన్ని వారి మతమే అంగీకరిస్తుంది. అందువల్లనే వారి పవిత్ర గ్రంథం ఇస్రాయీలీలను, ఇస్రాయె లేతరులను వేరు చేస్తూ ఇస్రాయేలేతరులు పరాయివారిగా వింతజనులుగా పేర్కొంటుంది. స్పష్టంగా చెప్పాలంటే జాతి విచక్షణ పాటించాలన్న బోధన ఉంది. ఈ విషయం పవిత్ర గ్రంథంలో ఇలా ఉంది :

"ప్రతి ఏడేళ్ళకోసారి క్షమాభిక్ష పెట్టడం క్షమించే పద్ధతి. తన పొరుగువారికి అప్పు ఇచ్చిన వాడు ఆ అప్పును మాఫీ చేయాలి. తన పొరుగువాడిని అడగరాదు. ఎందు కంటే ఆ సంవత్సరం దైవం క్షమించే సంవత్సరం. అయితే పరదేశీని అడగ వచ్చు. కానీ నీ సోదరునికి ఇచ్చిన అప్పును మాఫీ చేయాలి. (15 : 1-4)

నువ్వు నీ సోదరునికున్న అప్పుకు వడ్డీ ఇవ్వకు. రొఖ్ఖం గాని, ధాన్యం గాని, అలా వడ్డీగా ఇచ్చే మరే వస్తువు అయినా సరే ఇవ్వవద్దు. అయితే పరాయి వారికి నువ్వు

---

1. *సూరె మాయిద, వాక్యం 18, ఖుర్ఆన్ కూడా వీళ్ళ ఈ వాదనను పేర్కొంది)*
2. *సూరె బఖర, వాక్యం 80లో ఖుర్ఆన్ వీళ్ళ ఈ భ్రమలను ప్రస్తావించింది. అంతేకాదు, ఖుర్ఆన్ ఆరోపణలపై యూదులు, క్రయిస్తవుల మౌనం ఈ మాటల్లోని నిజాన్ని ధృవపరుస్తోంది.)*

అప్పు ఉంటే వారికి వడ్డీ ఇవ్వవచ్చు. కాని నీ సోదరునికి వడ్డీ ఇవ్వరాదు. తద్వారా ఈ దేశానికి నువ్వు యజమాని కావడానికి దైవం నీ చేతి పనులన్నింటిలో సౌభాగ్యాన్నీయాలని నువ్వు ఆశించగలవు" (23:19-20)

అంతేకాదు పవిత్రగ్రంథం దృష్టిలో ఎవరినన్నా బానిస చేసి అమ్మడం అన్నది కేవలం ఇస్రాయిలీలకే నిషిద్ధం. అలా వారు చేస్తే నేరం. ఇతరులతో అలా ప్రవర్తించడంలో ఎలాంటి అభ్యంతరం లేదు. అందుకే ఈ గ్రంథం ఇలా పేర్కొంటోంది.

"తన తోటి సోదరులయిన బనీ ఇస్రాయీలీలను అపహరించుకుని పోయి బానిసగా మార్చిన, అమ్ముకున్న వాడు ఎవరయినా దొరికితే వాణ్ణి చంపేయాలి. ఇలాంటి చేష్టలకు తమ మధ్య చోటీయరాదు. " (అధ్యాయం 24 :7)

అయితే ఇదే వ్యవహారం ఇతరుల పట్ల –అంటే ఇస్రాయీలేతరుల పట్ల ఎవరయినా చేస్తే అందులో తప్పు లేదు.

బోధించేది జాతి విచక్షణే. అయితే పవిత్ర గ్రంథం అతి మృదువుగా బోధనలు చేస్తుంది. కాగా, తాల్మూద్ వ్యాఖ్యలు ఈ గ్రంధ ఉద్దేశ్యాన్ని సంపూర్ణంగా బహిర్గత పరుస్తు న్నాయి.

"ఇస్రాయీలీలకు చెందిన ఎద్దు ఇస్రాయలేతరుని ఎద్దును గాయపరిస్తే దానిపై ఎలాంటి పరిహారమూ లేదు. కాని ఇస్రాయలేతరుని ఎద్దు ఇస్రాయిలీ ఎద్దును గాయపరిస్తే పరిహారముంది. అలాగే, ఎవరన్న వ్యక్తికి, ఎక్కడన్నా ఏదన్నా వస్తువు దొరికితే ఆ వ్యక్తి ఆ చుట్టుపక్కల నివసించే ప్రజలు ఎవరన్నది చూడాలి. ఇస్రాయలీ ప్రజల ప్రాంతమైతే వెంటనే తనకు వస్తువు దొరికిందని ప్రకటించాలి. ఇస్రాయలేతరుల ప్రాంతమైతే ఎలాంటి ప్రకటన చేయవలసిన అవసరం లేదు. ఆ వస్తువును తానే తీసుకోవాలి. " రబీ శామ్యూల్ వ్యాఖ్యల ప్రకారం ఇస్రాయలీ, ఇస్రాయలేతరుని వ్యాజ్యం న్యాయమూర్తి ముందుకు వస్తే న్యాయమూర్తి ఇస్రాయలీ చట్టం ప్రకారం తన తోటి సోదరుని గెలిపించగలిగితే ఆ ప్రకారం గెలిపించి ఇది మా చట్టమని చెప్పాలి. ఒకవేళ ఇస్రాయలేతరుల చట్ట ప్రకారం తోటి సోదరుని గెలిపించే వీలు మాత్రమే ఉంటే ఆ ప్రకారమే తన వాడిని గెలిపించి 'ఇది మీ చట్టమే' అని చెప్పాలి. ఒకవేళ రెండు చట్టాలు కాపాడలేకపోతే ఏ విధంగానయినా ఇస్రాయలీ గెలిచే వీలుంటే ఆ విధంగా ప్రయత్నించాలి. రబి శామ్యుల్ ప్రకారం ఇస్రాయలీ ప్రతి తప్పును సొమ్ము చేసుకోవాలి.[1]

---

1. *తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ (1-225)*

ఇలాంటి బోధనలున్న మతం ఇతరుల పట్ల న్యాయంగా, స్వేచ్ఛా సమానత్వాల విలువల ప్రకారం వ్యవహరిస్తుందని ఆశించగలమా?

బౌద్ధమతం

ఈ మతం ఆస్తిక ప్రపంచంలో ప్రాచీనమైనది మాత్రమే కాదు, నేటికీ ఈ మతానుయాయులు కోట్ల సంఖ్యలో ఉన్నారు. జాతివివక్షను, వర్గ విచక్షణల వల్ల మానవాళికి తగిలిన గాయాలకు ఔషధంగా ఈ మతాన్ని చాలా మంది భావించారు. అందువల్లనే స్వతంత్ర భారతంలో దళితుల విముక్తికి నడుం కట్టిన ప్రధమ నాయకుడు డా. అంబేద్కర్ కూడా తన అంతిమ దినాల్లో ఈ మతాన్ని స్వీకరించారు. తనతో పాటు పెద్ద సంఖ్యలో తన అనుయాయులను కూడా ఈ మతం ఛత్రఛాయల్లోకి చేర్చారు. కాని వాస్తవాలు చూస్తే బౌద్ధమతంపై ప్రాపంచిక వైరాగ్య ప్రభావం తీవ్రంగా ఉంది. ఇలాంటి వైరాగ్య భావాలు ఉన్న మతంతో సామాజిక రుగ్మతలను అంతమొందించడం అంత సులభం కాదు. బుద్ధుని దృష్టిలో మానవజీవితం దు:ఖదాయకం, క్లేశభరితం. సకల దు:ఖాలకు మూలం మనిషి కోరికలు. విముక్తి పొందే మార్గం ఒక్కటే ఉంది. ప్రాపంచిక సంబంధాలను, కోరికలను ఆకాంక్షలను మనిషి విడిచిపెట్టాలి. ఈ బోధనల వల్లనే భారతదేశంలో ప్రజల దృష్టిని ఈ మతం ఆకర్షించింది. హిందూ మతంలోని కులవ్యవస్థ సృష్టించిన రుగ్మతలను బౌద్ధం అంతం చేస్తుందని ఆశించారు. కాని ఈ దిశలో బౌద్ధం ప్రభావవంతమైన పాత్రను పోషించలేదు.

శ్రద్ధ ప్రకాష్ దేవ్‌జీ ఈ విషయమై ఇలా రాశారు.

"వర్ణాశ్రమ వ్యవస్థతో బౌద్ధమతానికి సంబంధం ఏమిటి? ఈ ప్రశ్నకు జవాబిచ్చే ముందు మరికొన్ని అంశాలు ప్రస్తావించడం అవసరం. కులవ్యవస్థ వ్రేళ్ళు పెకలించి హిందూ సమాజ నిర్మాణాన్ని పడగొట్టడం బుద్ధుని ఉద్దేశ్యం కాకపోయినప్పటికీ కుల విభజన అన్నది ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతంలో లేదు. బ్రాహ్మణ, క్షత్రీయ, అగ్రకులాల వారే కాక, అల్ప కులాల వారు కూడా భిక్షుసంఘంలో చేరే అర్హత ఉండేది. ఒకసారి బుద్ధుడు స్వయంగా ఇలా అన్నారు

"గంగా, జమునా, సరస్వతి తదితర నదులు ఏవైనా సరే చివరికి సముద్రంలో కలిసి తమ పాత పేరును వదిలి సముద్ర జలాలుగానే పిలువబడతాయి. అదే విధంగా బ్రాహ్మణ, క్షత్రీయ, వైశ్య, శూద్ర వర్ణాల వారు కూడా నా ఉపదేశాలకు అనుగుణంగా గృహస్థాశ్రమాన్ని వదిలి సన్యాసాశ్రమాన్ని స్వీకరించిన తర్వాత తమ పాత వంశాన్ని, ఆచారాలను,

వర్ణ నామాన్ని విడిచి శాక్య సంతానంగా భిక్షువులుగా మాత్రమే పిలువబడతారు." అని స్పష్టపరిచారు"[1]

మరోచోట బుద్ధుడు ఇలా బోధించాడు

"సచ్ఛీలం, పవిత్రతల వల్ల నిమ్న కులస్థుడు కూడా బ్రాహ్మణుడయిపోతాడు. బ్రాహ్మణత్వానికి నిజమైన లక్షణం ఇదే. పుట్టుక రీత్యా ఎవరూ బ్రాహ్మణులు కాదు. మనిషి మంచి పనుల వల్ల నిజమైన బ్రాహ్మణుడవుతాడు"

ఇంకా ఇలా అన్నారు

"జన్మసిద్ధంగా ఎవ్వరూ చండాలుడు కాదు. బ్రాహ్మణుడూ కాదు. మనిషి కేవలం తన కర్మల ద్వారానే బ్రాహ్మణుడు గాని చండాలుడు కాని అవుతాడు" (సత్‌నిపత్)

మరోచోట

"సత్యం, ప్రేమ, పరిశుభ్రత, దయలను పాటిస్తూ ఉన్నవాడు, జితేంద్రీయుడు, అజ్ఞానాన్ని పాపకృత్యాలను విడనాడి స్వేచ్ఛను పొందినవాడే నిజమైన బ్రాహ్మణుడు" (ధర్మపథం)

అయితే ఇంతటి ఉన్నతమైన బోధనలు చేసినప్పటికీ బౌద్ధమతం భారతదేశంలో పాతుకుపోయిన కులవ్యవస్థను నిర్మూలించడంలో చెప్పుకోదగ్గ పాత్రను పోషించలేక పోయింది. ఇదే విషయాన్ని పేర్కొంటూ శ్రద్ధ ప్రకాష్ దేవ్‌జీ ఇంకా ఇలా రాశారు.[2]

"బుద్ధుడు కులవ్యవస్థ వ్రేళ్ళు నరికి సమాజాన్ని సంస్కరించే ప్రయత్నం చేశాడని అనుకోరాదు. సమాజంలో అల్ప జాతులుగా పడిఉన్న వారిని పైకిలాగే ప్రయత్నం చేయడం, అల్పజాతుల వారిని ఉన్నతులుగా మార్చడం లేదా సమాజంలోని అనాచారాలను రూపు మాపడం ఇలాంటి ఏ సంస్కరణ గురించైనా సంఘర్షించాలని, పోరాడాలని ఆయన బోధించిన సాక్ష్యం దొరకదు. సమాజ సంస్కరణ అన్నది ఆయన ధర్మప్రచారంలో లేదు. సమాజం స్థితి, రాజ్య పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ సమాజాన్ని వదిలిపెట్టిన భిక్షువులకు సామాజిక బాధ్యతలతో ఎలాంటి సంబంధమూ లేదు. భిక్షువులు సంఘ నియమాలను పాటిస్తే చాలు.

మానవ సమాజాలకు స్వేచ్ఛా సమానత్వాల నిలయాలుగా చేయడంలో బౌద్ధమత పాత్రను నిష్పక్షపాతంగా విశ్లేషించిన వ్యాసకర్త అభిప్రాయాలివి.[3]

ఇంతకు మించి ఈ విషయంలో మనం వేరే చెప్పనవసరం లేదు.

---

1. బుద్ధదేవ్‌జీ కె సావకహ్ ఔర్ బుద్ధ ధరమ్‌కా బయాన్, భాగం 4, పేజి 14-24
2. ఇంతకు ముందు పేర్కొన్న పుస్తకం పేజి 44, 45
3. అదే పుస్తకం ముందుమాట పేజి 1-32

క్రయిస్తవం

క్రయిస్తవ మతానుయాయులు ప్రపంచంలో మూల మూలలా వ్యాపించి ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మతమన్న కీర్తి క్రయిస్తవానికి ఉంది. ముఖ్య విషయమేమంటే మానవులకు స్వేచ్ఛా సమానత్వం సోదర భావాల విలువలను ప్రసాదించడంలో బౌద్ధంలాగే ఈ మతం కూడా తన ప్రవక్త బోధనలపైనే ఆధారపడి ఉంది. సమస్త మానవులు సహజ సిద్ధంగా స్వతంత్రులు, సమానులు అన్న క్రీస్తు ప్రకటన ఇంతకు ముందే వివరించాము క్రయిస్తవ మతానుయాయులు కూడా ఈ ప్రకటనను పదే పదే చెబుతూ ఉంటారు. కాని వాస్తవాలు వేరుగా ఉన్నాయి. అనేక ఇతర అంశాలతో పాటు ఈ స్వేచ్ఛాసమానత్వాల భారాన్ని క్రయిస్తవం బలవంతాన మోస్తోంది. క్రీస్తు స్పష్టమైన పదాల్లో తాను బనీ ఇస్రాయిలీ ప్రజల కొరకు అవతరించినట్లు పేర్కొన్నారు. మిగిలిన జాతులతో సమాజాలతో తనకెలాంటి సంబంధమూ లేదని స్పష్టపరిచారు. అందువల్లనే ప్రవక్త యాకూబ్ (అస) జన్మభూమికి చెందిన స్త్రీ ఒకామె ప్రవక్త క్రీస్తుతో తనకుమార్తెకు పట్టిన దుష్టశక్తిని వదిలించమని కోరినపుడు ఆయన "నేను ఇస్రాయిల్ వంశంలో మార్గభ్రష్టులైన ప్రజల వద్దకు తప్ప మరెవ్వరి వద్దకు పంపబడలేదు" అని జవాబిచ్చారు" *(మతా: అధ్యాయం 15-24)*

అయినా ఆ స్త్రీ పట్టువదలక ప్రాధేయపడుతుంటే ఆయన ఇలా చెప్పారు

"పిల్లల రొట్టెను తీసుకుని కుక్కలకు వేయడం మంచిది కాదు" *(అధ్యాయం 26)*

ఈ మాటల వల్ల స్పష్టంగా తెలుస్తున్నదేమంటే జీవితంలోని అనేక ఇతర వ్యవహారాలు సమస్యల లాగే స్వేచ్ఛా సమానత్వాలు కూడా ప్రవక్త క్రీస్తు బోధనలలోని అంశాలు కాదు. క్రీస్తు ప్రవక్త ఆసక్తి అంతా ఇస్రాయలీలలో దారితప్పిన వారికి మాత్రమే పరిమితమైంది. అయితే తన కార్యపరిధుల్ని అతిక్రమిస్తూ క్రీస్తు ప్రవక్త స్వేచ్ఛా సమానత్వాల గురించి చేసినట్లుగా కనబడే బోధనలు కల్పితాలు తప్ప మరేమీ కాదు. అందులో ఒకటి ప్రవక్త పదవి తర్వాత క్రీస్తు

"యూదులు లేరు, గ్రీకులు లేరు, బానిసలు లేరు, స్వతంత్రులు లేరు, స్త్రీలు లేరు, పురుషులు లేరు.. ఎందుకంటే ప్రవక్త క్రీస్తులో మీరంతా ఒక్కటే."

(గెలియత్ పేర్ ప్రవక్త లేఖ, అధ్యాయం 3-28,29)

క్రయిస్తవంలో కలిసిన తర్వాత యూదులు, గ్రీకులు అన్న భేదాలు నశించి పోయాయి. బానిసలు, స్వతంత్రులు అన్న విభేదం రూపుమాసింది. ఇది చాలా మంచిదే. కాని, స్త్రీ స్త్రీగా ఉండదు. పురుషుడు, పురుషుడు కాదు అనడంలో అర్థమేమిటి? స్త్రీపురుషులు లైంగికంగా విభిన్నమైన వారని తెలియని వారెవరూ?

స్త్రీ పురుషుల శరీర నిర్మాణం వేర్వేరుగా ఉంటుందని, భావావేశాలు, అభిరుచులు భిన్నమైనవని, జీవితపు పరుగులో వారిరువురికి హక్కులు బాధ్యతలు విభిన్నమైనవని తెలియనిదెవరికి?

ఆచరణాత్మకమైన న్యాయబద్ధమైన మాట ఏమంటే, స్త్రీపురుషుల సహజ భేదాల్ని అంగీకరిస్తూ జీవిత పయనంలో స్త్రీపురుషుల కొరకు వారిని సమతుల్యమైన మార్గంలో నడిపే, వారి హక్కులను, బాధ్యతలను నిర్ధారించే మార్గదర్శక సూత్రాలను ప్రతిపాదించాలి. అంతేగాని స్త్రీపురుష సహజ భేదాలనే నిరాకరించడం సరికాదు. స్త్రీ పురుషుల మధ్య ఉన్న భేదాలను గుర్తించడం అనివార్యమైనట్లే విభిన్న మానవజాతులు, తెగల విషయంలోనూ ఇదే పద్ధతిని ఆచరించడం ద్వారా మానవుల మధ్య న్యాయాన్ని, సమతుల్యతను, శాంతి భద్రతలను సంతృప్తికరంగా నెలకొల్పగలం. మానవుల మధ్య రంగు, జాతి, తెగల భేదాలు సహజ భేదాలు. ఈ విధంగా మానవ సమాజం రంగు,జాతి,భేదాల ప్రాతిపదికన విభజించ బడడం అనివార్యం. ఈ విభేదాలను రూపుమాపడానికి గాను అసలు ఎలాంటి భేదాలు లేవని వాటి ఉనికినే నిరాకరించడం సరిఅయిన పద్ధతికాదు. ఈ భిన్నవర్గాలను ఓ కేంద్రంతో అనుసంధానం చేస్తూ విభిన్న వర్గాల ప్రత్యేక ఉనికిని అంగీకరిస్తు మనిషి జీవిత పయనం ముందుకు సాగాలి. ఏ వర్గానికి ఏ విధమైన అన్యాయం జరగరాదు. ఏ వర్గం హక్కులను మరో వర్గం కబళించరాదు.

మరింత విచారకరమైన విషయమేమంటే మానవ సమానత్వం గురించి కల్పిత గాథ లను, బోధనలను స్వీకరించిన వారు తుదకు వాటిని మరింత ప్రమాదకరంగా మలిచారు. అంటే క్రీస్తు తర్వాత క్రీస్తు అనుయాయులు క్రీస్తు బోధించిన ధర్మశాస్త్రానికి పూర్తిగా దూర మయ్యారు. వారేమి చేసినా దైవిక కుటుంబంలోనే ఉంటారు. ఈ పరంపర క్రింది విధంగా ప్రారంభమయ్యింది.

"విశ్వసించకపూర్వం ధర్మశాస్త్రానుగుణంగా మాకు కాపలా ఉండేది. విశ్వాసం వచ్చేవరకు అంటే అది ప్రకటిత మయ్యే వరకు మేం దానికి నిబద్ధులుగానే ఉన్నాము. క్రీస్తు వరకు చేరడానికి ధర్మశాస్త్రం మాకు దారి చూపించింది. తద్వారా మేము విశ్వసాను గుణంగా నిజాయితి గలవారిగా నిరూపించబడ్డాము. కాని విశ్వసించిన తర్వాత మేము మా మార్గదర్శి (అంటే ధర్మశాస్త్రం)కి లోబడి ఉండలేదు. ఎందుకంటే, విశ్వాసం దృష్ట్యా ప్రవక్త క్రీస్తు (మతంలో) ఉన్నాము. మేమంతా దైవపుత్రులం. క్రీస్తులో చేరడానికి బాప్తిజము స్వీకరించిన వారందరూ క్రీస్తుని తమపై ఆవహింప చేసుకున్నారు." (పై పుస్తకం *23-27*)

దీని తరువాత మానవ సమానత్వం గురించి ఇంతకు ముందు చెప్పిన మాటలు ఉన్నాయి. ఆ మాటలతో పాటు క్రింది వాగ్దానం కూడా ఉంది.

"మీరు గనుక క్రీస్తు ప్రవక్త అనుయాయులైతే అబ్రహం సంతానంగా వాగ్దానం ప్రకారం వారసులు కూడా అవుతారు" *(పై పుస్తకం 29)*

పై వాక్యంలో క్రయిస్తవ అనుయాయులకు చేయబడిన వాగ్దానం స్పష్టంగా ఉంది. అంటే వాళ్ళు విశ్వాసం... ప్రవక్త క్రీస్తు అలైహిస్సలాం.. వచ్చే వరకు ధర్మ శాస్త్రానికి బద్ధులై ఉన్నారు. కాని క్రీస్తు అవతరించిన తర్వాత వారిపై నుంచి ధర్మశాస్త్ర నిబంధనలు తొలగి పోయాయి. వాళ్ళు క్రీస్తు కారణంగా దైవపుత్రులై పోయారు. వీళ్ళు క్రీస్తు బాప్తిజము స్వీకరించి క్రీస్తును ధరించారు. క్రీస్తు అనుయాయులను సాధారణ ప్రజలుగా లెక్కకట్టడం సరికాదని తెలుస్తోంది. దైవంతో వారి సంబంధం తండ్రి కొడుకుల సంబంధం వంటిది.[1]

తండ్రి ఎంత చండశాసనుడైనా అతడికి సంతానంతో ఉండే సంబంధం ఇతరులతో ఉండదు. సరే, ఈ బాంధవ్యం ఉన్నప్పటికీ కనీసం ధర్మశాస్త్రాన్ని పాటించాలన్న నిబంధనన్నా ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. కాని ఇది అత్యంత దురదృష్టమే అనుకోండి, తండ్రి తన కొడుకులపై ఎలాంటి నిబంధనలు, భారమూ లేకుండా చేసాడు. ఇలాంటి పరిస్థితిలో సాధారణ ప్రజల పట్ల న్యాయంగా, స్వేచ్ఛా సమానత్వాలను గౌరవిస్తూ ఎవరన్నా వ్యవహరిస్తే అది ఓ విచిత్రమే అవుతుంది. దైవ ప్రేమ తమపై ఉందన్న గ్యారంటీ గల ఈ ప్రజలు సాధారణ జనావళి పట్ల ఏ తీరున వ్యవహరించినా అడిగేదెవరు? యూరప్ భూభాగంలో క్రయిస్తవుల చేతుల్లో జాతి వివక్ష పెరిగి పెద్దదిగావడానికి పూర్తి అవకాశాలు దొరికాయి. యూరప్‌లో మాత్రమే కాదు సమస్త ప్రపంచంలో ఈ జాతి వివక్షతను వాళ్ళు పెంచి పోషించిన తీరు, జాతి వివక్ష ప్రాతిపదికన కొన్ని వర్గాల ప్రజలపై దౌర్జన్యాలు, అత్యాచారాలకు పాల్పడిన వైనం చూసి మనం ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

సిద్ధాంతాలు, మతబోధనల వైఫల్యం

మానవ సమాజాలలో స్వేచ్ఛ సమానత్వాలను పెంపొందించడంలో ఆయా మతాల వైఫల్యాలు మన ముందున్నాయి. ఆయా మతబోధనలు స్వేచ్ఛా సమానత్వ విలువల స్థాపనలో ప్రతిబంధకాలే అయ్యాయి. అణిచివేత తప్ప ఈ బోధనలు మరేమీ సాధించలేదు. యూదమతం కాని, క్రయిస్తవం కాని, హైందవం కాని, బౌద్ధమతం కాని అన్నింటిలోను లోపాలున్నాయి. ఆ లోపలుండగా ఈ మతాల్లో స్వేచ్ఛా సమానత్వాలు సంపూర్ణంగా

1. *ఖుర్‌ఆన్ ప్రకారం కూడా యూదుల వలె క్రయిస్తవులు, దైవపుత్రులుగా వాదించేవారని తెలుస్తోంది. (మాయిదా : 12)*

లభిస్తాయని ఆశించలేం. అదేవిధంగా మానవ మేధ సృష్టించిన సిద్ధాంతాలు, భావనలు కూడా స్వేచ్ఛా సమానత్వాల స్థాపనలో విఫలమయ్యాయి. కాగా, ఈ విషయంలో కమ్యూనిజం లేదా బోల్షివిజం కూడా వెనుకబడి లేదు. మానవ సౌభ్రాత్రత దృష్ట్యా చూస్తే స్వేచ్ఛా సమానత్వాలను నిరాకరించడం అన్నది బోల్షివిజం నైజంలోనే ఉంది. అందువల్లనే రష్యాలో ఈ విలువల పీక నులిమిన తర్వాత కమ్యూనిస్టు సోషలిస్టు రష్యా ప్రపంచలో అతిపెద్ద భాగాన్ని సామ్యవాద చట్రంలో ఇరికించగలిగింది.

ఫాసిజం విషయానికి వస్తే రెండవ ప్రపంచ యుద్ధంలో ఇటలీ, జర్మనీలు పరాజయాన్ని చవి చూసిన తర్వాత ఈ భావన బలహీనపడి పోయింది. అయితే ఈ భావాలు ఇంకా ఉనికిలో ఉన్నాయి. కాగా, ప్రపంచంలో ఇతరత్రా ఫాసిజం విభిన్న రూపాల్లో తల పైకెత్తుతూనే ఉంది. నిజం చెప్పాలంటే ఫాసిజం నీడలు నానాటికి పొడవవుతూనే ఉన్నాయి. భారతదేశంలో సాంస్కృతిక ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న తీరే దానికి సజీవ ఉదాహరణ.

ఇక అమెరికాలో జారీ అయిన, ఆ తర్వాత ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ చేసిన స్వేచ్ఛా సమానత్వాల తీర్మానం విషయానికి వస్తే ఈ తీర్మానం సమస్త ప్రపంచ మానవులు సమానులనీ ఘోషిస్తుంది. స్వేచ్ఛా సమానత్వాలు మౌలిక మానవహక్కులుగా పేర్కొంది. ఈ తీర్మానం ప్రభావం వల్ల ప్రపంచ దేశాల్లో ఈ విలువల ఔన్నత్యం గురించిన స్తోత్ర పాఠాలు జరుగుతున్నాయి. ఇందులో మనదేశం కూడా ఉంది. మానవ హక్కుల ఈ చార్టరులో కూడా లోపాలు తక్కువగా లేవు.

మొదటిది : స్వేచ్ఛా సమానత్వాల గురించిన అంతర్జాతీయ భావన ఏదీ లేదు. కేవలం పరిమిత నేపథ్యానికి లోబడిన బలహీన అభిప్రాయం మాత్రమే ఉంది. ఎందుకంటే, ఈ చార్టరు పాలకులకు, ప్రజలకు మధ్య సంఘర్షణలో జన్మించింది.

రెండవది : ఈ భావన సమస్త ప్రపంచ మానవుల స్వేచ్ఛా సమా నత్వాల గురించి చెబుతున్నట్లు పైకి కనబడుతుంది. కాని ఈ చార్టరు నిస్సహాయ పరిస్థితుల కారణంగా ఉనికిలోకి వచ్చింది. ఆ నిస్సహాయ పరిస్థితి కనుక లేనట్లయితే ఇంతకు ముందు చెప్పినట్లు జాతి వివక్షత అన్నది యూరప్‌లో ప్రబలంగానే ఉండేది.

మూడవది : ఫాసిస్టు భావాల్లో ఉన్న మౌలికదోషం ఆధునిక స్వేచ్ఛా సమానత్వాల భావనలోను ఉంది. అదేమంటే, దైవాన్ని, ప్రళయదినాన్ని తిరస్కరించడం. ప్రాపంచిక వ్యవహారాల్లో దైవిక బోధనలను పూర్తిగా నిరాకరించడం. దైవిక విశ్వాసం లేనిదే ఎన్ని మంచి సిద్ధాంతాలు, మంచిమంచి మాటలు ఉన్నా అవి కేవలం అలంకారప్రాయాలుగా మాత్రమే

మిగిలి ఉంటాయి. ఆచరణను ప్రేరేపించే శక్తి ఏదీ వాటికి ఉండదు. మనిషి మంచి మాటలను చెప్పగలడు. మంచి సిద్ధాంతాలను రూపొందించగలడు. కాని భావావేశాలు, కోరికలు, అభిలాషల కీకారణ్యంలో చిక్కుకుని సిద్ధాంతాల గొంతు నులిమేస్తాడు.

ప్రపంచ పరిస్థితులు

సమకాలీన ప్రపంచ పరిస్థితులను పరిశీలిస్తే, పైన పేర్కొన్న విషయాలలోని నిజాలు నిరూపణకు వస్తాయి. ఈ సందర్భంగా బోల్షివిజంను ప్రస్తావించడం లేదు. ఎందుకంటే, మానవహక్కులను నిరాకరించడం, ఓ ప్రత్యేక తరగతి తప్ప మిగిలిన మానవులందరి పట్ల దౌర్జన్యాలను అనుమతించడం ఆ సిద్ధాంతపు నైజంలోనే ఉంది. పరాయి దేశస్తులపైనే కాదు, కొన్ని సార్లు తమ దేశస్తులను కూడా దౌర్జన్యాలపాలు చేయడం ఇందులో సాధారణం. చరిత్రలో రష్యా, ఇటలీ, జర్మనీలలో జరిగిన సంఘటనలే అందుకు నిదర్శనం. స్వేచ్ఛా ప్రజాస్వామ్యం మానవ హక్కుల ధ్వజాన్ని మోస్తున్నట్లు చెప్పుకునే దేశాల పరిస్థితి కూడా భిన్నంగా లేదు. స్వేచ్ఛా సమానత్వాలన్నవి తమ దేశానికే చెందినవిగా భావిస్తాయి. ఇతర జాతుల స్వాతంత్ర్యాన్ని హరించడం, వివక్ష పాటించడం సముచితంగా భావించడమే కాదు, అది తమ హక్కుగా చూపే ప్రయత్నం కూడా చేస్తాయి. నేడు మానవ హక్కుల గురించి మాట్లాడుతున్న బ్రిటన్, ఫ్రాన్స్, తదితర దేశాలు సామ్రాజ్యవాద కాంక్షతో వలసలు స్థాపించి అక్కడి ప్రజల పట్ల వ్యవహరించిన తీరు చరిత్రలో ఇంకా పాతబడలేదు. అంతేకాదు, శ్వేత జాతీయులలో కనబడే జాత్యాహంకారం ఎటువంటిదంటే, పరాయి దేశస్తుల స్వేచ్ఛా సమానత్వాలను గౌరవించడం అన్నది అటుంచండి, స్వయాన తమ దేశస్తులకు కూడా జాతి వర్ణ వివక్షకు అతీతంగా స్వేచ్ఛా సమానత్వాలను ఈయడానికి సిద్ధపడలేదు. అమెరికాలోని నల్లజాతీయుల జనాభా ఇందుకు సజీవ ఉదాహరణ. స్వేచ్ఛా సమానత్వాల అమెరికా ప్రకటన వెలువడి 200 సంవత్సరాలు పూర్తయి నప్పటికీ నేటికీ నల్లజాతి ప్రజలు జాతి వివక్షను ఎదుర్కుంటూనే ఉన్నారు. అనేక విధాల దౌర్జన్యాలకు గురవుతున్నారు.[1]

శ్వేత జాతీయులు ప్రపంచంలో అనేక ప్రాంతాలను తమ గుప్పిట బిగించుకున్నారు. అక్కడి మెజారిటీ ప్రజలపై అధికారం చెలాయిస్తూ జాతి వివక్షతకు గురి చేస్తున్నారు. మానవహక్కులకు సమాధి కడుతున్నారు. శ్వేతేతర జాతులను జంతువుల కన్నా హీనంగా

---

1. ఇప్పుడు బ్రిటన్‌లో కూడా ఈ ప్రభావం కనబడుతోంది. ఇక్కడ శ్వేతజాతీయులకు ఇతర జాతులకు మధ్య వివక్ష అమలువుతోంది. గోధుమ వర్ణం ప్రజలకు అనేక విధాల, వివక్ష తప్పడం లేదు. చివరకు పరిస్థితి ఉద్రిక్తతలకు కూడా దారితీస్తోంది.)

చూస్తున్నారు. శ్వేత జాతీయుల దురాక్రమణలో నలుగుతున్న ఆయా దేశాల ప్రజల ఇళ్ళు, పిల్లల బడులు అన్నీ దూరంగా, శ్వేతజాతి వారిపై నీడ కూడా పడకుండా ఎక్కడో విసరేసి నట్లు ఉంటాయి. గుర్తింపు పత్రాలు లేనిదే మాతృదేశంలో శ్వేతేతర ప్రజలు తిరగలేని పరిస్థితి కల్పించారు. ఈ నిబంధనలను అతిక్రమిస్తే సంవత్సరాల తరబడి జైలు ఊచలు లెక్కబెట్ట వలసి వస్తుంది. దక్షిణాఫ్రికాలోని జాత్యాహంకార ప్రభుత్వం ఇదంతా ఆచరణలో బహి రంగంగా ప్రదర్శించింది. పాశ్చాత్య దేశాలు పెంచి పోషిస్తున్న ఈ దుష్టశక్తి పూర్తి ఆఫ్రికాను తన విషకౌగిలిలో బిగించి, ఆ విధంగా జాత్యాహంకార ప్రభుత్వ పరిధిని పెంచుకోవాలని ప్రయత్నించింది. జింబాబ్వే (పూర్వం రోడిషియా) ఏడేళ్ళపాటు గెరిల్లా పోరాటం చేసి ఇరవై వేలమంది యోధుల్ని బలిపెట్టి స్వాతంత్ర్యాన్ని పొందినా నేటికి కూడా జింబాబ్వే నెత్తిన కత్తి వేలాడుతూనే ఉంది. జింబాబ్వే ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నాలు అనేకం జరిగాయి. ఇంకా అనేక ఇతర దేశాలు ఆఫ్రికాలో తిష్ఠ వేసిన శ్వేతజాతి కొండచిలువ నోటిలో చిక్కు కుని ఉన్నాయి. ఇదంతా స్వేచ్ఛా సమానత్వాలంటూ గొంతు చించుకునే, సంస్కృతి సభ్యతా అంటూ పాటపాడే పాశ్చాత్య దేశాల మార్గదర్శకత్వంలోనే జరుగుతోంది. ఈ జాతులు గతంలో పాల్పడ్డ ఘోరాలను మరిచిపోయి, 1984లో ఐక్యరాజ్యసమితి వేదిక నుంచి మానవ హక్కుల గురించి కొల్లేటి చాంతాడంత తీర్మానాన్ని ఆమోదించాయి. యావత్ ప్రపంచంలో ఈ ప్రకటనను గొంతెండిపోయేలా ప్రచారం చేసాయి.

ఈ జాతుల వెనుక నడుస్తున్న ప్రపంచంలోని కొన్ని దేశాలలోను ప్రజాస్వామ్యం మానవహక్కుల గురించిన ఉపన్యాసాలు జోరుగా వినిపిస్తుంటాయి. ఉదాహరణకు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశంలో కూడా వివక్ష తీవ్రస్థాయిలో ఉంది. రాజ్యాంగంలోను, శాసనాలలోను వేలసార్లు మతానికి పాలనతో సంబంధం లేదని ప్రకటించినప్పటికీ సామాజికంగా మతప్రభావం నుంచి బయటపడలేదు.

అందువల్ల దేశస్వాతంత్ర్యం వచ్చి అర్ధ శతాబ్ధి దాటినా స్వేచ్ఛా సమానత్వాలు ప్రతి పౌరునికి మౌలికహక్కులని రాజ్యాంగం గుర్తించినప్పటికీ ఈ హక్కులను అమలు చేయ డానికి అనేక శాసనాలు చేసినప్పటికీ ప్రభుత్వ వేదికలపై నుంచి తరచుగా ఈ హక్కుల గురించి ప్రకటనలు వెలువడుతున్నప్పటికీ, వీటికి సంబంధించిన ప్రత్యేక ఆర్డినెన్సులు, సూచనలు జారీ అవుతున్నప్పటికీ – నేటికి ఇక్కడి అంటరానివారు, వెనుకబడిన తరగతుల పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. కాగా కొన్ని సందర్భాల్లో పరిస్థితి గతం కన్నా దిగ జారినట్లు కూడా తెలియవస్తోంది.

రెండవ అధ్యాయం

సమానత్వ సాధనలో ఇస్లాం పాత్ర

ఇస్లాంలో స్వేచ్ఛా సమానత్వాల భావనను పరిశీలిస్తే, ఇతర మతాలు, సిద్ధాంతాలకు ఇస్లాంకు మధ్య భూమ్యాకాశాల తేడా కనబడుతుంది. ఈ సందర్భంగా ఇస్లాంలో సమానత్వ భావనకు సంబంధించిన అనేక ప్రత్యేకతలు మన ముందుకు వస్తాయి.

ఇస్లాంలో సమానత్వ భావన

ఇస్లాంలో సమానత్వ భావన అన్నది ఏవో పరిస్థితుల నేపథ్యంలో పుట్టింది కాదు. అందువల్ల సమాజంలో వివిధ వర్గాల మధ్య ఘర్షణల ఫలితంగా లేదా పాలకులు, పాలితుల మధ్య సంఘర్షణ ఫలితంగా ఉనికిలోకి వచ్చింది కానే కాదు. స్వేచ్ఛా, సమానత్వం, సోదర భావం, సౌభ్రాత్రతలకు సంబందించి ఇస్లాంలో ఉన్న భావన విశ్వజనీనమైనది. రంగు, జాతి, భాష, ప్రాంతం, జాతీయత వంటి విభేదాలకు అతీతంగా పూర్తి మానవసమాజాన్ని ఒక వసుధైక కుటుంబంగా రూపొందిస్తోంది. పూర్తి ప్రపంచ మానవాళికి స్వేచ్ఛా సమానత్వాల హక్కులను ప్రసాదిస్తూ మానవులలో సౌభ్రాత్రత, సౌహార్దతలను పెంపొందిస్తుంది. ఈ ఇస్లామీయ భావనలోని అతిముఖ్యమైన అంశం ఏమంటే, ఇది ఏ తత్వవేత్త సృష్టించినది కాదు. లేదా ఏ సంస్కర్త మస్తిష్కంలో రూపుదిద్దుకున్న ఆలోచనల ఫలితమూ కాదు. ఇది భూమ్యాకాశాల సృష్టికర్త పంపిన బోధన. ఆ విశ్వప్రభువు మనిషిని సృష్టించిన వాడు. మనిషి శక్తిసామర్థ్యాలు బలహీనతల గురించి చక్కగా తెలిసినవాడు. మనిషి ఎదుర్కుంటున్న సమస్యలు సంక్షోభాల గురించిన పూర్తి జ్ఞానం కలవాడు. రెండవ ముఖ్యాంశం ఏమంటే, ఇస్లాం ఏదో అస్పష్టంగా సౌభ్రాత్రతా బోధన చేసి తృప్తిపడి ఊరుకోలేదు. ఈ విలువల స్థాపన కోసం శాశ్వతమైన, మార్పునొందని ప్రమాణాలను నిర్దేశించింది. ఫలితంగా వర్ణ, వర్గ, భాషా, జాతీ, ప్రాంతీయ భేదాల ఆధారంగా మానవులు నిర్మించిన అడ్డుగోడలు కుప్పకూలిపోతాయి. ఈ అసహజ, ప్రకృతి విరుద్ధ విభేదాల ఆధారంగా ప్రపంచాన్ని సతమతపరుస్తున్న వివక్షతలు కలతలు, కలహాలు సమస్తం సమసిపోతాయి. మూడవ ముఖ్యాంశం ఏమంటే, ఇస్లాంలోని ఈ బోధనలు ఈ నియమాలు కేవలం కాగితాలకే

పరిమితమైనవి కావు, అలంకారప్రాయాలూ కావు. ఈ నియమాల ప్రాతి పదికన ఇస్లాం ఆచరణాత్మకంగా ఓ విశ్వజనీన సౌభ్రాత్రతకు రూపునిచ్చింది. జాతి, వర్ణ, వర్గ భాషా ప్రాంతీయ భేదాల ఆధారంగా ప్రపంచంలో ఉన్న వివక్షతకు ఈ బోధనలకు ఆమడదూరం. నేటికి 1400 సంవత్సరాలకు పూర్వం అరబ్బు ద్వీపకల్పంలో, అరబ్బు జాతిలో జన్మించిన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఆధ్వర్యంలో ఈ విశ్వజనీన సౌభ్రాత్రతా వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. నాటి నుంచి నేటి వరకు ప్రతికాలంలోనూ, ప్రతియుగంలోనూ, ప్రతి ప్రాంతంలోనూ నిరాటంకంగా ఈ సౌభ్రాత్రతా, సమానత్వ భావనను మనం చూడవచ్చు.

> "మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తర్వాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులు గాను, తెగలుగాను చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువగా గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు. సకల విషయాలు తెలిసినవాడు. *(హుజురాత్13)*

సమతాభావానికి పునాదులు

ఈ దైవవాక్యాలు ఓ వైపు సమానత్వ సమతాభావాలను ప్రభోదిస్తూ, దాంతోపాటు ఈ విలువల కోసం శాశ్వతమైన మార్పునొందని ప్రమాణాలను నిర్దేశిస్తున్నాయి. ఈ విషయమై తలెత్తే ప్రతి ప్రశ్నకు సంతృప్తి దాయకమైన జవాబులను ఇస్లాం ఇస్తుంది. ప్రాచీన అజ్ఞాన కాలం నుంచి నేటి ఆధునిక అజ్ఞాన యుగం వరకు వివిధ మానవ వర్గాల మధ్య జాతి , రంగు, భాష, ప్రాంత ప్రాతిపదికలపై వ్యవహారంలో ఉన్న విచక్షణలకు, మనుష్యుల మధ్య నిమ్నోన్నతలలను అంగీకరిస్తున్న వాదనలకు ముఖ్యకారణం ఒక్కటే. అది - మానవుల జన్మమూలాలు వేర్వేరని భావించడం. దైవం స్వయాన కొన్ని వర్గాల వారిని ఉన్నతులుగా పేర్కొన్నాడన్నదే దీనికి కారణం. అందువల్ల ప్రాచీన కాలంలో బ్రాహ్మణులు ఈ ప్రత్యేకతను పొందారు. బ్రహ్మ వివిధ మానవజాతులను తన శరీరంలోని వివిధ భాగాల ద్వారా పుట్టించాడు కాబట్టి కొందరికి అధికులుగా మరి కొందరికి అల్పులుగా నిర్ధారించాడని భావించారు. కాగా, నేటి ఆధునిక అజ్ఞాన కాలంలో కొన్ని జాతులు ఇతర జాతుల కన్నా ఉన్నతమైనవనీ, ఆధిక్యంకలిగినవనీ, మిగిలిన జాతుల కన్నా మౌలిక విశిష్టతలు కలిగినవనీ పేర్కొనబడుతున్నాయి. ఇలాంటి అసహజ ప్రకృతి విరుద్ధ భావాలను ఇస్లాం తిరస్కరిస్తూంది. ఇలాంటి భావాలలోని ప్రతి అంశాన్ని తుచ్ఛమైనదిగా పరిగణిస్తోంది.

సమస్త మానవుల జన్మమూలం ఒక్కటే అన్న వాస్తవం ఖుర్ఆన్‌లో సవివరంగా స్పష్టంగా ప్రకటించబడింది. జన్మరీత్యా సమస్త మానవాళి ఒకే విధమైన గౌరవ మర్యాదలకు అర్హత కలిగి ఉంది. అదేవిధంగా ఆలోచనాశక్తి, విజ్ఞానాలలోనూ సమస్త మానవ వర్గాలు సమానం. జాతిపరంగా ఏ వర్గానికి మరో వర్గంపై ఆధిక్యం, ఔన్నత్యం లేదు. ఖుర్ఆన్‌లో ప్రకటితమైన ప్రమాణాలను ఏడు విభిన్న శీర్షికల క్రింద విభజించవచ్చు.

1. సమస్త మానవులు ఆదం (అస) హవ్వాల సంతానం

సమానత్వం గురించి పవిత్ర ఖుర్ఆన్ ముందుగా సమస్త మానవుల జన్మ మూలం ఒక్కటే అన్న వాస్తవాన్ని ప్రస్తావిస్తోంది. సమస్త మానవులు ఒకే జంట ఆదం హవ్వాల సంతానమని బోధిస్తుంది. అందువల్ల మనుష్యుల మధ్య నిమ్నోన్నతా భేదాలన్న ప్రస్తావనే ఉండదు.

> "మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుంచి పుట్టించాడు. అదే ప్రాణి నుంచి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతోమంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపచేశాడు. ఏ దేవుని పేరు చెప్పుకుని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో ఆ దేవునికి భయ పడండి. బంధుత్వ సంబంధాలను తెంచడం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి. *(నిసా: 1)*

> "ఆయనే మిమ్మల్ని ఒకే ప్రాణి నుంచి పుట్టించాడు. ఇంకా ప్రతి ఒక్కరికి ఒక నివాస స్థలం ఉంది. అప్పగించబడే ఒక స్థలం ఉంది. విజ్ఞత ఉన్నవారి కొరకు మేము ఈ సూచనలను స్పష్టపరిచాము." *(అన్ఆమ్ : 98)*

> "అల్లాహ్‌యే మిమ్మల్ని ఏకైక ప్రాణి నుంచి సృష్టించాడు. ఇంకా అదే జాతి నుంచి అతనికి సహచరిని సృజించాడు. అతను ఆమెతో ప్రశాంత జీవితం గడుపడానికి.
> *(ఆరాఫ్ : 189)*

> "మిమ్మల్ని ఒకే ప్రాణి నుంచి పుట్టించిన వాడు ఆయనే. తిరిగి ఆయనే ఆ ప్రాణి నుంచి దాని జంటను సృజించాడు. ఇంకా ఆయనే మీ కొరకు పశువులలో ఎనిమిది మగ ఆడ జాతులను సృష్టించాడు. *(జుమర్ : 6)*

2. సమస్త మానవులను సృష్టించిన విధానం ఒక్కటే

సమస్త మానవుల జన్మమూలం ఒక్కటే అయినట్లు సమస్త మానవులను ఒకేవిధంగా

సృష్టించడం కూడా జరిగింది. అంటే ప్రపంచంలోని సమస్త మానవులు ఒకే మట్టితో సృష్టిం చబడ్డారు. ఈ విధంగా చూసినా ఏ మనిషికి మరో మనిషిపై ఎలాంటి ఆధిక్యం, ఔన్నత్యం లేదు.

"అల్లాహ్ మిమ్మల్ని మట్టితో సృష్టించాడు. తర్వాత ఇంద్రియ బిందువులతో. ఆ తర్వాత మిమ్మల్ని జంటలుగా చేశాడు. (అంటే స్త్రీపురుషులు) అల్లాహ్‌కు తెలియ కుండా ఏ స్త్రీ అయినా గర్భం దాల్చనూ లేదు, ప్రసవించనూ లేదు. వయసు పెరుగు తున్న వాడెవ్వడూ ఆయువును పొందలేడు. ఎవరి ఆయువులోను తగ్గింపు అన్నది జరగదు. గ్రంథంలో రాయబడి ఉన్న దాని ప్రకారం తప్ప. ఇది అల్లాహ్‌కు చాల సులభమైన పని. *(ఫాతిర్ : 11)*

"ఆయనే మిమ్మల్ని మట్టితో సృజించాడు. ఆపై రేతస్సుతో, తర్వాత నెత్తుటి ముద్దతో ఆ పిదప ఆయన మిమ్మల్ని శిశువు రూపంలో బయటకు తీస్తాడు. తదనంతరం మీరు పూర్తి బలం పుంజుకునే వరకు మిమ్మల్ని పోషిస్తాడు. ఆ పిమ్మట మీరు ముదిమికి చేరుకునేవరకు మిమ్మల్ని పెంచుతాడు. మీలో కొందరు ముందే పిలువ బడతారు. మీరు మీ నిర్ణయవ్యవధికి చేరి యథార్థం ఏమిటో అర్థం చేసుకోవాలని ఇదంతా చేయబడుతుంది" *(మూ'మిన్ : 67)*

"ఒకవేళ మీకు మరణానంతర జీవితం గురించి ఏదైనా సందేహం ఉంటే మీరు ఈ విషయాన్ని తెలుసుకోవాలి. మేము మిమ్మల్ని మట్టితో సృష్టించాం. తర్వాత వీర్య బిందువులతో, ఆ తర్వాత నెత్తుటి గడ్డతో, ఆపై మాంసపు కండతో, అది రూపం కలదిగాను, రూపం లేనిదిగాను ఉంటుంది. (మేము ఈ విషయాన్ని మీకు యథార్థం ఏమిటో స్పష్టం చేయాలని (తెలుపుతున్నాము) మేము కోరిన (వీర్యబిందు వులను) దానిని ఒక ప్రత్యేక కాలం వరకు మాతృగర్భంలో నిలిపి ఉంచుతాము. తర్వాత మిమ్మల్ని ఒక శిశువు రూపంలో బయటకు తీస్తాము." *(హజ్ : 5)*

"అప్పుడు అతని పొరుగువాడు మాట్లాడుతూ అతనితో ఇలా అన్నాడు. "నిన్ను మట్టితోను, తర్వాత వీర్యబిందువుతోను పుట్టించి ఒక సంపూర్ణ మానవునిగా తీర్చి దిద్దిన ఆయనను నీవు తిరస్కరిస్తున్నావా? ఇక నీ విషయం. నా ప్రభువైతే అల్లాహ్‌యే, నేను ఎవరినీ ఆయనకు భాగస్వామిగా చేయను." *(కహఫ్ : 37,38)*

"అల్లాహ్ దృష్టిలో ఈసా పుట్టుక ఆదమ్ పుట్టుక వంటిదే. అల్లాహ్ ఆదమ్‌ను మట్టితో చేసి "అయిపో" అని ఆజ్ఞాపించాడు. అతను అయ్యాడు. అసలు వాస్తవం

ఇది. అది మీ ప్రభువు తరఫునుంచి మీకు తెలుపబడుతోంది. దానిని శంకించే వారిలో నీవు చేరిపోకు." *(ఆలి ఇమ్రాన్ : 59-60)*

3. సమస్త మానవుల సృష్టి ఒకేవిధమైన శ్రద్ధతో జరిగింది

అల్లాహ్ సమస్త మానవులను ఒకేవిధమైన ద్రవ్యంతో సృష్టించినట్లే, మానవుల రూపురేఖలను తీర్చిదిద్దడంలో సమానమైన ఆసక్తిని కనబరిచాడు. ఈ కోణంతో చూసినా ఏ జాతికి, లేదా వర్గానికయినా సరే ఇతరులపై ఆధిక్యం, ఔన్నత్యాలున్నాయని చెప్పే అవకాశం లేదు.

"మేము మీ సృష్టిక్రియను ప్రారంభించాము. తర్వాత మీ రూపాన్ని తీర్చిదిద్దాము. పిదప ఆదమ్‌కు సాష్టాంగపడండి అని దైవదూతలను ఆజ్ఞాపించాము. ఈ ఆదేశాను సారం అందరూ సాష్టాంగపడ్డారు. కాని ఇబ్లీష్ సాష్టాంగపడేవారిలో చేరలేదు" *(ఆరాఫ్ : 11)*

"మీ కొరకు భూమిని నివాసస్థలంగా చేసినవాడు, పైన ఆకాశాన్ని కప్పుగా నిర్మించినవాడు, మీ రూపాన్ని తీర్చిదిద్దినవాడు, దానిని ఎంతో చక్కగా మలచినవాడు, మీకు పరిశుభ్రమైన పదార్థాలను ఆహారంగా ఇచ్చినవాడు అల్లాహ్‌యే కదా. ఆ అల్లాహ్‌యే (ఈ పనులన్నీ చేసినవాడు) మీ ప్రభువు. ఆ విశ్వప్రభువు అసంఖ్యాకమైన శుభాలు కలవాడు. ఆయనే సజీవుడు. ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు ఎవడూ లేడు." *(మూ'మిన్ : 64)*

"ఓ మానవుడా! పరమదాత అయిన నీ ప్రభువును గురించి ఏ విషయం నిన్ను మోసంలో పడవేసింది. ఆయనే నిన్ను సృష్టించాడు. ఎలాంటి లోపం లేకుండా నిన్ను తీర్చిదిద్దాడు. నిన్ను తగిన రీతిలో పొందికగా రూపొందించాడు. తాను తలిచిన ఆకారంలో నిన్ను క్రమబద్ధంగా మలిచాడు" *(ఇన్‌ఫితార్ : 6-8)*

"అత్తి, అలీవ్‌లు సాక్షిగా, సీనా పర్వతం సాక్షిగా, ఈ శాంతి నగరం (మక్కా) సాక్షిగా, మేము మానవుడిని అద్భుతమైన ఆకృతిలో సృజించాము." *(అత్తీన్ : 1-4)*

4. దైవదాస్య ప్రమాణంలో మానవులందరూ ఉన్నారు

పైన పేర్కొన్న భౌతిక సమానతలే కాక ఆధ్యాత్మిక సమానతలు కూడా ఉన్నాయి. ఖుర్ఆన్ ప్రకారం ప్రారంభదినం నాడు దైవం హజ్రత్ ఆదం (అస) నుంచి తీసుకున్న ప్రమాణం (దైవదాస్యం గురించిన ప్రమాణం)లో ఏ వర్గానికి ఏ విధమైన ప్రత్యేకత

ఇవ్వలేదు. దైవదాస్యం గురించిన ఈ ప్రమాణాన్ని దైవం సమస్త మానవుల పక్షాన హజ్రత్ ఆదం (అస) నుంచి తీసుకున్నాడు. సమస్త మానవులు ఈ ప్రమాణాన్ని అంగీకరించారు.

"ప్రవక్తా! ప్రజలకు ఆ సమయాన్ని జ్ఞాపకం చేయి. అప్పుడు నీ ప్రభువు ఆదమ్ సంతతి యొక్క వీపుల నుంచి వారి సంతానాన్ని తీసి, ఇంకా స్వయంగా వారిని వారికే సాక్షులుగా నిలబెట్టి అడిగాడు. "నేను నీ ప్రభువును కదా?" అని. వారు ఇలా అన్నారు. "నిశ్చయంగా మీరే మా ప్రభువు మేము దీనికి సాక్ష్యం ఇస్తు న్నాము." మేము ఇలా ఎందుకు చేసామంటే, ప్రళయదినం నాడు మీరు "మాకు ఈ విషయం తెలియదు అని అనకుండా ఉండేటందుకు. లేదా "షిర్కును మా తాతముత్తాతలు మా కంటే ముందే ప్రారంభించారు, తర్వాత మేము వారి సంతతికి జన్మించాము. దుర్జనులు చేసిన నేరానికి మీరు మమ్మల్ని పట్టుకుంటారా?" అని అనకుండా ఉండేటందుకు. చూడండి ఇలా మేము సూచనలను స్పష్టంగా వివరిస్తాము. *(ఆరాఫ్ : 172-173)*

"అపరాధులారా! ఈనాడు మీరు వేరు అయిపోండి. ఆదమ్ సంతానమా నేను మీకు ఉపదేశించలేదా, సైతానుకు దాస్యం చేయవద్దని, వాడు మీకు బహిరంగ శత్రువనీ, నా దాస్యమే చేయండని, ఇదే సరైన మార్గమనీ?" *(యాసీన్ : 59-61)*

"మీకు ఏమయింది అల్లాహ్‌ను మీరు విశ్వసించరు, వాస్తవానికి ప్రవక్త మీకు ప్రభు వును విశ్వసించండని పిలుపునిస్తున్నాడు. ఆయన మీ చేత ప్రమాణం చేయించు కున్నాడు. మీరు నిజమైన విశ్వాసులైతే .." *(హదీద్ : 8)*

"జ్ఞాపకం తెచ్చుకోండి. ప్రవక్తల నుంచి అల్లాహ్ ఈ వాగ్దానం తీసుకున్నాడు. "నేను ఈ రోజు మీకు గ్రంథాన్ని వివేకాన్ని ప్రసాదించాను. పూర్వం నుంచి మీ వద్ద ఉన్న హితోప దేశాన్ని ధృవీకరిస్తూ రేపు ప్రవక్త ఎవరైనా మీ వద్దకు వస్తే ఆయనను మీరు విశ్వసించవలసి ఉంటుంది, ఆయనకు సహాయం చేయవలసి ఉంటుంది" ఈ విధంగా ప్రవచించి అల్లాహ్ ఇలా అడిగాడు, "ఈ విషయాన్ని మీరు అంగీకరి స్తారా? మీ తరఫు నుంచి మీపై మోపబడిన ఈ ప్రమాణం బరువు బాధ్యతలను మీరు స్వీకరిస్తారా?" వారు ఇలా అన్నారు, "ఔను, మేము స్వీకరిస్తాము". అప్పుడు అల్లాహ్ ఇలా అన్నాడు "అయితే దీనికి సాక్షులుగా ఉండండి. మీతో పాటు నేను సాక్షిగా ఉంటాను. ఇకపై ఎవరు తమ వాగ్దానం నుంచి మరలుతారో వారే హద్దులు మీరేవారు." *(ఇమ్రాన్ : 81-82)*

5. ప్రాతినిధ్య బాధ్యత మానవులందరిపై సమానంగా ఉంది

దైవం వద్ద దైవదాస్యం చేస్తామన్న ప్రమాణాన్ని మానవులందరూ ఏవిధంగా చేసారో అదేవిధంగా అల్లాహ్ కూడా భూమిపై ప్రాతినిధ్య బాధ్యతను మానవాళి అందరికీ సమానంగా ఇచ్చాడు. సమస్త మానవాళిని సంబోధిస్తూ అల్లాహ్ ఈ బాధ్యతను ప్రదానం చేశాడు. మనిషిని భూమిపై తన ప్రతినిధిగా నియమించాడు. భూమిపై దైవశాసనాన్ని స్థాపించాలని మనిషికి శాసించాడు. ఈ ప్రాతినిధ్య బాధ్యత పూర్తి మానవాళిపై సమానంగా ఉందని ఖుర్‌ఆన్ పేర్కొంటోంది. ఇందులో ఏ ఒక్క జాతికి ప్రత్యేకత, గుత్తాధిపత్యం లాంటివి ఏవీ లేవు.

> "ఈ సంఘటనను జ్ఞాపకం తెచ్చుకో, "నేను భువిలో ఒక ప్రతినిధిని సృష్టించ బోతున్నాను." అని నీ ప్రభువు తన దూతలతో అన్నప్పుడు వారు, "భూవ్యవస్థను అస్తవ్యస్తంగా చేసి రక్తం చిందించేవాడిని నియమించ బోతున్నావా ప్రభూ? మేము నీ స్తోత్రం చేస్తూ నీ గొప్పదనాన్ని కొనియాడుతూ, నీ పవిత్రనామం స్మరిస్తూనే ఉన్నాము కదా!" అని విన్నవించుకున్నాడు. దానికి అల్లాహ్, "మీకు తెలియనివన్నీ నాకు తెలుసు" అని సమాధానం పలికాడు." *(బఖర : 30)*
>
> "ఆయనే మిమ్మల్ని భూమండలానికి ఖలీఫాలుగా చేశాడు. మీలో కొందరికి కొందరిపై ఉన్నతస్థానాలను ప్రసాదించాడు. మీకు ఇచ్చినదానితోనే మిమ్మల్ని పరీక్షించాలని. నిస్సందేహంగా మీ ప్రభువు శిక్షించడంలో కూడా వడిగలవాడు. ఎక్కువగా మన్నించేవాడు, కరుణించేవాడు కూడా." (అల్ అన్‌ఆమ్ : 165)
>
> "మిమ్మల్ని భూమిపై ఖలీఫాలుగా చేసినవాడు ఆయనేగా! ఇక ఎవడైనా అవిశ్వాసానికి పాల్పడితే, అతని అవిశ్వాసం సంకటమై అతని మీదనే ఉంటుంది. అవిశ్వాసుల అవిశ్వాసం వారి ప్రభువు యొక్క ఆగ్రహాన్ని వారిపై ఉగ్రతరం చేస్తుందే తప్ప వారికి ఏ వృద్ధిని కలిగించదు. అవిశ్వాసులకు నష్టంలో పెరుగుదల తప్ప అభివృద్ధి ఏమీ ఉండదు." *(ఫాతిర్ : 39)*
>
> "బాధితుడు మొరపెట్టుకున్నప్పుడు, అతని మొరను ఆలకించి, అతని బాధను తొలగించేవాడెవడు? భూమిపై మిమ్మల్ని ప్రతినిధులుగా చేసినవాడెవడు? అల్లాహ్‌తో పాటు (ఈ పనులు చేసే మరొక దేవుడు కూడా ఎవడైనా ఉన్నాడా? మీరు చాలా తక్కువగా ఆలోచిస్తారు." *(నమల్ : 62)*

6. సమస్త మానవులకు గౌరవమర్యాదలు

దైవం దృష్టిలో మానవులందరికీ సమాన గౌరవమర్యాదలున్నాయని ఖుర్ఆన్ స్పష్టంగా ప్రకటిస్తోంది. గౌరవ మర్యాదలను ఏ ఒక్క జాతికో, లేక తెగకో అల్లాహ్ పరిమితం చేయలేదు. సమస్త మానవులకు సమాన ప్రతిపత్తి గౌరవ మర్యాదలను ప్రసాదించాడు.

"మేము ఆదమ్ సంతతికి పెద్దరికాన్ని ప్రసాదించాము. వారికి నేలపై నీటిలో నడిచే వాహనాలను ప్రసాదించాము. వారికి పరిశుద్ధమైన వస్తువులను ఆహారంగా ఇచ్చాము. మేము సృష్టించిన ఎన్నో ప్రాణులపై వారికి స్పష్టమైన ఆధిక్యాన్ని అనుగ్రహించాము. ఇదంతా మా అనుగ్రహం." *(బనీ ఇస్రాయీల్ : 70)*

"మళ్ళీ వాడు ఇలా అన్నాడు, "కొంచెం వాడ్ని చూడు, వాడు తగినవాడనా? నీవు వాడికి నాపై ఆధిక్యం ఇచ్చావు? నీవు గనక నాకు ప్రళయదినం వరకు వ్యవధినిస్తే నేను వాడి మొత్తం వంశాన్ని సమూలంగా నాశనం చేస్తాను. కేవలం కొందరు మాత్రమే నా నుంచి తప్పించుకో గలుగుతారు." *(బనీ ఇస్రాయీల్ : 62)*

7. బౌద్ధిక శక్తిసామర్థ్యాల సమానత్వం

ఆలోచనాశక్తి, బౌద్ధిక సామర్థ్యం కేవలం ఏదో ఒక జాతికి మాత్రమే అధికంగా ఉంటాయన్న అసహజ వాదనను కూడా ఖుర్ఆన్ త్రోసిపుచ్చింది.[1]

ఏదో ఒక జాతికి ఆలోచనా శక్తి, బౌద్ధిక సామర్థ్యాలలో ఆధిక్యం ఉందన్న వాదనను ఇస్లాం ఖండిస్తుంది. ఈ శక్తిసామర్థ్యాలు ఖుర్ఆన్ ప్రకారం సమస్త మానవాళికి సమానంగా ఉన్నాయి. ఎందుకంటే ఆరంభదినం నాడు అల్లాహ్ ఈ శక్తిసామర్థ్యాలను హజ్రత్ ఆదం (అస)కు ప్రసాదించాడు. ఆయన ద్వారా ఈ శక్తిసామర్థ్యాలు మానవాళికి అందాయి.

"అల్లాహ్ ఆదమ్‌కు అన్ని వస్తువుల పేర్లు నేర్పాడు. వాటిని దూతలకు చూపించి, "(ప్రతినిధి నియామకం సంక్షోభాన్ని దారితీస్తుంది అనే) మీ అభిప్రాయమే నిజమైతే వీటి పేర్లు నాకు కాస్త చెప్పండి?" అని అల్లాహ్ వారిని అడిగాడు. వారు కడు వినమ్రులై ఇలా అన్నారు, "(ప్రభూ!) దోషరహితుడవు నీవే! నీవు తెలిపినది తప్ప మాకు మరేమీ తెలియదు. వాస్తవంగా సర్వం తెలిసినవాడవు, సర్వాన్ని అర్థం చేసుకోగలవాడవు నీవే!" అప్పుడు అల్లాహ్ ఆదమ్‌తో "ఈ వస్తువుల పేర్లను నీవు

---

1. *ఉదాహరణకు పాశ్చాత్యులకు తమ శ్వేతజాతి గురించి ఉన్న అభిప్రాయం. వివరాలు మొదటి అధ్యాయంలో రోమాంటిసిజమ్, రేసిజం శీర్షికల క్రింద మీరు చదివారు)*

వారికి తెలుపు" అని అన్నాడు. ఆదమ్ వారికి వాటి పేర్లన్నీ తెలుపగానే, అల్లాహ్ ఇలా ప్రకటించాడు, "భూమ్యా కాశాలలో మీకు గోప్యంగా ఉన్న సత్యాలన్నీ నాకు తెలుసనీ, మీరు ప్రకటించేవి, మీరు దాచేవి అన్నీ నాకు తెలుసని నేను మీకు చెప్పలేదా?" *(బఖర : 31–33)*

అంతేకాదు, బౌద్ధికశక్తిసామర్థ్యాల విషయంలో దైవానుగ్రహం సమస్త మానవాళిపై సమానంగా ఉందని ఖుర్‌ఆన్ ప్రకటిస్తోంది. ఈ శక్తిసామర్థ్యాలను అనుగ్రహించడంలో దైవం ఏ ఒక్క జాతికి ప్రత్యేక ప్రాధాన్యత ఈయలేదు. అల్‌ఇన్‌సాన్.. అంటే మానవులైన ప్రతి ఒక్కరికీ అనుగ్రహించాడు దైవం.

"ఓ ప్రవక్తా! పఠించు సర్వాన్ని సృష్టించిన నీ ప్రభువు పేరుతో, ఆయన పేరుకు పోయిన నెత్తుటి ముద్దతో మానవుడిని సృజించాడు. పఠించు నీ ప్రభువు పరమ దయాళువు ఆయన కలం ద్వారా జ్ఞానం నేర్పాడు, మనిషి ఎరుగని జ్ఞానాన్ని అతనికి ప్రసాదించాడు." *(అలఖ్ 1–5)*

"పరమ కృపాశీలుడు (అయిన దేవుడు) ఈ ఖుర్‌ఆన్ బోధించాడు. ఆయనే మానవుడిని సృష్టించి అతనికి మాట్లాడ్డం నేర్పాడు." *(రహ్మాన్ : 1–4)*

జాతుల విభజనలోని వివేచన

విశ్వ సృష్టికర్త మానవుల సృష్టిలోను మనిషికి సంబంధించిన సమస్త అంశాలలోనూ అన్నింటా సమానత్వాన్ని పాటించినప్పటికీ మనకు మానవ సమాజాలలో విభిన్న జాతులు, తెగలు వర్ణాలు ఎందుకు కనబడుతున్నాయన్నది ప్రశ్న. అందులోను ప్రతిజాతీ తనదైన ప్రత్యేకతను, ప్రతి తెగ తనదైన విభిన్నతను కలిగి కనబడుతోంది. చివరకు జాతుల శరీరవర్ణాలలోనూ తేడాలున్నాయి. భాషలు వేరువేరుగా ఉన్నాయి. ఆహార అలవాట్లలో వైవిధ్యం ఉంది. తినడం త్రాగడం తీరుతెన్నులు విభిన్నంగా ఉన్నాయి. వస్త్రధారణ వేరువేరుగా ఉంది. నిత్యజీవిత అలవాట్లు భిన్నంగా ఉన్నాయి. విభిన్న జాతులు తెగల మధ్య ఈ వివైధ్యం ఉంది. మానవుల మధ్య సమానత్వాన్ని పెంపొందింపచేయడానికి దైవం గనుక పూర్తి మానవాళిని ఒకేవిధంగా సృష్టించి ఉంటే చాలా అనువుగా ఉండేది కదా! విభిన్న జాతులు తెగల మధ్య ఘర్షణలుండేవి కావు. భాషాభేదాలు, ప్రాంతీయపోరాటాలు, తెగల వైషమ్యాలు ఉండేవి కావు. అంతేకాదు, ప్రతిమనిషి రంగు ఒకేలా, భాష ఒక్కటిగా, ఆహారం ఒకేవిధమైనదిగా, దుస్తులు ఒకేతీరులో, స్వరూప స్వభావాలు ఒకేవిధంగా ఉన్నట్లయితే సముచితంగా ఉండేది కదా! కాని నిజపరిస్థితి చూస్తే భూమిపై వివిధ ప్రాంతాల్లో విభిన్న

జాతులు, భిన్న తెగలు ఉన్నాయి ఎందుకు? ప్రతి ప్రాంతంలోను మనకు అసంఖ్యాక జాతులు, తెగలు భాషలు కనేబడుతున్నాయి .. ఎందుకని?

ఖుర్ఆన్ వాక్యం ఈ ప్రశ్నకు సమగ్రంగా, సంక్షిప్తంగా సమాధానమిస్తుంది. ఆ వాక్యం ప్రకారం దైవం మానవులను భిన్న జాతులుగా, తెగలుగా విభజించింది మనుష్యులు ఒకరినొకరు గుర్తించడానికి, అలా అని ఓ జాతి మరోజాతి కన్నా ఉన్నతమైనదని లేదా ఓ జాతి మరో జాతి కన్నా అల్పమని అర్థం కాదు. తాము ఉన్నతజాతికి చెందినవారమన్న అహంకారంతో ఓ జాతి మరో జాతిపై పెత్తనం చలాయించడాన్ని సమర్థించడమనీ ఈ పంక్తుల భావం కాదు. అల్లమ జమ్ఖష్రీ ఈ వాక్యానికి చక్కని వివరణ ఇచ్చారు.

"అల్లాహ్ మిమ్మల్ని జాతులుగా, తెగలుగా విభజించడం వెనుక ఉన్న ఉద్దేశ్యం మీరు పరస్పరం పరిచయం చేసుకోవడానికి. అలాగే మీ తాతముత్తాతలతోనే మీ బాంధవ్యముండాలని. అలా అని మీరు మీ వంశ ప్రతిష్ఠపై మిగిలిన వారి కన్నా అధికులమని గర్వించేందుకు గాని, లేక ఒండొరుల మధ్య ఉన్న భేదాల పరంగా వివక్ష పాటించాలని గాని, లేక ఒకరి కన్నా ఒకరు ఉన్నతులని గర్వించడానికి గాని ఇలా చేయలేదు."

సాధారణంగా ప్రజలు 'పరిచయం' లేదా 'గుర్తింపు' గురించి నామమాత్రంగా ప్రస్తావించి వదిలిపెడతారు. గుర్తింపు లేదా పరిచయం వెనుక ఉన్న వివేచన సాధారణంగా మన దృష్టిపథంలోకి రాదు. పరిచయం వెనుక ఉన్న లక్ష్యం గురించి కాస్త లోతుగా చూద్దాం. ఆదే క్రమంలో సామాజిక జీవనంలోని కొన్ని బాధ్యతలను కూడా పరిశీలిద్దాం. ఒక మనిషి మరో మనిషిని గుర్తించడానికి జాతి, వర్ణ విభజన తప్ప మరో దారి లేదని ఈ పరిశీలన వల్ల మనకు అర్థం అవుతుంది. ఈ సందర్భంగా సామాజిక జీవనంలోని కొన్ని బాధ్యతలు పూర్తి మానవాళిపై ఉన్నాయి. మరికొన్ని బాధ్యతలు కేవలం ముస్లిం సమాజానికి సంబంధించినవి. ఎందుకంటే వారు దైవదాస్య భావనను స్వీకరించారు. దైవాన్ని విశ్వసించి ఒక ప్రత్యేక జీవనవిధానాన్ని అనుసరిస్తున్నారు కాబట్టి వారిపై ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయి. మనం ముందు పూర్తి మానవాళికి సంబంధించిన బాధ్యతలను పరిశీలిద్దాం.

సామాజిక బాధ్యతలు

సమస్త ప్రపంచ మానవాళి ఒకే జాతికి చెందినది అన్న మాట వినడానికి చాలా బాగుంది. మనుష్యులందరూ ఒకే జాతికి చెందిన వారయితే, ఇంకా అందరి రంగు ఒకేలా ఉన్నట్లయితే, భాష ఒక్కటే అయితే, అందరి జీవిత అలవాట్లు ఒకేతీరులో ఉంటే ఎంత

బాగుండు అనిపిస్తుంది. పైకి ఈ మాటలు చాలా బాగున్నప్పటికీ కాస్త లోతుగా పరిశీలిస్తే మానవాళి ఈ విధంగా ఉన్నట్లయితే మనిషి సమస్యలు పరిష్కారం కావు సరికదా అసంఖ్యాక కొత్త సమస్యలు పుట్టుకొస్తాయి. ఎందుకంటే ఇలాంటి సమాజంలో ఇద్దరు వ్యక్తుల మధ్య సంబంధాన్ని పటిష్టం చేసే ప్రేరక శక్తి ఏదీ ఉండదు.

మనిషి మరో మనిషితో పరిచయాన్ని పెంచుకోవాలనుకుంటే పరిచయానికి అవసరమైన వివరాలు ఉండవు. ఫలితంగా ప్రతి మనిషి ఒంటరి కుహరంలో ఉండిపోతాడు. సమాజంలో ఎవరికి వారే యమునాతీరే పరిస్థితి నెలకొంటుంది. పరస్పర పరిచయానికి సంబంధాలకు గాను మనుష్యుల రూపురేఖలు, శరీరవర్ణం, భాష తదితర అంశాలు ఎక్కువగా తోడ్పడతాయి. మనిషి నడవడి, మాట్లాడేతీరుల వల్ల కూడా పరిచయ సౌలభ్యం ఏర్పడుతుంది. కాగా నిజానికి పరిచయం మొదలు అయ్యే మొదటి అంశం జాతి లేదా తెగకు సంబంధించినది. జాతి తెగ వంశం – వీటి ద్వారా మనిషి పరిచయం దూరదూరాల వరకు వ్యాపించగలదు. ఏదైనా విషయం గురించి ఓ మనిషి చెప్పిన మాటను దూర ప్రాంతాల్లో ఉటంకించడం ఈ వివరాల వల్ల సాధ్యమవుతుంది. ఈ విభజన లేనిదే మనిషి పరిచయం పరిమిత పరిధిలో, అంటే అతడు నివసించే ప్రాంతానికి పరిమితమై పోతుంది. ఆ పరిధిని దాటి విశాల ప్రపంచంలోని వ్యవహారాల్లో పరిచయం అన్నది ఈ విభజన లేకపోతే సాధ్యంకాదు. ఈ విభజన లేకపోతే సమాజంలోని సభ్యుల పరిచయ సంబంధాలు నామమాత్రమైపోతాయి.

నాగరికత వికాసం

మనం ఇదే విషయాన్ని మరింత లోతుగా ఆలోచిస్తే, మానవ జీవితంలో రంగు, వంశం, జాతి, తెగల వల్ల లభించే ఈ పరిచయం లేదా ఈ గుర్తింపు వల్లనే సంస్కృతీ నాగరి కతలు వికసించాయి. ఈ పరిచయం, గుర్తింపుల వల్లనే సంస్కృతి సంప్రదాయాల రథం నడుస్తోంది. సంస్కృతీ నాగరికతలకు అవసరమైన ప్రేరణ ఇక్కడి నుంచే లభిస్తుంది. మానవ నాగరికత ఏదైనా ప్రారంభమయ్యేది సమూహాల ఏర్పాటు వల్ల. వ్యక్తులు సమూహాలుగా ఏర్పడి ఏదైనా ప్రాంతంలో స్థిరనివాసాలు ఏర్పరచుకోవడం ద్వారా నాగరికతకు బీజం పడుతుంది. ఈ సమూహాల వల్లనే పల్లెలు, ఊర్లు, పట్టణాలు, నగరాలు ఏర్పడుతాయి. ఇవి ప్రగతి వికాసాలు సాధించి పెద్ద పెద్ద నగరాలుగా రూపొందుతాయి. ఈ విధంగానే సంస్కృతి నాగరికతలు ప్రారంభమవుతాయి. ఈ నాగరికతలు క్రమేణా విస్తరించి ప్రగతి దిశన పురోగమిస్తాయి. ఈ సమూహాలు ఏర్పడడానికి ముఖ్యమైన ప్రేరక శక్తి, జాతి,

తెగ, రంగు, భాషల ఆధారంగా లభించే ప్రత్యేక గుర్తింపు, పరిచయాల ద్వారానే లభిస్తుంది. ఎందువల్ల నంటే ఈ సమూహాలు స్థిరనివాసాలతో సమాజాలుగా ఏర్పడేది ప్రజల మధ్య పరస్పర చర్యలకు అవకాశం కల్పించడానికి. వ్యాపారం, వాణిజ్యం, ఇచ్చిపుచ్చుకోడాలు, వస్తువుల ఉత్పత్తి, సేవల వినిమయం ఇవన్నీ చోటు చేసుకుంటాయి. ఈ విధంగా వ్యక్తుల మధ్య సాంఘీక సంబంధాలు ఏర్పడుతాయి. పరిశ్రమలు, కార్ఖానాలు ఉనికిలోకి వస్తాయి. వీటిలో ప్రజలు వివిధ స్థాయిల్లో పనిచేయడం ప్రారంభమవుతుంది. విద్యాసంస్థలు ఏర్పడుతాయి. అందులో ఉపాధ్యాయులు విద్యార్థుల కార్యకలాపాలు నడుస్తాయి. ప్రభుత్వాలు ఏర్పడుతాయి. ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య సంబంధాలు రూపుదిద్దుకుంటాయి. ఇవన్నీ ఉనికిలోకి వచ్చి ఒక సమూహం ఒక సమాజంగా, ఒక వ్యవస్థగా రూపొందాలంటే ఆ సమూహంలో ప్రతి వ్యక్తికి ప్రత్యేక గుర్తింపు పరిచయం ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. ప్రతి వ్యక్తితో సమాజం, ప్రభుత్వం వ్యవహరించడానికి వీలు కల్పించే గుర్తింపు ఉండాలి. వ్యక్తికి సంబంధించిన ఈ గుర్తింపు, పరిచయం అన్నది మౌలికంగా జాతి, తెగ, వంశం తదితర అంశాల ప్రాతిపదికన మాత్రమే జరుగుతుంది. చిన్న పరిధిలో, ఒక ప్రత్యేక ప్రదేశంలో వ్యవహారాలైతే వ్యక్తి రూపురేఖలు, పేరు వగైరా వివరాలు సరిపోవచ్చు, కాని ఒక రాజ్యం లేదా దేశం స్థాయిలో వ్యవహారాలకు ఈ గుర్తింపు సరిపోదు. అప్పుడు జాతి, తెగ, ప్రాంతం, రంగు, వంశం, భాష వగైరా వివరాలు తప్పనిసరిగా అవసరమవుతాయి.

ఉదాహరణకు ఒక వ్యక్తి ఏదైనా దుకాణం నుంచి వస్తువులు అప్పుగా తీసుకోవాలనుకున్నాడు లేదా ఎవరి వద్ద నుంచయినా రుణం తీసుకోవాలనుకుంటున్నాడు, ఇప్పుడు ప్రశ్న ఏమంటే అతనికి అప్పు ఇచ్చే వ్యక్తి ఏ పరిచయం ఆధారంగా ఎలాంటి నమ్మకంతో ఆ అప్పు ఇవ్వాలి. ఇలాంటి పరిస్థితిలో రూపురేఖలు, పేరు వగైరా వివరాలు సరిపోతాయా? పేరు ఊరు వంటి వివరాలు కూడా నమ్మకంగా అప్పు ఇవ్వడానికి చాలవు. ఒకే పేరుతో వంద మంది వ్యక్తులు ఉండవచ్చు. ఒకే పేరుతో పది ఊర్లు ఉండవచ్చు. ఇలాంటి పరిస్థితిలో అప్పు తీసుకోవాలనుకుంటున్న వ్యక్తి తన పూర్తి పరిచయం ఇవ్వాలంటే ఒక్కటే మార్గం. తన జాతి, వంశం వగైరా వివరాలన్నీ ఇవ్వవలసి ఉంటుంది. తన తెగ లేదా జాతి వారిని గ్యారంటీగా చూపించవలసి ఉంటుంది.

ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. ఇచ్చిపుచ్చుకోవడాలు ఇతర లావాదేవీలకు సంబంధించి, ఇంకా ఇలాంటి అనేక వ్యవహారాల్లో, నాగరికతకు సంబంధించిన ఇతర సందర్భాల్లో పరిచయం, గుర్తింపునకు సంబంధించిన ఇలాంటి వివరాలు ఎంత అవసరమో మీరే అంచనా వేయవచ్చు.

జాతి, తెగ, రంగు, భాష, ప్రాంతం వగైరా వివరాలు పరిచయానికి, గుర్తింపునకు ఎంతైనా అవసరం. దేవుడు ఈ విధంగా గుర్తింపునకు అవకాశం కల్పించి మనకు పెద్ద వరదానమిచ్చాడన్నది కూడా దీన్నిబట్టి అర్థమవుతుంది. ఉదాహరణకు ఏదైనా విద్యాసంస్థను తీసుకోండి, అందులో వేలాది విద్యార్థులు చదువుతుంటారు. వందలాది ఉపాధ్యాయులు ఉంటారు. అలాగే బోధనేతర సిబ్బంది వందల సంఖ్యలో ఉండవచ్చు. ఇప్పుడు ఆ విద్యాసంస్థలో ప్రతి వ్యక్తికి సంబంధించి స్పష్టమైన గుర్తింపు లేనట్లయితే విద్యాసంస్థ వ్యవహారాలు నడుపడం చాలా కష్టం అవుతుంది. చిన్న పరిధిలో రూపురేఖలు, పేరు, ఊరు వంటి వివరాలు సరిపోవచ్చు కాని పెద్ద పరిధిలో, విస్తృత వ్యవహారాల్లో పేరు ఊరు వంటి వివరాలు గుర్తింపునకు సరిపోవు. కేవలం ఈ కొద్దిపాటి వివరాలతో పెద్ద పరిధిలో వ్యవహారాలు నడుపడం సాధ్యం కాదు. పైన పేర్కొన్న మాదిరి పెద్ద సంస్థలో ఎవరైనా వ్యక్తి ఏదైనా నేరం చేసి పారిపోతే లేదా ఎవరైనా వ్యక్తి విషయంలో విచారణ అవసరమైతే ఇలాంటి పరిస్థితుల్లో జాతి, తెగ, రంగు వగైరా వివరాలు ఖచ్చితంగా అవసరమవుతాయి. కాబట్టి ఇలాంటి గుర్తింపు అవసరం లేదని పెద్ద పెద్ద సంస్థలు పనిచేయడం కష్టం. ఇలాంటి వివరాలతో పనిలేదంటూ కొద్దికాలం సంస్థను నడిపినా ఆ తర్వాత రక రకాల సమస్యలతో సతమతమై కాడి పారేసే పరిస్థితి వస్తుంది. కార్ఖానాల్లో కాని, ఆఫీసుల్లో కాని, సంస్థల్లో కాని సామాజిక వ్యవహారాల్లో కాని గుర్తింపు ఎంత అవసరమో దీన్ని బట్టి మీరు అర్థం చేసుకోవచ్చు.

నేరనిరోధన

జాతి, తెగ, రంగు, భాష, ప్రాంతం వగైరా విభేదాలను రెచ్చగొట్టి నేడు ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న వారు వివిధ వర్గాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్న వారు పైకి మాత్రం అల్లర్లు విద్వేషాలకు అసలు కారణం జాతి, తెగ, రంగు, భాషల తేడాలేనని ప్రచారం చేస్తుంటారు. దేవుడు కనుక ప్రపంచంలోని ప్రజలందరినీ ఒకే రూపురేఖలతో, ఒకే రంగులో పుట్టించినట్లయితే, మనుష్యులందరి మానసిక తీరుతెన్నులు, స్వభావం, భావావేశాలు ఒకే మాదిరిగా ఉండేట్లు సృష్టించినట్లయితే మనిషి దైవదూత మాదిరిగా మారిపోతాడు. ఎక్కడా అల్లర్లు, నేరాలు ఉండవు. అలా కాకుండా మనిషి భావావేశాలు, మానసికవైఖరులు, స్వభావాల్లో తేడా ఉన్నప్పుడు మానవులందరిని ఒకే కుటుంబంగా మార్చినా సమస్యలు తీరవు. పైగా ఇంకా ఎక్కువవుతాయి. ఎందుకంటే మనిషి స్వభావం వేర్వేరుగాఉంటుంది. మనుష్యుల ఆలోచనల్లో తేడా ఉంటుంది. భావావేశాలు ఒకేమాదిరిగా ఉండవు. నైజం ఒకేలా ఉండదు. అందువల్ల మనుష్యుల్లో మంచి చెడు రెండు ఉంటాయి. మనిషి తన స్వభావం

రీత్యా మంచి చేస్తాడు, చెడు చేస్తాడు. మనిషిలో ఉన్న చెడు స్వభావం వల్ల పెద్ద పెద్ద నేరాలకు పాల్పడవచ్చు. ఇతరులపై దౌర్జన్యాలకు పాల్పడతాడు. దుర్మార్గాలకు ఒడిగడతాడు. అందువల్లనే ప్రపంచంలో నేటి వరకు ఎక్కడ కూడా నేరాలు, అపరాధాలు లేని సమాజం ఒక్కటి కూడా మనకు కనబడదు. ప్రపంచంలో సమూహాలు స్థిరనివాసాలు ఏర్పరచుకుని సమాజాలుగా రూపొందిన ప్రతి ప్రాంతంలోను సమాజంలో నేరాలు కూడా తప్పనిసరిగా కనబడతాయి.

ఇక్కడ ఆలోచించవలసిన ప్రశ్న ఏమంటే, ఈ దుర్మార్గాలను ఎలా అదుపు చేయాలి. సమాజంలో ఈ నేరాలు జరక్కుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. మనుష్యుల్లో మంచి చెడు ఉంటాయి. కాబట్టి మానవస్వభావాన్ని మార్చడం సాధ్యం కాదు. చెడు ఉన్నప్పుడు నేరాలు ఉంటాయి. అలా అని సమాజాలు నేరాలను అలాగే భరిస్తూ ఉండడం కూడా సాధ్యం కాదు. దీనికి నివారణ ఒక్కటే, నేరానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడం ద్వారా నేరాలను అదుపు చేయడం. కాని అలా చేయాలంటే సమాజంలో ప్రతి వ్యక్తికి స్పష్టమైన గుర్తింపు ఉన్నప్పుడే సాధ్యం. సమాజంలో ప్రతి వ్యక్తికి వ్యక్తిగత గుర్తింపు, జాతి, తెగ, రంగు, వంశం వగైరా భేదాల ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఈ తేడాల వల్ల లభించే గుర్తింపు తప్ప మరేవిధమైన గుర్తింపైనా గాని అది అసమగ్రంగా, అసంపూర్ణంగానే ఉంటుంది. సమాజంలో నేరాల నివారణకు ఈ అసమగ్రమైన గుర్తింపు వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. మనిషి రూపురేఖలు, పేరు, ఊరు, మాట్లాడే పద్ధతి, పుట్టిన తేదీ వంటి వివరాల వల్ల పూర్తి గుర్తింపు లభించదు. ఇవి కేవలం కొన్ని పరిమితమైన వ్యవహారాల్లో, చిన్న పరిధిలో మాత్రమే ఉపయోగపడతాయి. వ్యవహారాల విస్తృతి పెరిగిన కొద్ది తెగ, జాతి, రంగు వగైరా వివరాలన్నీ అవసరమవుతాయి. వంశం, జాతి, భాష వగైరా వివరాల ద్వారానే నేరస్తుడిని పట్టుకోవడం తేలికవుతుంది. ఎక్కడ దాక్కుని ఉన్నప్పటికీ పట్టుకుని చట్టానికి అప్పగించడం సాధ్యపడుతుంది. ఈ విధమైన ఏర్పాట్లు లేకపోతే సమాజంలో నేరాలను అరికట్టడం సాధ్యం కాదు. నేరస్తుల ఆటలు కట్టించడం సాధ్యం కాదు. సమాజంలో నేరస్వభావం కలవారిని అదుపు చేయడం సాధ్యం కాదు. మనిషి శాంతియుతంగా, నిశ్చింతగా బతకడం సాధ్యం కాదు. మనిషి ధనప్రాణాలకు భద్రత లభించడం సాధ్యం కాదు.

సామాజిక జీవనంలో ఇవి కాదనలేని అంశాలు. ఇవి పూర్తి మానవాళికి సంబంధించినవి. వీటితో పాటు ముస్లిములకు సంబందించిన కొన్ని సామాజిక అంశాలు కూడా ఉన్నాయి. అల్లాహ్‌ను విశ్వసించి, దైవప్రవక్త (స) ను విశ్వసించి ఒక ప్రత్యేక జీవన

విధానాన్ని అనుసరిస్తున్న సమాజంగా ముస్లిం సమాజానికి సంబంధించిన అంశాలు కూడా ఉన్నాయి. అవేమంటే..

1. కుటుంబ వ్యవస్థను స్థాపించడం

ఇస్లామ్ ప్రతిపాదించిన సామాజిక వ్యవస్థలో కుటుంబానికి అధిక ప్రాముఖ్యం ఉంది. నిజం చెప్పాలంటే, ప్రతి సమాజంలోనూ కుటుంబానికి అధిక ప్రాముఖ్యం ఉంటుంది. ఆ ప్రాముఖ్యాన్ని ఆయా సమాజాలు గుర్తించినా గుర్తించకపోయినా. మానవ శరీరంలో వెన్నెముకకు ఎంత ప్రాముఖ్యం ఉందో సమాజంలో కుటుంబ వ్యవస్థకు అంతే ప్రాముఖ్యం ఉంది. కుటుంబ సంస్కరణలోనే పూర్తి సమాజ సంస్కరణ దాగి ఉంది. కుటుంబ వ్యవస్థ బీటలు వారితే పూర్తి సమాజం కుప్పకూలుతుంది. మరో విధంగా చెప్పాలంటే, సమాజం అన్నది కొన్ని కుటుంబాలు కలువడం వల్ల ఏర్పడుతుంది. ఈ కుటుంబాల సమూహంలో ప్రతి యూనిట్ విద్యాపరంగా, నైతికంగా, ఆలోచనల పరంగా, ఆర్థికంగా .. అన్ని విధాల పటిష్ఠమైతే, అన్ని విధాల ప్రగతి సాధిస్తుంటే ఈ కుటుంబాల ద్వారా ఏర్పడిన సమాజం పటిష్ఠంగా మారుతుంది. అలాంటి సమాజం ఒక ఆదర్శ సమాజంగా రూపుదిద్దు కుంటుంది. కుటుంబ వ్యవస్థ ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవడానికి ఒక్క ఉదాహరణ చాలు. వైజ్ఞానికంగా, సాంకేతికంగా నేడు ప్రగతి పథాన పయనిస్తున్న సమాజాలు , అసంఖ్యాక సౌఖ్యాలు, సదుపాయాలు సాధించుకున్న సమాజాలు, వినోద ఉల్లాసాల సామాగ్రిని సముపార్జించుకున్న సమాజాలు కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసుకున్నందువల్ల నేడు శాంతిసుఖాలకు దూరమయ్యాయి. కుటుంబ వ్యవస్థ నాశనం కావడం వల్ల ఇవి పతనానికి చేరువవుతున్నాయి.

ఇప్పుడు ఆలోచించవలసిన విషయమేమంటే, జాతి, తెగ, వంశాల గుర్తింపు, పరిచయం లేనట్లయితే కుటుంబ వ్యవస్థ పటిష్ఠంగా రూపొందడం సాధ్యమా? కాబట్టి కుటుంబ వ్యవస్థను పరిశీలించినట్లయితే జాతులు, తెగలు, వంశాల విభజన అవసరమేనని అర్థం అవుతుంది. కుటుంబం ప్రత్యేకంగా ఏర్పడినప్పుడే కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు, ప్రేమలు పటిష్ఠంగా ఏర్పడుతాయి. ఆ కుటుంబాలతోనే వంశాలు, తెగలు, జాతులు రూపొందుతాయి.

సంబంధ బాంధవ్యాలు

మానవసమాజాల్లో కుటుంబ వ్యవస్థ వల్ల లభించే మరో ప్రయోజనమేమంటే, కుటుంబ సభ్యుల పట్ల తమ హక్కులను నిర్వర్తించే ప్రేరణ. కుటుంబ సభ్యుల న్యాయ బద్ధమైన ప్రయోజనాలను కాపాడాలన్న కోరిక. ఇస్లాం ఈ వైఖరిని అత్యధికంగా ప్రోత్స

హిస్తుంది. అంటే మనిషి తన బంధు సంబంధీకులందరి గురించి ఆలోచించాలి. వారి మంచిచెడ్డలు చూడాలి. అవసరమైతే వారిని ఆర్థికంగా ఆదుకోవాలి. అవసరమైతే తన సొమ్ము వారికోసం ఖర్చు చేయాలి. వారికి సహాయపడాలి. బంధుత్వ సంబంధాలను పటిష్టం చేయాలి. సంబంధాలను తెంచుకోరాదు. ఇస్లాం ఈ వైఖరికి ఎంత ప్రాముఖ్యం ఇచ్చిందంటే, ఇస్లాంలో అల్లాహ్ హక్కుల తర్వాత ప్రాధాన్యత బంధువుల హక్కులకే ఉంది.

"మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుంచి పుట్టించాడు. అదే ప్రాణి నుంచి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతో మంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపచేశాడు. ఏ దేవుని పేరు చెప్పుకుని మీరు పరస్పరం మీమీ హక్కులను కోరుకుంటారో, ఆ దేవునికి భయ పడండి. బంధుత్వ సంబంధాలను తెంచడం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి." *(నిసా: 1)*

ఇలాంటి వారిని అల్లాహ్ తన బుద్ధిమంతులైన దాసులుగా వర్ణిస్తున్నాడు

"వారి వైఖరి ఎలా ఉంటుందంటే, స్థిరపరచండి అని అల్లాహ్ ఆదేశించిన సంబం ధాలను స్థిరపరుస్తారు. తమ ప్రభువునకు భయపడుతూ ఉంటారు. తమ నుంచి కఠినంగా లెక్క తీసుకోబడుతుందేమోనని భయపడుతూ ఉంటారు." *(అర్రాద్: 21)*

దేవుడు ఈ వైఖరికి ఎంత ప్రాముఖ్యం ఇచ్చాడంటే, దేవుడి గుణగణాల్లో ఒకటైనా రహ్మాన్ (కరుణామయుడు)లో భాగంగా దీన్ని పేర్కొన్నాడు. సంబంధబాంధవ్యాలను కలిపి ఉంచేవారు, తనతో కలిపి ఉంచే పని చేస్తున్నట్లు తెలిపాడు. సంబంధబాంధవ్యాలను తెంచేవారు, తనతో తెగతెంపులు చేసుకుంటున్నట్లు హెచ్చరించాడు. హజ్రత్ అబూహురైరా ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు :

"అల్లాహ్ ఇలా అన్నాడు, 'సంబంధబాంధవ్యాలను కలిపేవారిని నేను నాతో కలుపుకుంటాను. వాటిని తెంచేవారితో నేను తెగతెంపులు చేసుకుంటాను"

ఈ ప్రవక్త ప్రవచనానికి మరో ప్రవచనంలో వివరణ లభిస్తుంది. దేవుడు చెప్పిన మాటలను ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా తెలిపారు.

"నేను అల్లాహ్. నేను రహ్మాన్ (కరుణామయుడిని). నేను రహమ్ (సంబంధ బాంధవ్యాలను) సృష్టించాను. నా పేరు నుంచి వాటికి పేరు పెట్టాను. అందువల్ల వాటిని కలిపేవారిని నాతో కలుపుకుంటాను. వాటిని తెంచేవారితో తెగతెంపులు చేసుకుంటాను." (తిర్మిజి)

సంబంధ బాంధవ్యాలలో ఈ కర్తవ్యాలను మనిషి నిర్వర్తించడమన్నది సమాజంలో జాతులు, తెగలు, వంశాల ప్రత్యేక యూనిట్లు ఉన్నప్పుడే సాధ్యం అవుతుంది. ఈ ప్రత్యేక యూనిట్లతో సంబంధమున్న వ్యక్తులు సమాజంలో తమదైన ప్రత్యేక గుర్తింపు కలిగి ఉన్నప్పుడే ఇది సాధ్యం అవుతుంది. ఈ విషయాన్నే ప్రవక్త (స) ఇలా తెలిపారు.

"మీ వంశం గురించి తెలుసుకోండి. ఆ విధంగా మీరు మీ బంధువుల హక్కులు నిర్వర్తించగలరు." (తిర్మిజి)

వారసత్వం

బంధువులు సంబంధీకుల పరిధిలో వచ్చే సమస్య మరొకటి ఉంది. ఈ సమస్యకు ఇస్లామీయ సామాజిక వ్యవస్థలో అసాధారణ ప్రాముఖ్యం ఉంది. ఆర్థిక సాంఘీక రంగాలపై అత్యంత ప్రభావం వేసే సమస్య ఇది. వారసత్వ నియమాల గురించిన విధానం అది. వారసత్వ నియమాలను, నిబంధనలను దివ్యఖుర్ఆన్ పూర్తిగా వివరించింది. దీన్ని బట్టి వారసత్వ నియమాల ప్రాముఖ్యం మనం అర్థం చేసుకోవచ్చు. [1]

వారసత్వ పంపిణీకి సంబంధించిన జ్ఞానాన్ని ప్రవక్త (స) సగం జ్ఞానంగా అభివర్ణించడాన్ని బట్టి వారసత్వ నియమాలకు ఎంత ప్రాముఖ్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ జ్ఞానాన్ని పొందాలని ఆయన ప్రోత్సహించారు. ప్రవక్త (స) ఇలా అన్నారు:

"వారసత్వ పంపిణీకి సంబంధించిన జ్ఞానం గ్రహించండి. ఇతరులకు నేర్పండి. ఎందుకంటే పూర్తి జ్ఞానంలో సగభాగం అది. దీన్ని మరిచిపోయే ప్రమాదం ఉంది. నా అనుచర సమాజం మరిచిపోయే వాటిలో ఇది మొదటిది అవుతుంది." (ఇబ్నెమాజా)

బంధువులు ఎంత దగ్గరివారైతే వారసత్వంలో వారికి అంత ఎక్కువ హక్కు ఉంటుంది. ఈ బంధుత్వాలను గుర్తించడమన్నది సమాజంలో జాతులు, తెగలు, వంశాల విభజన ఉన్నప్పుడే సాధ్యం అవుతుంది. ప్రజలను అసహజమైన విశ్వజనీన కుటుంబంలో ఇరికించే బదులు, చిన్న చిన్న యూనిట్లుగా ప్రత్యేక వంశాలు, జాతులుగా సహజసిద్ధమైన గుర్తింపులతో కొనసాగించే వ్యవస్థ ఇది.

ధర్మబద్ధమైన, నిషిద్ధమైన బాంధవ్యాలు

సంబంధ బాంధవ్యాలలో మరొక అంశం వివాహానికి నిషిద్ధమైన, ధర్మబద్ధమైన సంబంధాలను తెలుసుకోవడం. ప్రస్తుత ఆధునిక నాగరికత ధర్మబద్ధమైన, నిషిద్ధమైన

---

1. దేవుడు వారసుల్లో ప్రతివారి హక్కును స్పష్టంగా తెలియజేశాడు.

అంశాల విచక్షణ పాటించని వ్యవస్థ. ఇది మానవ ప్రవృత్తికి విరుద్ధమైన వ్యవస్థ. కాని ముస్లిం సమాజానికి ఇది ఎంతో ముఖ్యమైన అంశం. ఇస్లాం జీవితరంగాలన్నింటా ధర్మబద్ధమైనవి ఏవో, నిషిద్ధమైనవి ఏవో స్పష్టంగా తెలియజేసింది. అదేవిధంగా వివాహసంబంధాల్లో కూడా స్పష్టమైన వివరాలు ఇచ్చింది. మానవప్రవృత్తికి పొసగే విధంగా, సహజమైన పద్ధతిలో బంధుత్వాల జాబితాను తెలియజేసింది. వివాహ సంబంధానికి ధర్మబద్ధమైన బంధుత్వాలు ఏవో, ఏ బంధుత్వాల ద్వారా కుటుంబం ఏర్పరచుకోవచ్చునో స్పష్టం చేసింది. వివాహానికి నిషిద్ధ బంధుత్వాల్లో తల్లి, చెల్లి, మేనత్త, పిన్ని, మేనకోడలు చాలా దగ్గరి బంధువులు. ఇలాంటి వారితో లైంగిక సంబంధం గురించి ఆలోచనే అత్యంత జుగుప్సాకరంగా ఉంటుంది. అందువల్ల వైవాహిక సంబంధానికి ధర్మబద్ధమైన బంధువులెవరో స్పష్టంగా తెలియజేసింది ఇస్లాం.

ఈ కోణంతో ఆలోచిస్తే, సమాజంలో జాతి, తెగ, వంశం వంటి సహజమైన యూనిట్లు ఉన్నప్పుడే వివాహ సంబంధాలకు ధర్మబద్ధమైన బంధుత్వాల గుర్తింపు సాధ్యమవతుంది. ఇస్లాం నిషేధించిన బంధుత్వాలకు దూరంగా ఉండడం వీలవుతుంది.

వంశ పరిరక్షణ

ఇస్లాం వైవాహిక సంబంధాల్లో ధర్మబద్ధమైన, నిషిద్ధమైన బంధుత్వాలను ఏవిధంగా స్పష్టం చేసిందో అదేవిధంగా వంశాన్ని రక్షించుకోవాలని కూడా పేర్కొంది. తన్ను తాను ఇతర వంశానికి చెందిన వాడిగా లేక ఇతరుల కుమారుడిగా పరిచయం చేసుకోరాదని పేర్కొంది. ఇలా చేయడం దేవుడి ఆదేశాలను అతిక్రమించడం. ఇది పెద్ద పాపం. అందువల్లనే ఖుర్ఆన్ ఈ విధంగా పేర్కొంది:

> "దత్తపుత్రులను వారి తండ్రులతో ఉన్న సంబంధం ప్రకారం పిలువండి. ఇది అల్లాహ్ దృష్టిలో ఎంతో న్యాయసంబంధమైన విషయం. ఒకవేళ వారి తండ్రులెవరో మీకు తెలియకపోతే, అప్పుడు వారు మీకు ధార్మిక సోదరులు, మరియు సహచరులు. పొరపాటు వల్ల మీరు ఏదైనా మాట అంటే దానికి మిమ్మల్ని పట్టుకోవడం జరగదు. కాని మీరు బుద్ధిపూర్వకంగా అనే మాటకు తప్పనిసరిగా మిమ్మల్ని పట్టుకోవడం జరుగుతుంది. అల్లాహ్ మన్నించేవాడు, కరుణించే వాడూను." *(అహ్‌జాబ్ : 5)*

తన వంశాన్ని మార్చుకుని వేరొక వంశంగా చెప్పడం ప్రవక్త ముహమ్మద్ (స) దృష్టిలో ఎంత పెద్ద పాపమంటే, అలా చేసిన వారు స్వర్గంలో ప్రవేశించలేరన్నారు. అలాంటి

వారిపై అల్లాహ్ శాపం శాశ్వతంగా పడుతుందని చెప్పారు. ప్రవక్త (స) మాటలను హజ్రత్ సాద్ బిన్ మాలిక్ ఇలా తెలిపారు :

"ఎవరైనా తన తండ్రిని వదిలి మరొకరి వంశానికి చెందిన వాడిగా చెప్పుకుంటే, ఫలానా వారు తన తండ్రి కాదని తెలిసినా తండ్రిగా చెప్పుకుంటే, అలాంటి వ్యక్తికి స్వర్గ ప్రవేశార్హత లేదు." (అబూ దావూద్)

అదే విధంగా హజ్రత్ అనస్(రజి) ప్రవక్త (స) ప్రవచనాన్ని ఈవిధంగా తెలియ జేసారు:

"ఎవరైనా తన తండ్రిని వదిలి మరొకరిని తండ్రిగా చెప్పుకుంటే, లేదా ఎవరివద్ద ఉన్నాడో వారిని వదిలి మరొకరి పెంపకం పోషణలో ఉన్నట్లు వారితో తన బాంధవ్యం చెప్పుకుంటే అలాంటి వ్యక్తిని అల్లాహ్ శపిస్తాడు. అది ప్రళయం వరకు వాడిపై ఉంటుంది." (అబూ దావూద్)

మనిషి తన వంశం తన కుటుంబం గురించి తెలుసుకోవడం, వంశానికి కట్టు బడడం అన్నది సమాజంలో వంశం, తెగ, జాతుల యూనిట్లు స్పష్టంగా ఉన్నప్పుడే సాధ్యం. అప్పుడే ప్రతి వ్యక్తి తనకు సంబంధించిన యూనిట్‌తో కలిసి ఉండగలడు. ప్రపంచమంతా ఒకే కుటుంబం అన్న అసహజ భావనలో ఇలాంటి కుటుంబ, వంశ వ్యవస్థలకు స్థానం ఉండదు. అందరూ ఒకే రంగు ఒకే రూపంలో ఉన్నట్లయితే వంశం, కుటుంబ వ్యవస్థలకు స్థానమే ఉండదు.

ప్రవక్తలతో సంబంధం

బంధువులతో సంబంధంతో పాటు ముస్లిములకు మరో ముఖ్యమైన సంబంధం ప్రవక్తలతో సంబంధం. విశ్వసించిన వారి ఇహపరలోకాలు దీనిపైనే ఆధారపడి ఉన్నాయి. ప్రవక్తల పరంపర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన దశల్లో జరిగింది. ప్రవక్తల ద్వారానే మనిషి జీవన సాఫల్యం గురించి తెలుసుకున్నాడు. ప్రవక్తల పరంపరలో చివరి ప్రవక్త ముహమ్మద్ (స)తోను, ప్రవక్త (స) సహచరులతోను ముస్లిములకు ప్రగాఢ సంబంధం ఉంది. ప్రతి ముస్లిం ప్రవక్త ముహమ్మద్ (స) పట్ల అపార ప్రేమాభిమానాలు కలిగి ఉంటాడు. నిజం చెప్పాలంటే ప్రవక్త (స) పట్ల ప్రేమ అన్నది ముస్లిం ధార్మిక జీవితానికి ప్రాణం వంటిది. ప్రవక్త (స)ను తన ప్రాణాల కన్నా ఎక్కువగా ప్రేమించినంత కాలం ముస్లిం తన విశ్వాసంపై స్థిరంగా ఉంటాడు.

"తన తల్లిదండ్రుల కన్నా, పిల్లల కన్నా, తనవారందరి కన్నా ఎక్కువగా నన్ను ప్రేమించకపోతే మీలో ఏ వ్యక్తి కూడా నిజంగా విశ్వాసి కాలేడు." (బుఖారీ)

అంతేకాదు, ప్రవక్త తన సహచరుల పట్ల కూడా అందరూ ప్రేమాభి మానాలు కలిగి ఉండాలని బోధించారు. వారి పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండడం తన పట్ల ప్రేమాభి మానాలు కలిగి ఉండడంగా అభివర్ణించారు.

"నా సహచరుల విషయంలో దైవానికి భయపడండి. నా తర్వాత వారిని కష్టపెట్ట కండి. వారిని ప్రేమించేవారు నా పట్ల ప్రేమతో వారిని ప్రేమిస్తున్నట్లే. వారి పట్ల వైరం కలిగిన వాడు నాపట్ల వైరం కలిగినట్లే." (తిర్మిజి)

ఈ విషయంలో అన్సార్ల గురించి (మదీనాలో ప్రవక్తకు సహాయపడిన వారు) కూడా ప్రవక్త తాకీదు చేశారు. వారి పట్ల ప్రేమను విశ్వాసానికి సూచికగాను, వారిపట్ల వైరాన్ని కపట విశ్వాసానికి నిదర్శనంగాను చెప్పారు.

"అన్సార్లతో ప్రేమ కలిగి ఉండడం విశ్వాసానికి నిదర్శనం. వారి పట్ల వైరం కలిగి ఉండడం కపట విశ్వాసానికి నిదర్శనం" *(బుఖారీ)*

ప్రతి కాలంలోను ముస్లిం సమాజంలో ఒక వర్గం విశ్వాసంపై స్థిరంగా ఉంటుందని ప్రవక్త (స) తన ప్రవచనంలో తెలిపారు.

"ఈ (ముస్లిం) సముదాయం వ్యవహారం సరిగానే కొనసాగుతుంది. ప్రళయం వరకు కొనసాగుతుంది. లేదా ప్రపంచం గురించి అల్లాహ్ నిర్ణయం వచ్చే వరకు కొనసాగుతుంది." *(బుఖారి)*

ఇంకా మరో ప్రవచనంలో ఇలా ఉంది.

"నా అనుచర సమాజంలో ఒక వర్గం ఎల్లప్పుడు సత్యంపై స్థిరంగా ఉంటుంది. వారిని వదిలి వెళ్లిన వారు ఈ వర్గానికి ఎలాంటి నష్టం కలిగించలేరు. అల్లాహ్ నిర్ణయం (ప్రళయం) వచ్చే వరకు వారు అలాగే స్థిరంగా ఉంటారు." *(ముస్లిం)*

అందువల్ల ముస్లిం సమాజం ఉలమాలు (ధర్మవేత్తలు), సహబాలతో ఎల్లప్పుడు పటిష్టమైన సంబంధం కలిగి ఉంది. ప్రతి కాలంలోను ఈ పుణ్యపురుషుల ద్వారా ప్రేరణ పొందుతూ వస్తోంది. ఈ పుణ్యపురుషుల వ్యక్తిగత గుర్తింపు స్పష్టంగా ఉండడం వల్లనే ఇది సాధ్యమయ్యింది. జాతులు, తెగలు, వంశాల యూనిట్లు ఉండడం వల్లనే ఈ గుర్తింపు సాధ్యపడుతుంది. ఇలాంటి గుర్తింపు లేనట్లయితే మానవ చరిత్ర గుర్తింపులేని వ్యక్తుల కథలుగా మిగిలిపోయి ఉండేది. మానవ సమాజాలు ఎవరో ఒకరిని ఎల్లప్పుడు వెదుక్కునే

పరిస్థితి ఉండేది. ఈ గుర్తింపు లేకపోతే ఎవరు ఎవరి కోసం ఎంత వెదికినా ఎవరికి కావలసిన వారు ఎన్నటికీ దొరకని విచారకరమైన స్థితి నెలకొనేది.[1]

ఈ వివరణల ద్వారా మానవ జీవితంలో జాతులు, తెగలు, వంశాల విభజన, సమాజంలో ఈ యూనిట్ల ఉనికి ఎంత అవసరమో అర్థం చేసుకోవచ్చు. అల్లాహ్ ఈ విభజన చేయడం ద్వారా మానవ సమాజాలకు ఎంత మేలు చేసాడో కూడా తెలుసుకోవచ్చు. మానవ నాగరికతల వికాసానికి ఇవి ఎంతగా తోడ్పడ్డాయో కూడా అంచనా వేయవచ్చు.

ఔన్నత్యానికి ప్రమాణం దైవభీతి

ఔన్నత్యం, ఆధిక్యతలకు దైవగ్రంథం ఒక విప్లవాత్మకమైన, అత్యున్నతమైన ప్రమాణాన్ని ప్రతిపాదిస్తుంది. ఈ ప్రమాణం నైతికమైనది, ఆధ్యాత్మికమైనది. ఈ ప్రమాణాన్ని ఏ వ్యక్తయినా సాధించవచ్చు. అల్లాహ్ వద్ద ఔన్నత్యం, ఆధిక్యతలన్నవి దైవభీతి కలిగిన వారికి మాత్రమే ఉన్నాయన్నది ఆ ప్రమాణం. దైవాదేశాలను పాటించేవాడు, దైవం నిషేధించిన వాటికి దూరంగా ఉండేవాడు, దైవానికి భయపడేవాడు, దైవప్రసన్నత కోసం ప్రయత్నించేవాడు ఎవరైనా గాని ఔన్నత్యాన్ని పొందుతాడు. ఈ లక్షణాలు ఎవరిలో ఎంతగా ఉంటే ఆ వ్యక్తి అంతగా అధికుడు. ఈ నైతిక ఆధిక్యత ప్రమాణం ఇతర విభజనలు, వివక్షలన్నింటిని పెకలించి వేస్తుంది. ప్రాచీన కాలం నుంచి ఇప్పటి వరకు కొనసాగుతూ వస్తున్న జాతి, తెగ, రంగు, భాష, వంశం వగైరా ఆధిక్యతలన్నింటిని ఈ ప్రమాణం రద్దు చేస్తోంది. ఎందు కంటే అల్లాహ్ మానవాళిని వివిధ జాతులు, తెగలు, వంశాలు, వర్గాలు, వర్ణాలుగా విభజిం చింది కేవలం వారి మధ్య పరిచయానికి, వారి గుర్తింపునకు మాత్రమే. ఈ గుర్తింపు ద్వారా సామాజిక జీవనంలో అవసరమైన సౌలభ్యాలు పొందడానికి మాత్రమే. అంతేకాని ఈ విభజన జాతి, తెగల ఆధారంగా ఆధిక్యత పొందడానికి కాదు. మనిషి నైతికంగా ఎంత దిగజారినా జాతి, తెగ ఆధారంగా ఉన్నతుడిగా సర్టిఫికేట్ పొందడానికి కాదు. ఇలాంటి ఆధిక్యతలేవీ దైవం వద్ద చెల్లుబాటు కావని పవిత్ర గ్రంథం స్పష్టంగా చెప్పింది. దైవం దృష్టిలో మనుష్యులందరూ ఒక్కటే. దైవం మనుష్యులందరినీ ఒకే మట్టితో పుట్టించాడు. అందరూ ఒకే జంట ఆదం, హవ్వాల సంతానం. అందువల్ల తెల్లవారికి నల్లవారిపై నల్లవారికి తెల్లవారిపై ఎలాంటి ఆధిక్యత లేదు. దైవం మానవుల్లో ఆధిక్యతకు సంబంధించి ఏర్పాటు చేసిన

---

1. అల్లమా ఇబ్నె హజమ్‌ను ఉటంకిస్తూ హాఫిజ్ ఇబ్నె హజర్ ధర్మంలో వంశచరిత్రల ప్రాముఖ్యాన్ని వివరించారు. గుర్తింపు పరిచయాలకు సంబంధించిన సంక్షిప్తమైన వివరణ అక్కడ లభిస్తుంది. చూడండి ఫతహుబారీ, పేజి 339.

ప్రమాణం ఒక్కటే. ఆధిక్యతా ప్రమాణం అన్నది నైతికమైనది. దైవభీతి దానికి కొలబద్ద. ఈ ప్రమాణాన్ని ఎవరైనా అందుకోవచ్చు.

దైవగ్రంథంలో వచ్చిన ఆదేశాలను ప్రవక్త (స) తన ప్రవచనంలో మరింత విస్తారంగా వివరించారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రవక్త ప్రవచనాన్ని ఈ విధంగా తెలియజేశారు.

"ఓ ప్రజలారా అజ్ఞాన కాలం నాటి గర్వాహంకారాలను అల్లాహ్ మీ నుంచి దూరం చేసాడు." తాతముత్తాతల పేరుతో గొప్పలు పోవడాన్ని తొలగించాడు. మనుష్యులు కేవలం రెండు రకాలు. దేవునికి భయపడేవారు. ఇలాంటి వారికి దేవుని వద్ద గౌరవ మర్యాదలున్నాయి. దుర్మార్గానికి పాల్పడేవారు దౌర్భాగ్యులు. ఇలాంటివారు దేవుని దృష్టిలో మూర్ఖులు. మనుష్యులందరూ ఆదమ్ (అ.స) సంతానం. అల్లాహ్ ఆదమ్‌ను మట్టితో తయారుచేశాడు. దేవుడు ఇలా సెలవిచ్చాడు. "ప్రజలారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీ పురుష జంట ద్వారా సృష్టించాము. మిమ్మల్ని వివిధ జాతులు. తెగులుగా చేశాము. తద్వారా మీరు ఒకరినొకరు గుర్తించాలని. అల్లాహ్ పట్ల అందరికన్నా ఎక్కువ భయభక్తులు కలవాడే మీలో ఉన్నతడు. నిస్సందేహంగా అల్లాహ్ అన్నీ తెలిసినవాడు. అన్నింట ఎరుక ఉన్నవాడు" (తిర్మిజీ)

ఇబ్నె అబీ హాతిమ్‌లో హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రవక్త ప్రవచనాన్ని ఈ విధంగా తెలియజేశారు.

"హజ్రత్ అబ్దులా బిన్ ఉమర్ ఉటంకం : మక్కా విజయం రోజున ప్రవక్త (స) తన ఒంటెపై సవారి చేస్తూ తవాఫ్ చేశారు.

"ఆయన చేతిలో ఒక బెత్తం ఉంది. దానితో ఆయన అర్కాన్‌ను తాకుతూ వెళ్ళసాగారు. మస్జిదె హరామ్ వద్ద ఆయన ఒంటెపై కూర్చునే స్థలం లభించలేదు. చివరకు ఆయన ప్రజల వద్దకు వచ్చి, వారితో కలిసి లోయ మధ్యకు చేరుకున్నారు. అక్కడ ఒంటెను కూర్చోబెట్టారు. ఒంటెపైన కూర్చునే ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మొదట అల్లాహ్ స్తోత్రం చేశారు. తర్వాత ఇలా అన్నారు: "ఓ ప్రజలారా! అజ్ఞాన కాలం నాటి అహంకారాన్ని, తాతముత్తాతల పేరు చెప్పి ఆధిక్యం ప్రకటించడాన్ని అల్లాహ్ నిర్మూలించాడు. మనుష్యులు రెండు రకాలు. మంచివాళ్ళు. అల్లాహ్‌కు భయపడతారు. వీరికి అల్లాహ్ వద్ద గౌరవం లభిస్తుంది. చెడ్డవాళ్ళు, దౌర్భాగ్యులు. వీరు అల్లాహ్ దృష్టిలో మూర్ఖులు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"ప్రజలారా! మేము మిమ్మల్ని ఒక స్త్రీ, ఒక పురుషుని ద్వారా పుట్టించాము. మిమ్మల్ని జాతులుగా, తెగలుగా చేశాము. తద్వారా మీరు ఒకరినొకరు గుర్తించాలని అల్లాహ్ పట్ల అందరికన్నా ఎక్కువ భయభక్తులు కలవాడే మీలో ఉన్నతుడు. నిస్సందేహంగా అల్లాహ్ అన్నీ తెలిసినవాడు. అన్నింట ఎరుక ఉన్నవాడు." మళ్ళీ ఇలా అన్నారు: "ఈ మాటలతో నేను నా ప్రసంగం ముగిస్తున్నాను. నా కోసం, మీ కోసం దేవుని క్షమాభిక్ష కోరుతున్నాను." (ఇబ్ను అబీ హాతిమ్) అదే విధంగా హ|జత్ అబూ హురైరా (రజి) చెప్పిన హదీసులో క్రింది పదాలున్నాయి.

"తాత ముత్తాతల పేరు చెప్పి గర్వించేవారు ఇక ఆ పని మానుకుంటారు. వాళ్ళు చనిపోయారు. నరకాగ్నికి బూడిద అయ్యారు. ఇలా అహంకారం ప్రదర్శించేవారు అల్లాహ్ దృష్టిలో మూర్ఖులు. అజ్ఞాన కాలం నాటి గర్వాన్ని, తాతముత్తాతల పేరుతో గర్వం ప్రదర్శించడాన్ని అల్లాహ్ మీ నుంచి దూరం చేశాడు. మనుష్యులు కేవలం రెండు రకాలు. విశ్వాసులు అల్లాహ్‌కు భయపడతారు. చెడ్డవారు దౌర్భాగ్యం పాలయ్యేవారు. మనుష్యులందరూ ఆదమ్ (అ.స) సంతానం. ఆదమ్ (అస) మట్టితో సృష్టించబడ్డారు." (తిర్మిజీ)

ఇది ఇమామ్ తిర్మిజి పేర్కొన్న హదీసు. అబూదావూద్‌లో ఇదే హదీసును అబూ హురైరా క్రింది పదాల్లో పేర్కొన్నారు.

"సత్యమేమంటే, అజ్ఞాన కాలం నాటి అహంకారాన్ని, తాతముత్తాతల పేరు చెప్పి గర్వించడాన్ని అల్లాహ్ మీ నుంచి తొలగించాడు. ఇప్పుడు విశ్వాసులు, అల్లాహ్‌కు మాత్రమే భయపడేవారు, చెడ్డవాళ్ళు, దౌర్భాగ్యం పాలయ్యేవారు మాత్రమే ఉన్నారు. మీరంతా ఆదమ్ (అస) సంతానం ఆదమ్ (అస) మట్టితో సృష్టించబడ్డారు. నరకాగ్నికి బూడిదైన పూర్వీకుల పేరు చెప్పి గర్వించడాన్ని ప్రజలు మానుకోవాలి. లేకపోతే వారు అల్లాహ్ దృష్టిలో మూర్ఖులవుతారు" (అబూదావూద్)

హ|జత్ అబూ హురైరా మరో ఉటంకంలో ఇలా అన్నారు.

"అజ్ఞానకాలం నాటి అహంకారాన్ని, తాతముత్తాతల పేరుతో గర్వించడాన్ని అల్లాహ్ నిర్మూలించడం. ఇప్పుడు రెండు రకాల మనుష్యులు. చెడ్డవాళ్ళు, దౌర్భాగ్యం పాలయ్యేవారు. మనుష్యులందరూ ఆదమ్ (అస) సంతానం. ఆదమ్ (అస) మట్టితో సృష్టించబడ్డారు. (తిర్మిజి)

ఇమామ్ బైహాకీ ఉటంకంలో మరింత వివరణ ఉంది.

"ప్రజలారా! మీ అందరి ప్రభువు ఒక్కడే. మీ అందరి పూర్వీకుడు ఒక్కడే. అరబ్బుకు

అరబ్బేతరునిపై ఎలాంటి ఆధిక్యం లేదు. తెల్లవారికి నల్లవారిపై, నల్లవారికి తెల్లవారిపై ఆధిక్యం లేదు. కేవలం దైవభీతి విషయంలో తప్ప. అధిక దైవభీతి కలవాడే దేవుని వద్ద ఎక్కువ గౌరవం కలవాడు. వినండి! నేను మీ వద్దకు సందేశం చేరవేశాను. ప్రజలు ఔనని జవాబిచ్చారు. అప్పుడు ప్రవక్త ఇలా అన్నారు, "ఇక్కడ ఉన్నవారు, ఇక్కడ లేనివారి వద్దకు ఈ సందేశం చేరవేయాలి." (బైహకి)

ఇబ్నె అబీ హాతిమ్ ఈ హదీసును ఇలా వివరించారు.

"ప్రజలారా! నిస్సందేహంగా మీ అందరి ప్రభువు ఒక్కడే మీ అందరి పూర్వీకుడు ఒక్కడే. వినండి. అరబ్బునకు అరబ్బేతరునిపై ఎలాంటి ఆధిక్యంలేదు. అరబ్బేతరునికి అరబ్బుపై ఆధిక్యం లేదు. తెల్లవారికి నల్లవారిపై ఆధిక్యంలేదు. నల్లవారికి తెల్లవారిపై ఆధిక్యం లేదు. దైవభీతి విషయంలో తప్ప. అల్లాహ్ పట్ల ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఉన్నతడు." (ఇబ్నె అబీ హాతిమ్)

ఈ ప్రవక్త ప్రవచనాల ద్వారా స్పష్టంగా తెలుస్తున్న వాస్తవమేమంటే ఇస్లాం దృష్టిలో మనిషి ఆధిక్యత అన్నది కేవలం దైవభీతి, ధర్మపరాయణతలపై మాత్రమే ఆధారపడి ఉంది. ఇవి కాక ఆధిక్యతకు సంబంధించిన మరే ప్రమాణమైనా ఇస్లాం అధర్మంగా భావిస్తుంది. ఇవే కాకుండా, హదీసు గ్రంథాల్లో మనకు మరిన్ని ప్రవచనాలు లభిస్తాయి. ప్రవక్త ముహమ్మద్ (స)ను "అందరికన్నా అధికుడు ఎవరు" అని ప్రజలు ప్రశ్నించినప్పుడు, "అందరికన్నా ఉత్తముడెవరు?" అని ప్రశ్నించినప్పుడు ఆయన ఎల్లప్పుడు దైవభీతి ధర్మపరాయణతలనే ప్రమాణాలుగా పేర్కొన్నారు. దీన్ని బట్టి తెలుస్తున్నదేమంటే, అల్లాహ్ దృష్టిలో, ప్రవక్త (స) దృష్టిలో ఆధిక్యతకు, ఔన్నత్యానికి ప్రమాణాలు కేవలం ఇవి మాత్రమే. హజ్రత్ అబూ హురైరా ఉటంకం ప్రకారం ఒకసారి ప్రవక్త (స)తో "ప్రజల్లో అందరికన్నా ఉత్తముడెవరు?" అని ప్రశ్నించినప్పుడు "అల్లాహ్ పట్ల అందరికన్నా ఎక్కువగా భయపడేవాడు అల్లాహ్ దృష్టిలో అందరికన్నా ఉత్తముడని" సమాధానమిచ్చారు. అప్పుడు సహచరులు "మేము ఆ విషయం గురించి కాదు అడిగింది" అన్నారు. అప్పుడు ప్రవక్త (స) సమాధానమిస్తూ "ప్రజలందరిలోను ఉత్తములు హజ్రత్ యూసుఫ్ (అస). ఆయన అల్లాహ్ ప్రవక్త. ఆయన తర్వాత వంశంలో మూడు తరాల వరకు ప్రవక్తల పరంపర కొనసాగింది. (అంటే యూసుఫ్ బిన్ యాకూబ్ బిన్ ఇస్హాక్ వరకు). అప్పుడు సహచరులు "మేము ఆ విషయం గురించి కూడా మిమ్మల్ని అడగలేదు" అన్నారు. అప్పుడు ప్రవక్త (స) "అంటే మీరు నన్ను అరబ్బు తెగల గురించి అడుగుతున్నారా?" అని ప్రశ్నించారు. సహచరులు అవునన్నారు. అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు "అజ్ఞానకాలంలో మీ అందరిలో ఉత్తములుగా ఉన్నవారే ఇస్లాం

స్వీకరించిన తర్వాత కూడా మీ అందరిలోను ఉత్తములుగా ఉన్నారు. అయితే వారిలో ధర్మం గురించిన సరయిన అవగాహన వచ్చి ఉండాలన్నది షరతు" అన్నారు. (బుఖారి)

ఇదేవిధంగా హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమ్రూ (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త (స)ను "ప్రజల్లో అందరికన్నా ఉత్తముడెవరు?" అని ప్రశ్నించినపుడు ఆయన జవాబిస్తూ "హృదయ శుద్ధి కలిగినవాడు, సత్యాన్ని పలికేవాడు" అన్నారు. సహచరులు దానిపై "సత్యం పలికే వాడన్నది అర్థం అవుతోంది కాని హృదయశుద్ధి అన్నది అర్థం కాలేదు" అన్నారు. దానికి జవాబిస్తూ ప్రవక్త (స)"అల్లాహ్ పట్ల భయపడేవాడు, చెడులకు దూరంగా ఉండేవాడు, దైవం పట్ల అవిధేయత చూపనివాడు, తలబిరుసు లేనివాడు, బలహీనతలు, దురాశ లేనివాడు" అన్నారు. (ఇబ్నె మాజా)

ఇలాంటి ఉటంకమే దుర్రతుల్ బింతె అబీ లహబ్ ఉటంకించారు. ఆమె ప్రకారం ప్రవక్త (స) మింబర్‌పై నిలబడి ప్రసంగిస్తున్నప్పుడు ఒక వ్యక్తి లేచి ఆయన వద్దకు వెళ్ళాడు. "ఓ ప్రవక్తా! ప్రజల్లో అందరికన్నా మంచివాడు ఎవరు?" అనడిగాడు. ప్రవక్త (స) జవాబిస్తూ "ప్రజల్లో అందరికన్నా ఎక్కువగా ఖుర్ఆన్ జ్ఞానం కలిగినవాడు, దైవానికి భయపడేవాడు, అందరికన్నా ఎక్కువగా మంచిపనులను ప్రోత్సహించేవాడు, అందరికన్నా ఎక్కువగా చెడులను నిరోధించేవాడు అందరికన్నా ఎక్కువగా బంధుత్వ సంబంధాలను కాపాడేవాడు అందరికన్నా మంచివాడు" అన్నారు. *(మస్నద్ అహ్మద్)*

ప్రవక్త ముహమ్మద్ (స) వ్యక్తిత్వం అల్లాహ్ అభీష్టానికి నిలువుటద్దం వంటిది. అందువల్ల ఆయన తన జీవితంలో అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగిన ధర్మపరాయణుల పట్ల మాత్రమే ఆసక్తి చూపించారు. హజ్రత్ ఆయెషా (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స)కు ప్రాపంచిక వస్తుసామాగ్రి పట్ల ఆసక్తి ఉండేది కాదు. ఎవరిపైనా ఆసక్తి ఉండేది కాదు. కేవలం ధర్మపరాయణులైన వారి పట్ల మాత్రమే ఆసక్తి కలిగి ఉండేవారు. *(మస్నద్ అహ్మద్)*

నైతిక ఔన్నత్యం

ఆధిక్యత విషయంలో దైవభీతి, దర్మపరాయణతల విప్లవాత్మక ప్రమాణాన్ని ఇస్లాం ప్రవేశపెట్టింది. ఈ ప్రమాణం కేవలం సామాజిక స్థాయిలో ఏదో ఒక నినాదంగా, ఒక మంచిమాటగా పరిమితం కాదు. ముందు ముందు పంక్తుల్లో ఈ విషయం గురించి మరిన్ని వివరాలు మనం చర్చిద్దాం. ఇస్లామీయ జీవన వ్యవస్థ యావత్తు నైతికతా నియమాలపై ఆధారపడి ఉంది. అందువల్ల సాధారణ సామాజిక జీవనంలో ఔన్నత్యం, ఆధిక్యతల విషయంలో నైతికతను దృష్టిలో ఉంచుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే

ముఖ్యమైన ఆధ్యాత్మిక, ధార్మిక వ్యవహారాల్లోను నైతికతకే ప్రాముఖ్యత ఉంటుంది. ఈ విషయమై ఇమామ్ రాజి దైవగ్రంథంలోని చివరి అధ్యాయం వాక్యాల వివరణ క్రింది విధంగా ఇచ్చారు.

"అందువల్ల ధార్మిక వ్యవహారాల, న్యాయ వ్యవహారాల విషయంలో ప్రతి వ్యక్తికి పూర్తి అర్హత ఉంది. వ్యక్తి పెద్ద వంశానికి చెందినవాడైనా లేక చిన్న వంశానికి చెందిన వాడైనా ఎవరైనా ధర్మపరాయణుడైతే చాలు. ధార్మిక జ్ఞానం కలిగి ఉంటే చాలు. కాగా ధార్మిక కార్యకలాపాల విషయంలో కపట విశ్వాసికి ఎలాంటి అర్హతలేదు. అతడు ఎంత పెద్ద వంశానికి చెందినవాడైనప్పటికీ, ఎంత సంపన్నుడైనప్పటికీ అర్హత పొందలేడు." (మఫాతి వుల్ గైబ్, సంపుటం 7, పేజి 571)

ఇది కేవలం ధార్మిక కార్యకలాపాల వరకు మాత్రమే పరిమితం కాదు. సాంఘీక, రాజకీయ కార్యకలాపాల విషయంలో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. హాఫిజ్ ఇబ్నె హజర్ ఈ విషయాన్ని క్రింది విధంగా వివరించారు.

"ధార్మిక విషయాల్లో ఉత్తముడైన వ్యక్తి ప్రాపంచిక వ్యవహారాల విషయంలో కూడా ఉత్తముడు గానే భావించబడతాడు. అలాంటి వ్యక్తికి ఖాజి (న్యాయమూర్తి) బాధ్యతలు కూడా ఇవ్వవచ్చు. సైన్యాధిపతిగా నియమించవచ్చు. శిస్తు వసూలు బాధ్యతలు కూడా ఇవ్వవచ్చు."

(ఫతవుల్‌బారీ సంపుటం 8, పేజి 170)

అసమానతలు

పై చర్చ ద్వారా ఇస్లామీయ సమానత్వ భావన ఎంత విస్తారమైనదో, ఎంత సమగ్రమైనదో అంచనా వేయవచ్చు. ఇస్లాంలోని ఈ సమానత్వ భావన పటిష్టమైన పునాదులపై ఆధారపడి వుంది. ఇస్లాం కేవలం సమానత్వ భావనను ప్రకటించి లేదా వివరించి ఊరుకోలేదు. సమానత్వాన్ని దెబ్బతీసే అంశాలను రద్దు చేసే చర్యలు కూడా పూర్తిగా తీసుకుంది. మానవుల మధ్య విద్వేషాన్ని, వైరాన్ని రెచ్చగొట్టి విభజనలు, అల్లర్లు, ఘర్షణలకు కారణమయ్యే ప్రతి కారణాన్ని తొలగించింది. అసమానతలకు కొన్ని కారణాలు శాశ్వతస్థాయిని కలిగి ఉన్నాయి. మరి కొన్ని తాత్కాలిక కారణాలుగా ఉన్నాయి. తాత్కాలిక కారణాలుగా ఉన్నప్పటికీ ఇవి కూడా మనుష్యుల మధ్య విద్వేషానికి కారణమవుతున్నాయి. ముందుగా మనం అసమానతలకు దారితీస్తున్న శాశ్వత కారణాలను చూద్దాం.

అసమానతలకు శాశ్వత కారణాలు

వంశాధిక్యత : అసమానతలకు దారితీసే కారణాల్లో అతి ముఖ్యమైనది

వంశాధిక్యతకు సంబంధించినది. ఎందుకంటే మానవ సమాజాల్లో వ్యక్తుల ఆధిక్యత, ఔన్నత్యాల విషయంలో ప్రభావం వేసే అత్యంత బలమైన కారణం వంశం. మనిషి వంశం గొప్పదైతే అతడికి సమాజంలో గొప్ప గౌరవమర్యాదలు లభిస్తాయి. అలాగే మనిషి వంశం తక్కువదైతే సమాజంలో అతడిని తక్కువ చూపు చూడడం జరుగుతుంది. మనిషి గౌరవ ప్రతిష్ఠలకు సంబంధించి వంశానికి ఈ ప్రాముఖ్యం ఎందుకు లభిస్తుందంటే, మనిషితో పాటు అతడి వంశం ఎల్లప్పుడు వెన్నంటి ఉంటుంది. మనిషి నుంచి అతడి వంశ ప్రతిష్ఠను ఎవరూ తస్కరించలేరు. అలాగే తక్కువ వంశానికి చెందిన వ్యక్తి వంశప్రతిష్ఠను ఎవరూ పెంచనూ లేరు. వంశానికి సంబంధించిన ఈ ప్రాముఖ్యం వల్లనే దివ్యఖుర్‌ఆన్ వంశాన్ని ప్రస్తావిస్తూ మానవ సమానత్వానికి సంబంధించి సంవిధానంగా పరిగణించే ఆదేశాన్ని ఇచ్చింది. మేము మిమ్మల్ని వంశాలుగా, తెగలుగా సృష్టించాము, తద్వారా మీరు ఒకరి నొకరు గుర్తించాలని అంటూ పేర్కొంది. ఇమామ్ రాజి (రఅ) ఈ వాక్యానికి చక్కని వివరణ ఇచ్చారు.

"మనిషి తన ఆధిక్యతను ప్రదర్శించే కారణాలు చాలా ఉన్నాయి. వాటన్నింటిలోను వంశం అత్యంత బలమైనది. ఎందుకంటే సంపద అనేది ఎవరికైనా లభించవచ్చు. ఒక బీదవాడు కూడా సంపన్నుడు కావచ్చు కాబట్టి సంపద చూపి గర్వించడం సాధ్యం కాదు. అలాగే సౌందర్యం తదితర అంశాలు ఏవీ శాశ్వతం కావు. అవి ఎల్లప్పుడు మనిషి వెన్నంటి ఉండవు. కాని వంశం మాత్రం మనిషిని అంటుకునే ఉంటుంది. తన వంశాన్ని మార్చు కోవడం ఎవరికీ సాధ్యం కూడా కాదు. అందువల్లనే అల్లాహ్ వంశాన్ని ప్రస్తావిస్తూ దైవభీతికి బదులు వంశాన్ని ఆధిక్యతకు ప్రమాణంగా చేసుకోడాన్ని తీవ్రంగా ఖండించాడు. ఆ విధంగా మానవ అసమానతలకు కారణాలన్నింటిని సమూలంగా పెకలించివేసాడు."

(మఫ్తావుల్ గైబ్)

మానవ అసమానతలకు కారణాల్లో అత్యంత బలమైన కారణాన్ని ఇస్లాం సమూలంగా పెకలించి వేసింది. ప్రవక్త ముహమ్మద్ (స) ఈ విషయం గురించి ప్రస్తావిస్తూ మనిషి వంశం అన్నది అతడితో పాటు ఎల్లప్పుడు ఉంటుంది. గొప్ప వంశం తక్కువ వంశం అన్న వాటికి అల్లాహ్ దృష్టిలో ఎలాంటి ప్రాముఖ్యం లేదు. అల్లాహ్ దృష్టిలో ఔన్నత్యానికి ప్రమాణాలు దైవభీతి, ధర్మపరాయణతలు మాత్రమే. ఈ సుగుణాలను సాధించడం ప్రతి మనిషికి సాధ్యమే. ఈ సుగుణాలు లేని వాడు అల్లాహ్ దృష్టిలో అల్పుడు. హజ్రత్ ఉఖ్బా బి.న్ ఆమిర్ జహ్నీ (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త (స) ఈ విధంగా సెలవిచ్చారు.

"మీ వంశప్రతిష్ఠ వల్ల మీకు ఎలాంటి ప్రయోజనమూ లేదు. మీరంతా ఆదమ్ (అస)

సంతానం. ఎవరికీ ఎవరిపైన ఎలాంటి ఆధిక్యం లేదు. దైవభీతి, ధర్మపరాయణతల ఆధారంగానే ఆధిక్యత ఉంటుంది. మనిషి లజ్జను వదిలేయడం, పిసినారితనం ప్రదర్శించడం ద్వారా అల్పుడవుతాడు." (మస్నద్ అహ్మద్)

ఈ విషయాన్నే దివ్యఖుర్ఆన్ కూడా స్పష్టంగా ప్రకటించింది. వంశానికి, బంధుత్వాలు దేవుని వద్ద ఏవిధంగాను ఉపయోగపడవు. అక్కడ ఉపయోగపడేది మనిషి గుణగణాలే.

> "ప్రళయం నాడు మీ బంధుత్వాలు కాని, మీ సంతానం కాని ఏవిధంగాను పనికి రావు. ఆరోజున అల్లాహ్ మీ మధ్యన ఎడబాటు కలిగిస్తాడు. ఆయనే మీ కర్మలను చూసేవాడు." *(ముమ్‌తనాహ్ : 3)*

ప్రళయదినాన వంశానికి, వంశ ప్రతిష్ఠకు ఎలాంటి విలువ ఉండదు. అక్కడ కేవలం పుణ్యకర్మలనే లెక్కించడం జరుగుతుంది.

> "శంఖం ఊదబడినంతనే వారి మధ్య ఏ బంధుత్వమూ ఉండదు. వారు ఒకరినొకరు పరామర్శించుకోరు. అప్పుడు ఎవ్వరి (త్రాసు) పళ్ళెములు బరువుగా ఉంటాయో వారే సాఫల్యం పొందుతారు. ఎవరి (త్రాసు) పళ్ళెములు తేలికగా ఉంటాయో వారే తమను తాము నష్టానికి గురిచేసుకునేవారు. వారు నరకంలో శాశ్వతంగా ఉంటారు." *(మూమినూన్ : 101-103)*

ఇదే విషయాన్ని ప్రవక్త ముహమ్మద్ (స) ఒక ప్రవచనంలో ఇలా తెలియజేసారు.

"మానవులందరూ ఆదమ్,హవ్వాల సంతానం. ప్రళయదినాన దేవుడు మీ వంశాలు, కుటుంబాల గురించి అడగడు. దేవుని పట్ల ఎక్కువగా భయపడే వాడే దేవుని దృష్టిలో ఎక్కువ ఆదరణీయుడు." (ఇబ్నె జరీర్)

అంతేకాదు, ప్రవక్త (స) అనేక హదీసుల్లో వంశం, కుటుంబాలకు సంబంధించి వాటి ప్రాముఖ్యతకు బదులు వాటిని ధర్మంతో, నైతికతతో జతచేస్తూ బోధించారు. అసలు ప్రాముఖ్యం ధర్మానికి, నైతికతకు మాత్రమే ఉందని, వంశానికి, వంశ ప్రతిష్ఠకు ప్రాముఖ్యం లేదని తెలిపారు. హజ్రత్ అబూజర్ (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు.

"దూరదృష్టి, వ్యవహారదక్షతలకు మించి బుద్ధికుశలత మరొకటి లేదు. మనిషి తన్ను తాను అదుపులో ఉంచుకోవడాన్ని మించి ధర్మపరాయణత మరొకటి లేదు. నైతికతకు మించి వంశం ఏదీ లేదు." (ఇబ్నె మాజా)

ఇదేవిధంగా హ|జత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ ఇలా అన్నారు.

"విశ్వాసి ఉత్తముడనడానికి నిదర్శనం అతడి దైవభీతి. అతడి ధర్మపరాయణత అతడి ఉన్నత వంశం. అతడిలో ఉన్న నైతికత అతడి పౌరుషం" (ముతా)

ఇస్లాం దృష్టిలో ఈ నైతిక సుగుణాలకే ప్రాముఖ్యం ఉంది. ఈ సుగుణాలు లేక ఆచరణారంగంలో వెనుకబడినవాడికి వాడి వంశం వల్ల ఎలాంటి ఉపయోగమూ ఉండదు. ఈ విషయమై ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు.

"తన ఆచరణల రీత్యా వెనుకబడినవాడిని వాడి వంశం ముందుకు తీసుకుపోలేదు." (ముస్లిం)

జాతి, వర్ణం

వంశం మాదిరిగానే మనిషి రంగు రూపాలకు కూడా ఇలాంటి ప్రాముఖ్యతే ఉంది. మనిషి రంగు రూపాల ఆధారంగా ప్రాచీన కాలం నుంచి నేటి వరకు మానవుల మధ్య వివక్ష కొనసాగుతూ వస్తోంది. ప్రాచీన కాలంలో ఆర్యులు తమ శారీరక వర్ణం పట్ల గర్వించేవారు.[1] నల్లరంగు వారిని దాసదాసీలుగా తమ ఆధీనంలో ఉంచుకునేవారు. వారిని అవమానించడం, వారితో సేవలు చేయించుకోవడం గొప్ప పవిత్రకార్యంగా భావించేవారు. అందుగ్గాను దేవతల సహాయాన్ని కోరేవారు.[2] నేడు ఆధునిక కాలంలో రేసిజం, జాత్యాహంకారం వంటి సిద్ధాంతాలు పుట్టుకు వచ్చాయి. ఈ సిద్ధాంతాలు కొన్ని జాతులను గొప్పవిగాను, కొన్నింటిని తక్కువ జాతులుగాను జమకట్టాయి. కొందరు మరికాస్త ముందుకు వెళ్ళి తమ జాతిని రాజజాతిగా ప్రకటించు కున్నారు. (ఈ పుస్తకం వెనుకటి అధ్యాయంలో చూడండి). కాని ఇస్లాం ఈ వర్ణం, జాతి విభేదాలకు ఎలాంటి ప్రాముఖ్యం ఇవ్వదు. ఖుర్ఆన్ ప్రకారం ఈ విశ్వం వైవిధ్యంతో నిండి ఉంది. ఇక్కడ వివిధ రంగుల ఫలాలు ఉన్నాయి. వివిధ వర్ణాల పర్వతాలు ఇక్కడ కనబడతాయి. ఇదే పరిస్థితి మనుష్యులు, జంతువులది కూడా. వారిలో కూడా వివిధ వర్ణాలున్నాయి. కేవలం రంగు ఆధారంగా ఏ ఫలం కూడా ఇతర ఫలాల కన్నా ఉన్నతమైనది కాలేదు. అలాగే రంగు కారణంగా ఏ పర్వతం ఇతర పర్వతాల కన్నా ఎక్కువ కాదు. అలాగే ఏ జంతువు కూడా కేవలం రంగు కారణంగా ఇతర జంతువుల కన్నా అధికం కాదు. అదే పరిస్థితి మానవులది. కేవలం శరీర వర్ణం ఆధారంగా ఎవరికి ఎవరిపైనా ఆధిక్యత లేదు. దైవభీతి, ధర్మపరాయణతలే

---

1. *ఋగ్వేదం, మంత్రం 1:100:18:19, అల్ జిహాద్ ఫిల్ ఇస్లామ్ నుంచి గ్రహించడమైనది.*
2. *పైన పేర్కొన్న పుస్తకం పేజీలు 333-341)*

దేవునికి ఇష్టమైనవి. మనిషి దేవుని గుర్తించడం ద్వారా ఈ లక్షణాలను పొందగలడు. మనిషి ఈ లక్షణాలను సముపార్జించుకుని దేవునికి భయపడే వానిగా రూపొందాలి.

> "ఆకాశం నుండి అల్లాహ్ వర్షం కురిపించడాన్ని నీవు చూడడం లేదా? తర్వాత దాని ద్వారా రకరకాల రంగురంగుల పళ్ళను ఉత్పత్తి చేస్తాము. కొండల్లో కూడా తెల్లని, ఎఱ్ఱని, కారునలుపు చారలు కనిపిస్తాయి, వాటి రంగులు వేర్వేరుగా ఉంటాయి. ఈ విధంగానే మానవుల, జంతువుల, పశువుల రంగులు కూడా భిన్న మైనవే. యథార్థమేమిటంటే, అల్లాహ్ దాసుల్లో జ్ఞానులు మాత్రమే ఆయనకు భయ పడతారు. నిస్సందేహంగా అల్లాహ్ శక్తిమంతుడు, మన్నించేవాడూను."
>
> *(ఫాతిర్ : 27-28)*

ఈ విషయాన్నే ప్రవక్త ముహమ్మద్ (స) తన హదీసులో సెలవిచ్చారు

"దైవం మీ ముఖాలను, మీ సంపదను చూడదు. ఆయన మీ హృదయా లను, మీ ఆచరణలను మాత్రమే చూస్తాడు." అబూజర్ (రజి)ను ఉద్దేశించి ఇలా అన్నారు "జాగ్రత్తగా విను, నువ్వు ఏ నల్లవాడి కన్నా, లేక తెల్లవాడి కన్నా ఎక్కువ కాదు. వారికన్నా నువ్వు దైవభీతి విషయంలో ఉన్నతుడివి." (ముస్లిం)

భాష

రంగు, జాతిల మాదిరిగానే భాష కూడా అసమానతలకు కారణ మవుతుంది. భాష కారణంగా వివిధ వర్గాలుగా మానవాళి విభజించబడింది. రంగు, జాతి మాదిరిగానే భాష కూడా మనిషిని విభజించే కారణం కాదని ఖుర్ఆన్ పేర్కొంటోంది. భాషాభేదాల కారణంగా మానవాళి జగడాలకు దిగరాదని స్పష్టం చేసింది. విద్వేషవైరాలకు శాశ్వత కారణంగా భాష మారకూడదన్నదే ఖుర్ఆన్ అభీష్టం. భాష నిజానికి మనిషి దేవుని తెలుసుకునే సాధనం. ఎందుకంటే భాష మనిషికి దేవుని ఔన్నత్యం తెలియజేస్తుంది. ఈ సృష్టి యాధృచ్ఛికంగా ఉనికిలోకి రాలేదని, వాటికవే విశ్వ వ్యవహారాలు నడువడం లేదని, ఒక సృష్టికర్త ఉన్నాడని, ఆయనే ఈ వ్యవహారాలన్నింటిని నడుపుతున్నాడని తెలియజేస్తోంది. సృష్టిలోని అనేక చిహ్నాల మాదిరిగానే భాష కూడా దేవుని ఏకత్వాన్ని చాటి చెప్పే ఒక చిహ్నం.

> "ఆయన సూచనలలో ఒకటి ఏమిటంటే, ఆయన మిమ్మల్ని మట్టితో సృష్టించాడు. తర్వాత అకస్మాత్తుగా మీరు మానవులు అయ్యారు. (భూమిపై) వ్యాపిస్తూ ఉన్నారు. ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే, ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుంచి సృష్టిం చాడు - మీరు వారి వద్దకు శాంతిని పొందడానికి, మీ

మధ్య ప్రేమను, కారుణ్యాన్ని సృజించాడు. నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలున్నాయి. ఆయన సూచనలలో, ఆకాశాలను, భూమిని సృష్టించడమూ, మీభాషల, మీ రంగుల వైవిధ్యాలు ఉన్నాయి. నిశ్చయంగా విజ్ఞులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి."(అర్రూమ్ : 20-22)

ఇక భాషలు, మాండలికాల విషయానికి వస్తే అల్లాహ్ తన ప్రవక్తలను ప్రతి భాషలో పంపించాడు. అంటే దేవునికి ప్రతి భాషతోను, ప్రతి భాష మాట్లాడే సముదాయంతోను ఒకే విధమైన సంబంధం ఉంది. ఈ విషయంలో ఆయన ఎలాంటి పక్షపాతం వహించడం లేదు.

"మేము మా సందేశాన్ని అందజేసే నిమిత్తం ప్రవక్తను పంపినప్పుడల్లా, అతడు తన జాతి ప్రజలు మాట్లాడే భాషలోనే మా సందేశాన్ని అందజేసాడు. వారికి అతడు విషయాన్ని చక్కగా అర్థమయ్యేట్లు చెప్పడానికి, అల్లాహ్ తాను మార్గభ్రష్ఠ లుగా చేయదలచుకున్న వారిని మార్గభ్రష్ఠులుగా చేస్తాడు. తాను మార్గం చూప దలిచిన వారికి మార్గం చూపుతాడు. ఆయన శక్తిసంపన్నుడు, వివేక సంపన్ను డూను." (ఇబ్రాహీం : 4)

ప్రవక్త ముహమ్మద్ (స) కూడా ఈ విషయంలో ఎలాంటి పక్షపాతానికి తావివ్వ లేదు. తన సహచరులను అరబీతో పాటు ఇతర భాషలు నేర్చుకోవాలని ఆయన ప్రోత్సహిం చారు. హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) ప్రకారం ఆయన్ను ప్రవక్త (స) ఇబ్రానీ భాష నేర్చు కోవాలని ఆదేశించారు. జైద్ (రజి) పదిహేను రోజుల్లోనే ఆ భాషపై పట్టు సాధిం చారు. (అబూదావూద్)

జైద్ బిన్ సాబిత్ (రజి) ఉటంకించిన మరో ప్రవచనం ప్రకారం ప్రవక్త (స) ఆయన్ను సిరియాని భాష నేర్చుకోవాలని ఆదేశించారు. (తిర్మిజి). అరబ్బులకు తమ భాషపై చాలా గర్వం ఉండేది. ఈ గర్వంతోనే వారు తమ భాష కాక ఇతర భాషలు మాట్లాడేవారిని మూగ వారిగా పరిగణించేవారు. ప్రవక్త (స) ఈ భాషా గర్వాన్ని నిరసించారు.

"ఒక అరబ్బుకు అరబ్బేతరునిపై ఎలాంటి ఆధిక్యం లేదు. అరబ్బేతరునికి అరబ్బుపై ఆధిక్యం లేదు. తెల్లవాడికి నల్లవాడిపై, నల్లవాడికి తెల్లవాడిపై ఆధిక్యం లేదు. ఆధిక్యానికి ప్రమాణం కేవలం దైవభీతి మాత్రమే" అన్నారు. (బైహాకి)

అంటే, దేవుని వద్ద తన భాషకు ప్రత్యేక ప్రాముఖ్యం ఉందని ఎవరన్నా భావిస్తే అది పెద్ద పొరబాటు. దేవుడు కేవలం తన పట్ల భయభక్తులు ఎవరు కలిగి ఉన్నారన్నది

మాత్రమే చూస్తాడు. ఎవరు తనపట్ల భయభక్తులతో జీవితం గడుపుతున్నారన్నది మాత్రమే ఆయన పరిగణనలోకి తీసుకుంటాడు.

ప్రాంతీయతత్వం

రంగు, జాతి, భాషల మాదిరిగానే ప్రాంతానికి కూడా వివక్షతకు కారణమయ్యే శక్తి ఉంది. ప్రాంతీయతత్వంతో మానవ సమూహాల మధ్య వైరాలు జగడాలు మామూలయ్యాయి. ఒక ప్రాంతం వారు మిగిలిన ప్రాంత ప్రజల కన్నా తాము అధికులమని భావించడమూ కనబడుతుంది. మనిషి ఏ ప్రాంతం లేదా ఏ ప్రదేశానికి చెందినవాడన్న విషయానికి ఇస్లాంలో ఎలాంటి ప్రాముఖ్యం లేదు. ఏ జాతి ఏ ప్రాంతంలో నివసిస్తున్నదన్న విషయానికి ఎలాంటి ప్రాధాన్యత లేదు. దివ్యఖుర్ఆన్ ప్రకారం ప్రాంతం అన్నది మనిషికి యాధృచ్ఛికంగా లభించింది మాత్రమే. పూర్తి ప్రపంచ జనాభా ఏదో ఒక ప్రాంతంలో నివసించడం అన్నది సాధ్యమయ్యే విషయం కాదు. నాగరికతల వికాసంలో ఇది అనివార్య మైన ఒక పరిణామం. ఆ పరిణామం ఫలితంగా వివిధ వర్గాలు వివిధ ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. మానవులు భూమిపై వ్యాపించడం అన్నది నాగరికతల వికాసాన్ని కాదనలేని అవసరం. దివ్యఖుర్ఆన్ ఈ విషయాన్ని చక్కగా తెలియజేసింది.

> "ఆయన సూచనలలో ఒకటి ఏమిటంటే, ఆయన మిమ్మల్ని మట్టితో సృష్టించాడు. తర్వాత అకస్మాత్తుగా మీరు మానవులు అయ్యారు. (భూమిపై) వ్యాపిస్తూ ఉన్నారు. *(రూమ్ : 20)*

మానవులను వివిధ దేశాల్లో, వివిధ ప్రాంతాల్లో వ్యాపించేలా చేసాడు అల్లాహ్. అందువల్ల ప్రాంతం ఆధారంగా ఎలాంటి ఆధిక్యతను కల్పించడం సముచితం కాదు. దివ్యఖుర్ఆన్ ప్రకారం మనిషికి కన్ను, చెవి, గుండె వంటివి అల్లాహ్ ఎలా ప్రసాదించాడో, వాటి విషయంలో మనిషి సొంత అభీష్టానికి ఎలా స్థానం లేదో అదేవిధంగా మనిషి జన్మించే ప్రాంతం విషయంలోను అతడికి ఎలాంటి నిర్ణయాధికారమూ లేదు.

"మిమ్మల్ని పుట్టించినవాడు అల్లాహ్యే, ఆయనే మీకు వినే, చూసే శక్తులు ఇచ్చాడు. ఇక ఆయనే మీకు ఆలోచించే, అర్థం చేసుకునే మనసు కూడా ఇచ్చాడు. కాని మీరు చాలా తక్కువగా కృతజ్ఞతలు తెలుపుతారు.

> వారితో ఇలా అను, "అల్లాహ్యే మిమ్మల్ని యావద్భూమిపై వ్యాపింపజేశాడు. ఆయనవైపుకే మీరు సమీకరింపబడతారు." *(ముల్క్ : 23,24)*

దీన్ని బట్టి తెలిసేదేమంటే అసమానతలకు కారణమయ్యే వివిధ అంశాల మాదిరి గానే ప్రాంతం అన్నది కూడా యాధృచ్ఛికంగా మనిషికి లభించేది మాత్రమే. ప్రాంతం ఆధారంగా ఎలాంటి ఆధిక్యాన్ని ఇస్లాం ఒప్పుకోదు. ప్రత్యేక ప్రాంతంలో నివసిస్తున్నంత మాత్రాన మనిషికి ఎలాంటి ఆధిక్యత, పవిత్రత లభించదు. మనిషికి ఆధిక్యత అన్నది అతడి ఆచరణల వల్ల మాత్రమే లభిస్తుంది. ఇదే విషయాన్ని ఇబ్నే సయీద్ ఉటంకించిన ప్రవక్త ప్రవచనం కూడా తెలియజేస్తోంది. సిరియాకు న్యాయమూర్తిగా వెళ్ళిన హజ్రత్ అబూదర్దా (రజి), హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి)కు ఒక లేఖ రాస్తూ పవిత్ర భూమి (సిరియా)కు మీరు కూడా వచ్చేయండి అని పేర్కొన్నారు. దీనికి జవాబుగా హజ్రత్ సల్మాన్ (రజి) రాసిన పంక్తులు ఆధునిక కాలంలో కూడా విద్వేషాలకు కారణమవుతున్న ప్రాంతీయతత్వాన్ని కూకటి వేళ్ళతో పెకలించి వేసే పంక్తులు. ఆయన ఇలా రాశారు

"ప్రాంతం ఎవరిని ఆధికులు, పవిత్రులు చేయదు. మనిషి ఆచరణలే అతడిని పవిత్రుడిగా చేస్తాయి." (మూతా)

వృత్తి

మనిషి వృత్తి వ్యాపకాలను కూడా ఆధిక్యతకు కారణాలుగా పరిగణించడం కనబడుతుంది. చాలామంది తమ వంశవృత్తిని మార్చుకోవడం సాధ్యపడుతుంది, అయినప్పటికీ ప్రపంచంలో చాలా సమాజాల్లో వృత్తి వ్యాపకాల రీత్యా ఆధిక్యత భావన చాలా లోతుగా ఉంది. వంశవృత్తిని మానుకుని కొత్త వృత్తి చేపట్టినప్పటికీ కూడా అతడి పూర్వికుల వృత్తితోనే అతడిని గుర్తించడం జరుగుతోంది. ఆ విధంగా మనుష్యులను అధికులు, అల్పులుగా చూసే ధోరణి కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా ఒకవ్యక్తి పూర్వికులు నీచస్థాయిగా పరిగణించే వృత్తిలో ఉన్నవారైతే, ఆ వ్యక్తి తన వృత్తిని మార్చుకుని కొత్త వృత్తి చేపట్టినప్పటికీ అతడిని పూర్వికుల వృత్తిపరంగానే చూడడం జరుగుతుంది. ఇలా వృత్తిరీత్యా ఆధిక్యత భావనను ఇస్లాం ఒప్పుకోదు. అల్లాహ్ మానవులకు వివిధ వృత్తి నైపుణ్యాలు ప్రసాదించి వారిని వివిధ సేవలు, పనులు చేసేవారిగా రూపొందించాడు. అందువల్లనే సమాజంలో వ్యక్తులు వివిధ సేవలు పొందగలుగుతున్నారు. నైపుణ్యాలలో ఈ వైవిధ్యం లేనట్లయితే ఒక మనిషి మరో మనిషిపై ఆధారపడడం అన్నది ఉండదు. ఫలితంగా నాగరికత ప్రగతి వికాసాలు సాధించడం కూడా ఉండదు. ప్రపంచ వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమవుతుంది. అల్లాహ్ మనిషి సదుపాయం కోసం ఏర్పాటు చేసిన సౌలభ్యాన్ని మనిషి మానవ సమాజాలకు ఒక శాపంగా మార్చుకోవడం అవివేకం.

వృత్తిరిత్యా విభేదాలు సృష్టించుకుని మానవసమాజాలను విద్వేషవైరాలకు నిలయాలుగా మార్చుకోవడం మూర్ఖత్వం.

"వారు ఇలా అంటారు "ఈ ఖుర్ఆన్ రెండు నగరాలలోని పెద్ద మనుష్యులలో ఏ ఒక్క పెద్దమనిషి పైనైనా ఎందుకు అవతరించలేదు. నీ ప్రభువు కారుణ్యాన్ని పంచిపెట్టేవారు వారేనా? ఈ ప్రపంచ జీవితంలో వారి బ్రతుకుదెరువు మార్గాలను మేము వారిమధ్య పంచాము. వారిలో కొందరికి మరి కొందరిపై అంతస్తుల వారిగా ఆధిక్యం ఇచ్చాము. వారు ఒకరినొకరు సేవించుకోవడానికి. నీ ప్రభువు కారుణ్యం (అంటే ప్రవక్త పదవి) వారు సమీకరించే సంపద కంటే ఎంతో విలువైనది."

(జఖ్రుఫ్ : 31,32)

ఇమామ్ రాజి దీనికి క్రింది విధంగా వివరణ రాశారు.

"మేము మానవుల మధ్య తేడాలు ఉంచాము. ఒకరు బలవంతుడైతే మరొకరు బలహీనుడు, ఒకరు పండితుడైతే మరొకరు పామరుడు, ఒకరు నిపుణుడైతే మరొకరు నైపుణ్యం లేనివాడు, ఒకరికి కీర్తి లభిస్తే మరొకరు పేరులేని వాడు. మేము ఇలా ఎందుకు చేశామంటే, మేము గనుక అందరికీ అన్నీ ఇస్తే ఎవరూ ఎవరికీ సేవ చేయరు. ఎవరూ ఎవరి క్రింద పనిచేయడానికి ఇష్టపడరు. ఈ పరిస్థితి సమాజాల పతనానికి కారణ మవుతుంది. ప్రపంచ వ్యవస్థ చిన్నాభిన్నమవుతుంది." (తఫ్సీర్ కబీర్)

ఇస్లాంలో వృత్తికి ఏమైనా ప్రాముఖ్యం ఉంటే అది కేవలం దివ్యఖుర్ఆన్ బోధించిన వాక్యాల ప్రకారం మాత్రమే ఉంది. ఈ విషయంలో ఖుర్ఆన్ వాక్యాలు అర్ధవంతంగా మనముందుకు వస్తాయి. దీన్ని బట్టి తెలిసేదేమంటే మానవసమాజాల్లో వివిధ హోదస్థాయి ఉన్న వివిధ వృత్తులు ఉండడం ఆధారంగా మనిషికి వృత్తిరీత్యా ఎలాంటి ఆధిక్యతా లభిం చదు. అలాగే వృత్తి అనేది మనిషితో పాటు శాశ్వతంగా ఉండేది కూడా కాదు. మనిషి తన శక్తిసామర్థ్యాలను పెంచుకుని ఉన్నత స్థాయి వృత్తిని చేపట్టవచ్చు. ఇతరుల సేవ నుంచి తప్పుకుని ఇతరుల నుంచి సేవలు పొందే స్థాయికి ఎదగనూ వచ్చు.

ఈ విషయమై ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పిన మాటలు కూడా గమనార్హమైనవి. వృత్తి వల్ల ఎలాంటి ఆధిక్యతా లభించదని ఈ మాటలు స్పష్టం చేస్తున్నాయి. చేతివృత్తులన్నవి ప్రవక్తల సంప్రదాయం. హజ్రత్ దావూద్ (అస) చేతివృత్తి చేసేవారు. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు

"మనిషి తన చేతితో సంపాదించిన రొట్టె కన్నా ఉత్తమమైన రొట్టెను ఎవరూ

తినలేరు. అల్లాహ్ ప్రవక్త దావూద్ (అస) తన చేతితో సంపాదించుకుని తినేవారు" (బుఖారి)

అదేవిధంగా హజ్రత్ జకరియా (అస) వడ్రంగం చేసేవారు. ప్రవక్త ముహమ్మద్ (స) "హజ్రత్ జకరియా వడ్రంగం చేసేవారు" (ముస్లిం) అని తెలియజేశారు.

ప్రవక్తలు హజ్రత్ దావూద్, హజ్రత్ జకరియాలు చేతివృత్తులతో సంపాదించుకుని తినేవారయితే స్వయంగా ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవక్త పదవికి ముందు వ్యాపారం చేసేవారు. ప్రవక్త (స) ప్రియ సహచరులు హజ్రత్ అబూబక్ర్ (రజి) కూడా బట్టల వ్యాపారం చేసేవారు. వీరే కాదు ప్రవక్త సహచరులు చాలా మంది నేతపని, వడ్రంగం తదితర పనులు చేసుకునే వారు. (బుఖారి). వ్యాపారం కాస్త గౌరవప్రదమైనదిగా చాలా మంది భావించవచ్చు, వ్యాపారం చేసేవారిని తక్కువగా చూడడం జరగకపోవచ్చు. సాధారణంగా సమాజం చిన్న చూపు చూసే వృత్తులకు కూడా ఇస్లాం గౌరవప్రదమైన స్థానం కల్పించింది. పూర్వం చెడురక్తం తీయడం ద్వారా వైద్యం చేసే ప్రక్రియ ఉండేది. అలా చెడురక్తం తీసేవారిని తక్కువ చూపు చూసేవారు వారి విషయంలో ప్రవక్త (స) ఇలా అన్నారు.

"చెడురక్తాన్ని తీసే గొప్ప పని చేసేవారు ఎంత మంచివారు. ఆ విధంగా శరీరం తేలికవుతుంది. చూపు బాగుపడుతుంది." (ఇబ్నెమాజ)

వివక్షకు వ్యతిరేకంగా ఇస్లాం పోరాటం

జాతి, రంగు, వంశం, వృత్తి, ప్రాంతం, భాష వగైరా కారణాల వల్లనే వివక్ష పుట్టుకు వస్తుంది. ఫలితంగా మనిషి మంచి చెడులను విస్మరించి గ్రుడ్డిగా ఏదో ఒక వర్గాన్ని బలపరుస్తుంటాడు. ఆ వర్గం కోసం పోరాడ్డానికి, ప్రాణాలు వదలడానికి సిద్ధపడతాడు. తన వర్గం న్యాయంపై ఉందా లేదా అన్నది చూడడు. ప్రాచీన కాలం మాదిరిగా నేడు కూడా ఈ వివక్షలు మానవులను అనేక ముక్కలుగా విభజించి వేసాయి. ప్రతి వర్గం మరో వర్గంపై కత్తులు నూరుతోంది. ఒకరిని ఒకరు పూర్తిగా నిర్మూలించాలని చూస్తున్నారు. ఇలాంటి వివక్షలను ఇస్లాం పూర్తిగా నిర్మూలిస్తోంది. ఈ విషయమై ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు.

"వివక్ష వైపు పిలిచేవాడు మావాడు కాదు. వివక్షతో యుద్ధం చేసేవాడు మాలోని వాడు కాదు. వివక్ష కోసం ప్రాణాలు ఇచ్చేవాడు మావాడు కాదు" (అబూ దావూద్)

ఇంకో హదీసులో ఇలా ఉంది.

" తనవర్గం అన్యాయానికి పాల్పడుతున్నా వారికి మద్దతు పలికేవాడి పరిస్థితి

బావిలో పడిన ఒంటెను తోకపట్టుకుని పైకి లాగుతున్న పరిస్థితి వంటిది" అంటే ఆ పరిస్థితి పూర్తిగా వినాశకరమైన పరిస్థితి. (అబూదావూద్)

ఈ వివక్షల వేళ్ళు అరబ్బు సమాజంలో చాలా లోతుగా ఉండేవి. అందువల్ల ఇస్లాం స్వీకరించిన తర్వాత కూడా ఆ ప్రభావం చాలా మందిలో ఉండేది. ప్రవక్త ముహమ్మద్ (స) ఒక్కొక్కటిగా ఈ వివక్షలను తొలగించారు. జీవిత రంగాలన్నింటా ఇస్లాం ఆధిక్యతను స్థాపించారు. అబూ ఉఖ్బా ఫార్సీ వర్గం వారు.. ఆయన ఇలా అన్నారు. "నేను ప్రవక్త (స)తో ఉహుద్ యుద్ధంలో పాల్గొన్నాను. నేను ముష్రిక్కులలో ఒక వ్యక్తిపై బలంగా దాడి చేసాను. చూడు, నేను ఒక ఫార్సి బానిసను నా చేతి దెబ్బ రుచి చూడమన్నాను. ఈ మాటలు విని ప్రవక్త (స) నావైపు తిరిగారు. నువ్వు ఆ మాటలకు బదులు నా చేతి దెబ్బరుచి చూడు నేను ఒక అన్సార్ బానిసను అని ఉంటే బాగుండేది అన్నారు. (అబూదావూద్). ఈ మాటలకు అర్థం ఏమంటే తన వర్గం గురించి చెప్పుకునేదైతే ఇస్లాంకు సంబంధించిన వర్గం గురించి చెప్పుకోవలసింది. ఇస్లాం స్వీకరించిన తర్వాత కూడా పాత వర్గాల విషయాలు ప్రస్తావించడం ఎందుకు?

ఇంతకన్నా ముఖ్యమైన సంఘటన మరొకటి ఉంది. ఇలాంటి వ్యవహారమే ముహాజిర్లు (మక్కా నుంచి వలస వచ్చినవారు) అన్సార్లు (మదీనాలో సహాయపడినవారు) ఈ రెండు వర్గాల మధ్య చోటు చేసుకుంది. హజ్రత్ జాబిర్ ఉటంకం ప్రకారం వారు ప్రవక్త (స)తో పాటు ఒక యుద్ధంలో ఉన్నారు. ఇంతలో ముహాజిర్లలో ఒక వ్యక్తి అన్సార్లలో ఒక వ్యక్తిని కొట్టాడు. ఆ అన్సార్ వ్యక్తి వెంటనే ఇతర అన్సార్లను తనకు సహాయంగా పిలిచాడు. ముహాజిర్ కూడా ఇతర ముహాజిర్లను తన సహాయానికి రావాలని పిలిచాడు. ప్రవక్త ముహమ్మద్ (స)కు ఈ విషయం తెలిసిన వెంటనే ఆయన ఇలా అన్నారు "ఈ అజ్ఞానపూరిత నినాదాలు ఇవ్వడమేమిటి?" అన్నారు. అప్పుడు సహచరులు ఆయనతో "ప్రవక్త (స) ముహాజిర్లలో ఒక వ్యక్తి అన్సార్లలో ఒక వ్యక్తిని కొట్టాడు (అందువల్ల ఈ నినాదాలు వినిపిస్తున్నాయి)" అన్నారు. అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు "ఈ అజ్ఞానపు నినాదాలు ఇవ్వడం ఆపండి. ఇది చెడు పని" అన్నారు. (అంటే అర్థం అల్లాహ్‌కు, అల్లాహ్ ప్రవక్తకు విధేయత చూపుతామని ప్రమాణం చేసిన తర్వాత నిర్ణయాలన్నీ అల్లాహ్, అల్లాహ్ ప్రవక్త ఇష్టప్రకారమే జరుగుతాయి. ఇప్పుడు పరస్పర ఘర్షణల కారణంగా అజ్ఞానకాలం నాటి వర్గపక్షపాతాన్ని మళ్ళీ బతికించడం సమ్మతం కాదు. (ముస్లిం)

ఇలాంటి అజ్ఞానపు నినాదాలు ఇవ్వడాన్ని నివారిస్తూ ప్రవక్త (స) ఇలా తెలియ జేసారు-

"అజ్ఞానపు నినాదాలు ఇచ్చేవారు నరకాగ్నికి ఇంధనంగా మారుతారు." అప్పుడు ప్రజలు ఆయన్ను "ప్రవక్తా(స), అలాంటి నినాదాలు ఇచ్చిన వ్యక్తి ఉపవాసాలు ఉండేవాడు, నమాజులు చేసేవాడయితే" అని ప్రశ్నించారు. ప్రవక్త (స) జవాబిస్తూ "ఉపవాసాలు ఉండేవాడు, నమాజులు చేసేవాడయితే ముస్లిము అన్న విషయం కూడా దృష్టిలో ఉంచుకోవాలి. మీరు ముస్లిములను వారికి అల్లాహ్ పెట్టిన పేరుతో పిలువండి. అంటే ముస్లిములారా అని దైవదాసులారా అని పిలువండి" అన్నారు. (మస్నద్ అహ్మద్)

ఇవికాక పక్షపాతానికి వివక్షకు కారణమయ్యే సమస్త కారణాలను నిర్మూలిస్తూ ప్రవక్త (స) మక్కా విజయానంతరం ఇలా అన్నారు.

"వినండి, అజ్ఞానకాలంలో గర్వం అహంకారాలకు కారణాలుగా ఉండిన సమస్త విషయాలను వాటి కారణంగా ఉన్న రక్తపరిహారాలను నేను నా పాదాల క్రింద అణచివేసాను. కేవలం ఒక్క విషయం మాత్రమే మిగిలి ఉంది. కాబాగృహం సంరక్షణ బాధ్యత, హజ్‌యాత్రికులకు నీరు సరఫరా చేసే బాధ్యత"(ఇబ్నెమాజ)

తాత్కాలిక కారణాలు

ఇప్పటి వరకు మనం అసమానతలకు సంబంధించి మనిషి వెన్నంటి ఉండే శాశ్వత స్థాయి కారణాల గురించి చర్చించాము. ఇప్పుడు అసమానతలకు సంబంధించి కొన్ని తాత్కాలిక కారణాలు కూడా ఉన్నాయి. ఈ కారణాల వల్ల మనిషి అహంకారానికి, గర్వాతిశయానికి లోనై ఇతరులు తనకన్నా తక్కువ వారిగా భావించడం ప్రారంభిస్తాడు. తనకు లభించిన వాటిని చూసి గర్వించి, తన తోటి వారిని చిన్నచూపు చూస్తాడు. ఈ విధంగా మనిషికి మనిషికి మధ్య విద్వేష వైరాలను రగిల్చి మానవులంతా ఒక్కటే అన్న భావాన్ని తుంగల్లో తొక్కడం జరుగుతుంది. ఇస్లాంలోని సమతాభావం ఈ అసమానతల కారణాలన్నింటిని తొలగిస్తుంది.

1. సంపద, సంతానం

ఈ తాత్కాలిక కారణాల్లో అన్నింటికన్నా ముందు ప్రస్తావించదగ్గవి, మనిషిని అహంకారానికి గురిచేసేవి సంపద, సంతానం. మనిషికి సంపద, సంతానం వంటి సౌభాగ్యాలు లభించినప్పుడు తన వంటి వాడు ఇక భూప్రపంచంలో ఎవడూ లేడని భావించడం ప్రారంభిస్తాడు. దేవుడు తనకు సంపద, సంతానం వంటి సౌభాగ్యాలను ఇంత గొప్పగా ప్రసాదించాడు కాబట్టి తనకు దైవప్రసన్నత లభించినట్లేనని, ఇక తాను ఏం చేసినా

చెల్లుతుందని భావిస్తాడు. ఫలితంగా ఇతరులు తనకన్నా తక్కువ స్థాయి వారిగా పరిగణిస్తాడు. ఇతరులతో ఎలా వ్యవహరించినా తప్పులేదని అనుకుంటాడు. దివ్యఖుర్ఆన్ ఈ భావనను తీవ్రంగా ఖండిస్తుంది. సంపద, సంతానం లభించడమన్నది దైవప్రసన్నత లభించిందనడానికి నిదర్శనం కాదని, దేవుని వద్ద వీటికి ఎలాంటి విలువ ఉండదని, దేవుని సన్నిధిలో మనిషి విశ్వాసం, మనిషి ఆచరణలు మాత్రమే పనికివస్తాయని స్పష్టం చేసింది. విశ్వాసం, ధర్మాచరణలు లేని మనిషి నరకాగ్నికి ఆహుతి కావలసి ఉంటుందని హెచ్చరిస్తుంది.

> "వారు ఎల్లప్పుడు ఇలానే అన్నారు. "మేము నీకంటే ఎక్కువ సంపదను, ఎక్కువ సంతానాన్ని కలిగి ఉన్నాము. మేము ఎంతమాత్రం శిక్షించబడేవారము కాము". ప్రవక్తా! వారితో ఇలా అను, "నా ప్రభువు తనకు ఇష్టమైన వారికి విస్తారంగా ఉపాధిని ప్రసాదిస్తాడు. తనకు ఇష్టమైన వారికి ఆచితూచి ఇస్తాడు. కాని చాలా మంది దీని యధార్థాన్ని గ్రహించరు.". మిమ్మల్ని మాకు దగ్గర చేసేది మీ సంపద కాని, మీ సంతానం కాని కాదు. విశ్వసించి సత్కార్యాలు చేసేవారు మాత్రమే (మాకు దగ్గర అవుతారు) ఇటువంటి వారికే తాము చేసిన దానికి రెట్టింపు ప్రతిఫలం లభించేది. వారు ఎత్తయిన భవనాలలో సురక్షితంగా ఉంటారు. ఇక మా వాక్యాలను చులకన పరచడానికి నిరంతర ప్రయత్నం చేసేవారు, వారు యాతనకు గురవుతారు." *(సబా : 35-38)*

దివ్యఖుర్ఆన్ ప్రకారం సంపద, సంతానం అనేవి కొద్దిరోజుల ఐహిక జీవితానికి సంబంధించినవి మాత్రమే. వీటిని చూసి మనిషి మోసపోరాదు. దేవుని వద్ద మనిషికి పనికి వచ్చేది అతడి ఆచరణ మాత్రమే.

> "ఈ సంపద, సంతానమూ కేవలం ఐహిక జీవితపు తాత్కాలిక అలంకారాలు మాత్రమే. అసలు, శాశ్వతంగా ఉండిపోయే పుణ్యకార్యాలే నీ ప్రభువు దగ్గర పరిణామం రీత్యా ఉత్తమమైనవి. కాబట్టి వాటి మీదనే పెద్ద ఆశలు పెట్టుకోవచ్చు." *(కహఫ్ : 46)*

మనిషి తన జీవితంలో ధార్మిక విశ్వాసం, ధర్మాచరణల సౌభాగ్యాన్ని పొందలేకపోతే, ప్రపంచంలో సంపద, సంతానం రీత్యా అతడు ఎంత గొప్ప వాడైనప్పటికీ, దేవుని దర్బారులో ఈ సంపద సంతానం వల్ల అతడికి ఎలాంటి ప్రయోజనమూ ఉండదు.

"అవిశ్వాస వైఖరిని అవలంబించిన వారికి వారి ఐశ్వర్య బలం కాని సంతాన బలం

కాని అల్లాహ్‌కు ప్రతికూలంగా ఉపయోగపడవు. వారు నరకానికి ఇంధనం అయితీరుతారు. చివరకు వారి ముగింపు ఫిర్‌ఔన్ అనుచరులు, అంతకు పూర్వపు అవిధేయుల ముగింపు వంటిది అవుతుంది. వారు అల్లాహ్ ఆయతులను అసత్యాలుగా తిరస్కరించారు. పర్యవసానంగా వారి పాపాలకు గాను అల్లాహ్ వారిని పట్టుకున్నాడు. వాస్తవమేమంటే, నిశ్చయంగా అల్లాహ్ కఠినంగా శిక్షిస్తాడు."
(ఆలి ఇమ్రాన్ : 10,11)

2. శక్తిసామర్థ్యాలు

సంపద సంతానం మాదిరిగానే మనిషి తన శక్తి సామర్థ్యాలను చూసి కూడా గర్విస్తాడు. మానవత్వాన్ని మరిచిపోతాడు. ఇతరులు తన కన్నా చాలా తక్కువస్థాయి వారిగా పరిగణిస్తాడు. వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతాడు. ఇలా వ్యవహరించేవాడు పెద్ద మూర్ఖుడని దివ్యఖుర్‌ఆన్ హెచ్చరిస్తుంది. ప్రపంచంలో లభించే ఇతర సౌభాగ్యాల మాదిరిగానే ఎవరైనా మనిషికి శక్తిసామర్థ్యాలు, శారీరక బలం లభిస్తే అది కేవలం దేవుడిచ్చినదే, కాబట్టి దేవునికి కృతజ్ఞతలు చెల్లించుకోవాలి. అంతే కాని, బలగర్వంతో ఇతరుల హక్కులను కాల రాయడానికి ప్రయత్నించరాదు. ఈ విషయమై దివ్యఖుర్‌ఆన్ ఆద్ జాతి గురించి ప్రస్తావిస్తూ ఇలా సెలవిచ్చింది.

"మీకు ఆశ్చర్యం కలిగిందా, మీ వద్దకు మిమ్మల్ని హెచ్చరించడానికి స్వయంగా మీ జాతికి చెందిన ఒక మనిషి ద్వారా మీ ప్రభువు జ్ఞాపిక వచ్చిందని? మరిచిపోకండి – మీ ప్రభువు నూహ్ జాతి తర్వాత మిమ్మల్ని వారసులుగా చేసాడు. మీకు బలాధిక్యతను ప్రసాదించాడు కనుక అల్లాహ్ శక్తి మహిమలను జ్ఞాపకం ఉంచుకోండి. మీరు సాఫల్యం పొందగలరని ఆశించవచ్చు." *(అరాఫ్ : 69)*

వ్యక్తులైనా, జాతులైనా ఎవరికైనా గాని శక్తిసామర్థ్యాల సౌభాగ్యం కేవలం దేవుని వరప్రసాదమే. బలగర్వంతో మనిషి వాస్తవాలను మరిచిపోరాదు. అహంకారంతో మునిగిపోయి ఇతరుల పట్ల రాక్షసంగా వ్యవహరించరాదు. హజ్రత్ తాలూత్ గురించి ప్రస్తావిస్తూ దివ్యఖుర్‌ఆన్ ఇలా సెలవిచ్చింది.

"వారి ప్రవక్త వారితో ఇలా అన్నాడు, "మీకు ఏలికగా అల్లాహ్ తాలూత్‌ను నియమించాడు" ఇది విని వారు ఇలా అన్నారు, "మాపై రాజ్యం చేసే హక్కు అతనికి ఎలా సంక్రమిస్తుంది? రాజ్యం చేసే హక్కు, అర్హతలు అతనికంటే మాకే ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే, అతడు శ్రీమంతుడు కాదు". దానికి సమాధానంగా ప్రవక్త

వారితో ఇలా అన్నాడు. "మీకు బదులుగా అల్లాహ్ అతనినే ఎన్నిక చేసాడు. అల్లాహ్ అతనికి బుద్ధిబలాన్ని, కండబలాన్ని సమృద్ధిగా ప్రసాదించాడు. తాను కోరిన వారికి రాజ్యం ప్రసాదించే అధికారం అల్లాహ్‌కు ఉంది. అల్లాహ్ అంతా వ్యాపించి ఉన్నాడు. సర్వం తెలిసినవాడు." *(బఖర : 247)*

3. సౌందర్యం

శారీరక సౌందర్యం కూడా అలాంటి ఒక కారణమే. అందాన్ని చూసి మనిషి గర్వించడం తన్నుతాను మరిచిపోవడం జరుగుతుంది. తన కన్నా తక్కువ అందంగా ఉన్న వారిని, చూడ్డానికి బాగోలేని వారిని మనిషి చిన్న చూపు చూస్తాడు. అలాగే వికలాంగులను చూసి అవహేళన చేస్తాడు. శారీరక లోపం ఉన్న వారిని తక్కువ వారిగా చూస్తాడు. మనిషికి ఇలాంటి గర్వాతిశయం పనికిరాదని ఖుర్ఆన్ హెచ్చరిస్తోంది. మనిషి తాను ఎలా సృష్టించబడ్డాడో ఒకసారి గ్రహించాలని బుద్ధి చెబుతుంది. మనిషి తాను ఎలాంటి స్థాయి నుంచి దేవుని కృపవల్ల ఎలాంటి స్థాయికి చేరుకున్నాడో తెలుసుకోవాలని చెబుతుంది.

"మేము మానవుడిని మట్టి యొక్క సారంతో సృష్టించాము. తర్వాత అతనిని ఒక సురక్షిత స్థానంలో పడే బిందువుగా మార్చాము. ఆ తర్వాత ఆ బిందువుకు ముద్ద ఆకారాన్ని ఇచ్చాము. ఆ పైన ముద్దను కండగా చేసాము. తర్వాత మాంసపు కండను ఎముకలుగా చేసాము. ఆ తర్వాత ఎముకలకు మాంసాన్ని తొడిగాము. ఆపైన దానిని భిన్నమైన సృష్టిగా చేసి నిలబెట్టాము. కనుక అల్లాహ్ ఎంతో శుభప్రదుడు. సృజనకారులందరిలో కెల్లా ఉత్తమ సృజనకారుడు."

(మౌమినూన్ : 12-14)

ఇవే కాక మనిషి జ్ఞానేంద్రియాలు కన్ను, ముక్కు, చెవి వీటివల్లనే మనిషి అందంగా కనిపిస్తాడు. ఇవన్నీ దేవుడు ప్రసాదించినవేనని, అందుగ్గాను మనిషి దేవునికి కృతజ్ఞుడై ఉండాలని, గర్వాహంకారాలకు గురికారాదని హెచ్చరిస్తుంది.

"ఆయన ఏ వస్తువు చేసినా చక్కగా చేసేవాడు. ఆయన మానవ సృష్టి ప్రారంభాన్ని మట్టితో చేసాడు. తర్వాత అతని సంతతిని తుచ్ఛమైన ద్రవపదార్థం వంటి ఒక సారంతో కొనసాగించాడు. ఆ తర్వాత అతనిని నఖశిఖ పర్యంతం తీర్చిదిద్దాడు. అతనిలోనికి తన ఆత్మను ఊదాడు. మీకు చెవులిచ్చాడు, కళ్ళిచ్చాడు, హృదయాలిచ్చాడు. అయినా మీరు కృతజ్ఞతలు తెలుపడం చాలా తక్కువ." *(సజ్దా : 7-9)*

మనిషికి ఈ సౌందర్యాన్ని ప్రసాదించిన దేవుడు దానిని తిరిగి లాక్కుంటే మనిషికి తిరిగి ఆ శారీరక సౌందర్యాన్ని ఇచ్చేవాడెవడు? ఈ విషయాన్నే దివ్యఖుర్ఆన్ తెలుసు కొమ్మంటుంది.

"ప్రవక్తా! వారితో ఇలా అను "మీరెప్పుడైనా ఆలోచించారా, అల్లాహ్ మీ చూపును, మీ వినికిడిని మీ నుంచి లాక్కుంటే, మీ హృదయాలకు ముద్రవేస్తే, మళ్ళీ మీకు ఈ శక్తులను అల్లాహ్ తప్ప తిరిగి ఇవ్వగల మరొక్క దేవుడు ఎవడున్నాడు?" చూడు– ఏవిధంగా మేము మా సూచనలను మాటిమాటికి వారికి తెలుపుతామో, మరేవిధంగా వారు వాటి నుంచి తమ దృష్టిని మరల్చుకుంటారో! ఇలా అను "మీరెప్పుడైనా యోచించారా, అల్లాహ్ తరఫు నుంచి అకస్మాత్తుగానో, బహిరంగం గానో మీపై శిక్ష అవతరిస్తే, అప్పుడు దుర్మార్గులు తప్ప మరెవ్వరైనా నాశన మవుతారా." *(అన్ఆమ్ : 46-48)*

4. బుద్ధిజ్ఞానాలు

బుద్ధిజ్ఞానాల వల్ల మనిషి ఎంతగా గర్విస్తాడంటే, మిగిలిన కారణాల కన్నా ఈ కారణం మరింత బలంగా ఉంటుంది. ఫలితంగా మనిషి మిగిలిన వారందరూ తన కన్నా చాలా తక్కువస్థాయి వారిగా పరిగణిస్తాడు. ఇతరులపై దౌర్జన్యాలు చేయడానికి కూడా వెనుకాడడు. ప్రస్తుత కాలంలో పాశ్చాత్యదేశాలు ప్రపంచంలో ఇతర దేశాలపై తమ వైజ్ఞానిక ప్రగతి కారణంగానే వలసలు స్థాపించి దౌర్జన్యాలకు పాల్పడ్డాయన్నది ఇక్కడ గమనించాలి. తృతియ ప్రపంచ దేశాల్లోని ప్రజలను బానిసలుగా మార్చాయి. దీనిక్కారణం కూడా ఈ గర్వాతిశయమే. వైజ్ఞానికంగా వెనుకబడిన దేశాల ప్రజలు, ఆయా నాగరికతలు, సంస్కృతులు తమకన్నా తక్కువస్థాయివిగా భావించడం వల్లనే ఈ అరాచకాలకు తెగబడ్డారు. ఈ గర్వాతిశయాన్ని అవివేకంగా దివ్యఖుర్ఆన్ ప్రకటిస్తుంది. మనిషికి లభించిన బుద్ధి జ్ఞానాలు అన్నీ దేవుని దయవల్లనే లభించాయి, మనిషి తల్లిగర్భం నుంచి భూప్రపంచంలోకి వచ్చినప్పుడు నిరక్షరాస్యుడే.

"అల్లాహ్ మిమ్మల్ని మీ మాతృగర్భాల నుండి మీరు ఏమీ ఎరుగని స్థితిలో ఉండగా బయటకు తీశాడు. ఆయన మీకు చెవులను ఇచ్చాడు, కళ్ళు ఇచ్చాడు, ఆలోచించే మనసు ఇచ్చాడు – మీరు కృతజ్ఞులు కావాలని." *(నహల్ : 78)*

మనిషికి లభించిన బుద్ధిజ్ఞానాలన్నీ అల్లాహ్ ప్రసాదించినవేనని దివ్యఖుర్ఆన్ స్పష్టంగా చెబుతోంది.

"విశ్వసించిన ప్రజలారా! మీరు పరస్పరం ఒక నిర్ణీత కాలం కొరకు అప్పు తీసుకున్నప్పుడు ఆ వ్యవహారాన్ని రాసి పదిలపరచండి. ఇరు పక్షాల మధ్య న్యాయంగా దస్తావేజును ఒక వ్యక్తి రాయాలి. అల్లాహ్ ఎవరికైతే అక్షరజ్ఞానం ప్రసాదించాడో అతడు వ్రాయడానికి నిరాకరించకూడదు. అతడు వ్రాయాలి." *(బఖర : 282)*

ఇంకో చోట ఇదే విషయాన్ని దివ్యఖుర్‌ఆన్ ఇలా ప్రకటించింది.

"ప్రజలు తమ కొరకు ఏది హలాల్ చేయబడిందని అడుగుతారు. ఇలా బోధించు పరిశుభ్రమైన వస్తువులన్నీ మీ కొరకు హలాల్ చేయబడ్డాయి. మీరు తర్ఫీదు ఇచ్చిన వేట జంతువులు – దేవుడు మీకు ప్రసాదించిన జ్ఞానం ఆధారంగా మీరు వేటాడే తర్ఫీదును ఇచ్చినవి – అవి మీ కొరకు పట్టిన జంతువును కూడా మీరు తినవచ్చు. కాని దానిపై అల్లాహ్ పేరును ఉచ్చరించండి. అల్లాహ్ శాసనాన్ని ఉల్లంఘించేందుకు భయపడండి. లెక్క తీసుకోవాలంటే అల్లాహ్‌కు ఎంతోసేపు పట్టదు."

(మాయిద: 4)

అందువల్లనే ధర్మపరాయణులైన వారు దేవుడు ప్రసాదించిన ఈ సౌభాగ్యం పట్ల ఎన్నడూ గర్వించేవారు కాదు. అహంకారం ప్రదర్శించేవారు కాదు. ఎల్లప్పుడు దేవునికి కృతజ్ఞతలు చెల్లించుకునేవారు. ప్రతిక్షణం దేవుని స్తోత్రంలో దైవనామస్మరణలో ఉండేవారు. ఈ సందర్భంగా దివ్యఖుర్‌ఆన్ హజ్రత్ దావూద్ (అస), హజ్రత్ సులైమాన్ (అస) ల ఉదాహరణలు పేర్కొంటుంది. ఈ ఇద్దరు ప్రవక్తలకు దేవుడు అపారమైన బుద్ధిజ్ఞానాలను ప్రసాదించాడు.

"మేము నీ ప్రయోజనం కొరకు అతనికి కవచాలు తయారు చేసే కళను నేర్పాము. తద్వారా మిమ్మల్ని పరస్పర హాని నుండి రక్షిద్దామని. అలాంటప్పుడు మీరు కృతజ్ఞులుగా ఉన్నారా?" *(అంబియా : 80)*

ఇదేవిధంగా హజ్రత్ సులైమాన్ (అస)కు దేవుడు పశుపక్ష్యాదుల భాష గురించిన జ్ఞానాన్ని ప్రసాదించాడు. ఆయనకు ప్రపంచంలోని అన్ని విధాల వస్తుసామాగ్రిని అనుగ్రహించాడు. అంతేకాదు, ఆయన వద్ద ఉన్న సైనికదళాలు సాటిలేనివి. ఆ సైనిక దళాల్లో మనుష్యులే కాదు, జిన్నులు కూడా ఉండేవి. పక్షులు కూడా ఉండేవి.

"సులైమాన్ దావూద్‌కు వారసుడయ్యాడు. అతను ఇలా అన్నాడు, "ప్రజలారా! మాకు పక్షుల భాషలు నేర్పబడ్డాయి. ఇంకా మాకు అన్ని రకాల వస్తువులు

ఇవ్వబడ్డాయి. నిస్సందేహంగా ఇది స్పష్టమైన (దేవుని) అనుగ్రహం." సులైమాన్ కొరకు జిన్నాతుల, మానవుల, పక్షుల సైన్యాలు సమీకరిపబడ్డాయి."

(నమల్ : 17)

ఇంత గొప్పవారైనప్పటికి ఈ మహానుభావులు అనుక్షణం దైవస్తోత్రం చేస్తూ ఉండేవారు

"మేము దావూద్‌కు సులైమాన్‌కు జ్ఞానాన్ని ప్రసాదించాము. "విశ్వాసులైన అనేక మంది తన దాసులకంటే మాకు ఘనతను ప్రసాదించిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు" అని వారు అన్నారు." *(నమల్ : 15)*

హజ్రత్ దావూద్ (అస) పరిస్థితి ఎలా ఉండేదంటే, ఆయన ఏదన్నా కొండచరియలో కూర్చుని దైవస్తోత్రం చేస్తుంటే, మానవులే కాదు కొండలు, పశుపక్ష్యాదులు కూడా ఆయనతో పాటు దైవస్తోత్రం చేసేవి.

"దావూద్‌తో పాటు పర్వతాలు, పక్షులు (మా) స్తోత్రం చేసే కట్టుబాటు మేము చేశాము. ఈ పనిని చేసినవారము మేమే." *(అంబియా : 80)*

5. సంస్కృతీ నాగరికతలు

బుద్ధిజ్ఞానాల మాదరిగానే సంస్కృతీ నాగరికతల ప్రగతి కూడా మనిషిని గర్వాతిశయానికి గురిచేస్తుంది. వెనుకబడిన సంస్కృతుల ప్రజలను హీనంగా చూస్తాడు. నేటి ఆధునిక కాలంలోనూ అభివృద్ధి చెందిన దేశాలు, వర్ధమాన దేశాలన్న విభజన కనబడు తుంది. అభివృద్ధి చెందిన దేశాల ప్రజలు వర్ధమాన దేశాల ప్రజలను తక్కువగా చూడడం మనకు తెలిసిందే. అలాగే వర్ధమాన దేశాల ప్రజలు కూడా అభివృద్ధి చెందిన దేశాల ప్రజల జీవనవిధానాన్ని చూసి న్యూనతాభావానికి గురికావడం కనబడుతుంది. అంతేకాదు, అభివృద్ధి చెందిన దేశాల ప్రజలను అనుకరించడానికి ప్రయత్నించడమూ చూడవచ్చు. సంస్కృతీ నాగరికతల ప్రగతి వికాసాల కారణంగా గర్వించడాన్ని ఇస్లాం ఖండిస్తుంది. మనిషి ధర్మపరాయణుడై, ధార్మికవిశ్వాసం, ధర్మాచరణలకు కట్టుబడడం తప్ప మరేదీ ఇస్లాంలో ముఖ్యం కాదు. ఈ సుగుణాలు లేకపోతే ఎంత గొప్ప సంస్కృతీ నాగరికతలకు చెందినవాడైనా దేవుని దృష్టిలో అల్పుడే. మక్కావాసులను ఉద్దేశించి ఖుర్ఆన్ చెప్పిన మాటలు ఇదే వాస్తవాన్ని చాటి చెబుతున్నాయి.

"మేము వారికి పూర్వం , ఎన్నో జాతులను నాశనం చేసి ఉన్నాము. వారు వీరికంటే ఎంతో ఎక్కువ శక్తిమంతులు. వారు అనేక ప్రపంచ దేశాలను చుట్టివచ్చారు.

అయితే వారు ఎక్కడైనా, ఏదైనా ఆశ్రయం పొందగలిగారా? హృదయం ఉండి విషయాన్ని శ్రద్ధగా ఆలకించే ప్రతి వ్యక్తికీ ఈ చరిత్రలో గుణపాఠం ఉన్నది." *(ఖాఫ్ : 36,37)*

మక్కావాసులకు పదే పదే వివరించిన ఈ జాతులు, ఆద్, సమూద్, మద్యన్ జాతులు. ఈ జాతులు కట్టడాల నిర్మాణంలోనూ, సంస్కృతీ నాగరికతల వికాసంలోను చాలా ప్రగతి సాధించిన జాతులు. ఆయా కాలాల్లో ఈ జాతులు సంస్కృతీ నాగరికతల రిత్యా ప్రపంచంలో మిగిలిన జాతుల కన్నా చాలా ముందుండేవి. సమూద్ జాతి మహాకట్ట డాలను నిర్మించేది. పర్వతాలను తొలిచి భవనాలు కట్టేది.

"జ్ఞాపకం తెచ్చుకోండి ఆ సమాయాన్ని, అప్పుడు అల్లాహ్ ఆద్ జాతి తరువాత మిమ్మల్ని దానికి వారసులుగా చేశాడు. మీకు భూమిపై ఉన్నతమైన స్థానాన్ని ప్రసాదించగా మీరు ఈ రోజు దాని చదునైన మైదానాలలో మహోన్నత మైన భవనాలను నిర్మిస్తున్నారు. దాని కొండలను గృహాలుగా చెక్కుతున్నారు. కనుక ఆయన సృష్టి మహిమలను నిర్లక్ష్యం చెయ్యకండి. ధరణిపై సంక్షోభాన్ని సృష్టిం చకండి." *(ఆరాఫ్ : 74)*

ఇదే పరిస్థితి ఇతర జాతులది కూడా.

"వారు (పూర్వీకులు) వీరి కంటే ఎక్కువ బలవంతులు. వారు భూమిని బాగా తవ్వారు. వారు దీనిని వీరు చేసిన దానికంటే ఎక్కువగా వసింపచేశారు."

(రూమ్ : 9)

భూమిపై ప్రతి అంగుళం ఈ జాతుల గొప్పదనానికి నిదర్శనంగా ఉండేది.

"వారు వీరికంటే ఎక్కువ బలవంతులు. భూమిలో వీరికంటే అత్యంత మహోజ్వల మైన గుర్తులు విడిచివెళ్లారు." *(మూ'మిన్ : 82)*

కాని ఈ జాతులు తలబిరుసుతనంతో దేవుని పట్ల అవిధేయత చూపి దైవాగ్రహానికి గురయ్యాయి. వారి సంస్కృతీ నాగరికతలు ఒక్క క్షణంలో నాశనమైపోయాయి. అందువల్లనే సూరా హజ్‌లో ఈ జాతుల గురించి వివరిస్తూ దైవం ఇలా తెలిపాడు.

"పాపాల పుట్టలైన ఎన్నో జనపదాలను మేము నాశనం చేశాము. ఈనాడు అవి తమ కప్పులపై తలక్రిందులుగా పడి ఉన్నాయి. ఎన్నో బావులు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఎన్నో ఎత్తైన భవనాలు శిధిలాలుగా మారిపోయాయి." (హజ్ :45)

దీన్ని బట్టి తెలిసేదేమంటే, జీవితంలో ఇతర సౌభాగ్యాల మాదిరిగా సంస్కృతీ నాగరి కతలు కూడా దేవుని వరప్రసాదాలే. వీటికి బదులుగా మనిషి దేవునికి కృతుజ్ఞుడై ఉండాలి. అందువల్లనే దివ్యఖుర్ఆన్‌లో ఈ తలబిరుసు వైఖరి గురించి ప్రస్తావన వచ్చినప్పుడు, దేవుని పట్ల కృతజ్ఞత చూపిన వారి ప్రస్తావన కూడా తప్పనిసరిగా కనిపిస్తుంది. హజ్రత్ సులైమాన్ (అస) గురించి ఇంతకు ముందు మనం చెప్పుకున్నాం. ఆయన కాలంలో సంస్కృతీ నాగరి కతలు గొప్ప అభివృద్ధి సాధించాయి. ఆయన సైన్యంలో మనుష్యులే కాదు, జిన్నాతులు, పక్షులు కూడా ఉండేవి (నమల్ : 1). సముద్రమార్గాన వాణిజ్యం పెద్దస్థాయిలో జరిగేది. గనుల నుంచి లోహాలు తీసేవారు. జిన్నాతులు ఆయన సేవలో ఉండేవి. వాటితో అనేక కళాకృతులు తయారు చేయించేవారు (సబా: 12,13). అంతేకాదు జిన్నాతులు ఆయన కోసం సముద్రం నుంచి సంపదలు వెలికి తీసి తెచ్చేవి. ఇవే కాక ఇంకా అనేక పనులు చేసేవి (అంబియా : 82). ఆయన నివసించిన రాజప్రసాదం ఎంత మనోహరంగా, గంభీరంగా ఉండేదంటే ఆ రాజప్రసాదాన్ని చూసి సబా రాణి చేష్టలుడిగి చూస్తుండిపోయింది (నమల్ : 44). కాని ఇంత అభివృద్ధి సాధించినప్పటికీ ఆయనలో ఏమాత్రం గర్వం, అహంకారం ఉండేవి కావు. అవన్నీ దైవప్రసాదితాలుగానే భావించేవారు.

> "సులైమాన్ దావూద్‌కు వారసుడయ్యాడు. అతను ఇలా అన్నాడు, "ప్రజలారా! మాకు పక్షుల భాషలు నేర్పబడ్డాయి. ఇంకా మాకు అన్ని రకాల వస్తువులు ఇవ్వ బడ్డాయి. నిస్సందేహంగా ఇది స్పష్టమైన (దేవుని) అనుగ్రహం."*(నమల్ : 16)*

ఎల్లప్పుడు దైవస్తోత్రంలో గడుపుతూ ఉండేవారు.

> "మేము దావూద్‌కు, సులైమాన్‌కు జ్ఞానాన్ని ప్రసాదించాము. "విశ్వాసులైన అనేక మంది తన దాసులకంటే మాకు ఘనతను ప్రసాదించిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు" అని వారు అన్నారు. *(నమల్ : 15)*

ఇదేవిధంగా జుల్‌కర్‌నైన్ ఉదాహరణ కూడా మనకు దివ్యఖుర్ఆన్‌లో కనబడు తుంది. ఆయన కాలంలో కూడా నాగరికత గొప్ప ప్రగతి సాధించింది. యాజూజ్, మాజూజ్ జాతులను ఎదిరించడానికి ఆయన ధృఢమైన గోడను నిర్మించి దానిపై లోహంతో పోత పోయించారు. ఆ గోడను దాటడం యాజూజ్ మాజూజ్‌ల వల్ల కాలేదు. కాని తన ప్రగతి వికాసాలు చూసి ఆయనెప్పుడూ గర్వించలేదు. అదంతా దేవుని అనుగ్రహంగా భావించే వారు.

"జుల్‌కర్‌నైన్ ఇలా అన్నాడు. "ఇది నా ప్రభువు కరుణ. కాని నా ప్రభువు యొక్క

వాగ్దాన సమయం ఆసన్నమయినప్పుడు, ఆయన దానిని నేలమట్టం చేస్తాడు. నా ప్రభువు వాగ్దానం నిజమైనది." *(కహఫ్ : 98)*

స్థాయి భేదాలు పరీక్షలే

మానవసమాజాల్లో అసమానతలకు కారణాలన్నింటిని ఇస్లాం తొలగిస్తోంది. కాని దేవుడు ఈ విశ్వాన్ని తనదైన పద్ధతిలో సృష్టించాడు. ఈ సృష్టి వెనుక ఎంతో వివేచన దాగి ఉంది. ఇంతకు ముందు కూడా మనం చెప్పుకున్నట్లు ప్రపంచంలో మానవులందరూ అన్ని విధాలా ఒకేతీరులో లేరు. అనేక తేడాలు ఉన్నాయి. అనేక తారతమ్యాలున్నాయి. కొందరు కొన్ని విధాల ఉన్నతస్థాయిలో ఉన్నారు. మరి కొందరు క్రిందిస్థాయిలో ఉన్నారు. ఈ స్థాయి భేదాల కారణంగా ఉన్నతస్థాయిలో ఉన్న వారు తమకన్నా తక్కువ స్థాయిలో ఉన్నవారిని చిన్నచూపు చూడడం ఎంత మాత్రం తగదు. వారి పట్ల వివక్ష చూపడాన్ని ఇస్లాం ఎంత మాత్రం ఒప్పుకోదు. ఈ స్థాయి భేదాల కారణంగా మనిషి మోసానికి గురికారాదు. పైస్థాయిలో ఉన్నానని గర్వించరాదు. స్థాయిభేదాలు మనిషి గర్వించడానికి కాదు, అవి పరీక్షలని గ్రహించి దేవునికి కృతజ్ఞుడై ఉండాలి.

"ఆయనే మిమ్మల్ని భూమండలానికి ఖలీఫాలుగా చేశాడు. మీలో కొందరికి కొందరిపై ఉన్నత స్థానాలను ప్రసాదించాడు, మీకు ఇచ్చిన దానితోనే మిమ్మల్ని పరీక్షించాలని, నిస్సందేహంగా మీ ప్రభువు శిక్షించడంలో కూడా వడిగలవాడు. ఎక్కువగా మన్నించేవాడు, కరుణించేవాడు కూడా." *(అన్ఆమ్ : 165)*

వ్యక్తి లేదా జాతి దేవుని అనుగ్రహాలు పొంది గర్వాతిశయానికి గురైతే సాఫల్యం పొందలేదు. ఆ విధంగా భ్రమల్లో బతకరాదు. ఇతరులపై అఘాయిత్యాలకు, దౌర్జన్యాలకు పాల్పడరాదు. ఈ పరీక్షల్లో దైవాదేశాలకు అనుగుణంగా ఉత్తీర్ణుడు కావాలి. తోటివారి హక్కులను నెరవేర్చాలి. న్యాయంగా వ్యవహరించాలి. ఆ విధంగా దైవప్రసన్నత పొందాలి. ఈ విషయమై కషాఫ్ ఎంత చక్కగా చెప్పారో చూడండి.

"(ఈ సౌభాగ్యాలను ఇవ్వడం ద్వారా) ఆ విధంగా మిమ్మల్ని పరీక్షించా లని దైవం భావిస్తున్నాడు). హోదా స్థాయి అనేవి, సంపద సంతానం వగైరాలు ఇలాంటివే. ఈ సౌభాగ్యాలు పొంది మీరు దేవునికి కృతజ్ఞులుగా ఉన్నారా లేదా అని చూస్తున్నాడు. ఎలా వ్యవహరిస్తున్నారో పరిశీలిస్తున్నాడు. పండితుడు పామరుడితో, సంపన్నుడు దరిద్రుడితో, యజమాని నౌకరుతో ఎలా వ్యవహరిస్తున్నాడో చూస్తున్నాడు" (అక్షాఫ్ అన్ హకాయకుల్ తంజీల్, సంపుటం 1, పేజి 436)

ఇదేవిధంగా దివ్యఖుర్ఆన్ కూడా దేవుని అనుగ్రహాలు పొంది భూమిపై గర్వించవద్దని చెబుతోంది. ప్రతి అడుగు ఆచితూచి వేయాలని బోధిస్తోంది. ప్రతి మనిషి తోటి వారి హక్కు నెరవేర్చాలి. గొప్ప వంశం, గొప్పజాతి, సంపద, అధికారాలేవి మనిషిని అహంకారానికి గురిచేయరాదు. ఏ మనిషిపై దౌర్జన్యం చేయవద్దు. ఎవరిని చిన్నచూపు చూడవద్దు. మీలో ప్రతి ఒక్కరు మరొకరికి పరీక్షగా ఉన్నారు. అందువల్ల జాగ్రత్తగా ఉండండి. ఈ పరీక్షలో మీరు అపజయం పాలు కారాదు.

"'అసలు మేము మిమ్మల్ని ఒకరి కొరకు మరొకరిని పరీక్షా సాధనాలుగా చేశాము. నీవు సహనంతో ఉంటావా? నీ ప్రభువు సర్వాన్నీ చూస్తున్నాడు." (ఫుర్ఖాన్ : 20)

ఇస్లాం దృష్టిలో అసమానతల కారణాలు

ఇస్లాం ఏ కారణాలను నిమ్నోన్నతలకు సబబైనవిగా భావిస్తుందో వాటిని కూడా చూద్దాం. ఇస్లాంలో సమతాభావానికి సంబంధించి ఇది ఆసక్తికరమైన అంశం. దివ్యఖుర్ఆన్ అనేక చోట్ల రెండు రకాల వ్యక్తుల మధ్య పోలిక చూపుతూ వచ్చింది. ఒకరిని ఉన్నతులుగాను, మరొకరిని అధములుగాను పేర్కొంది. ఔన్నత్యానికి సంబంధించిన ఈ అంశాలన్నీ ధార్మిక విశ్వాసం, ధర్మాచరణల రీత్యా ఉత్తమస్థాయిని సూచించేవే. దివ్యఖుర్ఆన్ పేర్కొన్న ఆయా అంశాలను క్రింద ప్రస్తావిస్తున్నాము. ఇందులో ప్రస్తావించబడిన వాటిని ఒక్కొటిగా చర్చిద్దాం.

1. ధార్మిక విశ్వాసం - కపట విశ్వాసం

విశ్వాసులకు శాశ్వత స్వర్గం, కపట విశ్వాసులకు నరకాగ్ని నివాసం"విశ్వాసి అయిన వ్యక్తి విద్రోహిగా మారిపోవడం సాధ్యమేనా? ఈ ఉభయులూ సమానులు కాలేరు. విశ్వసించి సత్కార్యాలు చేసిన వారికి ఉద్యానవనాలలోని నివాసాలు ఉన్నాయి. వారి కర్మలకు ప్రతిఫలంగా వారి ఆతిథ్యానికి. విద్రోహవైఖరిని అవలంబించిన వారి నివాసం నరకం, వారు దాని నుండి బయటపడదలిచి నప్పుడల్లా, అందులోకి నెట్టబడతారు. వారితో, "మీరు తిరస్కరిస్తూ ఉండే అగ్ని బాధను ఇప్పుడు రుచి చూడండి" అని అనబడుతుంది." *(సజ్దా : 18-20)*

2. మనిషి స్వర్గాన్ని లేక నరకాన్ని పొందడం

దివ్యఖుర్ఆన్ దృష్టిలో స్వర్గార్హత పొందిన వారే సాఫల్యం పొందిన వారు

"నరకానికి పోయేవారు, స్వర్గానికి పోయేవారు ఒకటి కాలేరు. అసలు స్వర్గానికి పోయేవారే కృతార్థులు." *(హషర్ : 20)*

3. దైవమార్గంలో సంఘర్షణ

అదేవిధంగా దైవమార్గంలో తమ ధనప్రాణాలొడ్డి పోరాడినవారు, చేతులు ముడుచుకు కూర్చున్నవారు ఒకటి కాదు.

"కారణమేదీ లేకుండానే ఇంటివద్ద కూర్చుండిపోయే ముస్లిములు, అల్లాహ్ మార్గంలో తమ ధనప్రాణాలతో "జిహాద్" చేసే ముస్లిములు ఉభయుల స్థానం సమానం కాదు. కూర్చుండిపోయేవారి స్థానం కంటే ధనప్రాణాలతో "జిహాద్" చేసేవారి స్థానాన్ని అల్లాహ్ సమున్నతం చేశాడు. ప్రతి ఒక్కరికి అల్లాహ్ మేలునే వాగ్దానం చేస్తూ మాట వాస్తవమే. అయినా ఆయనవద్ద ముజాహిద్‌ల సేవలకు లభించే ప్రతిఫలం, కూర్చుండిపోయే వారికి లభించే ప్రతిఫలం కంటే ఎంతో ఎక్కువ. వారి కొరకు అల్లాహ్ తరఫు నుండి ఉన్నత స్థానాలు ఉన్నాయి. క్షమాభిక్ష, కారుణ్యం కూడా ఉన్నాయి. అల్లాహ్ ఎక్కువగా క్షమించేవాడూ, అమితంగా కరుణించేవాడూను." *(నిసా : 95-96)*

4. దైవమార్గంలో పోరాడ్డం, ఖర్చు చేయడం

దివ్యఖుర్‌ఆన్ ప్రకారం కష్టసమయాల్లో కూడా దైవధర్మం కోసం పోరాడిన వారు, తమ సంపదను ఖర్చు చేసిన వారు, ఈ మార్గంలో వెనుకబడిన వారి కన్నా ఉన్నతులు.

"అసలు మీరు అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టకపోవడానికి కారణం ఏమిటి? వాస్తవానికి భూమి, ఆకాశములు వారసత్వం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. మీలో విజయం తర్వాత ఖర్చు పెట్టినవారు, జిహాద్ చేసినవారు, విజయానికి పూర్వం ఖర్చుపెట్టిన వారితో, జిహాద్ చేసినవారితో ఎన్నటికి సమానులు కాలేరు. వారి అంతస్తు, తరువాత ఖర్చు పెట్టిన వారికంటే, జిహాద్ చేసిన వారి కంటే గొప్పది. అయినా అల్లాహ్ ఉభయులకూ మంచి వాగ్దానాలు చేసి ఉన్నాడు. మీరు చేసిన దానిని అల్లాహ్ బాగా ఎరుగును." *(హదీద్ : 10)*

5. దైవమార్గంలో వలస పోయిన వారు

ఒకవైపు ఈ విధంగా త్యాగాలు చేసినవారు, మరోవైపు కేవలం జాతిగర్వంతో బతికే వారు దేవుని దృష్టిలో ఒకటి కాదు.

"అల్లాహ్‌ను అంతిమదినాన్ని విశ్వసించి అల్లాహ్ మార్గంలో ప్రాణాలొడ్డి కృషి చేసే మనిషి పనితో హాజీలకు మంచినీళ్ళు త్రాపడాన్ని, మస్జిదెహరామ్‌కు సేవలు చేయ్యటాన్ని మీరు సమానంగా భావించారా? అల్లాహ్ దగ్గర వారిద్దరూ సమానులు కారు. అల్లాహ్ దుర్మార్గులకు మార్గం చూపడు. విశ్వసించి అల్లాహ్ మార్గంలో ఇల్లూ వాకిలీ వదిలిపెట్టి తమ ప్రాణాలతో, తమ సంపదలతో పోరాడిన వారి అంతస్తే ఆయన దృష్టిలో గొప్పది. అట్టివారే సఫలీకృతులు." (తౌబ : 19,20)

6. తోటివారికి లాభం చేకూర్చడం

తోటివారికి సహాయం చేసేవారు, చేయని వారు ఒకటి కాదు.

"అల్లాహ్ ఒక ఉదాహరణను ఇస్తున్నాడు. ఒకడేమో బానిస - ఇతరుల యాజమాన్యంలో ఉన్నవాడు, స్వయంగా ఏ అధికారమూ లేనివాడు. ఇక రెండోవాడు - అతనికి మేము మా తరఫునుండి మంచి ఉపాధి ప్రసాదించాము. అతడు అందులో నుండి బహిరంగంగాను, రహస్యంగానూ బాగా ఖర్చు చేస్తాడు. చెప్పండి, వారి ఇద్దరూ సమానులేనా? - అల్ హమ్‌దులిల్లాహ్ (స్తోత్రం అల్లాహ్ కొరకే). కాని అనేకులు (ఈ సామాన్య విషయాన్ని) ఎరుగరు.

అల్లాహ్ మరొక ఉదాహరణ ఇస్తున్నాడు : ఇద్దరు మనుషులున్నారు. ఒకడు మూగవాడు, చెవిటివాడు. ఏ పనీ చెయ్యలేడు. తన యజమానికి భారమై కూర్చున్నాడు. ఆయన అతన్ని ఎక్కడకు పంపినా అతనివల్ల మంచి పని ఏదీ జరుగదు. ఇక రెండో మనషి - అతడు న్యాయం చెయ్యండి అని ఆజ్ఞాపిస్తాడు. స్వయంగా సన్మార్గంపై స్థిరంగా ఉన్నాడు. చెప్పండి వారు ఇద్దరూ సమానులేనా?"

(నహల్ : 75,76)

7. దైవభీతి

రాత్రింబవలు దేవునికి భయపడేవాడు, దేవుని నిర్లక్ష్యం చేసి సందేహాలతో బతికేవాడు ఈ ఇద్దరు ఒకటి కాదని దివ్యఖుర్‌ఆన్ పేర్కొంటోంది.

"మనిషిపైకి ఎప్పుడైనా ఏదైనా ఆపద వచ్చిపడితే, అతడు తన ప్రభువు వైపునకు మరలి ఆయనకు మొరపెట్టుకుంటాడు. తరువాత అతడి ప్రభువు అతడికి తన అనుగ్రహాన్ని ప్రసాదించినప్పుడు, అతడు గతంలో ఏ ఆపదను గురించి మొరపెట్టు కున్నాడో, ఆ ఆపదను మరిచిపోయి, ఇతరులను అల్లాహ్‌కు సమానులుగా

నిలబెడతాడు. ఈ విధంగా అతడు (ప్రజలను కూడా) అల్లాహ్ మార్గం నుండి తప్పిస్తాడు. (ఓ ప్రవక్తా!) అతడితో, "కొన్నాళ్ళపాటు నీ తిరస్కార వైఖరి ద్వారా ఆనందాన్ని అనుభవించు. చివరకు నీవు తప్పకుండా నరకానికి పోయేవాడివే" అని చెప్పు. (ఈ వ్యక్తి వైఖరి మంచిదా లేక ఆ వ్యక్తి వైఖరి మంచిదా) ఎవడైతే విధేయుడో, రాత్రి గడియలలో (నమాజు చేస్తూ) నిలబడతాడో, సజ్దాలు చేస్తాడో, పరలోకానికి భయపడతాడో, తన ప్రభువు కారుణ్యాన్ని ఆశిస్తాడో? వీరిని అడుగు, తెలిసిన వారూ, తెలియని వారూ ఇద్దరూ ఎప్పుడైనా సమానులు కాగలరా? బుద్ధిమంతులు మాత్రమే హితబోధను స్వీకరిస్తారు." *(జమర్ : 8,9)*

8. మంచి చేయడం

అదేవిధంగా మంచి చేసేవాడు, చెడు చేసేవాడు ఈ ఇద్దరు వ్యక్తులు సమానులు కాదు. వీరిద్దరి మధ్య భూమ్యాకాశాల తేడా ఉంది.

"కళ్ళు లేనివాడూ, కళ్ళు ఉన్నవాడూ సమానం కావడం : విశ్వసించి సత్కార్యాలు చేసేవారూ, దుర్వర్తనులూ సరిసమానం కావడం అనేది ఎంతమాత్రం జరగదు. కాని మీరు అర్థం చేసుకోవడం చాలా తక్కువ. నిశ్చయంగా ప్రళయ గడియ తప్పకుండా వస్తుంది. అది వచ్చే విషయం గురించి ఏమాత్రం సందేహం లేదు. కాని చాలా మంది నమ్మరు." *(మూమిన్ : 57-59)*

9. ధార్మిక విశ్వాసం, ధర్మాచరణలు

ధార్మిక విశ్వాసం కలిగి ఉండి, ధర్మాచరణలు చేసే వ్యక్తి, ఈ సుగుణాలు లేని వ్యక్తి ఒకటి కాదు.

"అల్లాహ్‌కు అబద్ధం అంటగట్టేవాడి కంటే పరమ దుర్మార్గుడెవడు? అటువంటి వారు అల్లాహ్ సమక్షంలో హాజరవుతారు. తమ ప్రభువునకు అబద్ధాన్ని అంటగట్టిన వారు వారే అని అప్పుడు సాక్షులు సాక్ష్యం చెబుతారు. విను! దుర్మార్గుల మీద దేవుని శాపం పడుతుంది. దేవుని మార్గం నుండి ప్రజలను ఆపే దుర్మార్గులమీద, ఆయన మార్గాన్ని వక్రీకరించగోరే దుర్మార్గులమీద, పరలోకాన్ని తిరస్కరించే దుర్మార్గులమీద – వారు భూమిపై అల్లాహ్‌ను నిస్సహాయునిగా చేయలేకపోయారు. అల్లాహ్‌కు వ్యతిరేకంగా వారిని రక్షించేవాడు కూడా లేకుండా పోయాడు. వారికి ఇప్పుడు రెట్టింపు శిక్ష పడుతుంది. ఎందుకంటే వారు ఎవరిమాటనూ వినేవారూ

కాదు, స్వయంగా వారికి ఏ విషయమూ తట్టేదీ కాదు. తాము కల్పించిన దాని నంతా కోల్పోయినవారూ వారే. వారు పరలోకంలో అందరికంటే అధికంగా నష్ట పోవడం అనివార్యం. ఇక విశ్వసించి సత్కార్యాలు చేసినవారూ, తమ ప్రభువుకే అంకితమై పోయినవారూ నిశ్చయంగా స్వర్గానికి పోతారు. స్వర్గంలోనే వారు శాశ్వ తంగా ఉంటారు. ఈ ఉభయపక్షాల పోలిక ఇలా ఉంది. ఒకడు గుడ్డివాడు, చెవిటి వాడు. రెండోవాడు చూడగలిగేవాడు, వినగలిగేవాడూ. వారు ఉభయులూ సమాను లౌతారా? మీరు (ఈ పోలిక ద్వారా) గుణపాఠాన్ని గ్రహించరా?"

(హూద్ : 18-24)

10. తీర్పుదినాన సాఫల్యం

దివ్యఖుర్ఆన్ ప్రకారం తీర్పుదినాన సాఫల్యం పొందేవ్యక్తి, వైఫల్యం పొందే వ్యక్తి సమానులు కాదు.

"మీకు ఇవ్వబడింది కేవలం ప్రాపంచిక జీవితపు సామాగ్రి మరియు అలంకరణలు మాత్రమే. అల్లాహ్ వద్ద ఉన్నది దీనికంటే ఉత్తమమైనది, నిత్యమైనది. మీరు ఆలోచించరా? మేము తనకు చేసిన మంచి వాగ్దానాన్ని తప్పకుండా పొందనున్న వ్యక్తి, మేము కేవలం ఇహలోక జీవన సామగ్రి ఇచ్చిన తరువాత ప్రళయం నాడు శిక్షకై హాజరు పరచబడనున్న వ్యక్తి ఒకటవుతారా?" (ఖసస్ : 60,61)

11. ఏక దైవారాధన

అదేవిధంగా ధార్మికవిశ్వాసం కలిగి ఉండి, ఏకదైవారాధనకు కట్టుబడిన వ్యక్తి, ఏకదైవారాధనను కాదని అజ్ఞానంలో కూరుకుపోయిన వ్యక్తి సమానులు కాలేరు.

"భూమ్యాకాశాలకు ప్రభువు ఎవరు? అని వారిని అడుగు. "అల్లాహ్" అని అను. తరువాత వారితో ఇలా అను, "యథార్థం ఇదైనప్పుడు మీరు ఆయనను వదలి, స్వయంగా తమ విషయంలో కూడా లాభనష్టాల అధికారం లేనటువంటి ఆ దేవుళ్ళను మీరు మీ పనులు నెరవేర్చేవారుగా ఎన్నుకున్నారు?" ఇలా అను, "గుడ్డివాడూ కళ్ళున్నవాడూ సమానులు కాగలరా? వెలుగూ చీకట్లూ ఒకటి కాగలవా? అలా కాకపోతే, వారు నిలబెట్టిన భాగస్వాములు కూడా అల్లాహ్ మాదిరిగా దేనినయినా సృష్టించారా? దాని కారణంగా సృష్టి విషయంలో వారికి అనుమానం కలుగడానికి? - ఇలా అను "ప్రతి వస్తువునూ అల్లాహ్‌యే సృష్టించాడు ఆయన అద్వితీయుడు, అందరిపై ఆధిక్యం కలవాడు."

(అర్రాద్ : 16)

12. జ్ఞానంతో హేతుబద్ధ వైఖరి

అదేవిధంగా జ్ఞానంతో హేతుబద్ధంగా ఆలోచించే వ్యక్తి, ప్రవక్త (స) మాటలు పాటించే వ్యక్తి, అందుకు విరుద్ధంగా తన కోరికల దాస్యం చేస్తూ ప్రవక్త (స) మాటలు తిరస్కరించి బతికే వ్యక్తి ఇరువురు సమానులు కాదు.

"మేము ప్రవక్తలను పంపేది వారు సచ్ఛరితులకు సంతోషవార్తను ఇచ్చేవారు, దుశ్చరిత్రులను భయపెట్టేవారు కావాలని. కనుక, వారి మాట విని తమ నడవడికను సంస్కరించుకునే వారికి భయం కానీ విచారం కానీ కలిగే అవకాశం లేదు. కాని మా ఆయతులు అసత్యాలని తిరస్కరించేవారు తమ అవిధేయతలకు ఫలితంగా శిక్ష తప్పకుండా అనుభవిస్తారు.

> ప్రవక్తా! వారితో ఇలా అను : "నా వద్ద అల్లాహ్ నిధి నిక్షేపాలు ఉన్నాయని గానీ, నాకు అగోచర జ్ఞానం కలదని గానీ, నేను మీతో చెప్పడం లేదు. ఇంకా నేను దైవ దూతనని కూడా అనడం లేదు. నేను కేవలం నాపై అవతరింప చేయబడే 'వహీ'ని మాత్రమే అనుసరిస్తాను." వారిని అడుగు : "గ్రుడ్డి వాడూ కళ్లు ఉన్నవాడూ ఇద్దరూ ఒకటి కాగలరా? మీరు అసలు ఆలోచించరా?" అని" *(అన్ఆమ్ : 48-50)*

13. హృదయం బతికి ఉండడం

అదేవిధంగా దివ్యఖుర్ఆన్ ప్రకారం ఎవరి హృదయమైతే బతికి ఉందో, ఎవరు హితబోధను స్వీకరిస్తారో వారు, హితబోధను తిరస్కరిస్తూ హృదయం నిర్జీవమైన వాళ్ళు ఒకటికాదు.

> "గుడ్డివాడూ, కళ్లున్నవాడూ సమానులు కాలేరు. చీకట్లూ, వెలుగూ ఒకటి కావు. చల్లని నీడా, ఎండతాపమూ ఒకేవిధంగా ఉండవు. బ్రతికి ఉన్నవారు, చనిపోయిన వారు సమానులు కాలేరు. అల్లాహ్ తనకు ఇష్టమైన వారికి వినిపింపచేస్తాడు. కాని (ప్రవక్తా) సమాధులలో ఖననమైన వారికి నీవు వినిపించలేవు. నీవు కేవలం హెచ్చరిక చేసేవాడవు మాత్రమే." *(ఫాతిర్ : 19-22)*

14. హృదయకాంతి

దివ్యఖుర్ఆన్ ప్రకారం దేవుడు ఎవరి హృదయాల్లో ప్రకాశం ప్రసాదించాడో అలాంటి వారు, తమ తిరస్కార వైఖరి వల్ల హృదయాలను కఠినం చేసుకున్న వారు సమానులు కాదు.

"మీరు గమనించరా – అల్లాహ్ ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించాడు, తరువాత దానిని ఊటలు, చలమలు, నదుల రూపాలలో భూమిలో ప్రవేశింపజేశాడు. తరువాత ఈ నీటి ద్వారా ఆయన రకరకాల పంటలు పండిస్తున్నాడు. వాటి రంగులు కూడా భిన్నంగా ఉంటాయి. ఆ తరువాత ఆ పంటలు పండి ఎండిపోతాయి. మళ్ళీ అవి పసుపు రంగుగా మారిపోవడాన్ని మీరు చూస్తారు. చివరకు అల్లాహ్ వాటిని పొట్టుగా మార్చివేస్తాడు. యధార్థానికి ఇందులో బుద్ధిమంతులకు గుణపాఠం ఉంది. ఇక ఏ వ్యక్తి హృదయాన్ని అల్లాహ్ ఇస్లామ్ కై తెరిచాడో, ఏ వ్యక్తి తన ప్రభువు చూపిన వెలుగులో నడుస్తున్నాడో, ఆ వ్యక్తి (ఈ విషయాల నుండి ఏ గుణపాఠమూ నేర్చుకోని వ్యక్తి లాంటి వాడు కాగలడా?) అల్లాహ్ హితోపదేశం వల్ల ఎవరి హృదయాలు మరింత కఠినమై పోతాయో, వారికి వినాశం ఉన్నది. వారు స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నారు."

(జుమర్ : 21,22)

15. ధార్మిక విశ్వాసం, ఆచరణ

దివ్యఖుర్ఆన్ ప్రకారం మనిషికి ఔన్నత్యం కేవలం ధార్మిక విశ్వాసం, ఆచరణల వల్ల మాత్రమే లభిస్తుంది.

"విశ్వసించిన ఓ ప్రజలారా! మీ సమావేశాలలో (వచ్చే వారికి) చోటు కల్పించండని మీతో అన్నప్పుడు, మీరు జరిగి, చోటు కల్పించండి. అల్లాహ్ మీకు విశాలమైన చోటును ప్రసాదిస్తాడు. మిమ్మల్ని లేచివెళ్ళండి అని అన్నప్పుడు, లేచి వెళ్ళండి. మీలో విశ్వసించిన వారికి, జ్ఞానం ప్రసాదించబడిన వారికి అల్లాహ్ ఉన్నత స్థానాలు ప్రసాదిస్తాడు. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు." (ముజాదలా : 11)

ధార్మిక విశ్వాసం - దైవసాన్నిహిత్యం

దివ్యఖుర్ఆన్ ప్రకారం గౌరవోన్నతులు పొందే అర్హత కేవలం దైవాన్ని, దైవప్రవక్త (స)ను విశ్వసించిన వారికి మాత్రమే ఉంది. వారికి మాత్రమే దైవసాన్నిహిత్యం లభిస్తుంది.

"వారు ఇంకా ఇలా అంటారు. "మనం మదీనా నగరానికి తిరిగి వెళ్ళిన తరువాత, మనలోని గౌరవనీయులు నీచులను అక్కణ్ణించి వెళ్ళగొట్టాలి." వాస్తవానికి గౌరవం అనేది అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విశ్వాసులకు మాత్రమే చెల్లుతుంది. కాని ఈ కపటులు అది గ్రహించరు." *(మునాఫిఖూన్ : 8)*

జాత్యాహంకారానికి పునాది

ఇస్లాం ఏవిధంగా వ్యక్తుల విషయంలో గర్వాతిశయాన్ని ఖండిస్తుందో అదేవిధంగా జాత్యాహంకారాన్ని కూడా తీవ్రంగా నిరసిస్తుంది. అందుకే ఖుర్‌ఆన్ స్పష్టమైన పదాలతో దేవునికి ఏ జాతి పట్ల ప్రత్యేకాభిమానం లేదని తేల్చి చెప్పింది. ఏ జాతితోను దేవునికి ప్రత్యేక సంబంధమూ లేదు. దేవుని దృష్టిలో స్వీకారయోగ్యమైనవి ధార్మిక విశ్వాసం, ధర్మాచరణలు మాత్రమే. ఈ సద్గుణాలు కలిగిన ఏ వ్యక్తికయినా దేవుని వద్ద తగిన ప్రతిఫలం లభిస్తుంది. అతను ఏ జాతికి సంబంధించిన వాడైనా గాని. ఈ సద్గుణాలు లేని వాడు ఏ జాతికి చెందినవాడైనా అతనికి ఆ జాతితో సంబంధం వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు.

> "అరేబియా ప్రవక్త (ముహమ్మద్)ను విశ్వసించేవారు కాని, యూదులు కానీ, క్రయిస్తవుల కానీ, సాబియీలు కాని – ఎవరైనా సరే – అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించి మంచి పనులు చేసిన వారికి నిస్సందేహంగా వారి ప్రభువు వద్ద మంచి ప్రతిఫలం ఉంది. వారికి ఏవిధమైన భయం కాని, విచారం కానీ కలిగే అవకాశం లేదు."[1] *(బఖర : 62)*

యూద, క్రయిస్తవ జాతులకు చెందిన వాడికి స్వర్గార్హత లభిస్తుందని గ్రంథప్రజలు భావించేవారు. ఈ అభిప్రాయాన్ని దివ్యఖుర్‌ఆన్ ఈ విధంగా ఖండించింది.

> ''యూదులు కాని వారెవ్వరూ లేక (క్రయిస్తవుల ప్రకారం) క్రయిస్తవులు కానివారెవ్వరూ స్వర్గంలో ప్రవేశించలేరు అని వారు ప్రకటిస్తారు. ఇవి వారి కాంక్షలు మాత్రమే. వారిని ఇలా అడుగు : "మీరు అనేది సత్యమే అయితే, దానికి నిదర్శనాలేమిటో చూపండి" (అసలు మీలో గాని, మరెవ్వరిలో గాని ఏవిధమైన ప్రత్యేకత లేదు). వాస్తవమేమిటంటే, ఎవరు తమను తాము అల్లాహ్ పట్ల విధేయతకు అంకితం చేసుకుని, ఆచరణలో సన్మార్గం అవలంబిస్తారో, దానికి వారుతమ ప్రభువు వద్ద మంచి ప్రతిఫలం పొందుతారు. అటువంటి వారికి భయం కాని, దు:ఖం కాని కలిగే అవకాశం లేదు." *(బఖర : 111, 112)*

యూద లేక క్రయిస్తవ జాతికి చెందినవాడైతే చాలు మనిషి సన్మార్గాన ఉన్నట్లేనని గ్రంథ ప్రజలు భావించేవారు. కాని ఏ వ్యక్తయినా అజ్ఞానాన్ని వదిలి రుజుమార్గాన్ని ఆశ్రయించకపోతే దేవుని ఆగ్రహం నుంచి తప్పించుకోలేడని ఖుర్‌ఆన్ చెబుతోంది.

---

1. *మాయిదా : 69, హజ్ : 71)*

"యూదులుగా మారితేనే రుజుమార్గం లభిస్తుంది అని యూదులు అంటారు. క్రయిస్తవులుగా మారితేనే ధర్మమార్గం పొందగలుగుతారని క్రయిస్తవులు అంటారు. మీరు వారితో ఇలా అనండి : "కాదు, మేము అన్ని మార్గాలను విసర్జించి, ఒక్క ఇబ్రాహీము మార్గాన్నే అనుసరిస్తాము. ఇబ్రాహీము ముష్రిక్కులలోని వాడు కాదు." ముస్లిములారా! ఇలా ప్రకటించండి : "మేమంతా అల్లాహ్‌ను, ఆయన మా వైపునకు పంపిన హితోపదేశాన్ని విశ్వసించాము. ఇంకా ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్‌హాఖు, యాఖూబు, యాఖూబు సంతానంపై అవతరించిన దానినీ, మూసాకూ, ఈసాకూ ఇతర ప్రవక్తలందరికీ వారి ప్రభువు ప్రసాదించిన దానినీ మేము విశ్వసించాము. వారిలో ఒక్కరి పట్లా మేము భేదభావం చూపము. మమ్మల్ని మేము ముస్లిములుగా అల్లాహ్‌కు సమర్పించుకున్నాము. మీరు విశ్వసించినట్లే వారు విశ్వసిస్తే, అప్పుడు వారు ధర్మమార్గంలో ఉన్నట్లు కాని, వారు ఒకవేళ దీనికి వైముఖ్యం చూపితే, కేవలం వైషమ్యంతో మంకుపట్టు పడుతున్నారన్నది విశదం. కనుక వారి బారి నుండి మిమ్మల్ని ఆదుకునేందుకు అల్లాహ్ చాలు. మీరు నిశ్చింతగా ఉండండి. ఆయన అన్నీ వింటాడు. అన్నీ ఆయనకు తెలుసు."

(బఖర : 135,136)

కేవలం గ్రంథ ప్రజలు– యూదులు, క్రయిస్తవుల విషయంలోనే కాదు, ముస్లిముల విషయంలో కూడా దివ్యఖుర్ఆన్ ఇదేవిధంగా ఎలాంటి జాతిపరమైన అభిమానం లేని వైఖరినే ప్రదర్శించింది. అల్లాహ్ ముస్లిమ్ సమాజాన్ని శ్రేయోసమాజంగా, మధ్యస్థ సమాజంగా అభివర్ణించాడు. అయినప్పటికీ ఇవేవీ పనికిరావు. ఇవన్నీ నైతిక సుగుణాలున్నప్పుడే పనికివస్తాయి. అంటే మంచిని ఆజ్ఞాపించడం, చెడును నిరోధించడం, దేవుని ఆదేశాల ప్రకారం ఆచరణలు నిర్వర్తించడం (ఆలి ఇమ్రాన్ : 110), ఇంకా తోటివారికి సందేశప్రచారం చేయడం (బఖర : 143) తదితర విధులు నిర్వర్తించినప్పుడే వారికయినా ప్రయోజనం ఉంది. అంటే ఈ సద్గుణాలు ఉంటేనే ముస్లిములు శ్రేయోసమాజంగా ఔన్నత్యానికి అర్హత పొందుతారు.

మూడవ అధ్యాయం

జీవనరంగాల్లో నైతిక ఔన్నత్యం

ఇంతకు ముందు చెప్పుకున్నట్లు ఔన్నత్యం, అధమత్వం అన్నది నైతిక ప్రమాణాల రీత్యా నిర్ధారణ అవుతుంది. ఇస్లాం బోధించే ఈ సూత్రాలు కేవలం మాటలకే పరిమితం కాదు. జీవనరంగాలన్నింటా ఈ నైతికసూత్రాలు ఆచరణాత్మకంగా ఉండేలా ఇస్లాం జాగ్రత్తలు తీసుకుంది. జాతిభేదాలు, రంగుభేదాలు వగైరా- వేటినైతే సాధారణంగా ఔన్నత్యానికి ప్రమాణాలుగా భావిస్తారో వాటన్నింటిని ఇస్లాం పూర్తిగా నిర్మూలించింది. వివిధ జీవనరంగాల్లో ఇస్లాం ప్రవేశపెట్టిన సంస్కరణలను క్రింద చూద్దాం.

1. ప్రవక్తల వారసత్వం

ఇస్లాం దృష్టిలో ప్రవక్తలకు మించి ఔన్నత్యం, పవిత్రత కలిగిన వారు ఎవరు లేరు. దేవుడు ఎన్నుకున్న మహానుభావులు వారు. భూప్రపంచంలో అలాంటి మనుష్యులు మరెవ్వరు లేరు. అల్లాహ్ వారికి భూప్రపంచంలో మనుష్యులందరిపై ఔన్నత్యాన్ని ప్రసాదించాడు.

> "మా దాసులైన ఇబ్రాహీమ్, ఇస్‌హాక్, యాఖూబ్‌లను గురించి ప్రస్తావించు. వారు గొప్ప కార్యశీలురు, దూరదృష్టి కలవారు. మేము వారిని ఒక విశిష్ట గుణం కారణంగా ఎన్నుకున్నాము. అది వారిలోని పరలోక చింతన. నిశ్చయంగా మా దృష్టిలో వారు ఎన్నుకోబడిన పుణ్యపురుషులలో పరిగణింప బడతారు."
>
> *(సాద్ : 45-47)*
>
> "ఇస్మాయీలు, అల్‌యస్‌అ, యూనుస్, లూత్‌లకు (సన్మార్గం చూపాము). వారిలో ప్రతి ఒక్కరికి మేము భూలోక వాసులందరిపై ఘనతను ప్రసాదించాము."
>
> *(అన్‌ఆమ్ : 86)*

ఈ ప్రవక్తల వారసత్వం ఏ వర్గానికి లభిస్తుందో వారి కన్నా గొప్పవారు ప్రపంచంలో ఇంకెవరూ ఉండరు. ప్రవక్త ముహమ్మద్ (స) ఈ విషయమై ఇలా అన్నారు.

"ప్రవక్తల వారసులు అంటే ఏదో ఒక వర్గానికి, వంశానికి, తెగకు, లేదా ఏదో ఒక ప్రత్యేక రంగు, జాతికి చెందిన వారు కాదు. ప్రవక్తల బోధనల గురించి తెలుసుకుని వారి నైతికతను ఒంటబట్టించుకున్న వారికి ఈ వారసత్వం లభిస్తుంది"

"నిస్సందేహంగా ధర్మవేత్తలు ప్రవక్తలకు వారసులు. ప్రవక్తలు తమ వారసత్వంగా వదిలింది తమ జ్ఞానాన్నే. ఆ జ్ఞానాన్ని సంపాదించిన వారు చాలా పెద్ద సంపద పొందారు" *(ఇబ్నెమాజ)*

2. నమాజుకు ఇమామత్ చేయడం, అజాన్ ఇవ్వడం

ప్రవక్తలు భూప్రపంచంలో అందరి కన్నా ఎక్కువ ఉత్తములైతే, వారి ఆచరణలకు ప్రతిరూపం నమాజు. అలాంటి నమాజుకు నాయకత్వం వహించే సౌభాగ్యం లభించిన వ్యక్తికి నిస్సందేహంగా ప్రవక్తల వారసత్వం లభించినట్లే. నమాజుకు సంబంధించి ఇస్లాం ప్రకారం మరో ప్రాముఖ్యం ఏమంటే, నమాజుకు నాయకత్వం వహించే వ్యక్తి ఇతర వ్యవహారాల్లో కూడా నాయకత్వం వహించేవాడు కాగలడు. ఐదుపూటల నమాజుకు నాయకత్వం వహించే వ్యక్తిపై ఆ సమాజ వ్యవహారాల నాయకత్వ బాధ్యత కూడా ఉంటుంది.

> "మేము గనుక వారికి భూమిపై అధికారాన్ని ప్రసాదిస్తే, వారు నమాజ్‌ను స్థాపిస్తారు. జకాత్ ఇస్తారు. మంచి చేయమని ఆజ్ఞాపిస్తారు, చెడు నుండి నిరోధిస్తారు. సకల వ్యవహారాల అంతిమ నిర్ణయం అల్లాహ్ చేతుల్లో ఉంది." *(హజ్ : 41)*

కాని నమాజుకు నాయకత్వం వహించే అర్హత ఎవరికి ఉంటుంది. ఈ అర్హత ఏదో ఒక వంశం వారికి, లేదా తెగవారికి, లేదా జాతి వారికి గుత్తసొత్తు కాదు. ధార్మికజ్ఞానం, ధార్మికవిశ్వాసం ఉన్న వారికే ఈ అర్హత ఉంది. ఈ విషయమై ప్రవక్త (స) ఇలా అన్నారు

"దైవగ్రంథం గురించిన ఎక్కువ జ్ఞానం కలిగినవాడు, దైవగ్రంథాన్ని ఎక్కువగా చదివే వాడు నమాజు నాయకత్వానికి అర్హుడు. అతను దైవగ్రంథ జ్ఞానం కలిగి ఉండి, చక్కగా చదువగలిగితే సున్నత్‌ల పరిజ్ఞానం ఎక్కువగా కలిగి ఉండాలి. సున్నత్ పరిజ్ఞానంలో అందరూ సమానంగా ఉంటే, ఇస్లామీయ వ్యవహారాల్లో అందరికన్నా ఉన్నతుడు ఈ బాధ్యత స్వీకరించాలి. ఒకరి నాయకత్వాన్ని మరొకరు తీసుకోరాదు. ఎవరు వేరొకరి ఇంటిలో ఆ ఇంటి యజమాని కూర్చునే ప్రత్యేక ఆసనంపై కూర్చోరాదు." (ముస్లిం)

అదేవిధంగా నమాజుకు ముందుమాట వంటి అజాన్ గురించి కూడా ప్రవక్త (స) వివరించారు.

"మీలో ధార్మికంగా, నైతికంగా ఉన్నతుడైన వ్యక్తి అజాన్ ఇవ్వాలి. ఖుర్ఆన్ పరిజ్ఞానంలో మీ అందరి కన్నా ఉన్నతుడైన వ్యక్తి, ఖుర్ఆన్ చక్కగా చదివే వ్యక్తి నమాజుకు ఇమామత్ చేయాలి." (అబూదావూద్)

3. ఇమామ్‌తో సామీప్యం

ఇస్లాంలో నమాజుకు నాయకత్వం వహించడానికి ఇంత ప్రాముఖ్యం ఉన్నప్పుడు, ఇమామ్‌కు దగ్గరగా నిలబడడానికి ఎంత ప్రాముఖ్యం ఉంటుందో కూడా అంచనా వేయవచ్చు. ప్రవక్త (స) ప్రకారం నమాజ్‌కు ఇమామత్ చేసే యోగ్యత ఏదో ఒక తెగ, లేదా వంశం గుత్తాధిపత్యం కాదు. అలాగే ఇమామ్‌కు దగ్గరగా నిలబడడం కూడా ఏదో ఒక వంశం లేదా తెగకు ప్రత్యేకం కాదు. జ్ఞానం, బుద్ధివివేకాలుగల వారే ఇమామ్‌కు దగ్గరగా నిలబడగలరు. వారు ఏ వంశానికి చెందినవారైనా లేక ఏ తెగకు చెందినవారైనా గాని. ఈ విషయమై ప్రవక్త (స) ప్రవచనాన్ని హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజి) ఇలా తెలిపారు.

"మీలో ధార్మిక జ్ఞానం, వివేకం ఉన్నవారే నాకు సమీపంలో ఉంటారు. వారికి దగ్గరగా ఉన్న వారు ఆ తర్వాత వస్తారు. ఈ విషయంలో వారికి కొద్దిగా తక్కువ ఉన్న వారు తర్వాత ఉంటారు. బాజారుల గందరగోళానికి, తొక్కిస లాటకు దూరంగా ఉండండి" *(ముస్లిం)*

నమాజుకు మించి మరొక సమావేశం లేదు. ఇస్లాం దృష్టిలో ఔన్నత్యం, పవిత్రత ఉన్న మరో సమావేశం ఏదీ లేదు. ఇందులో నైతిక ఔన్నత్యానికి, బుద్ధివివేకాలకు ప్రవక్త (స) ప్రాధాన్యం ఇచ్చారు. కాబట్టి ఇతర సమావేశాల్లో కూడా ఇదే ప్రాధాన్యతాక్రమం ఉంటుంది. ఈ విషయం గురించి పైన వివరించిన హదీసుకు అల్లమా నూవీ క్రింది వివరణ ఇచ్చారు.

"ఈ విధంగా చేయడమన్నది కేవలం నమాజుకు మాత్రమే పరిమితం కాదు. ప్రతి వ్యవహారంలోను జ్ఞానం, వివేకాలున్న వారు నాయకుడికి సమీపంలో ఉండడమే ప్రవక్త సంప్రదాయం. ఉదాహరణకు ధార్మిక సమావేశంలో, విద్యాపరమైన సమావేశంలో, సలహాసంప్రదింపుల సమావేశంలో, నమాజుకు నిలబడే ప్రదేశానికి సంబంధించి, నమాజు ఇమామత్, ధర్మఉపదేశాలు, హదీసు బోధనలు వగైరాల్లో జ్ఞానం, ధర్మపరాయణత, వివేకం, వయసు, వ్యక్తిగత యోగ్యతలు వగైరాల రీత్యా ఏ స్థాయిలో ఉన్నారో అందుకు అనుగుణంగా వారికి చోటు లభిస్తుంది. అనేక హదీసులు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి."

(షరహ్ నూవీ)

4. ప్రభుత్వం రాజకీయం

ఇస్లాం ఏవిధంగానైతే నమాజు నాయకత్వానికి నైతిక ఔన్నత్యాన్ని ప్రమాణంగా తీసుకుందో అదేవిధంగా ముస్లిం రాజ్య ప్రభుత్వం విషయంలోను, రాజకీయాల విషయంలోను నైతిక ఔన్నత్యాన్నే ప్రమాణంగా ప్రతిపాదిస్తుంది. ఈ విషయంలో వంశం, జాతి తదితర అంశాలకు ఎలాంటి ప్రమేయమూ లేకుండా కట్టడి చేసింది. ఈ విషయమై దివ్యఖుర్ఆన్ వివరణ ఇస్తూ ప్రభుత్వం, ప్రజాసంబంధ బాధ్యతల హోదాలు పొందే అర్హత వాటిని నిజాయితీగా నిర్వర్తించే వారికే ఉంది. దేవుని పట్ల తమ బాధ్యతలను, తోటి వారి పట్ల తమ బాధ్యతలను తెలుసుకుని నిర్వర్తించే వారికే ఈ యోగ్యత ఉంది. న్యాయం చేసే వారికే ఈ అర్హత ఉంది.

> "ముస్లిములారా! అమానతులను యోగ్యులైన వారికి అప్పగించండి. ప్రజల మధ్య తీర్పు చేసేటప్పుడు న్యాయంగా చేయండి. అని అల్లాహ్ మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాడు. అల్లాహ్ మీకు ఎంతో చక్కని హితోబోధను చేస్తున్నాడు. నిశ్చయంగా ఆయన అన్నీ వింటాడు. అన్నీ చూస్తాడు." *(నిసా : 58)*

ఇదేవిధంగా మరో చోట దివ్యఖుర్ఆన్ పదవి హోదాలు పొందే అర్హత విషయమై హేతుబద్ధ ఆలోచన, విశ్లేషణ చేయగలిగిన వారికే ఈ అర్హత ఉందని పేర్కొంది.

> "వారు ఎక్కడైనా ఏదైనా సంతృప్తికరమైన వార్తగాని లేదా భయంకరమైన వార్తగాని విన్నప్పుడు దాన్ని వ్యాపింపచేస్తారు. అలాకాక వారు దానిని ప్రవక్తకు, సంఘంలోని బాధ్యతాయుతులైన తమ పెద్దలకు తెలిపి ఉంటే వారిలో, దానిని ఆధారంగా చేసుకుని సరియైన నిర్ణయం తీసుకోగలిగే సామర్థ్యం కలవారి దృష్టికి అది వచ్చి ఉండేది, మీపై గనక అల్లాహ్ అనుగ్రహం, కారుణ్యం లేకపోయినట్లయితే, (మీ బలహీనతలు ఎలాంటివంటే) మీలో ఎవరో కొద్దిమంది తప్ప, మీరందరూ షైతానును అనుసరించి ఉండేవారు." *(నిసా : 83)*

అందువల్లనే ఎవరైనా వ్యక్తి సమాజంలో తక్కువస్థాయి కలిగిన వాడైనా, ప్రభుత్వం, నాయకత్వ బాధ్యతలు నిర్వర్తించడానికి అవసరమైన నైతిక యోగ్యతలు ఉన్నట్లయితే అలాంటి వ్యక్తికి విధేయత చూపడం తప్పనిసరని ప్రవక్త ముహమ్మద్ (స) తాకీదు చేశారు.

"ప్రజలారా! దేవునికి భయపడండి. ముక్కు తెగిన నల్ల నీగ్రో మీకు నాయకుడిగా నియమించబడినా అతడి మాట వినండి. విధేయత చూపండి. అతను దైవగ్రంధానికి కట్టుబడి ఉన్నంత కాలం విధేయత చూపండి" (తిర్మిజి)

5. సాక్ష్యం

ఇతర జీవనరంగాల్లో కూడా ఇస్లాం ఈ నైతిక ఔన్నత్యాన్ని మార్గదర్శక సూత్రంగా ప్రతిపాదిస్తుంది. మానవ జీవితంలో సాక్ష్యమివ్వడానికి చాలా ప్రాముఖ్యం ఉంది. ఈ విషయం అందరికి తెలుసు. సాక్ష్యం ఉండడం వల్ల లేక సాక్ష్యం లేకపోవడం వల్ల కొందరు తమ హక్కులను పొందడం లేక కోల్పోవడం జరుగుతుంది. అందువల్లనే ఖుర్‌ఆన్ న్యాయం, ధర్మం ప్రకారం సాక్ష్యం ఇవ్వాలని ఆదేశిస్తుంది.

> "విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు అవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సరిసమానమైనది. అల్లాహ్‌కు భయపడుతూ వ్యవహరించండి. మీరు చేసేదంతా అల్లాహ్‌కు పూర్తిగా తెలుసు." *(మాయిద : 8)*

అబద్ధపు సాక్ష్యమివ్వడాన్ని ప్రవక్త (స) కఠినంగా నిరోధించారు. ఇది మహాపాపంగా పేర్కొన్నారు. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ బక్ర్ తన తండ్రిగారు చెప్పిన మాటలను ఇలా పేర్కొన్నారు. ప్రవక్త (స) ప్రవచనాన్ని వారి తండ్రిగారు ఈ మాటల్లో చెప్పారు.

"అన్నింటికన్నా పెద్దపాపమేమిటో మీకు చెప్పనా, (ఈ మాట ఆయన మూడు సార్లు పలికారు), ప్రజలు ఈ మాటలు విని "దైవ ప్రవక్తా! చెప్పండి" అన్నారు. ప్రవక్త "దేవునికి సాటి కల్పించడం, తల్లిదండ్రుల పట్ల అవిధేయత చూపడం" అంటూ ఆయన కూర్చున్నారు.. తర్వాత ఆయన మళ్ళీ చెబుతూ "వినండి, మూడోవిషయం (సాక్ష్యంలో) అబద్ధం చెప్పడం." ఈ మాటను ఆయన పదే పదే చెప్పారు."

ఇదేవిధంగా హజ్రత్ అనస్ ఉటంకం కూడా ఉంది. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు – "దేవునికి సాటి కల్పించడం, తల్లిదండ్రులకు అవిధేయత చూపడం, మనిషిని హత్యచేయడం, అబద్ధపు సాక్ష్యం చెప్పడం" (బుఖారి)

అలాగే సాక్ష్యం చెప్పే హక్కు ఏదో ఒక వంశానికి లేదా తెగకు ప్రత్యేకమైనది కాదు. లేదా ఏదో ఒక వర్ణం వారికి లేదా జాతి వారికి ప్రత్యేకం కాదు. ఏదో ఒక ప్రాంతం వారికి ప్రత్యేకం కాదు. న్యాయం చేసే నైతిక లక్షణం ఉన్న వారికి మాత్రమే ఈ హక్కు ఉంది. దివ్యఖుర్‌ఆన్‌లో సాక్ష్యం గురించిన ప్రస్తావన వచ్చిన ప్రతి సందర్భంలోను న్యాయానికి సంబంధించిన నైతిక లక్షణాన్ని జోడించి చెప్పింది

"విశ్వాసులారా! మీలో ఎవరికైనా మరణ సమయం ఆసన్నమై అతడు వీలునామా వ్రాయిస్తున్నప్పుడు, దాని సాక్ష్యానికి అనుసరించవలసిన పద్ధతి ఏమిటంటే, మీలో న్యాయవర్తనులైన ఇద్దరు వ్యక్తులు సాక్షులుగా చెయ్యబడాలి." (మాయిద : 106)

"వారి నిర్ణీత గడువు కాలం ముగిసినప్పుడు, వారిని ఉత్తమమైన రీతిలో (మీ వివాహ బంధంలో) ఆపి ఉంచండి లేదా ఉత్తమమైన రీతిలో వారి నుంచి విడిపోండి. మీలో న్యాయశీలురైన ఇద్దరు వ్యక్తులను సాక్షులుగా పెట్టుకోండి. (ఓ సాక్షులారా) అల్లాహ్ కొరకు ఉన్నది ఉన్నట్లుగా సాక్ష్యం చెప్పండి." (తలాఖ్ : 2)

"రుణం తీసుకునే వ్యక్తి అమాయకుడు లేక బలహీనుడు లేక చెప్పి వ్రాయించలేని అసమర్థుడు అయితే, అతని సంరక్షకుడు న్యాయంగా చెప్పి వ్రాయించాలి. ఇంకా మీరు మీలోని ఇద్దరు పురుషులను దానికి సాక్షులుగా పెట్టుకోవాలి. ఇద్దరు పురుషులు లభించని పక్షంలో, ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు సాక్షులుగా ఉండాలి. ఎందుకంటే వారిలో ఒకామె మరిచిపోతే, రెండవ స్త్రీ ఆమెకు జ్ఞాపకం చేస్తుంది." *(బఖర : 282)*

అందుకే ఈ నైతిక లక్షణాలకు విరుద్ధంగా ఎవరైనా అనైతిక చేష్టల్లో మునిగినవాడైతే అలాంటి వ్యక్తి సాక్ష్యం ఇవ్వడానికి అనర్హుడిగా ఇస్లాం పరిగణిస్తుంది. ఆ వ్యక్తి ఎంత పెద్ద వంశానికి చెందినవాడైనా గాని, ఎంత గొప్ప జాతికి చెందినవాడైనా గాని. ఈ విషయమై ఖుర్ఆన్ స్పష్టంగా ఇలా చెప్పింది.

"ఎవరైనా శీలవతులైన స్త్రీలపై నిందమోపి తరువాత నలుగురు సాక్షులను తీసుకురాకపోతే, వారిని ఎనభై కొరడా దెబ్బలు కొట్టండి, వారి సాక్ష్యాన్ని ఇక ఎన్నడూ అంగీకరించకండి. వారే దుర్మార్గులు." (నూర్ : 4)

ప్రవక్త (స) కూడా ఇలాంటి వ్యక్తులు సాక్ష్యం ఇవ్వడానికి అనర్హులని పేర్కొన్నారు. వారు ఏ వంశానికి, ఏ తెగ, జాతికి చెందినవారైనా అనర్హులే. హజ్రత్ ఉమ్రూ బిన్ షుఐబ్ (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు

"అపహరణలకు (మనుష్యుల) పాల్పడే పురుషుడు, స్త్రీ, వ్యభిచారి అయిన పురుషుడు, స్త్రీ, అలాగే తన సోదరుడి పట్ల తన మనసులో స్పర్ధ ఉన్న వ్యక్తి సాక్ష్యం ఇవ్వడం సమ్మతం కాదు" (అబూదావూద్)

6. వివాహం

మనిషి జీవితంలో వివాహానికి ఎంత ప్రాముఖ్యం ఉందో అందరికీ తెలుసు. మనిషి ఇహపరలోకాల సాఫల్యానికి వివాహం కారణమవుతుంది. వివాహంలో వైఫల్యం అన్నింటా వైఫల్యం అవుతుంది. అంతేకాదు వివాహం విషయంలో జాతి, కులం, వంశం వగైరాలకు ఎల్లప్పుడు ప్రాముఖ్యం ఉంటుంది. ఇస్లామీయ వ్యవస్థలో ఈ విషయంలో కూడా నైతికప్రమాణాలకు అధిక ప్రాముఖ్యం ఇచ్చింది. వివాహంలో ఇస్లాం ధార్మికవిశ్వాసం, ధర్మాచరణలకే ప్రాముఖ్యం ఇచ్చింది. సాంఘీక హోదాకు సంబంధించిన అంశాలకు ఇస్లాం ప్రాముఖ్యం ఇవ్వదు. ఈ విషయమై దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొంది.

"..మీలో ఎవరు వివాహం లేకుండా ఒంటరిగా ఉంటున్నారో, మీ స్త్రీపురుష బానిసలలో ఎవరు గుణవంతులో, వారి వివాహాలు చేసివేయండి. వారు గనక పేదవారయితే, అల్లాహ్ తన అనుగ్రహంతో వారిని సంపన్నులుగా చేస్తాడు. అల్లాహ్ అంతులేని వనరులు కలవాడు. సర్వమూ తెలిసినవాడు." *(నూర్ : 32)*

ధార్మికవిశ్వాసం ఆచరణలు కలిగిన ఒక దాసిని వివాహమాడడం ఈ సద్గుణాలు లేని సాంఘీక హోదా ఉన్న యువతిని వివాహమాడడం కన్నా మేలని నిర్ధారించింది.

"ముష్రిక్కు మహిళలు విశ్వసించనంత వరకు మీరు వారిని ఎట్టి పరిస్థితిలోను వివాహమాడరాదు. ముష్రిక్కు కులీన స్త్రీ మీకు ఎంత నచ్చినా, ఆమె కంటే విశ్వాసు రాలైన ఒక బానిస స్త్రీ మేలు. (అదేవిధంగా) ముష్రిక్కు పురుషులు విశ్వాసులు కానంతవరకు మీరు మీ మహిళలను వారికిచ్చి ఎన్నటికీ వివాహం చెయ్యకూడదు. ముష్రిక్కు కులీనుడు మీకు ఎంత నచ్చినా, అతడికంటే విశ్వాసి అయిన ఒక బానిస ఎంతో మేలు. ఈ ముష్రిక్కులు మిమ్మల్ని అగ్ని వైపునకు ఆహ్వానిస్తారు. కాని అల్లాహ్ తన అనుజ్ఞతో మిమ్మల్ని స్వర్గం వైపునకూ క్షమాభిక్షవైపునకూ రమ్మని పిలుస్తాడు. గుణపాఠం గ్రహించి హితబోధను స్వీకరిస్తారని ప్రజలకు అల్లాహ్ తన ఆజ్ఞలను స్పష్టంగా తెలుపుతాడు." *(బఖర : 221)*

ఇదేవిధంగా దివ్యఖుర్ఆన్ ప్రవక్త ముహమ్మద్ (స) పవిత్రపత్నులను సంబోధిస్తూ మంచి భార్యల లక్షణాలను పేర్కొంది. ఈ లక్షణాలు కూడా ధార్మిక విశ్వాసం, ధర్మాచరణ లకు సంబంధించినవే.

"ఒకవేళ ప్రవక్త మీ అందరికీ విడాకులిస్తే, అల్లాహ్ మీకు బదులుగా ఆయనకు మీ కంటే మంచి భార్యలను ప్రసాదిస్తాడు. వారు నిజమైన ముస్లిములుగా, విశ్వాసం

కలవారిగా విధేయత చూపేవారుగా, పశ్చాత్తాపపడేవారుగా, ఆరాధన చేసేవారుగా, ఉపవాసం పాటించే వారుగా ఉంటారు. వారు భర్తృవిహీనులైనా లేదా కన్యలైనా కావచ్చు." *(తహ్రీమ్ : 5)*

ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచనాల్లో కూడా వివాహసంబంధం కుదుర్చుకుంటున్నప్పుడు ధార్మిక, నైతిక లక్షణాలకే ప్రాముఖ్యం ఇవ్వడం జరిగింది. ఆయన ఇలా అన్నారు.

"స్త్రీని వివాహమాడడం నాలుగు ప్రాతిపదికలపై జరుగుతుంది. ఆమె సంపద కారణంగా, ఆమె వంశం కారణంగా, ఆమె అందం కారణంగా, ఆమె ధర్మపరాయణత కారణంగా. మీరు ధర్మపరాయణురాలైన స్త్రీని వివాహమాడడానికి ప్రయత్నించండి. అల్లాహ్ మిమ్మల్ని మీ కాళ్ళపై నిలబడేలా చేస్తాడు." (బుఖారి)

ఎలాంటి భార్యను ఎన్నుకోవాలన్నది ప్రవక్త (స) చెప్పినట్లే, ఎలాంటి భర్తను ఎన్నుకోవాలన్న విషయంలో కూడా ఆయన ఈ విధంగా తాకీదు చేశారు. హజ్రత్ అబూ హురైరా (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త (స) ఇలా అన్నారు.

"మీవద్దకు వివాహ సంబంధం కోసం ఎవరన్నా వస్తే. ఆ వ్యక్తి ధర్మపరాయణత, నైతికత మీకు సమ్మతమైతే వివాహం జరిపించండి. మీరు అలా చేయకపోతే భూమిపై కల్లోలానికి దారితీస్తుంది. పెద్ద ఉపద్రవంగా మారవచ్చు." (ఇబ్నెమాజ)

7. అంతిమ సంస్కారాలు

ఏవిధంగానైతే సంతోషసమయాల్లో ఎలా వ్యవహరించాలన్నది చెప్పారో అదే విధంగా దుఃఖ సమయాలకు సంబంధించిన బోధనలు కూడా ఉన్నాయి. సాధారణంగా ప్రపంచంలో అసమానతకు, చిన్నచూపుకు గురైన వారు మరణించిన తర్వాత కూడా ఈ అనైతిక వ్యవహారశైలికి బలవుతూనే ఉంటారు. అందుకే అంటరానివారి స్మశానాలు కూడా వేరుగా ఉంటాయి. ఆ విధంగా మరణించిన తర్వాత కూడా వారి సాంఘీక హోద నిమ్న స్థాయిలోనే ఉంటుంది. ఈ విషయంలో కూడా ఇస్లామ్ ఈ అజ్ఞానకాలపు దురహంకారాలను పెకలించివేసింది. ధార్మిక, నైతిక ఔన్నత్యానికే పెద్దపీట వేసింది. హజ్రత్ హిష్షామ్ బిన్ ఆమిర్ ఉటంకం ప్రకారం ఉహుద్ యుద్ధంలో చాలామంది మరణించిన వార్త ప్రవక్త ముహమ్మద్ (స) వద్దకు చేరినప్పుడు ఆయన మాట్లాడుతూ ఇలా అన్నారు.

"సమాధులు తవ్వండి. విశాలంగా తవ్వండి. బాగా తవ్వండి. ఒకే సమాధిలో ఇద్దరు, ముగ్గుర్ని సమాధి చేయండి. వారిలో దివ్యఖుర్ఆన్ జ్ఞానం ఎక్కువ ఉన్నవారిని ముందు వరుసలో ఉంచండి. (ఉటంకించిన సహచరులు ఇంకా ఇలా చెప్పారు).. నా తండ్రి

మరణించినప్పుడు వారిని ఇద్దరు వ్యక్తుల కన్నా ముందు ఉంచారు. (ఎందుకంటే ఆయన దివ్యఖుర్ఆన్ జ్ఞానంలో వారికన్నా ఎక్కువ)" (తిర్మిజి)

8. సామాజిక సంబంధాలు

ఇంతేకాదు, సామాజిక సంబంధాల విషయంలో కూడా ధార్మిక, నైతిక గుణగణాలకే ఔన్నత్యం ప్రసాదించింది. ఈ విషయమై ప్రవక్త ముహమ్మద్ (స) తమకు దగ్గరి తెగతో కూడా తనకు ఎలాంటి మైత్రి, సాన్నిహిత్యాలు లేవని, దైవభీతి, నైతిక, ధార్మిక సద్గుణాలు కలవారితోనే తన మైత్రి సాన్నిహిత్యా లున్నాయని చెప్పారు. హ్రజత్ ఉమ్రూ బిన్ ఆస్ (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా చెప్పారు

"ఫలానా వంశం వారితో నాకేమీ మైత్రి లేదు. నా మిత్రుడు దేవుడు, ధర్మపరాయ ణులైన వారు మాత్రమే. వారితో నాకు సన్నిహిత సంబంధం ఉంది. వారి మైత్రిని నేను కాపాడుకుంటాను" (బుఖారి)

ఇది కేవలం ప్రవక్త (స) వ్యక్తిగత విషయం కాదు. సాధారణ ముస్లిములు కూడా ఇదే వైఖరి కలిగి ఉండాలని ఆయన తాకీదు చేశారు. దైవభీతి ధర్మపరాయణత ఉన్నవారి తోనే ముస్లిములు మైత్రిసంబంధాలు పెట్టుకోవాలని ఆయన తాకీదు చేశారు. జాతి, వర్గం, వర్ణం, వంశం వంటి అంశాల ఆధారంగా మైత్రి సంబంధాలు ఉండరాదని హెచ్చరించారు. హ్రజత్ అబూసయీద్ (రజి) ఈ విషయమై ప్రవక్త ప్రవచనాన్ని ఇలా తెలిపారు.

"ధార్మిక విశ్వాసం కలవారిని తప్ప మరెవ్వరిని మీకు మిత్రులుగా చేసుకోవద్దు. దైవభీతి కలవారిని తప్ప మరెవ్వరినీ భోజనపీఠం వద్దకు రానివ్వవద్దు" (తిర్మిజి)

ప్రతి వర్గంతోను మంచి వ్యవహారశైలి

అసమానతల ప్రేరణలను, కారణాలను అన్నింటిని నిర్మూలించి రాజు పేద ఇద్దరిని ఒకే పంక్తిన నిలబెట్టడంలో ఇస్లాం సాధించిన విజయం సాటిలేనిది. కాని ఇస్లాం దీంతో మాత్రమే సరిపెట్టుకోలేదు. ప్రపంచంలో ప్రతి ఒక్కరితోను మంచి వ్యవహారశైలి కలిగి ఉండాలని బోధించింది. ప్రతి వర్గం వారికి సమాన గౌరవమర్యాదలు లభించాలని తాకీదు చేసింది.

1. మహిళలు

మానవ సమాజాల్లో మహిళలపై ఎల్లప్పుడు దౌర్జన్యాలు జరుగుతూనే వస్తున్నాయి. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు స్త్రీని చిన్నచూపు చూడడం జరుగుతూనే ఉంది.

1. మౌలానా జలాలుద్దీన్ అన్సర్ ఉమ్రీగారి పుస్తకం ఔరత్ - ఇస్లామీ మాషిరెమేం ఉస్కా ముఖామ్ చదవండి.

ఇస్లాం స్త్రీలకు గౌరవోన్నతులు ప్రసాదించింది. స్త్రీల పట్ల మంచి వ్యవహారశైలి కలిగి ఉండాలని బోధించింది. స్త్రీపురుషుల మధ్య ప్రేమాభి మానాల సంబంధాలు ఉండాలని పేర్కొంది.

"ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే, ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు. – మీరు వారి వద్ద శాంతిని పొందడానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్నీ సృజించాడు. నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలున్నాయి." (రూమ్: 21)

అంతేకాదు, స్త్రీల పట్ల మంచి వ్యవహారశైలి కలిగి ఉండాలని తాకీదు చేసింది. అల్లాహ్ దైవగ్రంథంలో ఇలా సెలవిచ్చాడు

"విశ్వసించిన ప్రజలారా! బలవంతంగా స్త్రీలకు వారసులు కావడం మీకు ధర్మసమ్మతం కాదు. ఇంకా, వారిని వేధించి, సాధించి మీరు వారికి ఇచ్చిన మహర్ లో కొంత భాగాన్ని కాజేసే ప్రయత్నం చేయడం కూడా ధర్మసమ్మతం కాదు. అయితే వారు గనక బాహాటంగా చెడునడతకు పాల్పడినట్లయితే, (అప్పుడు వారి పట్ల కఠినంగా ప్రవర్తించే అధికారం మీకు ఉంది.) వారితో సద్భావంతో జీవితం గడ పండి. ఒకవేళ మీకు వారు నచ్చకపోతే, బహుశా మీకు ఒక వస్తువు నచ్చకపోవచ్చు, కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టి ఉండవచ్చు." *(నిసా : 19,20)*

ప్రవక్త ముహమ్మద్ (స) కూడా మహిళల పట్ల మంచి వ్యవహారశైలి కలిగి ఉండాలని గట్టిగా చెప్పారు. హజ్రత్ అబూహురైరా (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు.

"అల్లాహ్‌పై, ప్రళయదినంపై విశ్వాసం కలిగిన వారు తమ పొరుగువారిని వేధిం చరాదు. తమ స్త్రీల పట్ల మేలైన రీతిలో వ్యవహరించాలి. ఎందుకంటే వారు పక్క టెముకతో పుట్టించబడ్డారు. పక్కటెముక పై భాగం ఎంత వంకరగా ఉంటుందో చూడండి. మీరు దాన్ని తిన్నగా చేయాలనుకుంటే దాన్ని విరిచేస్తారు. అలా విడిచిపెడితే అది వంకరగానే ఉంటుంది. అందువల్ల స్త్రీల విషయంలో మృదువైఖరితో వ్యవహరించండి." (బుఖారి)

ఇదేవిధంగా హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త (స) ఇలా అన్నారు

"తమ భార్యాపిల్లల పట్ల ఉత్తమంగా వ్యవహరించేవారు మీలో ఉత్తములు. భార్యా పిల్లల విషయంలో మీ అందరి కన్నా నేను ఉత్తముడిని." (ఇబ్నెమాజా)

హ(జత్ అబ్దుల్లా బిన్ ఉమ్రూ (రజి) ఉటంకించిన ఇతర హదీసుల ప్రకారం ప్రవక్త (స) ఇలా అన్నారు.

"తన భార్య పట్ల ఉత్తమంగా వ్యవహరించేవాడు మీలో ఉత్తముడు" (ఇబ్నెమాజ)

కేవలం సామాజిక స్థాయిలో మాత్రమే స్త్రీల పట్ల ఉత్తమ వ్యవహారశైలి గురించి బోధించడం జరగలేదు. హక్కుల విషయంలోను వారికి సమానత్వం ఉందని బోధించారు. హ(జత్ బహ్జ్ బిన్ హకీమ్ (రజి) తాతగారు మావియా ఖషీరీ (రజి) ఉటంకం ప్రకారం ఆయన ఒకసారి ప్రవక్త ముహమ్మద్ (స) వద్దకు వెళ్ళి "మా స్త్రీల గురించి మీ ఆదేశం ఏమిటి" అని ప్రశ్నించారు. అప్పుడు ప్రవక్త (స) ఇలా చెప్పారు

"మీరు తినేదే వారికి తినిపించండి. మీరు తొడిగేవే వారికి తొడి గించండి. వారిని కొట్టవద్దు, వారితో పరుషంగా మాట్లాడవద్దు" (అబూదావూద్)

చట్టపరమైన విషయాలు మాత్రమే కాదు, అన్నపానీయాల విషయంలో కూడా స్త్రీల పట్ల సమానదృష్టి ఉండాలని ఆయన బోధించారు. చివరి హజ్ ప్రసంగంలో ప్రవక్త (స) స్త్రీపురుషుల హక్కులను వివరంగా తెలియజేశారు. స్త్రీల విషయంలో ఆయన చెప్పిన మాటలు

"వినండి మీపై స్త్రీలకు ఉన్న హక్కు ఏమిటంటే, వారి పట్ల మీరు ఉత్తమోత్తమ రీతిలో వ్యవహరించాలి. వారి అన్నపానీయాలు, దుస్తుల విషయంలో." (ఇబ్నెమాజ)

2. బానిసలు

ప్రాచీన కాలంలో బానిసత్వం ఉండేది. బానిసలపై అనేక దౌర్జన్యాలు, అఘాయిత్యాలు జరిగేవి. ఒకప్పుడు బానిసలు బానిసత్వం ఉండేవి నేడు కూడా బలహీన వర్గాలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ బలహీనవర్గాల వారిపట్ల ఉత్తమ వ్యవహారశైలి కలిగి ఉండాలని ఇస్లామ్ ఆదేశించింది. తల్లిదండ్రుల పట్ల మంచి వ్యవహారశైలి, దగ్గరి బంధువుల పట్ల మంచి వ్యవహారశైలి గురించి చెప్పిన దివ్యఖుర్ఆన్ ఆ సందర్భంగా బానిసల పట్ల ఉత్తమ వ్యవహారశైలి గురించి కూడా గట్టిగా హెచ్చరించింది. ఒక ముస్లింపై ఇది పెద్ద బాధ్యతల్లో ఒకటిగా పేర్కొంది.

> "మీరంతా అల్లాహ్‌కు దాస్యం చేయండి. ఎవరినీ ఆయనకు భాగ స్వాములుగా చేయవద్దు. తల్లిదండ్రుల ఎడల సద్భావంతో మెలగండి. బంధువులూ, అనాధులూ, నిరుపేదల పట్ల మంచిగా వ్యవహరించండి. పొరుగున ఉన్న మిత్రులు, బాట సారులు, మీ అధీనంలో ఉన్న దాసదాసీజనం పట్ల ఉదారబుద్ధితో వ్యవహరించండి.

గర్వాతిశయంతో కన్నూమిన్నూ కాననివారు, తమ గొప్పతనం గురించి విర్రవీగేవారు, అంటే అల్లాహ్ ఇష్టపడడు అని గట్టిగా నమ్మండి."

(నిసా : 26)

ప్రవక్త ముహమ్మద్ (స) కూడా బానిసల హక్కుల విషయంలో గట్టిగా చెప్పారు. వారిపట్ల దౌర్జన్యంగా వ్యవహరించడాన్ని కఠినంగా నివారించారు. హజ్రత్ అబూజర్ గఫారీ (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త(స) ఇలా చెప్పారు

" వారు మీ సోదరులు, మీకు సేవకులుగా మారారు. అల్లాహ్ వారిని మీ చేతిక్రింద ఉంచాడు. సోదరుడు తన చేతిక్రింద ఉంటే అతనికి తాను స్వయంగా తినేది తినిపించాలి. తాను తొడిగేది అతనికి తొడిగించాలి. అతడు చేయలేని పని భారం అతడిపై వేయరాదు. ఒకవేళ అతడు చేయలేని పనిభారాన్ని అతడిపై వేస్తే అతడికి తాను స్వయంగా సహాయపడి చేయూత ఇవ్వాలి." (బుఖారి)

ఇదే విధంగా ప్రవక్త ముహమ్మద్ (స) బానిసల విషయంలో ఇంకా ఇలా చెప్పారు. హజ్రత్ సలామ్ బిన్ ఉమ్రూ (రజి) ఇలా ఉటంకించారు.

"మీ బానిసలు మీకు సోదరులు. వారి పట్ల మేలైన రీతిలో వ్యవహరించండి. మీరు చేయలేని పనుల్లో వారి సహాయం తీసుకోండి. వారు చేయలేని పనుల్లో మీరు వారికి సహాయం చేయండి." (బుఖారి)

బానిసల పట్ల ఉత్తమ వ్యవహారశైలికి ప్రవక్త (స) ఎంతగా ప్రాముఖ్యం ఇచ్చారో అర్థం చేసుకోవాలంటే ఒక్క ఉదాహరణ చాలు. ప్రవక్త (స) అంతిమ ఘడియల్లో కూడా స్త్రీలు, బానిసల పట్ల జాగ్రత్త అంటూ హెచ్చరించారు. హజ్రత్ అలీ (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త (స) ఈ ప్రపంచాన్ని వదిలి వెళు తున్నప్పుడు చెప్పిన చివరి మాటలు.

"నమాజ్, నమాజ్... అల్లాహ్‌కు భయపడండి. మీ అధీనంలో ఉన్న వారి విష యంలో అల్లాహ్‌కు భయపడండి (అంటే బానిసల విషయంలో)

ఈ హదీసు అబూదావూద్ సంకలనంలో ఉంది. ఇబ్నెమాజా, మస్నద్ అహ్మద్ సంకలనాల్లో ఇంకా వివరంగా ఉంది. ప్రవక్త (స) చివరి ఘడియల్లో, మాట్లాడ్డం కూడా కష్టంగా ఉన్న స్థితిలో ఆయన చెప్పిన మాటలు, ఇబ్నె మాజాలో హజ్రత్ అనస్ బిన్ మలిక్ (రజి) ఇలా ఉటంకించారు

"ప్రవక్త ముహమ్మద్ (స) అంతిమ ఘడియల్లో ఆయన చెప్పిన హితోపదేశం.. నమాజ్ విషయంలో జాగ్రత్తగా ఉండండి. మీ అధీనంలో ఉన్న వారి విషయంలో (బానిసలు) జాగ్రత్తగా ఉండండి."

మస్నద్ అహ్మద్ సంకలనంలో విశ్వాసుల మాతృమూర్తి హ(జత్ ఉమ్మె సల్మా (రజి) వద్ద ఉన్న దాసి హ(జత్ సఫీనా (రజి) ఇలా ఉటంకించారు

"నమాజ్.. నమాజ్.. మీ అధీనంలో ఉన్న వారి విషయంలో జాగ్రత్తగా ఉండండి. (అంటే బానిసల విషయంలో)" అన్నారు ప్రవక్త(స). ఈ మాటల ప్రతిధ్వని ఆయన ఛాతీలో వినిపించే వరకు ఆయన ఈ మాటలు చెబుతూ ఉన్నారు. తన నోటి కదలికలు ఆగిపోయేవరకు ఈ మాటలు చెబుతూ ఉన్నారు"

మరో హదీసులో ప్రవక్త (స) చివరి మాటలను ఈ విధంగా పేర్కొనడం జరిగింది.

"ఈ మాటలను ఆయన లోలోనే చెప్పసాగారు. నోటిమాటలు నెమ్మదిగా ఆగి పోయాయి" (మస్నద్ అహ్మద్)

3. అనాధలు, బలహీనులు

అనాధలు, బీదలు ఇతర బలహీనవర్గాల వారిని సాధారణంగా సమాజంలో చిన్నచూపు చూడడం జరుగుతుంది. వారి పక్కన కూర్చోవడాన్ని, వారితో సమానంగా వ్యవహరించడాన్ని సమ్మతించరు. ఈ అసమానతల వైఖరిని ఇస్లాం పూర్తిగా నిర్మూలించింది. అనాధలు, పేదలు ఇతర బలహీనవర్గాల వారి హక్కులు నిర్వర్తించాలని తాకీదు చేసింది. దివ్యఖుర్ఆన్ ఈ విషయంలో ఇలా పేర్కొంది.

> "బంధువుల పట్ల మీ విధులను నిర్వర్తించండి. పేదవారిపట్ల, బాటసారుల పట్ల, మీ విధులను నిర్వర్తించండి. వృధా ఖర్చు చెయ్యకండి. వృథాఖర్చు చేసేవారు షైతాను సోదరులు. షైతాను తన ప్రభువు కృతఘ్నుడు."
>
> *(బనీ ఇస్రాయీల్ : 26, 27)*

దివ్యఖుర్ఆన్ ప్రకారం మనిషి అనాధలు, బలహీనులకు సహాయ పడడం వారి కోసం తన సంపద ఖర్చు చేయడం గొప్ప పుణ్యకార్యం.

> "సత్కార్యం అంటే మీరు మీ ముఖాలను తూర్పుకో పడమరకో త్రిప్పడం కాదు. సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌ను అంతిమ దినాన్నీ, దూతలనూ, అల్లాహ్ అవతరింపచేసిన గ్రంథాన్ని, ఆయన ప్రవక్తలనూ హృదయ పూర్వకంగా విశ్వసించడం. ఇంకా అల్లాహ్‌పట్ల ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని బంధువులు కొరకూ, అనాధుల కొరకూ, నిరుపేదల కొరకూ, బాటసారుల కొరకూ, సహాయం చెయ్యండి అని అర్థించేవారి కొరకూ, ఖైదీలను విడుదల చెయ్యడానికి వ్యయ

పరచడం. ఇంకా నమాజును స్థాపించడం, జకాత్ ఇవ్వడం, వాగ్దానం చేస్తే దానిని పాలించేవారూ, కష్టకాలంలో లేమిలో, సత్యానికి అసత్యానికి మధ్య జరిగే పోరాటంలో స్థయిర్యం చూపేవారూ సత్పురుషులు. వాస్తవంగా సత్యసంధులు, అల్లాహ్ ఎడల భయభక్తులు కలవారు వీరే."

ప్రవక్త (స) కూడా తన హదీసుల్లో అనాధలు, బలహీనులకు సహాయ పడాలని తాకీదు చేశారు. అనాధల సంరక్షణ చూసేవారి విషయంలో ప్రవక్త (స) ఇలా అన్నారు

"నేను, ఆనాధకు సంరక్షకుడిగా ఉన్నవాడు స్వర్గంలో ఈ విధంగా ఉంటాము అంటూ ఆయన చూపుడు వేలు, మధ్యవేలు కలిపి చూపించారు (అంటే అంత దగ్గరగా ఉంటామని భావం)" (బుఖారి)

ఇదేవిధంగా మరో హదీసులో ముస్లిములందరిలోను ఉత్తముడు అనాధల పట్ల ఉత్తమంగా వ్యవహరించేవాడని పేర్కొన్నారు. అనాధ పట్ల అనుచితంగా వ్యవహరించబడే ఇల్లు అన్నింటికన్నా చెడ్డ ఇల్లుగా పేర్కొన్నారు. హజ్రత్ అబూహురైరా (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త (స) ఇలా అన్నారు.

"అనాధ పట్ల ఉత్తమ వ్యవహారశైలి కలిగి ఉన్న ఇల్లు ముస్లిముల్లో మంచి ఇల్లు. ఒక అనాధ పట్ల చెడు వ్యవహారశైలి ఉన్న ఇల్లు ముస్లిముల్లో చెడ్డ ఇల్లు." (ఇబ్నెమాజా)

ఇదేవిధంగా వితంతువుల సంక్షేమం పట్ల కూడా ఆయన గట్టిగా తాకీదు చేశారు. వారికి సహాయసహకారాలు అందించడం పుణ్యకార్యంగా చెప్పారు. హజ్రత్ అబూహురైరా (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు

"వితంతువుల కోసం, అవసరంలో ఉన్న వారి కోసం పనిచేసేవాడు జిహాద్ చేసేవాడితో సమానం. (అబూహురైరా ప్రకారం ఇలా కూడా అన్నారు). అలాంటి వ్యక్తి అలసట ఎరుగని ఆరాధకుడి వంటి వాడు. నిరంతరంగా ఉపవాసాలు ఉండే వ్యక్తి వంటి వాడు" (బుఖారి)

ప్రవక్త ముహమ్మద్ (స) ఎల్లప్పుడు అనాధలు, అవసరార్థులు, పేదలకు సహాయం చేయాలని చెబుతూ ఉండేవారు. హజ్రత్ అబూ దర్దా (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా చెప్పారు.

"బలహీనుల్లో నన్ను వెదకండి. మీలో ఉన్న బలహీనుల కారణంగానే మీకు ఉపాధి లభిస్తుంది. మీకు సహాయం ప్రాప్తమవుతుంది" (అబూదావూద్)

మరో హదీసులో కష్టాల్లో ఉన్నవారిని ఆదుకొండని, అలా చేయడం దేవుడి పట్ల కృతజ్ఞత చూపే ఉత్తమమైన పద్ధతని ఆయన చెప్పారు. హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు.

"ప్రతి ముస్లింకు తోటివారిపై ఖర్చు చేయవలసిన బాధ్యత ఉంది అన్నారు ప్రవక్త. "ఎవరికన్నా అలా చేసే అవకాశం లేకపోతే" అని ప్రశ్నించారు అక్కడ ఉన్నవారు. అప్పుడు ప్రవక్త "అప్పుడు ఆ వ్యక్తి తన రెండు చేతులతో కష్టపడి పనిచేసి తన కోసం సంపాదించాలి. తోటివారి కోసం ఖర్చుపెట్టాలి. (సదకా)" అన్నారు. ప్రజలు "ఎవరికన్నా అలా చేసే శక్తి కూడా లేకపోతే, ఒకవేళ అతను అలా చేయలేకపోతే" అని ప్రశ్నించారు. అప్పుడు ప్రవక్త "అప్పుడు ఆ వ్యక్తి ఎవరైనా అవసరంలో ఉన్నవారికి, కష్టాల్లో ఉన్నవారికి సహాయపడాలి." అన్నారు. ప్రజలు "ఆ పని కూడా చేయలేని స్థితిలో ఉంటే" అని ప్రశ్నించారు. అప్పుడు ప్రవక్త "మంచిని ఆజ్ఞాపించాలి. లేదా మేలును ఆదేశించాలి." అన్నారు. అప్పుడు ఒక వ్యక్తి మళ్ళీ అడుగుతూ "ఆ పని కూడా చేయలేకపోతే" అన్నాడు. అప్పుడు ప్రవక్త "ఆ వ్యక్తి చెడుకు దూరంగా ఉండాలి." అన్నారు. అంటే అది కూడా అతనికి సదకాతో సమానం అవుతుంది." *(బుఖారి)*

ఇదేవిధంగా హజ్రత్ అబూజర్ గిఫారి (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా చెప్పారు

"అన్నింటికన్నా ఉత్తమ ఆచరణ ఏది అన్న ప్రశ్నకు ప్రవక్త జవాబిస్తూ "అల్లాహ్‌పై విశ్వాసం, ఆయన మార్గంలో జిహాద్" అన్నారు. అబూజర్ తిరిగి ఇలా అడిగారు, "ఏ బానిసకు స్వేచ్ఛ ఇవ్వడం అన్నింటికన్నా ఉత్తమమైనది?" ఆయన జవాబిస్తూ, "తన యజమాని వద్ద అందరికన్నా మేలయినవాడు, అందరి కన్నా విలువైనవాడిని" అన్నారు. తిరిగి అబూజర్ ఇలా అడిగారు, "నేను అలా చేయలేకపోతే", దానికి జవాబిస్తూ ప్రవక్త "అయితే మీరు ఎవరన్నా పనిచేసుకుంటున్న వాడికి సహాయం చేయండి. లేకపోతే ఏవరన్నా అమాయకుడి పని చేసి పెట్టండి." అన్నారు. తిరిగి అబూజర్ ఇలా అడిగారు, "దైవప్రవక్తా! ఆ పని కూడా నా వల్ల కాకపోతే (ఏం చేయాలి?) అని ప్రశ్నించారు. దానికి ప్రవక్త "అప్పుడు నీ చెడుకు ప్రజలు గురికాకుండా చూసుకో" అని చెప్పారు." (ముస్లిమ్)

4. ముస్లిమేతరుల పట్ల ఉత్తమ వ్యవహారశైలి

ఉత్తమవ్యవహారశైలి విషయంలో ఇస్లాం విశ్వజనీన విధానాన్ని అవలంబించింది. కేవలం ముస్లిములకే పరిమితం చేయలేదు. ముస్లిమేతరుల పట్ల ఉత్తమవ్యవహారశైలి కలిగి ఉండాలని తాకీదు చేసింది. ఈ విషయమై దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొంది.

"ఎవరైతే ధర్మం విషయంలో మీతో యుద్ధం చేయలేదో, మిమ్మల్ని మీ ఇళ్ళ నుండి వెళ్ళగొట్టలేదో, వారి పట్ల మీరు మంచితనంతో, న్యాయంతో వ్యవహరించడాన్ని అల్లాహ్ నిరోధించడు. అల్లాహ్ న్యాయం చేసేవారిని ప్రేమిస్తాడు. ఎవరు మీతో ధర్మం విషయంలో యుద్ధం చేశారో, మిమ్మల్ని మీ ఇళ్ళ నుండి బహిష్కరించారో, మిమ్మల్ని బహిష్కరించడంలో పరస్పరం సహకరించుకున్నారో, వారితో మీరు స్నేహం చేయడాన్ని మాత్రం అల్లాహ్ వారిస్తున్నాడు. అటువంటి వారితో స్నేహం చేసేవారే దుర్మార్గులు." (ముమ్‌తహ్‌న : 8,9)

ఇంతేకాదు, ఒకవేళ యుద్ధరంగంలో ముస్లిమేతరులు బందీలుగా పట్టుబడితే అప్పుడు కూడా వారి పట్ల ఉత్తమ వ్యవహారశైలి కలిగి ఉండాలని చెప్పింది. ఈ విషయమై దివ్యఖుర్‌ఆన్ ఇలా పేర్కొంది.

> "అల్లాహ్ మీది ప్రేమతో పేదలకూ, అనాధులకూ, ఖైదీలకూ అన్నం పెట్టేవారు. (వారు వారితో ఇలా అంటారు) "మేము కేవలం అల్లాహ్ కోసమే మీకు అన్నం పెడుతున్నాము. మేము మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్ని గానీ, కృతజ్ఞతలను గానీ ఆశించడం లేదు." (దహర్ : 8,9)

ప్రవక్త ముహమ్మద్ (స) కూడా హదీసుల్లో ఉత్తమవ్యవహారశైలి విషయమై గట్టిగా చెప్పారు. ముస్లిములైనా, ముస్లిమేతరులైనా ఎవరైనా గాని వారిపట్ల ఉత్తమరీతిలో వ్యవహరించాలని తాకీదు చేశారు. వంశం, వర్ణం, ప్రాంతం వగైరాలకు అతీతంగా వ్యవహారశైలి ఉండాలన్నారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమ్రూ (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా చెప్పారు.

"కరుణించేవారిపై కరుణించేవాడు కరుణిస్తాడు. భూమిపై ఉన్నవారిపై కరుణ చూపండి. ఆకాశంలో ఉన్నవాడు మీపై కరుణిస్తాడు." (తిర్మిజి)

అదేవిధంగా మరో హదీసులో ఇలా ఉంది.

"ఇతరుల పట్ల కరుణతో వ్యవహరించని వాడిపై దేవుడు కరుణించడు" (బుఖారి)

అదేవిధంగా మరో చోట ప్రవక్త (స) పూర్తి మానవాళిని దేవుని కుటుంబంగా పేర్కొన్నారు. ప్రతి మనిషి మరో మనిషితో ఉత్తమంగా వ్యవహరించాలని అన్నారు. హజ్రత్ అనస్ (రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త (స) ఇలా చెప్పారు

"సృష్టిలో అన్ని ప్రాణులు దేవుని కుటుంబం. ఈ కుటుంబంలో అందరి పట్ల ఉత్తమంగా వ్యవహరించేవాడు దేవునికి ఇష్టమైన వాడు" (మిష్కాత్).

మరో హదీసులో ఆయన మనుష్యులందరు సోదరులని చెప్పారు. దీన్ని బట్టి తెలిసేదేమంటే, ఇస్లాం ప్రకారం ప్రతి మనిషికి మరో మనిషితో సౌభ్రాత్ర సంబంధం ఉంది. ప్రవక్త (స) మాటల్లో చెప్పాలంటే..

"మనుష్యులందరు సోదరులు" (మస్నద్ అహ్మద్)

చట్టపరమైన రక్షణలు

మానవసమాజాల్లో అసమానతలు తొలగించడానికి, సమానత్వాన్ని స్థాపించడానికి ఇస్లాం చేసిన కృషి గురించి ఇంత వరకు మనం చర్చించాము. అయితే ఇప్పటి వరకు చెప్పుకున్నదంతా బోధనలు, హెచ్చరికలు, తాకీదులకు సంబంధించినది మాత్రమే. ఇదంతా నైతిక శిక్షణకు సంబంధించినది మాత్రమే. కేవలం బోధనలతో ఇస్లాం సరిపెట్టుకోలేదు. చట్టపరమైన రక్షణలు కూడా కల్పించింది. అది కూడా జీవితంలోని ఏవో కొన్ని రంగాలకు పరిమితమైనవి కాదు, జీవనరంగాలన్నింటా విస్తరించినవి. అందువల్ల విశ్వాసాలు, ఆరాధనలు మొదలు వ్యాపారవాణిజ్యాల వరకు జీవన రంగాలన్నింటా ఇస్లాం ఈ చట్టపరమైన రక్షణలు ఏర్పరచింది. ఏ జీవిత రంగంలో కూడా వంశం, వర్ణం, తెగ, జాతి, ప్రాంతం, భాష వంటి విభేదాల ఆధారంగా వివక్షకు అవకాశం లేకుండా చేసింది.

విశ్వాసాలు

ధార్మిక విశ్వాసాలకు జీవితంలో ఎంత ప్రాముఖ్యం ఉందో అందరికి తెలుసు. మనిషి విశ్వాసాలే అతడి ఆచరణలకు ఆధారాలవుతాయి. అందువల్లనే ప్రపంచంలో కనబడే అసమానతలు, వివక్షలకు కారణాల వెనుక విశ్వాసాల పాత్ర కాదనలేనిది. అందువల్లనే ప్రాచ్యదేశాల్లో కొన్ని వర్గాలు తమ్ము తాము దేవీ దేవతల ప్రతినిధులుగా, వారసులుగా ప్రకటించుకుని మిగిలిన వారు తమ కన్నా తక్కువస్థాయి వారిగా లెక్కించారు. ఇతరులపై దౌర్జన్యాలకు పాల్పడ్డారు. తమ వంశం దేవతలకు సంబంధించినదిగా పేర్లు పెట్టుకున్నారు. కాని ఇస్లాం అందుకు అవకాశం లేకుండా చేసింది. ఇస్లామీయ విశ్వాసాల్లో జాతి, రంగు, తెగ, వంశం, వర్ణం వగైరాలకు అతీతంగా మానవులందరూ సమానులనీ ప్రకటించి సమానత్వానికి చట్టబద్ధమైన రక్షణ కల్పించింది. జీవితంలోని ఏ రంగంలో అయినా గాని ఒక మనిషి మరో మనిషిపై వివక్షకు పాల్పడే అవకాశం లేకుండా చేసింది. ఏ ఒక్క వర్గం దేవతల వారసులుగా చెప్పుకుంటూ, ఇతరులపై దౌర్జన్యాలకు దిగే అవకాశం ఇస్లామీయ విశ్వాసాల్లో ఎక్కడా లేదు.

దేవుడు

విశ్వాసాల్లో దేవుడి అస్తిత్వం అన్నది ఎంతో ముఖ్యమైనది. నిజానికి దేవుడు అన్న పదం చుట్టూ సమస్త మతవిశ్వాసాలు ప్రదక్షిణ చేస్తాయి. ఇస్లామీయ విశ్వాసాల ప్రకారం దేవుడు ఏదో ఒక జాతి, తెగ, వంశం, వర్గం, వర్ణం లేదా ప్రాంతానికి చెందినవాడు కాదు. దేవుడు మానవాళి అందరికి దేవుడు. మానవులందరికి ఒక్కడే దేవుడు. ఆ దేవుడే పూర్తి ప్రపంచానికి పోషకుడు. అందువల్లనే ఇస్లామీయ సంవిధానం దివ్యఖుర్ఆన్ ప్రారంభవచనాలే ఈ విధంగా ఉన్నాయి.

"అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు. ఆయన సకల లోకాలకు ప్రభువు."

(ఫాతిహా : 1)

దివ్యఖుర్ఆన్ మానవాళిని అంతటిని సంబోధిస్తూ అనేకసార్లు బోధనలు చేసింది. రంగు, జాతి, వర్గ భేదాలు లేకుండా మానవాళి అంతటిని సంబోధించింది.

"మానవులారా! మిమ్మల్ని, మీకు పూర్వం వారినీ సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. దీని ద్వారానే మిమ్మల్ని మీరు రక్షించుకునే అవకాశం ఉంది."

(బఖర : 21)

"మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతో మంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింప జేశాడు. ఏ దేవుని పేరు చెప్పుకుని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో, ఆ దేవునికి భయపడండి. బంధుత్వ సంబంధాలను తెంచడం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని పరికిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి." *(నిసా : 1)*

ఈ విధంగా ప్రతి మనిషికి విశ్వాసాల రీత్యా ఇస్లామీయ అత్యున్నత చట్టం.. దివ్యఖుర్ఆన్ ప్రకారం సమానత్వానికి హామీ లభించింది. ప్రతి మనిషి మరో మనిషితో సమానస్థాయిలో మాట్లాడగలడు. ఒక మనిషిగా తనకు లభించవలసిన హక్కుల గురించి ప్రశ్నించగలడు. మరో మనిషి ముందు తలవంచవలసిన అవసరం అతనికి లేదు.

ప్రవక్త

దేవుని విశ్వాసం తర్వాత ఇస్లాంలో అతి ముఖ్యమైన విశ్వాసం ప్రవక్తను విశ్వసించడం. అంటే ప్రవక్త ముహమ్మద్ (స)ను దేవుని ప్రవక్తగా విశ్వసించడం. ప్రవక్త ముహమ్మద్

(స) తర్వాత ప్రళయం వరకు మరో ప్రవక్త ఎవరు రారని విశ్వసించడం, దివ్యఖుర్ఆన్ కూడా ఈ విషయమై స్పష్టంగా ఆదేశాలు జారీ చేసింది. ప్రవక్త ముహమ్మద్ (స) యావత్తు మానవాళికి ప్రవక్తగా పంపించబడ్డారని స్పష్టం చేసింది. ఆయన ఏదో ఒక జాతికి లేదా ప్రాంతానికి కాదు పూర్తి మానవాళి కోసం ప్రవక్తగా పంపించబడ్డారు. ప్రవక్త ముహమ్మద్ (స)ను విశ్వసించిన వ్యక్తి అతను ఏ జాతికి, తెగకు చెందినవాడైనా ఆ వ్యక్తితో ప్రవక్త (స)కు ఒకేవిధమైన అనుబంధం ఉంటుంది.

"ముహమ్మద్! ఇలా ప్రకటించు : "మానవులారా! నేను మీ అందరి వైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి. ఆయన భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మృత్యువును ఇస్తాడు. కనుక విశ్వసించండి అల్లాహ్‌ను, ఆయన పంపిన నిరక్షరాస్యుడైన ప్రవక్తను – అను అల్లాహ్‌ను, ఆయన సూక్తులను విశ్వసిస్తాడు – అతనిని అనుసరించండి, మీరు సరియైన మార్గం పొందుతారు."(ఆరాఫ్ 158)

అలాగే ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవక్త పదవి ఏదో ఒక జాతికి లేదా ప్రాంతానికి పరిమితం కాదు. ఆయన ప్రవక్త పదవి పూర్తి ప్రపంచ మానవాళికి సంబంధించినది.

"(ప్రవక్తా) మేము నిన్ను సర్వమానవులకు శుభవార్తను ఇచ్చేవాడుగా, హెచ్చరిక చేసేవాడుగా నియమించి పంపాము. కాని చాలా మంది మానవులు దీనిని ఎరుగరు." (సబా: 28)

మరో సందర్భంలో ఖుర్ఆన్ ప్రవక్త ముహమ్మద్ (స) గురించి చెబుతూ ఆయన యావత్తు మానవాళికి కారుణ్యంగా అభివర్ణించింది. ఈ విషయంలో ఏ ఒక్క వర్గానికి ఎలాంటి ప్రత్యేకతా లేదు.

"మేము నిన్ను ప్రపంచ మానవులకు కారుణ్యంగా పంపాము" *(అంబియా : 1-8)*

ప్రవక్త ప్రవచనాల్లో కూడా ఈ వాస్తవాన్ని స్పష్టంగా ప్రకటించడం జరిగింది.

"నల్లవారు, తెల్లవారు అందరి కోసం నన్ను పంపించడం జరిగింది." (మస్నద్ అహ్మద్)

మరో హదీసులో ఇలా ఉంది.

"యావత్తు మానవాళి కొరకు నేను దేవుని ప్రవక్తను" (కంజల్ ఆమాల్)

ఖుర్ఆన్

ఇస్లాం విశ్వాసాల్లో పైన పేర్కొన్న రెండు ముఖ్యమైన విశ్వాసాల విషయంలో అసమానతలకు చోటు లేకుండా చేసింది. అలాగే ఇస్లాంకు సంవిధానం వంటి దివ్య ఖుర్ఆన్ విషయంలో కూడా ఇదే వైఖరి అవలంబించింది. యావత్తు ప్రపంచ మానవాళి కోసం ఖుర్ఆన్ అవతరించబడింది. వేదాల బోధనలైతే ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంటాయి. "ఎవరైనా శూద్రుడు ఉద్దేశ్యపూర్వకంగా వేదశబ్దాలను వింటే అతడి చెవుల్లో కరిగించిన లక్క వేయాలని, ఎవరైనా వేదాలను చదివితే నాలుక ఖండించాలని, ఎవరైనా వేదాలను కంఠస్థం చేస్తే అతడి శరీరాన్ని రెండు ఖండాలు చేయాలని" ఉంది.[1]

కాని ఇస్లాం మాత్రం దివ్యఖుర్ఆన్ పఠించే గ్రంథంగా పేర్కొంటోంది. అందరికీ సమానహక్కును ఇచ్చింది. స్వయంగా దివ్యఖుర్ఆన్ మాటల్లో చెప్పాలంటే..

> "పవిత్ర ఖుర్ఆను అవతరించిన నెల రమజాను నెల. మానవులందరికి (ఆ గ్రంథం) మార్గదర్శకం. రుజుమార్గం చూసే, సత్యాసత్యాలను వేరుపరిచే స్పష్టమైన ఉపదేశాలు అందులో ఉన్నాయి." *(బఖర : 185)*

అంతేకాదు, దేవుడు ప్రవక్త ముహమ్మద్ (స)కు ఆదేశిస్తూ ఈ దివ్యగ్రంథాన్ని మానవాళికి చదివి వినిపించాలని ఆదేశించాడు.

> "మేము ఈ ఖుర్ఆనును కొద్దికొద్దిగా అవతరింపజేసాము. నీవు దానిని నెమ్మది నెమ్మదిగా ప్రజలకు వినిపించాలని. మేము దానిని సందర్భాన్ని బట్టి క్రమక్రమంగా అవతరింపజేశాము." *(బనీ ఇస్రాయీల్) : 106)*

దివ్యఖుర్ఆన్ బోధనలు పూర్తి మానవాళికి సంబంధించినవన్న విషయాన్ని ఖుర్ఆన్ పదే పదే ప్రస్తావించింది. ఏ ఒక్క వర్గానికి దీనిపై గుత్తాధిపత్యం లేదని కూడా స్పష్టం చేసింది.

> "మానవులారా! మీవద్దకు మీ ప్రభువు తరపునుండి హితోపదేశం వచ్చేసింది. అది హృదయాల వ్యాధులకు స్వస్థత. దానిని స్వీకరించేవారికి అది మార్గదర్శకత్వం, కారుణ్యం." *(యూనిస్ : 57)*

ఈ విధంగా ఇస్లామ్ పూర్తి మానవాళి ఖుర్ఆన్ ద్వారా ప్రయోజనం పొందే హక్కును ప్రసాదించింది. అందుకే ఏదో ఒక ప్రత్యేక వర్గం కొరకు ఖుర్ఆన్ అవతరించలేదన్న వాస్త

1. *గౌతమ్: 4 : 12, అల్ జిహాద్ ఫిల్ ఇస్లాం నుంచి గ్రహించడమైంది, పేజి 366*

వాన్ని పదే పదే ప్రస్తావించింది. ప్రపంచంలో పూర్తి మానవాళి హితబోధ కొరకు అవతరించిందన్న విషయాన్ని స్పష్టం చేసింది.

"దూరదృష్టితో నిండి ఉన్న ఈ కాంతులు ప్రజలందరి కొరకు. నమ్మే వారికి ఇవి మార్గదర్శకత్వం, కారుణ్యమూను." *(జాసియా : 20)*

అంతేకాదు, ప్రపంచ మానవాళికి దైవబోధనలు గుర్తు చేయడానికి వచ్చిందన్న విషయాన్ని కూడా గుర్తు చేస్తోంది.

"వాస్తవానికి ఇది సకల లోకాల వారి కొరకు అవతరించిన హితోపదేశం."

(ఖలమ్ : 52)

"వాస్తవానికి ఇది సకల లోకాల వారి కొరకు అవతరించిన హితోపదేశం."

(తక్వీర్ : 27)

ఆరాధనలు

విశ్వాసాల విషయంలో ఇస్లాం ఏ విధంగా విశ్వజనీన బోధనలు చేసిందో అదేవిధంగా ఆరాధనల విషయంలోను విశ్వజనీన భావనను ప్రవేశపెట్టింది. ప్రాచీన కాలం నుంచి చాలా మతధర్మాలు ఆరాధనలు, పూజాదికాలు చేసే హక్కును కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితం చేయడం జరిగింది. వేదాల అధ్యయనం మనుస్మృతి ప్రకారం బ్రాహ్మణులకు మాత్రమే ప్రత్యేకించబడింది.

"చదవడంలో అక్షరం అక్షరం స్పష్టంగా పఠించాలి. శూద్రుల వద్ద చదువరాదు"

(4:99)

కాని ఇస్లామీయ ఆరాధనల్లో ఏ ఒక్క వర్గానికి ఎలాంటి ప్రత్యేక హక్కు అధికారాలు లేవు. ప్రపంచంలో యావత్తు మానవాళికి సమాన హక్కులు అధికారాలున్నాయి. ఈ విధంగా ఖుర్ఆన్ ప్రతి ఒక్క మనిషికి ఆరాధనల విషయంలో ధార్మిక చట్టాల పరంగా రక్షణ కల్పించింది. ఏ ఒక్క వర్గమూ ఆరాధనల హక్కును తమ గుత్తాధిపత్యంగా మార్చుకునే అవకాశం లేకుండా చేసింది. ఇతరులకు ఆరాధనల నుంచి దూరంగా ఉంచే వీలులేకుండా కట్టడి చేసింది. నమాజు విషయంలో ప్రవక్త (స) ఈ విధంగా బోధించారు.

"ఐదు నమాజులున్నాయి. మనుష్యులందరిపై అల్లాహ్ వీటిని విధిగా నిర్ణయించాడు." *(అబూదావూద్)*

ఇదే విధంగా హజ్ విషయంలోను దివ్యఖుర్ఆన్ వివరిస్తూ, మనుష్యులందరికీ హజ్

చేసే సమానహక్కు అధికారాలున్నాయని పేర్కొంది. ఏ ఒక్క వర్గానికి దీనిపై గుత్తాధిపత్యం లేదు.

> "ప్రజలపై అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమిటంటే, ఈ గృహానికి వెళ్ళే శక్తిగలవారు దాని హజ్‌ను విధిగా చేయాలి. ఈ ఆజ్ఞను పాలించడానికి తిరస్కరించేవాడు అల్లాహ్‌కు ప్రపంచ ప్రజల అవసరం ఎంతమాత్రం లేదు అని స్పష్టంగా తెలుసుకోవాలి." *(ఆలి ఇమ్రాన్ : 97)*

ఆరాధనల కేంద్రం

ఆరాధనల విషయంలో మానవాళి అంతటికి ఒకే హక్కు అధికారాలు ప్రసాదించిన ఇస్లాం, ఆరాధనల కేంద్రం వంటి కాబాగృహం విషయంలోను అక్కడి వెళ్ళే అధికారాన్ని, హక్కును అందరికి సమానంగా ప్రసాదించింది. అక్కడికి వెళ్ళి ధార్మిక ప్రయోజనాలు పొందే అధికారం అందరికి సమానంగా ఉంది. ప్రాచీన కాలం నుంచి వివిధ మతధర్మాలు కొన్ని వర్గాలను ఆరాధనల కేంద్రాల నుంచి దూరంగా ఉంచడం మనం చూస్తాం. నేటి ఆధునిక కాలంలోను దళితులకు ఆలయప్రవేశం లభించని ఉదాహరణలు అనేకం ఉన్నాయి. అందువల్ల వారు తమకోసం ప్రత్యేకంగా మందిరాలు నిర్మించుకోవలసి కూడా వచ్చింది. క్రయిస్తవం సమానత్వానికి సంబంధించి అనేక మాటలు చెప్పినప్పటికీ ఈ విషయంలో వెనుకబడి ఉంది. దక్షిణాఫ్రికాలో నల్లవారి విద్యాసంస్థలు, ఆరాధనాస్థలాలు, తిరిగేదారులు అన్నీ వేరు వేరుగా ఉంచిన చరిత్ర మనముందుంది. తెల్లవారితో కలిసి ఒకే చర్చిలో నల్లవారు ధార్మిక విధులు నిర్వర్తించడం సాధ్యం కాని పరిస్థితి మనకు తెలుసు.

కాని ఇస్లాంలో ఇలాంటి పరిస్థితి లేదు. ఇస్లాంలోని ధార్మిక కేంద్రం వద్దకు ఎవరైనా వెళ్ళవచ్చు. ఏ ఒక్క వర్గానికి ప్రత్యేక హక్కు లేదు. దైవగృహం పూర్తి మానవాళి కొరకు నిర్మించబడిందని ఇస్లాం స్పష్టం చేసింది.

> "ప్రప్రథమంగా మానవుల కొరకు నిర్మించబడిన ఆరాధనాగృహం నిస్సందేహంగా మక్కాలో ఉన్నదే. దానికి సకల శుభాలు ప్రసాదించబడ్డాయి. విశ్వ ప్రజలందరికీ అది మార్గదర్శక కేంద్రంగా రూపొందించబడింది. దానిలో స్పష్టమైన సూచనలు ఉన్నాయి. ఇబ్రాహీము ప్రార్థనా స్థలం ఉన్నది. దానిలో ప్రవేశించేవాడు రక్షణ పొందుతాడు." *(ఆలి ఇమ్రాన్ : 96,97)*

ఖుర్‌ఆన్ మరోచోట కూడా ఈ విషయాన్ని ప్రస్తావించింది. దేవుని గృహం ద్వారాలు మానవాళి అందరి కొరకు తెరిచి ఉండాలని పేర్కొంది. ఈ విషయంలో తన పర భేదాలు,

దేశవిదేశ తారతమ్యాలకు అవకాశం లేదు. అలాంటి వివక్ష చూపేవారికి తీవ్ర శిక్ష తప్పదని ఖుర్‌ఆన్ హెచ్చరించింది.

"ఎవరు తిరస్కరించారో, ఇంకా (ఈనాడు) అల్లాహ్ మార్గం వైపునకు రాకుండా (ప్రజలను) అడ్డగిస్తున్నారో, – మేము సర్వమానవుల కొరకు నిర్మించిన పరిశుద్ధ మస్జిదులో స్థానిక ప్రజల యొక్క మరియు బయట నుండి వచ్చే వారి యొక్క హక్కులు సరిసమానంగా ఉన్నాయి – దాని సందర్శనానికి అవరోధంగా ఉన్నారో, (వారి వైఖరి నిశ్చయముగా శిక్షార్హనదే). దీని (పరిశుద్ధ మస్జిదు)లో, నిజాయితీ నుండి వైదొలగి, అన్యాయపు పద్ధతిని అవలం బించే వాడికి మేము వ్యధాభరితమైన శిక్షను రుచి చూపిస్తాము." *(హజ్ : 25)*

ఈ వాస్తవాన్ని చరిత్ర చాటి చెబుతోంది. నేటికి కూడా హజ్ యాత్ర సందర్భంగా ఈ వాస్తవం కళ్ళకు కట్టినట్లు మనకు కనబడుతుంది. హజ్ సందర్భంగా ప్రపంచం నలుమూలల నుంచి ముస్లిములు నల్లవారు, తెల్లవారు, అరబ్బులు, అరబ్బేతరులు, ఆసియా, ఆఫ్రికావాసులు, భారత, చైనా ప్రజలు అందరూ ఒకేలా అక్కడ కనబడతారు. భుజం భుజం కలిపి దైవగృహాన్ని ప్రదక్షిణ చేస్తారు.

సామాజిక సంబంధాలు

ఇస్లాం విశ్వాసాల విషయంలో ఏ విధంగానైతే సమానత్వాన్ని స్థాపించిందో అదేవిధంగా సాంఘీక సంబంధాల విషయంలో కూడా సమానత్వాన్ని ఏర్పరచింది. ఈ విషయంలో వంశం, వర్ణం, తెగ, జాతి, ప్రాంత భేదాలు లేవు. ఏ వ్యవస్థయినా సమానత్వం వంటి ఉన్నత విలువలను స్థాపించడంలో ఎంత వరకు విజయం సాధించిందన్నది సామాజిక సంబంధాల్లో ఆ వ్యవస్థ తన పర భేదాలు ఎంత వరకు నిర్మూలించింది. ఎలాంటి సాంఘీక సంబంధాలను ప్రోత్సహిస్తోంది అన్న విషయాలు చూడవలసి ఉంటుంది. ఈ పరిశీలన ద్వారా మాత్రమే ఆ వ్యవస్థ ఎలాంటిదో మనం స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఇస్లామీయ వ్యవస్థ నిఖార్సయిన విశ్వజనీన వ్యవస్థగా మనకు ఈ పరిశీలనలో తెలుస్తుంది. అందువల్లనే దివ్యఖుర్‌ఆన్ రంగు, జాతి భేదం లేకుండా పూర్తి మానవాళిని ఉద్దేశించి బోధనలు చేసింది. విశ్వాసం, ధర్మాచరణల సంబంధం తప్ప మిగిలిన సంబంధాలను ఇస్లాం ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. ప్రపంచంలో ఉన్న ముస్లిములందరూ సోదరులుగా పేర్కొంది. పూర్తి ముస్లిమ్ సమాజం ఒకే శరీరంగా అభివర్ణించింది. మనిషి ఏ వర్గానికి, ఏ తెగకు, ఏ జాతికి చెందినవాడన్నది ఇక్కడ అప్రస్తుతం. ఈ విషయమై దివ్యఖుర్‌ఆన్ బోధనలు స్పష్టంగా ఉన్నాయి.

"విశ్వాసులు పరస్పరం అన్నదమ్ములు. కనుక మీ సోదరుల మధ్య సంబంధాలను సంస్కరించండి. అల్లాహ్‌కు భయపండి, మీపై దయచూపడం జరగొచ్చు."

(హుజురాత్ : 10)

ప్రవక్త (స) కూడా హదీసుల్లో ముస్లిములను సోదరులుగా పేర్కొన్నారు. ఒకరి కష్టసుఖాల్లో మరొకరు పాలు పంచుకోవాలని హితవు గరిపారు.

"ముస్లిం మరొక ముస్లింకు సోదరుడు. అతడిపై దౌర్జన్యం చేయడు. అతడిని వదిలేయడు. తన తోటివాడి అవసరానికి ఉపయోగపడేవాడి అవసరానికి అల్లాహ్ ఉపయోగపడతాడు. తోటివాడి కష్టాన్ని దూరం చేసేవాడికి ప్రళయదినం కష్టాలను అల్లాహ్ తగ్గిస్తాడు. తోటివాడికి దుస్తులిచ్చినవాడికి అల్లాహ్ ప్రళయదినాన దుస్తులిస్తాడు."

(ముస్లిం)

ఒక్కసారి మనుస్మృతి బోధనలతో పోల్చి చూడండి.

"శూద్రబాలికను తన మంచంపై కూర్చుండబెట్టిన బ్రాహ్మణుడు నరకానికి పోతాడు"

(3:17)

అంతేకాదు,

"బ్రాహ్మణుడు తెలియక శూద్రుని అన్నం తింటే మూడు రోజుల ఉపవాసం చేయాలి. ఒకవేళ తెలిసి తింటే దానికి పరిహారం, రుతుస్రావం, మలమూత్రాలు తినడానికి చేయవలసిన పరిహారంతో సమానం" *(4:222)*

కాని ఇస్లాం ధర్మంలో అందరూ సమానులే. ముస్లిములందరూ ఒకే శరీరంగా ఇస్లాం భావిస్తుంది. ఇక్కడ ప్రతి ఒక్కరు ఇతరుల కష్టనష్టాలను తన స్వంత కష్టనష్టాలుగా భావిస్తాడు. హజ్రత్ నూమాన్ బిన్ బషీర్ (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా తెలియజేశారు.

"ఒకరిపట్ల ఒకరు ప్రేమాభిమానాలు కలిగి ఉండడం, ఒకరి కష్టాలను మరొకరు పంచుకోవడం, ఒకరికొకరు సహాయపడడంలో ముస్లిములు ఒకే శరీరం వంటివారు. శరీరంలో ఒక భాగం బాధకు లోనయితే పూర్తి శరీరం ఆ బాధను అనుభవిస్తుంది. జ్వరానికి, నిద్రారాహిత్యానికి గురవుతుంది." *(ముస్లిం)*

ఇతర హదీసుల్లో ప్రవక్త బోధనలు ఇలా ఉన్నాయి.

"ముస్లిములందరూ ఒకే శరీరం వంటివారు. కంటికి బాధకలిగితే పూర్తి శరీరం

ఆ బాధను అనుభవిస్తుంది. తలకు ఏదన్నా బాధ ఉంటే పూర్తి శరీరం ఆ బాధను పంచుకుంటుంది." *(ముస్లిం)*

ఇంకా –

"ముస్లిం మరో ముస్లింకు అద్దం వంటివాడు, ముస్లిం మరో ముస్లిముకు సోదరుడు. అతడిని నష్టం నుంచి కాపాడుతాడు. ఎల్లప్పుడు అతడికి మద్దతుగా నిలబడతాడు."

(అబూదావూద్)

"ముస్లిములు ఒక భవనం వంటి వారు. దానిలో ఒక భాగం మరొక భాగాన్ని పటిష్టంగా ఉంచుతుంది." *(బుఖారి)*

ఇదేవిధంగా హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త (స) ఇలా అన్నారు.

"ముస్లిములారా ఒకరిపై ఒకరు ఈర్ష్య కలిగి ఉండవద్దు. ఒకరిపై ఒకరు స్పర్ధ కలిగి ఉండవద్దు. ఒకరిపట్ల ఒకరు వైముఖ్యం కలిగి ఉండవద్దు. అల్లాహ్ దాసులుగా మారిపోండి. ఒకరికొకరు సోదరులుగా మారండి. తన తోటి ముస్లిమును మూడు రోజుల కన్నా ఎక్కువ రోజులు (మాట్లాడకుండా) వదిలేయడం సమ్మతం కాదు." *(అబూదావూద్)*

దివ్యఖుర్ఆన్, హదీసు బోధనల వల్ల తెలుస్తున్నదేమంటే, ప్రతి ముస్లిం సమాజంలో సమానగౌరవ మర్యాదలకు అర్హుడు. అందుకు కావలసిన ధార్మికమైన ఆదేశాలు ఇస్లాం జారీ చేసింది. నిజం చెప్పాలంటే ఇస్లామీయ సమాజాల్లో అసమానతలన్న సమస్య నేటి వరకు ఎన్నడూ ఉనికిలోకి రాలేదు. అసమానతలకు గురైన వారు కోర్టుకెక్కి న్యాయపరమైన రక్షణ కోరవలసిన అవసరం ఈ సమాజంలోని వారెవ్వరికి కలుగలేదు. ముస్లిముల చరిత్ర గమనిస్తే సమానత్వం, సోదరభావం వంటి విలువలు సర్వసాధారణంగా కనబడతాయి. ఈ వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉందంటే ఇందులోకి అసమానతల జాఢ్యం ప్రవేశించే అవకాశమే లేదు. ఒకవేళ ప్రవేశించినా ఆ జాఢ్యం ఇక్కడ బతకడం కష్టం.

పౌరహక్కులు

సామాజిక స్థాయిలో ఇస్లాం ఏవిధంగా ముస్లిములందరికి సమాన గౌరవమర్యాదలు ప్రసాదించిందో అదేవిధంగా పౌర హక్కులు కూడా ఎలాంటి వర్గ, వర్ణ, జాతి, ప్రాంత భేదాలు లేకుండా ప్రసాదించింది. ఈ హక్కులకు సంబంధించి ఆదేశాలను క్రింద ఇస్తున్నాము.

1. ప్రాణం

మనిషికి అత్యంత విలువైనది ప్రాణం. బొందిలో ప్రాణం ఉంటేనే మనిషి ఏ పనయినా చేయగలడు.

అందువల్లనే పౌరహక్కుల్లో జీవించే హక్కుకు ఎంతైనా ప్రాముఖ్యం ఉంది. ఇస్లాం మానవుల ప్రాణాన్ని అత్యంత విలువైనదిగా భావిస్తుంది. ఒకరి ప్రాణాలు తీయడాన్ని తీవ్రంగా ఖండిస్తుంది. ఈ విషయమై దేవుడు దివ్యగ్రంథంలో ఇలా సెలవిచ్చాడు.

> "ఏ ప్రాణాన్ని హతమార్చకండి, న్యాయంగా తప్ప. దానిని హతమార్చడాన్ని అల్లాహ్ నిషేధించాడు. అన్యాయంగా హత్య చెయ్యబడిన వ్యక్తి వారసునికి మేము "ఖిసాస్" కోరే హక్కును ప్రసాదించాము. కాని ఆ వారసుడు హత్యలో హద్దులు మీరకుండా ఉండాలి." *(బనీ ఇస్రాయీల్ : 33)*

> "ఈ కారణం వల్లనే ఇస్రాయీలు సంతతికి ఈ ఫర్మానాను వ్రాసి ఇచ్చాము : "హత్యకు బదులుగా గాని లేదా కల్లోలాన్ని వ్యాపింపచేసినందుకందుకు గాని కాక మరేకారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే, ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు, మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే." *(మాయిద : 32)*

ప్రవక్త (స) హదీసుల్లో కూడా ప్రాణానికి ఉన్న ఈ ప్రాముఖ్యాన్ని స్పష్టంగా చెప్పారు. ఎవరి ప్రాణాన్ని ఎవరు తీసినా అది ఒకేవిధంగా నిందార్హమైనది. ఇందులో జాతి, తెగ, వర్ణ, వర్గ వివిక్ష ఏమాత్రం లేదు. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉటంకం ప్రకారం ప్రవక్త (స) ఇలా అన్నారు.

"అల్లాహ్‌కు భాగస్వామిని కల్పించడం, ఒకరి ప్రాణాన్ని తీయడం, తల్లిదండ్రుల పట్ల అవిధేయత చూపడం, అబద్ధం చెప్పడం అంటే అబద్ధపు సాక్ష్యం ఇవ్వడం మహాపరాధాలు."(బుఖారి)

అదేవిధంగా ఒక వ్యక్తికి లభించిన ప్రాణరక్షణ హక్కు నిర్వీర్యమయ్యే మూడు పరిస్థితులను ప్రవక్త (స) తెలియజేశారు. అందులో ఒకటి ఎవరినన్నా హత్య చేయడం. హతుడు ఏ వర్గానికి, ఏ జాతికి, తెగ, ప్రాంతానికి చెందినవాడైనప్పటికీ హంతకుడు జీవించే హక్కును కోల్పోతాడు.

"అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని, నేను అల్లాహ్ ప్రవక్తనని ప్రకటించిన వ్యక్తిని హత్య చేయడం నిషిద్ధం. మూడు సందర్భాలలో తప్ప. అవి: ప్రాణానికి బదులు

ప్రాణం, వ్యభిచారానికి పాల్పడిన వివాహితుడు, తన ధర్మం నుంచి భ్రష్టుడైనవాడు. తన సమాజాన్ని వదిలేసినవాడు." *(బుఖారి)*

2. సంపద

మానవజీవితంలో సంపదకు ఉన్న ప్రాముఖ్యం ప్రతి ఒక్కరికి తెలుసు. మానవజీవితంలో ప్రగతీ వికాసాల రథం నడిచేది సంపదతోనే. ఇస్లాం మనిషి ప్రాణానికి ఎలా రక్షణ కల్పించిందో, అతడి సంపదకు కూడా అదే రక్షణ ప్రసాదించింది. ఇతరుల సంపదను కబళించడాన్ని తీవ్రంగా నిషేధించింది. ఈ విషయమై ఖుర్‌అన్ ఆదేశాలు చూడండి.

"మీలో మీరు ఒకరి ఆస్తిని మరొకరు అన్యాయంగా కబళించకండి. బుద్ధి పూర్వకంగా, అక్రమమైనరీతిలో ఇతరుల ఆస్తిలో కొంతభాగం కాజేసే అవకాశం లభిస్తుందేమో అనే దురుద్దేశ్యంతో దానిని న్యాయనిర్ణేతల వద్దకు తీసుకుపోకండి." *(బఖర : 188)*

ఇదేవిధంగా సూరా నిసాలో ఇలా ఉంది.

"విశ్వసించిన ప్రజలారా! ఒకరి సొమ్మును మరొకరు అధర్మంగా తినకండి. ఇచ్చి పుచ్చుకోవడం జరగవలసిందే, అయితే పరస్పర అంగీకారంతో. మిమ్మల్ని మీరు చంపుకోకండి. అల్లాహ్‌కు మీరంటే ఎంతో దయ అని నమ్మండి. హింసా దౌర్జన్యాల ద్వారా అలా చేసేవాణ్ని మేము తప్పకుండా అగ్నిలో పడవేస్తాము. ఇది అల్లాహ్‌కు అంత కష్టమైన పని కాదు. *(నిసా : 29,30)*

ప్రవక్త ముహమ్మద్ (స) హదీసుల్లో కూడా సంపద విషయంలో ఈ వాస్తవాలు స్పష్టంగా బోధించారు.

"వినండి, ఎవరిపైనా దౌర్జన్యం చేయవద్దు. ఒక వ్యక్తి సొమ్మును అతడి ఇష్టం లేకుండా తీసుకునే యోగ్యత మరొకరికి లేదు." (మిష్కాత్)

మరో హదీసులో-

"మీలో ఎవ్వరు కూడా తన తోటివాడి కర్రను కూడా తీసుకోరాదు. వేళాకోళానికి కూడా తీసుకోరాదు (అది అతడి వద్దనే ఉండిపోయే అవకాశం ఉంది). ఆ విధంగా అది ఒక నేరానికి కారణం కారాదు. తన తోటివాడి కర్రనైనా తీసుకున్నవాడు తక్షణం దానిని వాపసు చేయాలి."(తిర్మిజి)

3. మానమర్యాదలు

మానమర్యాదల రక్షణ కూడా ప్రతి ఒక్కరి మౌలిక హక్కుగా ఇస్లాం బోధిస్తోంది. ఇతరుల మానమర్యాదలు మంటగలిపే అధికారం ఎవరికి లేదు. సమాజంలో ఒక వ్యక్తి పేరుప్రతిష్ఠలను దెబ్బతీసే హక్కు ఎవరికి లేదు. దివ్యఖుర్ఆన్ ప్రకారం

"విశ్వాసులారా! పురుషులు ఇతర పురుషులను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠులు కావచ్చు. అలాగే స్త్రీలు ఇతర స్త్రీలను ఎగతాళి చేయకూడదు. వీరికంటే, వారే శ్రేష్ఠురాంద్రయి ఉండవచ్చు. ఒకరినొకరు ఎత్తిపొడుచుకోకండి. ఒకరినొకరు చెడ్డపేర్లతో పిలుచుకోకండి. విశ్వసించిన తరువాత చెడ్డతనంలో పేరు సంపాదించడం చాలా నీచమైన విషయం. ఈ వైఖరిని మానుకోని వారే దుర్మార్గులు.

> విశ్వాసులారా! అతిగా అనుమానించడం మానివేయండి. కొన్ని అనుమానాలు పాపాలు అవుతాయి. గుఢచారులుగా వ్యవహరించకండి. మీలో ఎవరూ ఎవరినీ పరోక్షంగా నిందించరాదు. మీలో ఎవరైనా మీ మృతసోదరిని మాంసం తినడానికి ఇష్టపడతారా? చూడండి, మీరే స్వయంగా దీనిని అసహ్యించుకుంటారు. అల్లాహ్‌కు భయపడండి, అల్లాహ్ అత్యధికంగా పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, కరుణించే వాడూను." *(హుజురాత్ : 11,12)*

ఈ విషయమై ప్రవక్త (స) హదీసులు కూడా స్పష్టంగా పున్నాయి. తోటివారి మాన మర్యాదలను నిష్కారణంగా మంటగలుపడం అత్యంత హీనమైన నేరంగా ఆయన పేర్కొన్నారు.

"తోటి ముస్లిం గౌరవమర్యాదలను అన్యాయంగా మంటగలుపడం అత్యంత హీన మైన దౌర్జన్యం." (అబూదావూద్)

అనేక సందర్భాల్లో ప్రవక్త (స) ధనప్రాణాలు, మానమర్యాదల పవిత్రత గురించి స్పష్టంగా చెప్పారు. ఒండొరుల ధనప్రాణాలను, మానమర్యాదలను కాపాడుకోవాలని హితవు గరిపారు. చివరి హజ్ ప్రసంగంలో ఆయన చేసిన హితబోధ ఈ సందర్భంగా గమనార్హమైనది.

"న్యాయంగా తప్ప, ఒకరి ప్రాణాలు తీయడం, ఒకరి సంపద కాజేయడం, ఒకరి గౌరవమర్యాదలపై దాడి చేయడం – వీటిని అల్లాహ్ మీకు నిషేధించాడు." *(బుఖారి)*

అలాగే హజ్రత్ అబూహురైరా (రజి) ఉటంకించిన మరో హదీసులో ఇలా ఉంది.

"ప్రతి ముస్లిమ్‌కు తోటి ముస్లిమ్ విషయంలో క్రింది విషయాలు నిషిద్ధాలు. అవి

: అతడి సంపద, అతడి గౌరవమర్యాదలు, అతడి ప్రాణం. తోటి వాడిని హీనంగా చూడడం మనిషి చెడ్డవాడని చెప్పడానికి చాలు." *(అబూదావూద్)*

ఇది అబూదావూద్ సంకలనంలోని హదీసు. ఇదే హదీసు ముస్లిం సంకలనంలో మరింత వివరంగా ఉంది.

"ఒకరిపై ఒకరు ఈర్ష్యపడకండి (క్రయవిక్రయాల్లో). ఒకరికొకరు దళారులుగా ఉండవద్దు. ఒకరి పట్ల ఒకరు ద్వేషం, వైరం పెంచుకోవద్దు. ఒకరిపట్ల ఒకరు వైముఖ్యం ప్రదర్శించవద్దు. ఇచ్చిపుచ్చుకోవడాల్లో ఒకరిపై ఒకరు పోటీలకు పోవద్దు. మీరంతా అల్లాహ్ దాసులుగా మారిపోండి. ఒకరికొకరు సోదరులుగా మారండి. ముస్లిం తోటి ముస్లిముకు సోదరుడు. తోటివానిపై దౌర్జన్యం చేయడు. తోటివాడిని వదిలేయడు. తోటివాడిని హీనంగా చూడడు. ఇది దైవభీతి. (ఎవరి హృదయంలో దైవభీతి ఉంటుందో వారు ఈ పనులు చేయరు.) ఈ మాటలు చెబుతూ ఆయన మూడు సార్లు తన ఛాతీవైపు సైగ చేసారు. తోటి వాడిని హీనంగా చూడడం మనిషి చెడ్డవాడని చెప్పడానికి చాలు. ఒక ముస్లిముకు తోటి ముస్లిమునకు సంబంధించిన ఈ అంశాలు నిషిద్ధమైనవి. అవి: తోటివాని సంపద, అతడి ప్రాణం, అతడి గౌరవ మర్యాదలు." *(ముస్లిం)*

4. న్యాయం

న్యాయం పొందడాన్ని కూడా ఇస్లాం ప్రతి మనిషికి మౌలిక హక్కుగా ప్రకటించింది. వంశం, వర్ణం, తెగ, జాతి భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి న్యాయాన్ని పొందే హక్కు ఉంది. ఎవరికి ఎవరి హక్కును కొల్లగొట్టే అధికారం లేదు. దివ్యఖుర్‌ఆన్ ఈ విషయమై చేసిన ఆదేశం చూడండి.

> "విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సరిసమానమైనది. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు." *(మాయిద : 8)*

ఇదేవిధంగా సూరా నిసాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు

"ముస్లిములారా! అమానతులను యోగ్యులైన వారికి అప్పగించండి. ప్రజల మధ్య తీర్పు చేసేటప్పుడు న్యాయంగా చేయండి అని అల్లాహ్ మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాడు. అల్లాహ్

మీకు ఎంతో చక్కని హితబోధ చేస్తున్నాడు. నిశ్చయంగా ఆయన అన్నీ వింటాడు. అన్నీ చూస్తాడు." *(నిసా : 58)*

ఇదే సూరాలో మరింతగా తాకీదు చేస్తున్న వచనాలున్నాయి

"విశ్వసించిన ప్రజలారా! న్యాయధ్వజవాహకులుగా నిలబడండి. అల్లాహ్ కొరకు సాక్షులుగా ఉండండి. మీ న్యాయం, మీ సాక్ష్యం మీకు, మీ తల్లిదండ్రులకు, మీ బంధువులకు ఎంత హాని కలిగించినా సరే. కక్షిదారులు భాగ్యవంతులైనా, నిరు పేదలైనా అల్లాహ్ వారి శ్రేయస్సును మీకంటే ఎక్కువగా కాంక్షిస్తాడు. కనుక మీ మనోవాంఛలను అనుసరిస్తూ న్యాయం నుంచి వైదొలగకండి. మీరు గనక సాక్ష్యాన్ని వక్రీకరిస్తే న్యాయాన్ని దాటవేస్తే, బాగా తెలుసుకోండి, మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు అని." *(నిసా : 135)*

ఇదేవిధంగా ఒక హదీసులో ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు

"మీకు తెలుసా! ప్రళయదినాన అల్లాహ్ నీడలోకి ఎవరు ముందుగా వెళతారో మీకు తెలుసా? (ఈ మాటలు విని) ప్రజలు అన్నారు "అల్లాహకు, అల్లాహ్ ప్రవక్తకు మాత్రమే తెలుసు". అప్పుడు ఆయన ఇలా అన్నారు, "తమ హక్కును ఇచ్చినప్పుడు దాన్ని స్వీకరించిన వారు, ఆ హక్కును వాడుకోవాలని చెప్పినప్పుడు అందులో ఆలస్యం చేయని వారు, తమ విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో పరుల విషయంలో కూడా అలాంటి నిర్ణయాలే తీసుకునేవారు" అని చెప్పారు." (ముస్నద్ అహ్మద్)

5. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల రక్షణ

ఇదేవిధంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కూడా ప్రతి మనిషి మౌలిక హక్కులుగా ఇస్లాం పరిగణిస్తుంది. ఏ వ్యక్తి అతను ఏ జాతి, తెగ, వంశం, వర్ణం, ప్రాంతాలకు చెందినవాడైనా గాని ఇతరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యలను కబళించే అధికారం లేదు. ఎంత బలహీనవర్గం వ్యక్తి అయినా సరే అతడి స్వేచ్ఛను నిరాకరించే అధికారం ఎవ్వరికీ లేదు. కాని ఈ విష యమై మనుస్మృతి బోధనలు వేరేవిధంగా ఉన్నాయి.

"శూద్రుడికి అతడి యజమాని స్వేచ్ఛ ఇచ్చినా అతడు స్వతంత్రుడు కాలేడు. ఎందు కంటే అతడి స్వభావంలో పొందుపరచబడిన అలవాటును ఎవరూ తీయలేరు." (8:414)

కాని ఇస్లాం దృష్టిలో స్వేచ్ఛ ప్రతి మనిషికి మౌలికహక్కు. ఈ హక్కును కాలరాసే అధికారం ఎవ్వరికీ లేదు. అలా చేసేవాడిపై అల్లాహ్ శిక్ష పడుతుందని ఒక హదీసులో ప్రవక్త (స) హెచ్చరించారు.

"అల్లాహ్ ఇలా తెలిపాడు, మూడు రకాల వ్యక్తులకు వ్యతిరేకంగా నేను ప్రళయ దినాన ఫిర్యాదుదారునిగా నిలబడతాను. ఒకడు : వాగ్దానం చేసి దాని నుంచి ముఖం తిప్పుకున్నవాడు, రెండవవాడు: స్వతంత్రుడైన వ్యక్తిని అమ్మేసి ఆ సొమ్ము తిన్నవాడు. మూడవవాడు: ఒక వ్యక్తిని కూలికి పెట్టుకుని అతడితో పని చేయించుకుని కూలి చెల్లించని వాడు" (బుఖారి)

ఒక స్వతంత్రుడైన వ్యక్తిని పట్టుకుని బానిసగా అమ్మేసి బానిసగా బతికేలా చేయడం అత్యంత హీనమైన నేరం. నేటి ఆధునిక కాలంలో బానిసత్వం లేకపోయినా వెట్టిచాకిరి చేయించుకునే వ్యవహారాలు అనేకం మన ముందుకు వస్తున్నాయి. బలహీన వర్గాల వారితో చాకిరి చేయించుకునే ఈ వ్యవహారాల్లో బానిసత్వం అన్న పేరు లేకపోయినా వారి బతుకులు అంతకన్నా ఎక్కువగా లేవు. వెట్టిచాకిరిలో ఆ మనిషి ఒక వంశానికి దాదాపు బానిసగానే బతుకుతాడు. మనుస్మృతి బోధనలు ఈ విషయంలో ఇలా ఉన్నాయి

> "శూద్రుడు కొనబడినవాడు అయినా కాకపోయినా అతడితో దాసుడి మాదిరిగా పని చేయించుకోవాలి. ఎందుకంటే బ్రాహ్మణులకు దాస్యం చేయడానికే బ్రహ్మ శూద్రులను సృష్టించాడు" *(8:413)*

కాని ఇస్లాం ఈ విధంగా ఒక తెగ, వర్ణం, జాతిని దాసులుగా నిర్ధా రించదు. ఒక స్వతంత్రుడైన వ్యక్తితో బలవంతంగా అతడికి ఇష్టంలేని పనులు చేయించడం ఇస్లాంలో కుదరదు. ఇదే విషయాన్ని సూరా నూర్‌లో దివ్యఖుర్‌ఆన్ ఇలా ప్రకటించింది.

> "... మీ లౌకిక ప్రయోజనాల నిమిత్తం మీ బానిస స్త్రీలను వేశ్యావృత్తికై బలవంత పెట్టకండి. వారే శీలవంతులుగా ఉండగోరినప్పుడు ఎవరైనా వారిని బలవంత పెడితే ఆ బలత్కారం తర్వాత అల్లాహ్ వారిని (బానిస స్త్రీల) క్షమించే వాడు, కరుణించేవాడూను." *(నూర్ : 33)*

బానిస స్త్రీలతో బలవంతంగా వేశ్యావృత్తి చేయించడం ఇస్లాంకు పూర్వం అరేబియాలో ఉండేది. పై ఖుర్‌ఆన్ వాక్యంలో ఈ దాసీ జనం గురించే ప్రస్తావించడం జరిగింది. ఈ దురాచారాన్ని నిర్మూలించడానికే ఆ దివ్యవచనం అవతరించింది. అంటే బానిసతో కూడా మనిషి అతడికి ఇష్టం లేని పని చేయించే అధికారం లేదు. కాబట్టి ఇక స్వతంత్రుడైన మనిషితో బలవంతాన పనిచేయించడం అన్న ప్రశ్నే లేదు.

ఎవరినీ బలవంతంగా తన వద్ద ఉంచుకునే అధికారం కూడా ఎవరికి లేదు.

భార్యాభర్తల సంబంధం చాలా పటిష్టమైన సంబంధం. సామాజికంగా, ఆర్థికంగా ఈ బంధం దృఢంగా ఉంటుంది. అయినప్పటికీ, ఇస్లాం ప్రకారం భార్యను కూడా తన వద్ద బలవంతాన ఉంచుకునే అధికారం భర్తకు లేదు. ఈ విషయంలో దివ్యఖుర్ఆన్ ఆదేశం

"మీరు మీ స్త్రీలకు విడాకులు ఇచ్చినప్పుడు, వారి కొరకు నిర్ణయింప బడిన గడువు, (ఇద్దత్) దగ్గరపడగానే, వారిని సహృదయంతో మీ వద్ద ఉంచుకోవాలి. లేదా మంచితనంతో సాగనంపాలి. కేవలం పీడించే ఉద్దేశ్యంతో వారిని మీతో ఉంచుకోవడం అన్యాయం. ఆ విధంగా చేసేవాడు వాస్తవానికి తనకు తానే అన్యాయం చేసుకుంటున్నాడు. అల్లాహ్ వాక్యాలతో చెలగాటం ఆడకండి. అల్లాహ్ మీకు గొప్ప కానుకను ప్రసాదించిన విషయాన్ని మరువకండి. మీపై అవతరింపచేసిన గ్రంథాన్ని, దివ్యజ్ఞానాన్ని తగువిధంగా గౌరవించండి. అని అల్లాహ్ మీకు బోధిస్తున్నాడు. అల్లాహ్‌కు భయపడండి. అంతా అయనకు తెలుసు అనే విషయం మీరు బాగా తెలుసుకోండి." (బఖర: 231)

ఇస్లాం ప్రకారం ఒక వ్యక్తి మరొక వ్యక్తిని బలవంతాన తన వద్ద ఉంచుకునే అధికారం ఎలా లేదో అదేవిధంగా ఒకవ్యక్తికి అతని ఇష్టమైన పని చేయకుండా అడ్డుకునే అధికారం కూడా ఎవరికీ లేదు. ఈ విషయంలో తలాక్ పొందిన తర్వాత భార్య విషయంలో భర్తకు కూడా ఈ హక్కు ఉండదు. తలాక్ పొందిన భార్య, తన ఇష్టప్రకారం తనకు నచ్చినవాడిని పునర్వివాహం చేసుకోకుండా అడ్డుకునే అధికారం మాజీ భర్తకు ఉండదు.

" మీరు మీ స్త్రీలకు విడాకులు ఇచ్చివేసిన తర్వాత దయ నిరీక్షణ వ్యవధి (ఇద్దత్)ని పూర్తిచేసి తమ నిశ్చిత భర్తలను ధర్మసమ్మతంగా పరస్పరం ఇష్టపడి వివాహం చేసుకోదలిస్తే మీరు వారిని ఆటంకపరచకూడదు. మీరు నిజంగా అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించిన వారే అయితే అలా ఎంతమాత్రం చేయకూడదని మీకు బోధించబడుతోంది. మీకొరకు సంస్కారవంతం, పవిత్రం అయిన పద్ధతి ఏమిటంటే, మీరు దానికి దూరంగా ఉండడమే, అల్లాహ్‌కు అన్నీ తెలుసు. మీకు తెలియదు." (బఖర: 232)

వైవాహిక సంబంధంలో దీర్ఘకాలం ఉన్న జంటల విషయంలో కూడా ఇస్లాం ఇదే సూత్రాన్ని పాటిస్తున్నప్పుడు, ఇతరుల విషయంలో వారి ఇష్టానికి వ్యతిరేకంగా పని చేయించడాన్ని లేదా ఇష్టమైన పని చేయకుండా అడ్డుకోవడాన్ని ఏమాత్రం సహించ దన్నది స్పష్టం.

6. ఆస్తి హక్కు

అసమానతలకు గురైన వర్గాలకు ప్రపంచంలో చాలా చోట్ల ఆస్తిహక్కు కూడా లభించలేదు. తమ యజమాని గుమ్మం దగ్గర పడిగాపులు పడేలా ఉండేది వారి పరిస్థితి. దాస్యబంధనాలను వదిలించుకుని బయటపడే మార్గం వారికి లేకుండా, అస్సలు ఆస్తిహక్కు వారికి లేకుండా చేసిన ఉదాహరణలు చాలా ఉన్నాయి. మనుస్మృతి బోధనలు చూడండి.

> "బ్రాహ్మణుడు శూద్ర దాసుడి నుంచి సంపద తీసుకోవాలి. ఇందులో ఆలస్యం చేయరాదు. ఎందుకంటే ఆ సంపద శూద్రునిది కాదు. శూద్రుడు సంపాదించినదంతా అతడి యజమాని స్వంతం" *(8:417)*

కాని ఇస్లాం ప్రతి మనిషికి ఆస్తిహక్కును ఇచ్చింది. మనిషి ఏ వర్గానికి, తెగకు, వర్ణానికి, వంశానికి చెందినవాడైనా గాని ఆస్తిహక్కు ఉంటుంది. ఖుర్‌ఆన్ ఈ విషయంలో ఇలా పేర్కొంది.

> "పురుషులు సంపాదించిన దానికి తగినట్లుగా వారి భాగం ఉంటుంది. స్త్రీలు సంపాదించిన దానికి తగినట్లుగా వారి భాగం ఉంటుంది. అయితే అల్లాహ్‌ను ఆయన అనుగ్రహం కొరకు ప్రార్థిస్తూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ సకల విషయాల పరిజ్ఞానం కలవాడు." *(నిసా : 32)*

ఈ ఖుర్‌ఆన్ వాక్యానికి వివరణ ఇస్తూ ప్రముఖ ధర్మవేత్త కుత్బ్‌షహీద్ (రఅ) ఇలా వ్యాఖ్యానించారు.

"స్త్రీపురుషులకు సంబంధించి సంపాదించే, ఆస్తి కలిగి ఉండే హక్కులివి. ఒక సాధారణ సూత్రంగా ఇందులో సమానత్వం ఉంది"

ఇది సంపాదించడానికి సంబంధించిన వ్యవహారం. ఇందులో విభిన్న స్థాయి భేదాలు ఉండడం సహజమే. అయితే ఇస్లాం వారసత్వ పంపిణీ విషయంలో భాగాలను స్పష్టంగా పేర్కొని ఎవరికి ఎలాంటి అన్యాయం జరగకుండా చూసింది. వంశం, జాతి వగైరా కారణాలతో ఎవరిని వారసత్వ ఆస్తి పొందకుండా అడ్డుకోవడం ఎవరికి సాధ్యం కాదు.

> "తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచి వెళ్ళిన ఆస్తిలో పురుషులకు భాగం ఉంది. అదేవిధంగా తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచి వెళ్ళిన ఆస్తిలో స్త్రీలకు భాగం ఉంది. – అది తక్కువైనా సరే లేక ఎక్కువైన సరే ఈ భాగం (అల్లాహ్ చే) నిర్ణయించబడింది." *(నిసా : 7)*

ఈ విధంగా ఇస్లాం ప్రతి స్వతంత్రుడైన వ్యక్తికి ఆస్తిహక్కును, వారసత్వ హక్కులను కల్పించింది. ఇస్లాం ప్రకారం ఏ జాతి, ఏ తెగ లేదా ఏ వంశం పుట్టుకరీత్యా ఎవరికీ బానిస కాదు. ఎవరు ఎవరికి బానిసలుగా పుట్టడం జరగదు. కూలి వాని చెమట ఆరకముందే కూలి చెల్లించాలని ఇస్లాం బోధిస్తుంది. ఈ విషయమై ప్రవక్త (స) ఇలా బోధించారు.

"కూలి వాని చెమట ఆరకముందే కూలి చెల్లించండి." (ఇబ్నెమాజ)

దీని ద్వారా తెలిసేదేమంటే, ప్రతి వ్యక్తికి సంపాదించే హక్కు, తన సంపద పొందే హక్కు ఉంది. కూలి పని చేసేవాడయినా గాని తన కాయకష్టంతో సంపాదించిన దానికి తానే యజమాని. అలా సంపాదించిన సొమ్ము పోగు చేసి అతను అభివృద్ధి సాధించవచ్చు. పెద్ద వ్యాపారి కావచ్చు. సమాజంలో తనదైన స్థానాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నించవచ్చు.

7. శరణు ఇచ్చే, ఒప్పందాలు చేసుకునే హక్కు

ఇస్లాం ఏవిధంగానైతే ఆర్థికంగా అందరికీ సంపాదించుకునే హక్కును ఎలా ప్రసాదించిందో, అదేవిధంగా ఇతరులకు శరణు ఇచ్చే హక్కు కూడా ఇచ్చింది. ఈవిధంగా సామాజిక, రాజకీయ స్థాయిల్లో కూడా అందరికీ సమానహక్కులు ప్రసాదిస్తోంది. మనిషి ఏ వర్ణం, ఏ తెగ, ఏ జాతికి చెందిన వాడైనా సరే ఈ హక్కులన్నీ లభిస్తాయి. ప్రతి ఒక్కరికి ఒప్పందాలు చేసుకునే హక్కు ఉంది. ఈ విషయమై ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా తెలిపారు

"అందరు ముస్లిముల రక్తం ఒక్కటే. వారు ఒకరికొకరు సహాయకులు. వారిలో తక్కువస్థాయికి చెందిన వ్యక్తయినా గాని ఎవరితో అయినా ఏదైనా ఒక బాధ్యతను స్వీకరించే ఒప్పందం చేసుకుంటే ఆ ఒప్పందం అందరి తరఫున చేసుకున్న ఒప్పందం అవుతుంది."
(అబూదావూద్)

ఇస్లాం ఏవిధంగానైతే వివిధ వర్గాల మధ్య ఒప్పందాలు చేసుకునే ఈ హక్కును ఇచ్చిందో అదేవిధంగా స్త్రీపురుషుల మధ్య కూడా ఈ సమానత్వాన్ని పాటించింది. పురుషునికి ఏవిధంగా శరణు ఇచ్చే హక్కు ఉందో అదేవిధంగా స్త్రీకి కూడా శరణు ఇచ్చే హక్కు ఉంది. దీనికి సంబంధించి ఒక ప్రముఖ సంఘటన ప్రస్తావించదగ్గది. మక్కా విజయం సందర్భంగా ప్రవక్త (స)కు సోదరి వరుస అయిన హజ్రత్ ఉమ్మె హానీ (రజి) ఒక ముష్రిక్కు (మక్కా బహుదైవారాధకుడు)కు శరణు ఇచ్చారు. ప్రవక్త (స) దీనిని ధర్మసమ్మతంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన చెప్పిన మాటలు.

"ఉమ్మె హానీ (రజి), మీరు ఎవరికి శరణు ఇచ్చారో వారికి మేము కూడా శరణు ఇస్తున్నాం" (బుఖారి)

అంతేకాదు, ఏవిధంగానైతే స్వతంత్రుడైన వ్యక్తికి శరణు ఇచ్చే హక్కు ఉందో అదేవిధంగా బానిసలకు కూడా శరణు ఇచ్చే హక్కు ఉంది. ఇమామ్ తిర్మిజి (రఅ) ప్రకారం హజ్రత్ ఉమ్మెహానీ (రజి) సంఘటన తర్వాత ప్రవక్త (స) ఇలా అన్నారు.

"మీరు ఎవరికి శరణు ఇచ్చారో మేము వారికి శరణు ఇచ్చాము. (దీనిపై ధర్మవేత్తల అభిప్రాయం ఏమంటే ప్రవక్త (స) స్త్రీలకు శరణు ఇచ్చే హక్కు ఉందని నిర్ధారించారు. అలాగే అహ్మద్, ఇస్‌హాఖ్‌ల ప్రకారం ప్రవక్త (స) స్త్రీలకు, బానిసలకు కూడా శరణు ఇచ్చే హక్కు ఉందని నిర్ధారించారు. అలాగే హజ్రత్ ఉమర్ (రజి) ప్రకారం బానిస ఇచ్చిన శరణును ధర్మసమ్మతంగా స్వీకరించడం జరిగింది" (తిర్మిజి)

హాఫిజ్ ఇబ్నె హజర్ (రజి) ఈ విషయమై హజ్రత్ ఉమర్ (రజి) ఫర్మానాను ఇలా తెలియజేసారు.

"బానిస ముస్లిం కూడా ముస్లిం సమాజంలో భాగం. అతను ఇచ్చిన శరణు కూడా ముస్లిం సమాజం ఇచ్చిన శరణు వంటిదే" (హిదాయ)

ధర్మవేత్తలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అందువల్లనే ఇమామ్ షాఫయి (రఅ), ఇమామ్ ముహమ్మద్ (రఅ), ఇమామ్ అబూ యూసుఫ్ (రఅ)ల అభిప్రాయాలు కూడా ఇవే (ముస్లిం). ప్రవక్త ముహమ్మద్ (స) ఈ విషయంలో చెప్పిన మాటలు.

"అందరు ముస్లిముల ప్రస్తావన, వారు చేసిన ఒప్పందాలు ఒక్కటే. వారిలో తక్కువ స్థాయికి చెందిన వ్యక్తి కూడా ఏదైనా బాధ్యత స్వీకరిస్తూ ఒప్పందం చేసుకుంటే అది అందరి తరఫున చేసినదే అవుతుంది." (ముస్లిం)

8. స్వతంత్ర అభిప్రాయం, మనస్సాక్షి కలిగి ఉండే స్వేచ్ఛ

అదేవిధంగా ఇస్లాం స్వతంత్ర అభిప్రాయాన్ని కలిగి ఉండే హక్కు, మనస్సాక్షిని అనుసరించే హక్కును కూడా ప్రసాదించింది. ఇది సమాజంలోని ప్రతి వ్యక్తికి లభించిన హక్కు. మనిషి ఏ తెగకు, ఏ జాతికి, ఏ వంశానికి చెందినవాడైనా గాని ఈ హక్కు అందరికి సమానంగా లభిస్తుంది. స్వతంత్ర అభిప్రాయాన్ని కలిగి ఉండే స్వేచ్ఛ ఇవ్వడమే కాదు, ఇస్లాం ఈ స్వేచ్ఛను వాడుకోవాలని ప్రోత్సహిస్తుంది. ముస్లిం సమాజం మంచిని ఆజ్ఞాపిస్తుంది. చెడును నిరోధిస్తుందని ఇస్లాం స్పష్టం చేస్తోంది.

"మీరు మంచిని చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు నుంచి ఆపుతారు. అల్లాహ్‌ను విశ్వసిస్తారు." *(ఆలి ఇమ్రాన్ : 110)*

ప్రవక్త ముహమ్మద్ (స) అనేక హదీసుల్లో మంచిని పెంచాలని, చెడును తుంచాలని బోధించారు. ఈ విషయంలో నిర్లక్ష్యాన్ని బలహీన విశ్వాసానికి నిదర్శనంగా పేర్కొన్నారు. ఒక ప్రముఖ హదీసులో ఇలా అన్నారు.

"మీలో ఎవరైనా చెడును చూస్తే దాన్ని మీ చేతులతో ఆపండి. అలా చేయలేకపోతే మీ నోటితో అది చెడు అని ప్రకటించండి. అలా కూడా చేయలేకపోతే కనీసం మనస్సులో చెడును చెడుగా భావించండి. ఇది విశ్వాసం రీత్యా అధమస్థాయి." *(ముస్లిం)*

ఈ బాధ్యత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే దేవుని శిక్ష పడుతుందని కూడా ఆయన హెచ్చరించారు. హజ్రత్ హుజైఫా (రజి) ఉటంకించిన హదీసు ప్రకారం ప్రవక్త (స) ఇలా అన్నారు.

"నా ప్రాణాలు ఎవరి చేతిలో ఉన్నాయో ఆ దేవుని సాక్షి, మీరు తప్పని సరిగా మంచిని ఆజ్ఞాపించండి, చెడును నిరోధించండి. అలా చేయలేకపోతే అల్లాహ్ తన తరఫు నుంచి మీపై ఏదన్నా శిక్ష పంపడం జరగవచ్చు. అప్పుడు మీరు ఆయన్ను ఎలుగెత్తి పిలిచినా ఆయన మీ మొర వినడు." (తిర్మిజి)

అలాగే మరో హదీసులో ప్రవక్త (స) బనీఇస్రాయీల్ ఈ విషయంలో చూపిన నిర్లక్ష్యాన్ని ఉదాహరిస్తూ ముస్లిం సమాజాన్ని హెచ్చరించారు.

"మీరు తప్పక మంచిని ఆజ్ఞాపిస్తారు. చెడు నుంచి ఆపుతారు. దౌర్జన్యపరుడిని చేయిపట్టి ఆపుతారు. సన్మార్గాన నడిచేలా చేస్తారు. అతడిని సన్మార్గానికి కట్టుబడేలా చేస్తారు. అలా చేయకపోతే అల్లాహ్ మీ అందరి మనస్సులు ఒకేలా చేసివేస్తాడు. (అంటే అందరి పరిస్థితి ఒకేలా అవుతుంది) మీ అందరిని శపిస్తాడు. వారిని (బనీఇస్రాయీల్‌ను) శపించి నట్లు." *(అబూదావూద్)*

ఇస్లాం దృష్టిలో అభిప్రాయస్వేచ్ఛ, మనస్సాక్షిని అనుసరించే స్వేచ్ఛ చాలా ముఖ్యమైనవి. ప్రతి ఒక్కరు ఈ హక్కును వాడుకోవాలని ఇస్లాం ప్రోత్సహిస్తుంది. ఈ వాస్తవం మనకు ప్రవక్త (స) చెప్పిన మరో హదీసులో స్పష్టంగా తెలుస్తోంది. ఆ హదీసులో ఆయన దౌర్జన్యపరుడైన పాలకుడి ముందు నిలబడి సత్యం, న్యాయం గురించి మాట్లాడ్డాన్ని గొప్ప జిహాద్‌గా పేర్కొన్నారు.

9. దౌర్జన్యాన్ని వ్యతిరేకించే హక్కు

దౌర్జన్యానికి విరుద్ధంగా గొంతెత్తే హక్కు, ప్రతిఘటించే హక్కు కూడా ఇస్లాం

ప్రసాదిస్తుంది. ఈ విషయంలో తెల్లవాడు, నల్లవాడు, ఉత్తముడు, అధముడు అన్న భేదం లేదు. ఈ విషయమై దివ్యఖుర్‌ఆన్ ఇలా పేర్కొంది.

"అన్యాయం జరిగితే తప్ప మనిషి చెడు పలకడాన్ని అల్లాహ్ ఇష్టపడడు. అల్లాహ్ అన్నీ వినేవాడు అన్నీ తెలిసినవాడూను. (అన్యాయం జరిగితే చెడు పలికే హక్కు మీకు ఉంది.)" *(నిసా : 148)*

ఇస్లాం ప్రతి ఒక్కరికి దౌర్జన్యానికి వ్యతిరేకంగా పోరాడే హక్కును కూడా ఇస్తోంది.

"ఒకవేళ మీరు ప్రతీకారం చేస్తే కేవలం మీపై దౌర్జన్యం జరిగిన మేరకే ప్రతీకారం చేయండి. కాని మీరు సహనం చూపితే, అది నిశ్చయంగా సహనం చూపేవారికే మంచిది." *(నహల్: 126)*

ఇస్లాం దృష్టిలో ఏ ఒక్క వర్గం కూడా శాశ్వతంగా దౌర్జన్యాలు, అన్యాయాలు అనుభవించడానికి పుట్టలేదు. సమాజంలో ప్రతివ్యక్తి అతను ఏ వర్గానికి, ఏ తెగకు, ఏ వంశానికి చెందినవాడైనా గాని తనపై జరిగే దౌర్జన్యాలను ప్రతిఘటించే హక్కు కలిగి ఉంటాడు. ఈ వాస్తవాన్ని దివ్యఖుర్‌ఆన్ స్పష్టంగా ప్రకటించింది.

"మీపై ఎవరన్నా దాడిచేస్తే మీరు వారిపై అదేవిధంగా దాడి చేయండి. అయితే అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. అల్లాహ్ ఏర్పరచిన హద్దులను అతిక్రమించకుండా ఉండేవారితో అల్లాహ్ ఉంటాడు అనే విషయం తెలుసుకోండి."

(బఖర : 194)

ఇస్లాం దృష్టిలో చెడు అన్నది అందరికీ ఒక్కటే. ఎవరు చేసినా చెడు చెడే. ఎవరైనా ఎవరి పట్లనైనా చెడుగా వ్యవహరిస్తే ప్రతిగా ఆ వ్యక్తి పట్ల కూడా అదేవిధంగా వ్యవహరించడమే న్యాయం. తనపై జరిగిన దౌర్జన్యానికి ఎవరైనా వ్యక్తి ప్రతీకారం తీసుకుంటే ఇస్లాం దాన్ని సమ్మతిస్తుంది.

"చెడుకు ప్రతిక్రియ అదేరకమైన చెడు కాని ఎవడైనా క్షమించి రాజీపడితే దానికి ప్రతిఫలం ఇవ్వడం అల్లాహ్ బాధ్యత. అల్లాహ్ దుర్మార్గులంటే ఇష్టపడడు. తమకు అపకారం జరిగినప్పుడు ఎవరైనా ప్రతీకారంచేస్తే వారిని నిందించడానికి వీలులేదు. అసలు నిందార్హులు ఇతరులకు అన్యాయం చేసేవారే, భూమిపై అన్యాయంగా దౌర్జన్యాలు చేసేవారే. అటువంటి వారికి వ్యథాపూరితమైన శిక్ష పడుతుంది."

(షూరా : 40,41)

దౌర్జన్యానికి ఎన్నడూ తలవంచని వైఖరిని పెంపొందిస్తుంది ఇస్లాం. అందరూ కలిసి దౌర్జన్యాన్ని నిర్మూలించేలా ప్రోత్సహిస్తుంది. దివ్యఖుర్ఆన్ మనుష్యుల్లో ధార్మిక విశ్వాసాన్ని, ధర్మాచరణలను ఎలా ప్రోత్సహిస్తుందో అదేవిధంగా దౌర్జన్యానికి తలవంచకుండా ఎదిరించే లక్షణాన్ని కూడా ప్రోత్సహిస్తుంది.

"తమ ప్రభువును నమ్ముకున్న వారి కోసం, పెద్ద పెద్ద పాపాలకు, సిగ్గుమాలిన పనులకు దూరంగా ఉండేవారి కోసం, కోపం వచ్చినప్పుడు కూడా క్షమించేవారి కోసం, తమ ప్రభువు ఆజ్ఞలను పాలించేవారి కోసం, నమాజ్ స్థాపించేవారి కోసం, తమ వ్యవహారాలను పరస్పర సంప్రదింపులతో నడుపుకునే వారి కోసం, మేము వారికి ఇచ్చిన ఉపాధి నుంచి ఖర్చు చేసే వారి కోసం, తమపై దౌర్జన్యం జరిగినప్పుడు దానిని ఎదుర్కొనే వారి కోసం." *(షూరా : 38,39)*

న్యాయం

న్యాయం విషయంలోను ఇస్లాం అందరి మధ్య సమానత్వాన్ని స్థాపించింది. అందుకు అవసరమైన చట్టపరమైన రక్షణలు కల్పించింది. ఇస్లాం దృష్టిలో ముద్దాయి, ఫిర్యాదుదారుడు ఇద్దరిలో ఎవరికి ఏవిధమైన ప్రత్యేకత లేదు. అందులో ఒకరు ఖలీఫా అయినా సరే లేక మామూలు పౌరుడైనా సరే. గొప్ప వంశానికి చెందినవాడైనా, తక్కువ వంశానికి చెందినవాడైనా, ఏ జాతికి చెందినవారైనా ఎవరికి ఎలాంటి ప్రత్యేకత లేదు. ప్రజలందరితో ఒకేవిధమైన న్యాయంతో వ్యవహరించాలని ఖుర్ఆన్ బోధించింది.

"ముస్లిములారా! అమానతులను యోగ్యులైన వారికి అప్పగించండి. ప్రజల మధ్య తీర్పు చేసేటప్పుడు న్యాయంగా చేయండి. అని అల్లాహ్ మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాడు. అల్లాహ్ మీకు ఎంతో చక్కని హితబోధ చేస్తున్నాడు. నిశ్చయంగా ఆయన అన్నీ వింటాడు. అన్నీ చూస్తాడు." *(నిసా : 58)*

ఇద్దరి మధ్య సరయిన న్యాయం చేయడం, ఏ ఒక్కరి పట్ల పక్షపాతం లేకుండా వ్యవహరించడం గురించి దివ్యఖుర్ఆన్ ప్రోత్సహించింది. న్యాయస్థానంలోకి వచ్చిన రాజయినా, పేదయినా న్యాయస్థానంలో ఒకేవిధంగా హాజరు కావలసి ఉంటుంది. ఈ విషయమై ప్రవక్త (స) ఇలా అన్నారు

"వ్యాజ్యంలో ఇద్దరు కక్షిదారులు న్యాయమూర్తి ముందు సమాన స్థాయిలో కూర్చుంటారు" (అబూదావూద్)

హజ్రత్ అలీ (రజి)ను యమన్ ప్రాంతానికి న్యాయమూర్తిగా పంపుతున్నప్పుడు ప్రవక్త (స) ఇలా తాకీదు చేశారు

"ఇద్దరు కక్షిదారులు నీ ముందు కూర్చున్నప్పుడు, మొదటివాని వాదనను ఎలా వింటావో, అలాగే రెండవ వాని వాదన వినక ముందు నిర్ణయాన్ని ప్రకటించవద్దు. ఈ విధంగా సరయిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది." (అబూదావూద్)

న్యాయమూర్తి స్థానంలో కూర్చున్న వారిని ఉద్దేశించి ప్రవక్త (స) ఇచ్చిన హితబోధ కూడా ఈ సందర్భంగా గమనార్హమైనది.

"మీలో ఎవరైనా న్యాయమూర్తి హోదాలో బాధ్యతలు నిర్వర్తిస్తూంటే, కక్షిదారులతో కూర్చునే పద్ధతి, సూచనలు, దృష్టి అన్ని విషయాల్లో సమానత్వం పాటించండి"

(అద్దరాయ)

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి), హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) కూఫా గవర్నర్‌గా ఉన్నప్పుడు ఆయన పేర పంపిన ఫర్మాన్‌లో కూడా ఈ విషయాలు స్పష్టంగా పేర్కొన్నారు.

"ప్రజలతో సమానంగా సానుభూతి వ్యవహారశైలి ప్రదర్శించండి. మీ ముందు కూర్చునే విషయంలో, మీరు వారివైపు చూసే విషయంలో, నిర్ణయాలు తీసుకునే విషయంలో సమానత్వం ఉండాలి. స్తోమత కలిగిన వాడు మీ నుంచి పక్షపాతం దొరుకుతుందన్న ఆశ కలిగి ఉండరాదు. బలహీనుడు మీ న్యాయం పట్ల నిరాశ చెందరాదు"

దివ్యఖుర్ఆన్, హదీసుల వెలుగులో ధర్మవేత్తలు న్యాయం విషయంలో రూపొందించిన సూత్రాల్లో ముఖ్యమైనది

"న్యాయమూర్తి ఒక కక్షిదారుని వదిలి మరొకరిని తన అతిథిగా చూడరాదు. తాను న్యాయస్థానంలోకి వచ్చినప్పుడు ఇద్దరు కక్షిదారులను కూర్చుండబెట్టడంలో, వారివైపు చూడడంలో సమానత్వం పాటించాలి. ఎవరో ఒక కక్షిదారునితో గుసగుసలాడరాదు, సైగలు చేయరాదు. కక్షిదారుని ఆధారాన్ని తాను వివరించరాదు. ఒకరివైపు చూసి నవ్వరాదు." *(అల్లాముల్ మౌఖీన్)*

న్యాయస్థానంలో ఈ సమానత్వం అన్నది కేవలం ముస్లిములకే పరిమితం అని భావించరాదు. వ్యాజ్యంలో ఎవరున్నా గాని ఇద్దరు కక్షిదారులకు ఈ హక్కులు సమానంగా వర్తిస్తాయి. ముస్లిములైనా, ముస్లిమేతరులైనా గాని, అందరికి సమానంగా లభిస్తాయి. హజ్రత్ అలీ (రజి)కు సంబంధించి ఒక సంఘటనలో ఆయన, మరొక సాధారణ పౌరుడు

కక్షిదారులుగా న్యాయస్థానంలోకి వచ్చారు. న్యాయమూర్తి హ|జత్ అలీ (రజి)ను చూడగానే లేచి స్వాగతం పలికారు. ఆ వెంటనే హ|జత్ అలీ (రజి) "ఇది మీరు చేసిన మొదటి అన్యాయం" అన్నారు.(ఇబ్నె ఖల్‌కాన్: దఫ్యాతుల్ అయ్యాన్)

పరిహారం

ఇదేవిధంగా పరిహారం విషయంలోనూ ఇస్లాం ప్రపంచంలోని సమస్త మానవాళి మధ్య సమానత్వాన్ని పాటిస్తుంది. పరిహారం పొందే విషయంలో ప్రతి మనిషికి సమాన హక్కు లభించేలా చేసింది. మనుస్మృతిలో ఏముందో చూడండి.

"ఒక శూద్రుడిని హత్య చేస్తే పరిహారం పిల్లి, కప్ప, కుక్క, గుడ్లగూబ, కాకి మొదలైన వాటిని చంపిన పరిహారంతో సమానం" *(11:131)*

దీనికి విరుద్ధంగా ఇస్లాం ఎవరిని హత్య చేసినా వర్గం,వర్ణం, వంశం, తెగ, జాతి భేదాలకు అతీతంగా ఒక్కరిని చంపడం పూర్తి మానవాళిని చంపడంగా పేర్కొంది.

"ఈ కారణం వల్లనే మేము ఇస్రాయీలు సంతతికి ఈ ఫర్మానాను వ్రాసి ఇచ్చాము. "హత్యకు బదులుగా గాని, లేదా కల్లోలాన్ని వ్యాపింపచేసినందుకు గాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుడిని చంపిన వాడు సమస్త మానవులను చంపినట్లే, ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడిన వాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే." *(మాయిద : 32)*

ఇస్లాం దృష్టిలో మనిషి ఎవరైనా గాని అతని ప్రాణం విలువైనది. ఎవరైనా ఒక వ్యక్తిని అన్యాయంగా హతమారిస్తే అందుకు బదులుగా అతనికి మరణశిక్ష తప్పదు. హంతకుడు ఏ తెగ, ఏ వంశానికి, ఏ జాతికి చెందినవాడైనా ఇందులో మినహాయింపు ఉండదు. రక్తపరిహారం తప్పక చెల్లించాల్సిందే. హతుడెవరైనా సరే ఈ రక్తపరిహార హక్కు సమానంగా లభిస్తుంది.

"విశ్వసించిన ప్రజలారా! హత్య వ్యవహారాలలో మీ కొరకు ప్రతీకార న్యాయం నిర్ణయించబడింది. హత్య చేసిన వ్యక్తి స్వతంత్రుడైతే, ఆ స్వతంత్రుడినే శిక్షించాలి. బానిస అయితే ఆ బానిసనే వధించాలి. స్త్రీ అయితే ఆ స్త్రీనే చంపాలి. ఒకవేళ హతుని సోదరుడు హంతకుడిని కనికరించదలిస్తే, న్యాయసమ్మతంగా రక్తశుల్క నిర్ణయం జరగాలి. హంతకుడు రక్తధనాన్ని ఉత్తమరీతిలో అతనికి చెల్లించాలి. ఇది మీ ప్రభువు నుంచి మీకు లభించే సౌకర్యం, కారుణ్యం. దీని తర్వాత కూడా ఈ హద్దులను అతిక్రమించేవారు ఘోరశిక్షకు గురి అవుతారు. బుద్ధిజ్ఞానం కల ఓ

మానవులారా! ఈ ప్రతీకార న్యాయం మీ సమాజానికి ఊపిరి. ఈ శాసనోల్లంఘనానికి మీరు దూరంగా ఉంటారని ఆశించబడుతోంది." *(బఖర : 178,179)*

ఈ వాక్యంలో హతులు అన్న పదం వాడబడింది. అంటే ముస్లిము లేదా ముస్లిమేతరుడు ఎవరైనా గాని, ఏ జాతికి చెందినవాడైనా, ఏ వంశానికి చెందినవాడైనా ఈ హక్కు విషయంలో అందరూ సమానులే.

అల్లమా అబూబక్ర్ హనఫీ (రఅ) ఈ విషయంలో ఇలా సెలవిచ్చారు

"ఈ ఆయత్ ద్వారా తెలిసేదేమంటే, హత్య జరిగితే రక్తపరిహారం తప్పనిసరి. ఇది హతులందరికి వర్తిస్తుంది. వారెవరైనా గాని. హత్యకు గురైనది బానిసైనా, పురుషుడైనా, స్త్రీ అయినా ఎవరైనా గాని ఇది వర్తిస్తుంది" *(అహ్కాముల్ ఖుర్ఆన్)*

ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. రక్తపరిహారం విషయంలో ముస్లిములు, ముస్లిమేతరులు, స్వతంత్రుడు, బానిస, స్త్రీ పురుషులన్న తేడా లేనప్పుడు, రక్తపరిహారం చెల్లింపు విషయంలో స్వతంత్రుడికి బదులు స్వతంత్రుడిని, బానిసకు బదులు బానిసను, స్త్రీకి బదులు స్త్రీ అన్న పదాలెందుకున్నాయి? దీనికి జవాబుగా అల్లమా అబూబక్ర్ హనఫీ (రఅ) ఇలా రాశారు

"దీని వెనుక ఒక చారిత్రక సంఘటన నేపథ్యంగా ఉంది. అరబ్బులో రెండు తెగల మధ్య ఘర్షణ జరిగింది. ఒక తెగ మరో తెగపై పైచేయి సాధించింది. వారు గర్వంతో మాలో హతమైన బానిసకు బదులు వారిలో స్వతంత్రుడి ప్రాణాలు తీస్తాం, మాలో హతమైన స్త్రీకి బదులు వారిలో పురుషుడి ప్రాణాలు తీస్తామని మొండికేసారు. అప్పుడు దేవుని తరఫున ఈ వాక్యాలు అవతరించాయి. మీరు అన్యాయానికి పాల్పడుతున్నారని పేర్కొన్నాడు. రక్తపరిహారం అన్నది కేవలం హంతకుడితో మాత్రమే తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నాడు. ఇతరులతో రక్తపరిహారం అన్నది కుదరదని తెలిపాడు. ఎందుకంటే ఈ తెగలు హంతకుడికి బదులు వేరొకరిని హతమార్చేవి. ఇలా చేయడాన్ని దేవుడు నివారించాడు. ఇదే విషయాన్ని ప్రవక్త (స) తన ప్రవచనాల్లో కూడా పేర్కొన్నారు. ప్రళయదినాన దేవుని దృష్టిలో అందరికన్నా తలబిరుసు మనుష్యులు మూడు రకాలు. హంతకుడికి బదులు వేరొకరిని హతమార్చిన వారు, కాబా పరిధుల్లో హత్యకు పాల్పడినవాడు, అజ్ఞానకాలం నాటి హత్యకు బదులు హత్యచేసిన వాడు అంటూ నిరసించారు.

కాబట్టి స్వతంత్రుడికి బదులు స్వతంత్రుడిని, బానిసకు బదులు బానిసను అన్న మాటలు అనవసర రక్తపాతాన్ని నివారించడానికి వాడిన పదాలు. ఆ విధంగా హంతకుడిపై

తప్పు మరొకరిపై చేయెత్తే అవకాశం ఎవరికి లేకుండా చేసారు. ఇక మనిషి ప్రాణానికి ఉన్న విలువకు సంబంధించి ప్రతి మనిషి ప్రాణం విలువైనదే. అందువల్లనే హనఫీ ధర్మ వేత్తలు స్వతంత్రుడి ప్రాణానికి బదులుగా స్వతంత్రుడికి మరణశిక్ష విధించినట్లే, బానిస ప్రాణానికి బదులుగా కూడా స్వతంత్రుడికి మరణశిక్ష పడుతుందని తీర్మానించారు.

"స్వతంత్రుడికి బదులు స్వతంత్రుడిని, అదేవిధంగా బానిసకు బదులు కూడా స్వతంత్రుడిని హతమార్చడం జరుగుతుంది. ఎందుకంటే ఈ విషయమై సూత్రాలు అందరికి సమానంగా వర్తిస్తాయి"

ఇదేవిధంగా ముస్లిములు, అవిశ్వాసుల మధ్య కూడా ఎలాంటి వివక్ష ఉండదు. ఒక అవిశ్వాసి హత్యకు బదులు ముస్లింపై మరణదండన పడుతుంది.

"అవిశ్వాసి హత్యకు బదులు ముస్లింపై మరణదండన పడుతుంది" (హిదాయ)

ఈ విధంగా వివిధ వర్గాల ప్రజల మధ్య న్యాయాన్ని సమానంగా స్థాపించడం జరిగింది. అలాగే స్త్రీపురుషుల మధ్య, స్థాయి భేదాలున్న ఇద్దరు వ్యక్తుల మధ్య కూడా న్యాయాన్ని ధర్మవేత్తలు ఈ సూత్రాల ప్రాతిపదికన నిర్ధారించారు.

"స్త్రీకి బదులు పురుషుడిని, బాలబాలికలకు బదులు పెద్దవాడిని, అదేవిధంగా అంధుడు, వికలాంగులకు, పిచ్చివారికి బదులు ఆరోగ్యంగా ఉన్నవాడిని, అన్ని అవయవాలు చక్కగా ఉన్నవాడిని మరణదండనకు గురి చేయడం జరగవచ్చు. ఎందుకంటే ఈ విషయంలో రక్తపరిహార సూత్రాలు అందరికి సమానంగా వర్తిస్తాయి" *(హిదాయ)*

అవయవాల విషయంలో సమానత్వం

ఇస్లాం ఏ విధంగా హత్య విషయంలో మానవులందరి మధ్య సమానత్వం స్థాపించిందో, అందరి ప్రాణాలు ఒకేవిధంగా విలువైనవిగా ఎలా ప్రకటించిందో అదేవిధంగా మానవ అవయవాల విషయంలో కూడా ఇదే సమానత్వాన్ని పాటిస్తోంది. ఈ విషయంలో చట్టపరమైన రక్షణలు కల్పించింది. మనుస్మృతిని పరిశీలిస్తే.. "శూద్రుడు ఒక బ్రాహ్మణుడితో, క్షత్రీయుడితో, వైశ్యునితో కఠినంగా మాట్లాడితే వాడి నాలుకకు రంధ్రం వేయాలి. ఎందుకంటే అతడు నీచమైన కాలి నుంచి పుట్టించబడ్డాడు." *(8:270)*

"చండాలుడు ఉన్నతులపై ఏ అవయవంతో దాడి చేస్తాడో వాడి ఆ అవయవాన్ని ఖండించాలి." *(8 :279)*

"చేతితో దాడి చేస్తే చేయి ఖండించాలి. కాలితో దాడి చేస్తే కాలిని ఖండించాలి" *(8 : 280)*

"గర్వంతో శరీరంపై ఉమ్మివేస్తే వాడి రెండు పెదాలు ఖండించాలి. మూత్రం పోస్తే మర్మావయవం ఖండించాలి. " *(8 : 282)*

కాని, ఇస్లాంలో ఈ విషయమై ఉన్న ఆదేశాలు పూర్తి విరుద్ధమైనవి.

"తౌరాత్ గ్రంథంలో మేము యూదుల కొరకు ఈ ఆజ్ఞను వ్రాశాము. ప్రాణానికి బదులు ప్రాణం, కన్నుకు బదులు కన్ను, ముక్కుకు బదులు ముక్కు, చెవికి బదులు చెవి, పన్నుకు బదులు పన్ను ఇలా సమస్త గాయాల కొరకు సమానమైన ప్రతీకారం. కాని ఎవరైనా ప్రతీకారం చేయకుండా క్షమిస్తే అది అతని కఫ్ఫారా (పరిహారం) అవుతుంది. అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పు చేయని వారే దుర్మార్గులు." *(మాయిద : 45)*

ఈ ఆధారంగా ధర్మవేత్తలు ఇలా వివరించారు.

"సమానమైన ప్రతీకారం తీసుకునే అవకాశం ఉన్న ప్రతిగాయానికి పరిహారం ఉంది" (హిదాయ)

ఇది కూడా కేవలం ముస్లిములకు ప్రత్యేకమైన ఆదేశం కాదు. ఇది ముస్లిములకు ముస్లిమేతరులు అందరికి సమానంగా వర్తించే ఆదేశం. హనఫీ ధర్మవేత్తలు అందుకే ఇలా అభిప్రాయపడ్డారు.

"అవయవాల విషయంలో పరిహారం తప్పనిసరి అవుతుంది. ముస్లిములు, ముస్లిమే తరులు ఇద్దరికి సమానం. ఎందుకంటే ఇద్దరి రక్తం ఒకేవిధంగా ప్రవహించింది." (హిదాయ)

ముస్లిములు, ముస్లిమేతరులు ఇద్దరు ఈ పరిధిలో ఎలా సమానంగా ఉన్నారో అదే విధంగా స్త్రీపురుషుల మధ్య కూడా ఎలాంటి తేడా లేదు. అందుకే ఇబ్నె అబీ లైలా (రఅ), షోరి (రఅ), మైస్ (రఅ), ఇమామ్ షాఫయి (రఅ) ఈ అభిప్రాయాన్ని బలపరుస్తున్నారు.

"స్త్రీపురుషులు ఇద్దరి విషయంలోను ప్రాణానికి బదులు రక్తపరిహారం తప్పనిసరవు తుంది. దానికన్నా తక్కువస్థాయికి చెందిన అవయవాల గాయం విషయంలో కూడా పరిహారం తప్పనిసరవుతుంది." (అహ్కాముల్ ఖుర్ఆన్)

ఇబ్నె లైలా (రఅ) ఈ విషయంలో బానిసకు, స్వతంత్రుడికి మధ్య కూడా భేదం లేదన్నారు.

ముస్లిం సమాజానికి నాయకత్వం వహించడంతో సమానమైనది. ఇస్లాం ఈ విషయంలో కూడా బానిసలను ముందుకు నడిపి వారికి నాయకత్వ బాధ్యతలు ఇచ్చింది. రాజైనా, బానిసైనా ఇస్లాం దృష్టిలో ఒక్కటేనని చాటి చెప్పింది. వంశం, వర్ణం వగైరా విచక్షణలకు ఏమాత్రం విలువలేదని చాటి చెప్పింది. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రకారం హజ్రత్ అబూ హుజైఫా (రజి) స్వేచ్ఛ ఇచ్చిన బానిస హజ్రత్ సాలిమ్ (రజి) ఖుబా మస్జిదులో ప్రారంభదశలో హిజ్రత్ చేసిన ముహాజిర్లకు, మిగిలిన సహచరులకు ఇమామ్‌గా నమాజు చేయించేవారు. ఈ నమాజులో హజ్రత్ అబూబక్ర్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి) వంటి ప్రముఖులు ఉండేవారు (బుఖారి). హజ్రత్ అబ్దుల్లా చెప్పిన మరో ఉటంకం ప్రకారం ఆయన హిజ్రత్‌కు ముందు మక్కాలో కూడా ముహాజిర్లకు నమాజ్ చేయించేవారు. (తబఖాత్)

హజ్రత్ సాలమ్ (రజి) స్వేచ్ఛ పొందిన బానిస. కాని అనేక ఇతర హదీసుల వల్ల తెలుస్తున్నదేమంటే చాలా మంది బానిసలు, బానిసలుగా ఉన్నప్పటికీ నమాజుకు ఇమాములుగా నాయకత్వం వహించేవారు. ఇస్లాంలో బానిసత్వం నుంచి స్వేచ్ఛను పొందే ఒక ప్రక్రియ ఉంది. యజమాని ఒక నిర్ధారిత మొత్తం లేదా నిర్దిష్ట సేవల తర్వాత బానిసకు స్వేచ్ఛ ప్రసాదిస్తాడు. ఈ వ్యవధిలో బానిసగానే ఉంటాడు. హజ్రత్ అబూ సుఫ్యాన్ (తాబయి) అబ్దుల్లా బిన్ అబీ అహ్మద్‌కు ఇలాంటి బానిసగానే ఉండేవారు. తర్వాత ఆయన స్వేచ్ఛ పొందారు. ఆ తర్వాత ఆయన కుటుంబసభ్యుడిగా మారారు. అయితే బానిసత్వ వ్యవధిలో ఉన్నప్పుడు కూడా వీళ్లు నమాజుకు ఇమాములుగా వ్యవహరించే వారు. దావూద్ బిన్ హుస్సేన్ ప్రకారం అబూ సుఫ్యాన్ (తాబయి) రమజాన్ మాసంలో బనీ అబ్దల్అష్‌హాల్ మస్జీదులో ఇమాముగా నమాజు చేయించేవారు. అప్పుడు ఆయన నిజానికి బానిసగా ఉన్నారు. ఆయన నమాజు చేయిస్తున్న వారిలో బదర్, అక్బా యుద్ధాల్లో పాల్గొన్న ప్రముఖులు కూడా ఉండేవారు. *(తబఖాత్)*

స్వయంగా ఆయనే చెప్పిన మాటలు పరిశీలిస్తే ఈ విషయం ఇంకా స్పష్టంగా అర్థమవుతుంది.

"నేను రమజాన్‌లో బనీ అబ్దల్ అష్‌షల్ మస్జిదులో తరావీహ్ నమాజు చేయించేవాడిని. ఒకసారి ముహమ్మద్ బిన్ ముసల్లమా, సల్మా బిన్ సలామా బిన్ వఖ్షలు నా ఖుర్‌ఆన్ పారాయణాన్ని విన్నారు. వారు చాలా సేపు ఆగి ఖుర్‌ఆన్ విన్నారు. అప్పట్లో నేను బానిసగానే ఉన్నాను. వారిద్దరు నా ఖిరాత్ విని నేను ఇమామత్ చేస్తే అభ్యంతరం లేదని అన్నారు."

అదేవిధంగా హజ్రత్ ఆయెషా (రజి) బానిస జక్వాన్ కూడా నమాజుకు ఇమామత్ చేసేవారు. ఆయన వెనుక ఖురైష్ ప్రముఖులు నమాజు చేసేవారు. అబ్దుల్లా బిన్ అబీ మలైకా

ఈ విషయాలు తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి

"హ్రజత్ ఆయెషా (రజి) హుర్రా, షబీర్ మధ్య ఒక ప్రాంతంలో విడిది చేశారు. పెద్ద పెద్ద ఖురైష్ నాయకులు ఆమెను కలువడానికి వచ్చేవారు. నమాజు వేళయితే హ్రజత్ అబ్దుర్రహ్మాన్ అబీ బక్ర్ (రజి) మాకు ఇమామ్‌గా నమాజు చదివించేవారు. ఆయన లేనప్పుడు హ్రజత్ ఆయెషా (రజి) బానిస జక్వాన్ (రజి) ఇమామత్ బాధ్యతలు నిర్వర్తించేవారు."(తబఖాత్)

ఇంకో ఉటంకం ప్రకారం హ్రజత్ అబ్దుర్రహ్మాన్ (రజి) ఉన్నప్పుడు కూడా హ్రజత్ ఆయెషా (రజి) బానిస జక్వాన్ (రజి) నమాజుకు ఇమామత్ చేసేవారు. ఈ విషయాన్ని హ్రజత్ అర్వా తన తండ్రి చెప్పినట్లు తెలియజేశారు.

"హ్రజత్ ఆయెషా (రజి) బానిస జక్వాన్ (రజి) ఖురైష్ పెద్దలకు ఇమామత్ వహించేవారు. ఆయన వెనుక నమాజు చదివేవారిలో హ్రజత్ అబ్దుర్రహ్మాన్‌బిన్ అబూబక్ర్ (రజి) కూడా ఉండేవారు. ఎందుకంటే ఆయన వారందరి కన్నా చక్కగా ఖుర్‌ఆన్ చదివేవారు"

ఇదేవిధంగా హ్రజత్ ఉమర్ (రజి) షహీద్ అయినప్పుడు, హ్రజత్ సుహైబ్ (రజి)ను ఇమామత్ చేయవలసిందిగా పిలిచారు. ఫలితంగా హ్రజత్ ఉమర్ (రజి) జనాజా నమాజుకు కూడా ఆయన్నే నాయకుడిగా ప్రజలు నిలబెట్టారు. ఈ విషయాన్ని హ్రజత్ సయీద్ బిన్ ముసైబ్ ఇలా తెలియ జేశారు.

"హ్రజత్ ఉమర్ (రజి) ప్రాణాలు విడిచినప్పుడు ముస్లిములు ఫరజ్ నమాజును హ్రజత్ సుహైబ్ (రజి) చేయించడాన్ని చూశారు. కాబట్టి హ్రజత్ ఉమర్ (రజి) జనాజా నమాజుకు కూడా ఆయన్నే నాయకుడిగా ప్రజలు నిలబెట్టారు. ఆయనే హ్రజత్ ఉమర్ (రజి) జనాజా నమాజును చదివించారు." *(తబఖాత్)*

ఖుర్‌ఆన్, ధార్మిక విద్యాబోధన

దివ్యఖుర్‌ఆన్ నేర్పడం, ధార్మిక విద్యాబోధనల విషయంలో కూడా ఇస్లాం బానిసలకు ఇదే గౌరవాన్ని ఇచ్చింది. ప్రవక్త ముహమ్మద్ (స) ఖుర్‌ఆన్ నేర్చుకోవడానికి ఎవరి పేర్లు సూచించారో ఆ నలుగురిలో హ్రజత్ సాలమ్ (రజి), హ్రజత్ మౌలా అబీ హుజైఫా (రజి)లు కూడా ఉన్నారు. హ్రజత్ అబ్దుల్లా బిన్ ఉమ్రూ ఉటంకం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు

"ఖుర్‌ఆన్ జ్ఞానాన్ని నలుగురితో నేర్చుకోండి. అబ్దుల్లా బిన్ మసూద్ (రజి), అబూ హుజైఫా (రజి) స్వేచ్ఛ ఇచ్చిన బానిస సాలమ్ (రజి), అబీ బిన్ కాబ్ (రజి), మాజ్ బిన్ జబల్ (రజి) వద్ద నేర్చుకోండి" (తబఖాత్)

ఇదేవిధంగా యజీద్ బిన్ ఉమైరా ప్రకారం మాజ్ బిన్ జబల్ (రజి) ఆయనకు నలుగురి వద్ద ధార్మిక విద్య నేర్చుకోవాలని తాకీదు చేశారు. అందులో హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి) కూడా ఒకరు.

గవర్నర్ పదవి

విద్యాజ్ఞానాల ద్వారా గౌరవమర్యాదలు పొందడం మాత్రమే కాదు, ఇస్లాం బానిసలకు రాజకీయంగా కూడా నాయకత్వం వహించే స్థాయి కల్పించింది. ప్రవక్త (స) ఒక యుద్ధానికి వెళుతున్నప్పుడు హజ్రత్ జైద్ బిన్ హారిసా (రజి)ను మదీనాకు గవర్నర్‌గా నియమించి వెళ్ళారు. అలాగే హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి) మదాయన్ గవర్నర్‌గా నియుక్తులయ్యారు. ఆయన జీవితాంతం ఆ పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉన్నారు. అలాగే హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి)ను హజ్రత్ ఉమర్ (రజి) కూఫా గవర్నర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన కూఫా ప్రజలకు రాసిన లేఖలో హజ్రత్ అమ్మార్ (రజి)ను అత్యంత ఉత్తముడైన వ్యక్తిగా అభివర్ణించారు. పూర్తి నిజాయితీతో కొత్త గవర్నర్‌కు విధేయత చూపాలని ఆదేశించారు. ఆ లేఖ నేడు సువర్ణాక్షరాలతో రాయదగిన లేఖ. ఆ లేఖలో పంక్తులు ఇలా ఉన్నాయి.

"నేను అమ్మార్ బిన్ యాసిర్‌ను మీకు గవర్నర్‌గాను, అబ్దుల్లా బిన్ మసూద్‌ను మీకు మంత్రిగాను చేసి పంపుతున్నాను. అబ్దుల్లా బిన్ మసూద్ మీ ప్రజాధనాగారం బాధ్యతలు కూడా అప్పగిస్తున్నాను. ఈ ఇద్దరు ప్రవక్త (స) సహచరులు. అత్యంత ఉత్తములైన వారు. బద్ర్ యుద్ధంలో పాల్గొన్న వారు. మీరు వారికి విధేయత చూపండి. వారు చూపించిన మార్గాన నడవండి."

ఇది ఆనాటి ఖలీఫా ఇద్దరు బానిసలను గవర్నర్‌గాను, మంత్రిగాను నియమించి పంపిన సంఘటన. విచిత్రమేమంటే, అప్పటి కాలంలో నైతికతకు ఎంత ప్రాముఖ్యం ఉందంటే, ఇతర పాలకులు కూడా తమ వారసులుగా ఈ బానిసల వైపే చూసేవారు. పైగా ఖలీఫా వారిని ప్రోత్సహించేవారు. ఆమిర్ బిన్ వాసిలా ప్రకారం, నాఫ బిన్ అబ్దుల్ హారిస్ ఒకసారి హజ్రత్ ఉమర్ (రజి)ను ఆస్ఫాన్ వద్ద కలిసారు. హజ్రత్ ఉమర్ (రజి) వారిని మక్కాకు గవర్నర్‌గా చేసి పంపారు. ఆయన హజ్రత్ ఉమర్ (రజి)కు సలామ్ చేశారు. హజ్రత్ ఉమర్ (రజి) ఆయనతో మాట్లాడుతూ "మీరు ఇక్కడ ఉన్నారు, అక్కడ మక్కాలో

మీకు బదులు ఎవరిని నియమించి వచ్చారు" అని అడిగారు. దానికి ఆయన జవాబిస్తూ "నేను అబ్దుర్రహ్మాన్‌ను నియమించి వచ్చాను" అన్నారు. ఇది విని హజ్రత్ ఉమర్ (రజి) "ఆయనెవరు" అని ప్రశ్నించారు. దానికి ఆయన జవాబిస్తూ "మేము స్వేచ్ఛ ఇచ్చిన బానిసల్లో ఒకరు" అన్నారు. ఈ నియామకాన్ని ఆమోదిస్తున్నట్లు హజ్రత్ ఉమర్ (రజి) తలూపి "మీరు మీ వారసుడిగా అక్కడ మీరు స్వేచ్ఛ ఇచ్చిన బానిసను నియమించారా?" అని అడిగారు. దానికి ఆయన జవాబిస్తూ "ఖలీఫా! ఆయన దైవగ్రంథ జ్ఞానం కలవాడు, దైవాదేశాలు పాలించేవాడు" అని అన్నారు. ఈ మాటలు విని హజ్రత్ ఉమర్ (రజి) సంతోషాన్ని వ్యక్తం చేస్తూ "వినండి, ప్రవక్త (స) ఇలా అన్నారు "నిస్సందేహంగా ఈ దైవగ్రంథం ద్వారా అల్లాహ్ కొందరి స్థాయి పెంచుతాడు. కొందరి స్థాయి తగ్గిస్తాడు" అన్నారు. (దార్మి)

శరణు

ఇంతకు ముందు మనం చెప్పుకున్నట్లు ఇస్లామీయ సమాజంలో రంగు, వర్ణం, వంశం, జాతి విభేదాలకు స్థానం లేదు. అందరికి సమాన హక్కులు లభిస్తాయి. ఇందులో శరణు ఇవ్వడం, ఒప్పందం చేసుకోవడం వంటి హక్కులు కూడా ఉన్నాయి. ఇలాంటి అనేక ఉదాహరణలు మనకు ఇస్లామీయ చరిత్రలో కనబడతాయి. హజ్రత్ ఉమర్ (రజి) కాలంలో పర్షియా ప్రాంతంలో ముస్లిములు ఒక నగరాన్ని చుట్టుముట్టారు. నగరంలో ప్రతిఘటన చాలా తగ్గింది. ఇక నగరం స్వాధీనం కావడం తథ్యంగా కనబడింది. సరిగ్గా ఆ సమయంలో ముస్లిమ్ సైన్యంలో ఒక బానిస ఆ నగరవాసులకు శరణుపత్రం రాసి ఇచ్చాడు. దాన్ని ఒక బాణానికి కట్టి నగరంలోకి పోయి పడేట్లు చేసాడు. మరుసటి రోజు ముస్లిము సైన్యం నగరంపై దాడి చేసింది. కాని, నగరవాసులు నగర ముఖద్వారాన్ని తెరిచి బయటకు వచ్చేశారు. ఒక ముస్లిం తమకు శరణు ఇచ్చాడని ప్రకటించారు. ఇప్పుడు ఎందుకు దాడి చేస్తున్నారని నిలదీశారు. శరణుపత్రాన్ని తీసి చూపించారు. శరణుపత్రం చూస్తే సైన్యంలోని ఒక బానిస రాసిందిగా తేలింది. ఈ విషయం హజ్రత్ ఉమర్ (రజి) గారికి తెలియజేయడం జరిగింది. దానికి హజ్రత్ ఉమర్ (రజి) రాసి పంపిన జవాబు ఇస్లామీయ చరిత్రలో చిరస్థాయి పొందింది. ముస్లిం బానిస కూడా ఇతర ముస్లిముల వంటి వాడే. అతడు శరణు ఇస్తే దానికి ఇతర ముస్లిములు ఇచ్చిన శరణుతో సమానస్థాయి ఉంటుంది. అందువల్ల అతడు ఇచ్చిన శరణు అమలు చేయండి అని రాసి పంపారాయన.

సాధారణ జీవితం

సాధారణ సామాజిక జీవనంలో కూడా ఇస్లాం బానిసల విషయంలో ఇదే వైఖరిని

ప్రదర్శించింది. హ్రజత్ ఉమర్ (రజి) కాలంలోనే జరిగిన ఒక సంఘటన, కొందరు ఖురైష్ సర్దారులు ఖలీఫాను కలువడానికి వచ్చారు. వారిలో సుహైల్ బిన్ ఉమ్రూ (రజి), అబూ సుఫ్యాన్ (రజి), హారిసా బిన్ హిష్షామ్ (రజి) వంటి మహామహులు కూడా ఉన్నారు. వారితో పాటు హ్రజత్ సుహైబ్ (రజి), హ్రజత్ బిలాల్ (రజి), హ్రజత్ అమ్మార్ (రజి) కూడా ఉన్నారు. ఈ ముగ్గురు ఒకప్పుడు బానిసలుగా ఉన్నవారు. అయితే ఈ ముగ్గురు బద్ర్ యుద్ధంలో పాల్గొన్న వారు. హ్రజత్ ఉమర్ (రజి) గారికి బద్ర్ యుద్ధంలో పాల్గొన్న వారంటే అపార అభిమానం. అందువల్ల ఆయన మొదట ఈ ముగ్గురినే కలుసుకున్నారు. ఇది చూసి అబూసుఫ్యాన్ (రజి) కొద్దిగా కినుక వహించారు. ఆయన నోట క్రింది పదాలు అనుకోకుండా వెలువడ్డాయి.

"నేటి కన్నా ఎక్కువ కష్టతరమైన రోజు నా జీవితంలో మరొకటి లేదు. ఈ బానిసలకు లోపలికి వెళ్ళే అనుమతి లభించింది. మనం కూర్చుని ముఖాలు చూసుకుంటున్నాం. మన గురించి అడిగేవాడు లేడు." అన్నారు. కాని దీనికి జవాబు అక్కడే ఉన్న హ్రజత్ సుహైల్ బిన్ ఉమ్రూ (రజి) చక్కగా ఇచ్చారు.

"మీ ముఖాలపై విసుగును నేను చూస్తున్నాను. మీకిప్పుడు కోపం వస్తుంటే, అది మీపై మీకే రావాలి. ఎందుకంటే, జాతిని ఇస్లామ్ వైపునకు పిలిచినప్పుడు మిమ్మల్ని కూడా పిలిచారు. వారు ముందుగా వెళ్ళారు, మీరు ఇంట కూర్చుని ఉన్నారు. వినండి, దేవుని సాక్షి, అప్పుడు వారు ప్రదర్శించిన ధార్మికస్ఫూర్తి ఫలితంగా వారికి లభిస్తున్న గౌరవాదరాలు చూసి అసూయ పడితే దాని ఫలితం ఇంతకన్నా తీవ్రంగా ఉంటుంది." అన్నారు.

ఇదేవిదంగా ఒకసారి హ్రజత్ సల్మాన్ ఫార్సి (రజి) కలువడానికి వస్తే ఖలీఫా హ్రజత్ ఉమర్ (రజి) స్వయంగా తానే ముందుకు వచ్చి స్వాగతం పలికారు.

వీటన్నింటి కన్నా గొప్ప సంఘటన హ్రజత్ ఖాలిద్ (రజి)కు సంబందించినది. హ్రజత్ ఉమర్ (రజి) ఖలీఫాగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత చేపట్టిన అనేక చర్యల్లో హ్రజత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ను నిర్బంధించిన సంఘటన కూడా ఒకటి. ముస్లిము సైన్యాలు డెమస్కస్‌ను చుట్టుముట్టిన సున్నిత పరిస్థితుల్లో హ్రజత్ ఉమర్ (రజి), అక్కడ సైన్యాన్ని నడుపుతున్న హ్రజత్ ఖాలిద్ బిన్ వలీద్‌ను నిర్బంధించే ఆదేశం ఇచ్చారు. మరో ఉటంకం ప్రకారం ఈ ఆదేశం యర్మూక యుద్ధం సందర్భంగా ఇచ్చారు. హ్రజత్ ఖాలిద్ (రజి) స్థానంలో హ్రజత్ ఉబైదా బిన్ జరాహ్‌ను సైన్యాధిపతిగా నియమించారు. హ్రజత్ అబూ ఉబైదా ఈ ఆదేశాన్ని దాచి ఉంచారు. విజయం సంపూర్ణం కావడానికి ముందు ఈ ఆదేశాన్ని బయట పెట్టాలనుకున్నారు. హ్రజత్ ఉమర్ (రజి)కు తన ఆదేశానికి

జవాబు రావడంలో ఆలస్యం కావడంతో మళ్ళీ రాశారు. అంతేకాదు, ఆ ఆదేశాన్ని బహిరంగంగా ముస్లిములందరి ముందు చదివి వినిపించాలని కూడా తాకీదు చేశారు. హజ్రత్ అబూ ఉబైదా (రజి)కు హజ్రత్ ఖాలిద్ (రజి) వంశ ప్రతిష్ఠ, ఆయన ధైర్యసాహసాలు, ఆయన యుద్ధనైపుణ్యం, అంతేకాదు, ఖాలిద్ (రజి) పట్ల సైన్యానికి ఉన్న విధేయత అన్నీ తెలుసు. అందువల్ల ఖలీఫా ఆదేశాన్ని అమలు చేయడానికి సంకోచించసాగారు. చివరికి బహిరంగంగా ఆ ఆదేశాన్ని అందరి ముందు చదివారు. ఈ ఆదేశం విన్న హజ్రత్ బిలాల్ (రజి), ఒకప్పటి బానిస, వెంటనే హజ్రత్ ఖాలిద్ (రజి)ను నిర్బంధించి, ఆయన నివాసాన్ని తనిఖీ చేయమన్న ఆదేశాన్ని అమలు చేశారు.

ఈ సంఘటన ద్వారా హజ్రత్ ఖాలిద్ (రజి) ధర్మపరాయణత, ఇస్లాం పట్ల విధేయతలు స్పష్టం అవుతున్నాయి. ఆయన ప్రతిష్ఠాత్మకమైన బనీ మఖ్‌జూమ్ తెగకు నాయకుడు. ఆయన యుద్ధనైపుణ్యం విశ్వవిఖ్యాతి గాంచింది. ఆయన ధైర్యసాహసాలు పూర్తి అరబ్బు లోకానికి తెలుసు. ఆయన పట్ల సైన్యానికి ఉన్న విధేయత కూడా అందరికీ తెలిసిందే. అలాంటి వ్యక్తి ఖలీఫా ఆదేశం వినగానే తలవంచుకుని బందీ అయ్యాడు. తన మనసులో ఎలాంటి భావాలు రానీయలేదు. ఈ సంఘటనలో తెలిసే మరో వాస్తవ మేమంటే, ఇస్లామీయ సమాజంలో అసమానతలు చూడ్డానికి కూడా కనబడవన్నది స్పష్టం అయ్యింది. హజ్రత్ ఖాలిద్ (రజి) స్థాయి వ్యక్తి ఒక మామూలు స్వేచ్ఛ పొందిన బానిస ముందు తన తల వంచాడు. ఆయనకు తన వంశప్రతిష్ఠ గురించి ఏమాత్రం పట్టలేదు.

ఈ ఇద్దరు కూడా ఇస్లాంలో ప్రముఖులు. వారికి ఇస్లామీయ చరిత్రలోనే కాదు, మానవచరిత్రలో ఒక ప్రత్యేకస్థానం ఉంది. స్వేచ్ఛ సమానత్వం వంటి విలువల విషయానికి వస్తే అప్పటి నుంచి నేటివరకు ముస్లిం సమాజంలో ఈ విలువలు కొనసాగుతూనే ఉన్నాయి. పద్నాలుగు శతాబ్దాల చరిత్రలో ముస్లిం సమాజం ప్రతి కాలంలోను సమానత్వాన్ని ఆదర్శప్రాయంగా ప్రదర్శిస్తూనే వచ్చింది. వంశం, వర్ణం, తెగ, జాతి, ప్రాంతం, భాషా భేదాలు లేకుండా యోగ్యత ఉన్న వారికి ఎల్లప్పుడు ఉన్నత స్థానం లభిస్తూ వచ్చింది. నేడు కూడా మొరాకష్ నుంచి ఇండోనేషియా వరకు ప్రపంచంలో ముస్లిం దేశాల్లో ఈ సమానత్వ కుసుమాలు వికసిస్తూనే ఉన్నాయి. వంశప్రతిష్ఠ, జాతి ఔన్నత్యం లేకపోయినా ముస్లిం సమాజంలో లభించే సమానత్వం ఫలితంగా ఉన్నత స్థాయి సాధించిన వారి జాబితా ప్రతి దేశంలోను లభిస్తుంది.

నాల్గవ అధ్యాయం

ఇస్లామీయ సమతాభావంపై విమర్శలు- జవాబులు

1. బానిసత్వం

స్వేచ్ఛా సమానత్వ భావాలను ఇస్లాం అంతగా ఆదరిస్తున్నట్లయితే ఇస్లాంలో బానిసత్వానికి స్థానం ఎలా లభించిందన్న ప్రశ్న తలెత్తవచ్చు. ఈ ప్రశ్నకు సూటిగా స్పష్టంగా సమాధానముంది. ఇస్లాం బానిసత్వాన్ని ఆరంభించలేదు. కేవలం భరించింది. మానవ చరిత్రలో బానిసత్వమన్నది ప్రాచీన కాలం నుంచి కొనసాగుతూ వస్తున్న దురాచారం. గ్రీసుకు చెందిన ప్రసిద్ధ తత్వశాస్త్రాలు స్వతంత్రులు, బానిసలు అన్న విభజనను ఆమోదించాయి. గ్రీసు తత్వవేత్తలు నాగరికతా వికాసంలో బానిసత్వం అన్నది అనివార్యమైన అంశంగా భావించేవారు.[1]

విశ్వవిఖ్యాత రోమన్ సామ్రాజ్యంలోనూ ఈ దురాచారం తీవ్రస్థాయిలో ఉండేది. ఈ నాగరిక జాతుల్లో బానిసల పరిస్థితి ఎలా ఉండేదంటే, అరిస్టాటిల్ మాటల్లో చెప్పాలంటే..

“బానిస అంటే ఒక పనిముట్టు. అయితే సజీవ పరికరం. ఇంకా బానిస ఒక ఆటబొమ్మ. జీవమున్న ఆటబొమ్మ. ”

ప్రతి కాలంలోను నాగరికతకు దానిదైన ప్రత్యేకతలు ఉంటాయి. ప్రతి నాగరికతకు దానిదైన ప్రత్యేక నిర్మాణం ఉంటుంది. ఈ నాగరికతలను ఒక్కసారిగా మార్చడం సాధ్యం కాదు. ఈ విషయమై ఎంతో దూరం ఆలోచించనక్కర్లేదు, మన భారతదేశాన్నే తీసుకుంటే స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచిపోయాయి. భారత రాజ్యాంగంలోని మౌలిక హక్కుల ప్రకరణలో స్వేచ్ఛా సమానత్వాలు ప్రతి భారతీయునికి వర్గ, వర్ణ జాతి విచక్షణ లేకుండా

1. *రూసో, రాజకీయం, మొదటి సంపుటం, అధ్యాయం 4, ఇస్లాంమే గులామీకి హకీకత్ ఆధారం.*

లభించాయి. అంతేకాదు, సంవిధాన మార్గదర్శక సూత్రాలలో దేశంలోని అణగారిన వర్గాలను ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందేలా చేయాలని ఉంది.[1]

కాని దశాబ్దాలు గడిచినా నేటికి కూడా పరిస్థితి ఎలా ఉందంటే నిరుత్సాహమే మిగులుతుంది. దళిత జనాలపై జరుగుతున్న హత్యాకాండలు, అణిచివేతల చర్యలే నేటి పరిస్థితికి అగ్రకుల అహంకారానికి దర్పణం పడుతున్నాయి. అగ్రవర్ణాలు దళితులపై దాడిచేసి సజీవంగా దహనం చేసిన సంఘటనలను కాలిన శరీరాల ఫోటోలతో సహా జాతీయ వార్తాపత్రికలు ప్రచురించాయి.

ఈ నేపథ్యంలో ఒక దురాచారాన్ని తుదముట్టించడానికి ఎంతటి ప్రయాస అవసరమో అంచనా వేయవచ్చునో ఈ పరిస్థితుల దృష్ట్యా బానిసత్వ క్రూర దురాచారాన్ని రూపుమాపడానికి గాను దీర్ఘకాలిక ప్రణాళిక అనుసరించడం తప్ప మరో మార్గం లేదు. ఈ లక్ష్యాన్ని అంటే బానిసత్వ దురాచారాన్ని రూపుమామపడానికి గాను ఇస్లాం తన అనుయాయుల ముందు బానిసలకు స్వేచ్ఛ నివ్వడం వల్ల లభించే పుణ్యఫలాలను ప్రస్తావించింది. అందుకోసం అసంఖ్యాక సందర్భాలను సూచించింది. ఆయా సందర్భాలలో బానిసలకు స్వేచ్ఛ ప్రసాదించడం తప్ప వేరే మార్గం లేకుండా చేసింది.[2]

ఇంకా ఇస్లామ్ బానిసల పట్ల వ్యవహరించవలసిన తీరుపై చేసిన తాకీదుల గురించి బానిసలపై ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడకుండా కఠినంగా నిరోధించిన విధానం గురించి ఇంతకు ముందు పేజిల్లో తెలుసుకున్నాము. ఇక మూడవ విషయమేమంటే, ఇస్లామ్ బానిసలకు సమస్త మానవహక్కులను, మిగిలిన స్వతంత్ర మానవులకు లభించే హక్కులన్నీ ప్రసాదించింది. ఈ వివరాలు కూడా మనం తెలుసుకున్నాము.

ఇస్లామ్ సృష్టించిన ఈ వాతావరణం ఫలితంగా ప్రవక్త (స) ప్రత్యక్ష సహచరుల కాలంలో బానిసల వర్గం నుంచి ఉద్భవించిన అత్యున్నత పురుషుల గురించి చర్చ ఇంతకు ముందు పేజిల్లో గడిచింది. ఆ తరువాతి కాలాల్లో బానిస వర్గంలో పుట్టిన ఉన్నత వ్యక్తుల్లో ముహమ్మద్ బిన్ సిరీన్ (రఅ), ఇమామ్ మాలిక్ (రఅ), ఉస్తాద్ నాఫా, అబ్దుల్లా బిన్ ముబారక్ (రఅ), అక్రం (రఅ), ముహమ్మద్ బిన్ ఇస్‌హాఖ్ (రఅ). అతాబిన్ రబా (రఅ), తాఉస్ బిన్ కైసాక్ (రఅ), యజాద్ బిన్ జబీల్ (రఅ), ఇమామ్ మక్‌హూల్ (రఅ), మైమూన్ బిన్ మహ్‌రాన్ (రఅ), ఇమామ్ జహాక్ (రఅ), ఇబ్రాహీం వఖీ (రఅ) తదితరులున్నారు.

1. *భారత రాజ్యాంగం, మౌలిక హక్కులు, మర్గదర్శక సూత్రాలు.*
2. *ఉదాహరణకు పరిహారాల విషయంలో (మాయిదా : 89), హత్యకు పరిహారం (నిసా 92), కుఫ్ఫారా జహార్ (ముజాదిలా 23) మొదలైనవి.*

ఈ మహానుభావులను నేటికీ ముస్లిం ప్రపంచం గౌరవాదరాలతో సంస్మరిస్తుంది. జ్ఞానం రీత్యా అగ్రస్థానానికి ఎదిగిన వారిని మాత్రమే కాదు, భారతదేశంలోను, ఈజిప్టులోను బానిస వంశస్థుల ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కుతూబుద్దీన్ ఐబక్, షంషుద్దీన్ అత్మష్, గీయాసుద్దీన్ బల్బన్ లాంటి గొప్ప గొప్ప రాజులు బానిస వర్గం వారే. ఈజిప్టులో ఈ ప్రభుత్వాలు 300 సంవత్సరాల కాలం చెక్కుచెదరలేదు. *(1215 - 1517)*

ఈ ప్రభుత్వాలను చూసి ప్రొఫెసర్ హతీకి క్రిందివిధంగా అంగీకరించక తప్పలేదు.

"ముస్లిముల చరిత్రలో తప్ప ఇలాంటి వంశాలు ఇంత గొప్ప స్థానాన్ని అందు కోవడం అసాధ్యంగా భావించవచ్చు"[1]

స్వేచ్ఛా సమానత్వాల నినాదాలను మిన్నంటేలా చేస్తున్న కొన్ని జాతుల్లో 19వ శతాబ్ధం అర్ధభాగం వరకు ఈ దురాచారం అతి క్రూరంగా ఆచరణలో ఉండేదన్న వాస్తవం తెలుసుకుంటే ఇస్లామ్ సాధించిన విజయాలు మరింత లోతుగా మన హృదయాలను తాకుతాయి. నాగరిక యూరోపియన్లు ఆఫ్రికా ఉంచి బానిసలను పశువుల్లా పట్టి తెచ్చేవారు. వారితో పూర్తిస్థాయి వ్యాపారం చేసేవారు. ఈ క్రూర కృత్యం వల్ల చివరికి ఆఫ్రికా ఖండం లోని కొన్ని జాతులే నశించిపోయాయి. దక్షిణ అమెరికాలో బానిసల పరిస్థితి ఎంత హీనంగా ఉండేదంటే వారిని సజీవదహనం చేసేవారు. బండి చక్రాల క్రింద నుజ్జు నుజ్జు చేసేవారు. అదేవిధంగా, అమెరికాలో శ్వేతజాతి స్త్రీలతో సంబంధం కలిగి ఉన్న బానిసలకు క్రూరమైన ఒక శిక్ష విధించేవారు. ఆ శిక్ష ఏమంటే బానిస శరీరానికి తారుపూసి నిప్పంటిం చేవారు. 19వ శతాబ్ధంలో బానిసత్వ నిర్మూలనానికి ఆమోదించబడ్డ బిల్లులు మానవతా దృక్పథంతో చేసినవి కావు. ఆర్థిక కారణాల దృష్ట్యా చేసినవి. పారిశ్రామిక విప్లవం తర్వాత యూరప్ బానిసత్వ నిర్మూలనానికి చర్యలు తీసుకుంది. పారిశ్రామిక విప్లవ ఫలితంగా లభిం చిన యంత్ర సామాగ్రి బానిసలకన్నా చవుకైనది, లాభసాటి అయినది. ఇక యూరప్ తెల్ల వారికి బానిసలను మేపవలసిన అవసరం లేకుండా పోయింది. అయినప్పటికీ 1930 వరకు ప్రపంచంలో యాభై లక్షల మంది బానిసలు ఉండేవారు. కాగా, 1926లో నానాజాతి సమితిలో ప్రపంచంలోని 28 ప్రముఖ ప్రభుత్వాలు తమ దేశాల్లో బానిసత్వాన్ని నిర్మూలిం చడానికి ప్రతిజ్ఞ చేసినప్పటికీ ప్రపంచంలో బానిసలున్నారు. వాస్తవాలు ఇలా ఉన్నప్పటికీ

---

1. *ఇస్లామీయ చరిత్రలో వివిధ రంగాల్లో ఎలాంటి ఉన్నత స్థానాన్ని పొందిన బానిసలు ఉన్నారు. వారు ఎలాంటి ఘనకార్యాలు సాధించారన్న వివరాలు కోసం సయ్యద్ అహ్మద్ అక్బరాబాది రాసిన పుస్తకం గులామానె ఇస్లామ్ చూడండి.*

ఎవరైనా ఇస్లామ్‌పై బానిసత్వం సాకుతో కువిమర్శలు చేస్తే దానికి జవాబు ఒక్కటే గురువింద వైఖరి మానుకొమ్మనడమే.

జిజియా

జిజియా విషయంలోను చాలా విమర్శలు వస్తుంటాయి. ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతర పౌరులపై వివక్షతో సుంకాన్ని విధించి సమానతా నియమాలను భంగపరుస్తున్నారని ఆరోపణలు, ఓ జాతి వారిపట్ల పక్షపాతం చూపారన్న అభియోగాలు వినిపిస్తున్నాయి. ఈ విమర్శలు అవగాహనా లోపం వల్ల తలెత్తే విమర్శలు మాత్రమే. ప్రపంచంలో ఏ ప్రభుత్వమూ తన ఆర్థిక అవసరాల భారాన్ని ఏదో ఒక వర్గంపై వేసిన ఉదాహరణ ఒక్కటి కూడా లేదు. ఇస్లామీయ ప్రభుత్వంలో ముస్లిమ్ పౌరులు జకాత్, సదకాత్ తదితర రూపాల్లో ప్రభుత్వానికి చెల్లిస్తుంటారు. ఇవేకాక దేశంలో శాంతిభద్రతల పరిరక్షణ, సరిహద్దుల భద్రత కూడా వారిపైనే ఉంటుంది. ఇస్లామీయ రాజ్యంలో నివసించే ముస్లిమేతర పౌరుల రక్షణ బాధ్యత ఇస్లామీయ ప్రభుత్వానిదే. అంతేకాదు, రాజ్య రక్షణకు సైనిక విధుల నుంచి వారికి మినహాయింపు ఉంటుంది. జిజియా రూపంలో ఇస్లామీయ ప్రభుత్వం వారి నుంచి పన్ను వసూలు చేస్తుంది. ఈ పన్ను నిజానికి వారికి సైనిక విధుల నుంచి మినహాయింపు ఇవ్వడం వల్ల, దేశంలో శాంతిభద్రతల పరిరక్షణకు గాను విధించే పన్ను. ముస్లిములు జకాత్ తదితర రూపాల్లో పన్నులు చెల్లిస్తే, ముస్లిమేతరులు జజియా రూపంలో పన్ను చెల్లిస్తారు. పైగా ముస్లిములు ఒకవేళ ముస్లిమేతరులకు రక్షణ కల్పించే బాధ్యత నెరవేర్చలేని పరిస్థితి ఉంటే, వారి నుంచి జిజియా వసూలు చేసే హక్కు కూడా ఇస్లామీయ ప్రభుత్వం కోల్పోతుంది. ఈ ఉదాహరణలు ఇస్లామీయ చరిత్రలో ఉన్నాయి. రక్షణ కల్పించలేని పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు ఇస్లామీయ ప్రభుత్వాలు వసూలు చేసిన జిజియా తిరిగి చెల్లించాయి. (అల్ ఫారూఖ్, షిబ్లి నోమాని). అదేవిధంగా ముస్లిమేతరుల నుంచి తీసుకునే ఈ మొత్తం ఎంత ఉండాలన్న విషయానికి వస్తే, వారి ఆర్థిక స్తోమత ప్రకారం ఉంటుంది. వారికి చెల్లించడం కష్టమయ్యే స్థాయిలో ఉండరాదు. ఇలాంటి అసమతుల్యాలను ప్రవక్త (స) పూర్తిగా నిషేధించారు.

"ముస్లిమ్ ఒడంబడికదారు (ముస్లిమేతర పౌరుడు)ని పై దౌర్జన్యం చేసినా లేదా అతని హక్కును కాజేసినా, లేదా అతని శక్తికి మించిన (రక్షణా రుసుము) భారం వేసినా, లేదా అతని వస్తువు ఏదయినా బలత్కారంగా దోచుకున్నా ప్రళయదినాన, దైవన్యాయ స్థానంలో ఆ ముస్లిమ్ మీద జరిగే విచారణలో నేను ఆ ముస్లిమేతరుని వకీలై నిలబడతాను"అని ప్రవక్త ముహమ్మద్ (స) పలికారు." (అబూదావూద్)

ఈ ధర్మసూత్రాల ఆధారంగా ఇస్లామీయ ధర్మవేత్తలు దీనికి సంబంధించి సంపూర్ణమైన వివరాలు ఇచ్చారు. అందువల్ల ఈ ధర్మసూత్రాలు ఆచరణలో ఉండగా వారిపై ఎలాంటి అన్యాయమూ జరిగే అవకాశం లేదు.

సరే ఇది ఇస్లామీయ ప్రభుత్వాల వైఖరి. ఈ ప్రభుత్వాలు నేటికి పద్నాలుగు వందల సంవత్సరాల క్రితం ప్రవక్త (స) స్థాపించినవి. మరోవైపు నేటి ఆధునిక నాగరిక ప్రభుత్వాల వైఖరి కూడా చూద్దాం. న్యాయం, స్వేచ్ఛ సమానత్వాల ధ్వజవాహకులుగా చెప్పుకునే ఈ ప్రభుత్వాలు వలసరాజ్యాలు స్థాపించి చేసిన అన్యాయాల చరిత్ర పాతదేం కాదు. ఈ దేశాలు ఎలాంటి అన్యాయాలు, దౌర్జన్యాలకు పాల్పడ్డాయో చెప్పడానికి వలసప్రాంతాల చరిత్ర చదివితే చాలు. వలస ప్రాంతాల్లో ఆర్థిక దోపిళ్ళకు పాల్పడిన చరిత్ర కూడా వీటికే స్వంతం. వలసప్రాంతాల వనరులన్నింటిని దోచుకుని తమ ప్రాంతం అభివృద్ధికి వాడుకున్న దోపిడీ చరిత్ర అందరికి తెలిసిందే. ఈ దోపిడిని న్యాయబద్ధమైనదిగా భావించేవారు. నేడు పాశ్చాత్యదేశాల సంపదకు కారణం వారి స్వంత కృషి మాత్రమే కాదు, వలస రాజ్యాల్లో సాగించిన దోపిడి కూడా దానికి కారణమే. బీద, వెనుకబడిన దేశాల్లో సాగించిన దోపిడీల ఫలితం కూడా ఈ సంపద వెనుక ఉంది.[1]

పాశ్చాత్య దేశాలను ప్రశంసిస్తూ, పాశ్చాత్యదేశాలు చెప్పే మాటలకు తలూపుతూ, అవసరమైనప్పుడు పాశ్చాత్యదేశాలకు అనుకూలంగా ఇస్లామ్‌పై విమర్శలు చేస్తూ గడిపే దేశాలు కూడా ఉన్నాయి. పాశ్చాత్యదేశాలతో కలిసి ఈ దేశాలు కూడా ఇస్లామ్‌పై ఆరోపణలు చేయడానికి, ఇస్లామ్‌పై బురదజల్లడానికి ప్రయత్నించడం జరుగుతూనే ఉంది. ఈ ఆరోపణలలో అసత్యాన్ని రుజువు చేయడానికి మరో నిదర్శనమేదీ అక్కరలేదు, ముస్లిం సమాజంలో నిర్దిష్ట స్తోమత ఉన్న ప్రతిఒక్కరు తమ సంపదలో రెండున్నర శాతం, తమకున్న భూముల నుంచి వచ్చే ఉత్పత్తిలో పదిశాతం తమ సమాజంలోని బీదవారి కోసం తప్పని సరిగా ఖర్చు చేస్తారన్నది ఇప్పటికీ కాదనలేని సత్యం. ఈ ఖర్చు చేస్తున్నప్పటికీ ఆ ముస్లిములు తాము నివసిస్తున్న ప్రాంతంలో ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్నులు, శుంకాలు కూడా చెల్లిస్తూనే ఉంటారు. ఇతర మతస్తులతో పాటు ప్రభుత్వపన్నులు, టాక్సులు

1. *1890లో డచ్ వారిని ఓడించి బ్రిటన్ దక్షిణాఫ్రికాలో తన వలస పాలన స్థాపించిన తర్వాత అక్కడ బంగారు గనుల నుంచి లభించే సొమ్ము బ్రిటన్‌లోని చర్చిలకు వెళ్ళేది. ఆ సొమ్మును ఆ చర్చిలు తమ సౌకర్యాలకు ఖర్చు చేసేవి. బ్రిటన్‌లోని ఇతర సంస్థలకు కూడా ఈ బంగారు గనుల్లో షేర్లు ఉండేవి. కాని దక్షిణాఫ్రికాలో నల్లజాతి వారికి మాత్రం తినడానికి తిండి కూడా ఉండేది కాదు.*

చెల్లిస్తూ, మరోవైపు జకాత్ రూపంలో ఈ చెల్లింపులు కూడా చేస్తూ ఉంటారు. ఇవన్నీ చేస్తున్నప్పటికీ వారి ధనప్రాణాలకు లభిస్తున్న రక్షణ అంతంతమాత్రమే. అనేక కమిటీల రిపోర్టులు ఈ వాస్తవాన్ని చాటిచెబుతున్నాయి. ముస్లిములు మైనారిటీలుగా ఉన్న ప్రతి ప్రాంతంలో వారికి వివక్షను ఎదుర్కోవడం తప్పడం లేదు.

3. కిఫాలత్

కిఫాలత్ అంటే వివాహం విషయంలో కూడా ఇస్లామీయ బోధనలపై అరోపణలు వినిపిస్తున్నాయి. ఇస్లాం వివాహం విషయంలో ఇచ్చిన అనుమతులు ఇస్లాం చెప్పే సమానత్వానికి అనుగుణంగా లేవని విమర్శలు గుప్పించేవారు చాలా మంది ఉన్నారు. కాని కొద్దిగా ఆలోచిస్తే ఇస్లామీయ బోధనల్లోని ఔచిత్యం ఎవరికైనా అర్థం అవుతుంది. వివాహం విషయంలో ఇస్లామ్ నైతిక ఔన్నత్యానికి మొదటి ప్రాధాన్యం ఇస్తుంది. వివాహసంబంధం నిశ్చయించుకునేటప్పుడు, వధువు విషయంలో అయినా, వరుని విషయంలో అయినా ధర్మపరాయణత, నైతిక నడవడికలకు చాలా ప్రాధాన్యం ఇస్తుంది. కాని వివాహబంధం పటిష్టంగా ఉండాలంటే వధువరుల మధ్య అవగాహనకు తోడ్పడే అంశాలను కూడా దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. ఎవరైనా వ్యక్తి వ్యాపారంలో మరో భాగస్వామిని ఎంచుకోవాలనుకున్నప్పుడు, ఆ వ్యాపార భాగస్వామితో తనకు పొత్తు కుదురుతుందా లేదా అన్నది ఒకటికి పది సార్లు చూసుకుంటాడు. తన స్వభావంతో అతడి స్వభావం కలుస్తుందా లేదా అన్నది కూడా చూసుకుంటాడు. వారిద్దరి స్వభావాల మధ్య తీవ్రమైన అంతరం ఉంటే ఆ వ్యాపార భాగస్వామ్యం ఏమాత్రం నిలబడదు. అదే విధంగా తన జీవితాన్ని పంచుకునే జీవితభాగస్వామి ఎంపిక విషయంలోను ఈ అంశాలను దృష్టిలో ఉంచుకోవడం అవసరం అవుతుంది. అందువల్లనే పెళ్ళి విషయంలో ఇస్లామ్ కిఫాలత్ అన్న నిబంధనను కూడా ఉంచింది. ఈ నిబంధన పెళ్ళి చేసుకునే వధువరుల స్వభావం, అలవాట్ల మధ్య పొంతనకు సంబంధించినది మాత్రమే.

సాధారణంగా కిఫాలత్ గురించి జరిగే ప్రస్తావనను చూస్తే ఇది పెళ్ళి విషయంలో వంశం లేదా జాతికి సంబంధించిన నిబంధనగా కనిపిస్తుంది. కాని కిఫాలత్ అలాంటి నిబంధన కాదు. కిఫాలత్‌కు సంబంధించి ధర్మవేత్తలు నాలుగు అంశాలను పేర్కొన్నారు. అవి: ధర్మపరాయణత, స్వేచ్ఛ, వంశం, వృత్తి. మరికొందరు ధర్మవేత్తలు ఈ నాలుగు అంశాలతో పాటు లోపాలు లేకపోవడం, సంపద అన్న మరి రెండు అంశాలను కూడా ప్రస్తావించారు. ఈ ఆరు అంశాలను పరిశీలిస్తే ఇస్లామ్ పెళ్ళి సంబంధాల విషయంలో

ఈ కిఫాలత్ నిబంధన ఎందుకు పెట్టిందో అర్థం అవుతుంది. పెళ్ళి సంబంధాల విషయంలో మొదటి అంశం ధర్మపరాయణత, వంశం, వర్ణాలకు సంబంధించినది కాదు. మిగిలిన అంశాలు జీవనశైలి, అలవాట్ల దృష్ట్యా ఇద్దరి మధ్య సమతుల్యం సాధించడానికి, వివాహ బంధాన్ని ఎన్నడూ విచ్ఛిన్నం కాని స్థాయిలో పటిష్ట పరచడానికి ఉద్దేశించినవి మాత్రమే.

ఇస్లాం దృష్టిలో ఔన్నత్యానికి ప్రమాణాలు ధర్మపరాయణత, దైవభీతి మాత్రమే. మిగిలిన జీవనరంగాల మాదిరిగానే వివాహం విషయంలో కూడా ఈ రెంటికే ప్రాముఖ్యం ఇచ్చింది. దివ్యఖుర్ఆన్, హదీసుల నుంచి మనకు ఇందుకు సంబంధించిన అనేక బోధనలు లభిస్తాయి. ఇందులో కొన్నింటి గురించి ఇంతకు ముందు వివరించాము. ఇమామ్ మాలిక్ (రఅ) ప్రకారం కిఫాలత్‌లో ధర్మపరాయణత తప్పనిసరి అంశం. ప్రవక్త సహచరుల్లో అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), అబ్దుల్లా బిన్ మసూద్ (రజి)ల అభిప్రాయం కూడా ఇదే. అలాగే తాబయిన్‌లలో ముహమ్మద్ బిన్ సీరీన్, ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్‌లు కూడా ఇదే అభిప్రాయాన్ని ప్రకటించారు. ప్రవక్త ముహమ్మద్ (స) స్వయంగా హజ్రత్ సఫియా (రజి)కు స్వేచ్ఛ ఇచ్చి ఆమెను వివాహం చేసుకున్నారు. అలాగే ప్రవక్త (స) పత్నులలో హజ్రత్ జువైరియా (రజి) వివాహం కూడా ఇలాంటిదే. అలాగే ప్రవక్త ముహమ్మద్ (స) తాను స్వేచ్ఛ ఇచ్చిన బానిస హజ్రత్ జైద్ బిన్ హారిసా (రజి) వివాహాన్ని తన మేనత్త కూతురైన జైనబ్ బింతె జహష్ (రజి)తో జరిపించారు. జైద్ బిన్ హారిసా (రజి) కుమారుడు ఉసామా బిన్ జైద్ (రజి)కు ఫహర్ తెగలో ఉన్నత వంశస్థురాలు ఫాతిమాతో జరిపించారు. అదేవిధంగా హజ్రత్ బిలాల్ (రజి) వివాహం హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) సోదరి హాలా బింతె ఔఫ్‌తో జరిగింది. హజ్రత్ సాలమ్ (రజి) స్వేచ్ఛ పొందిన బానిస. ఆయనకు హజ్రత్ హుజైఫా (రజి) స్వేచ్ఛ కల్పించారు. ఆ తర్వాత తన అన్న కుమార్తె హింద్‌ను ఇచ్చి వివాహం చేశారు. అలాగే అబుల్ కబీర్ కుమారులు చాలా సార్లు కోరినందువల్ల వారి సోదరిని హజ్రత్ బిలాల్ (రజి)కు ఇచ్చి వివాహం చేయడానికి ప్రవక్త (స) సమ్మతించారు. ఈ సందర్భంగా ఆయన చెప్పిన మాటలు :

"బిలాల్ (రజి)తో మీకెలాంటి సంబంధం. స్వర్గార్హత ఉన్న బిలాల్ (రజి)తో మీకేం సంబంధం"

అలాగే అబుల్ హింద్ (రజి) ఒక బానిస. బనూ బయాజా తెగలో ఆయన బానిసగా ఉండేవారు. ఆయన చేసే పని కూడా తక్కువ స్థాయికి చెందినదే. ఆయన గురించి చెబుతూ ప్రవక్త (స) ఇలా అన్నారు.

"బనూ బయాజా ప్రజలారా! అబుల్ హింద్ (రజి)కు మీ వంశంలోనే పెళ్ళి చేయండి. ఆయన వంశంలో మీరు పెళ్ళిసంబంధాలు చేసుకోండి" (తబఖాత్)

సమస్త జీవనరంగాల్లో ఇస్లామ్ ధర్మపరాయణతకు, నైతిక ప్రమాణాలకు ప్రాముఖ్యం ఇచ్చింది. వివాహం విషయంలోను ఇవే ప్రమాణాలు. ప్రవక్త సహచరుల కాలం నుంచి ఇవే ప్రమాణాలు అమలవుతు వస్తున్నాయి. వివాహం విషయంలో వధువరుల ఎంపికలో ఈ ప్రమాణాలకే పెద్ద పీట వేయడం జరిగింది. సమాజంలో అసమానతలను పెకలించి వేసే సామర్థ్యం ఉన్నప్పుడు, అలవాట్లు, జీవనశైలి తదితర విషయాలకు సంబంధించిన కిఫాలత్ నియమాన్ని కూడా పక్కనపెట్టి కేవలం ధార్మిక సంబంధం ఆధారంగా వివాహాలు జరుపవచ్చు. ఇలాంటి వివాహాలు కొన్ని సందర్భాల్లో అభిలషణీయమైనవిగా కూడా పరిగణన పొందుతాయి. అసమానతల అంశాలు ఒక్కోసారి సమాజంపై తీవ్రమైన ప్రభావాన్ని కలిగి ఉంటాయి. అందువల్ల సాధారణ పరిస్థితుల్లో, సమాజంలో ఉన్న అసమానతల ప్రభావం దృష్ట్యా, వివాహబంధం కలకాలం మనగలిగేలా ఉండడానికి గాను కిఫాలత్‌కు సంబంధించిన కొన్ని అంశాలను కూడా దృష్టిలో ఉంచుకోవడం అవసరమవుతుంది. అయితే ధర్మపరాయణతతో వధువరులు వివాహబంధంలో ఒక్కటవ్వాలని నిర్ణయించుకున్నప్పుడు, కిఫాలత్ నియమాల ప్రకారం జోడి సరిగా లేకున్నా, ఇస్లాం దృష్టిలో ఈ వివాహం సముచితమైనదే.

---

1. *కిఫాలత్‌కు సంబంధించిన హదీసులన్నీ ఆధారాల రీత్యా బలహీనమైనవన్నది కూడా ఇక్కడ గమనించాలి. హాఫిజ్ ఇబ్నె హజర్ ప్రకారం ఈ విషయమై ఆధారాలు బలంగా ఉన్న హదీసు ఏదీ లేదు (ఫతవుల్ బారీ). కాని ఇందుకు సంబంధించిన హదీసులు ఉన్నందువల్ల ధర్మవేత్తలు దీనిని స్వీకరించారు. అందువల్ల ప్రాధాన్యత ప్రశ్న ఉత్పన్నమైతే ఇస్లాంలో మౌలిక ప్రాధాన్యతగా ఉన్న ధర్మపరాయణత, దైవభీతులకు ప్రధమ ప్రాధాన్యం లభిస్తుంది.)*

రిఫరెన్సులు

ఉర్దూ మూలం "ఇస్లామ్ మే తసవ్వురె మసావాత్" గ్రంథకర్త సుల్తాన్ అహ్మద్ ఇస్లాహీ ఉపయోగించిన రిఫరెన్సు పుస్తకాల సూచిక

అరబీ

1. ఖుర్ఆన్
2. అబుల్ ఖాసిమ్ జారల్లాహ్ మహ్మూద్ బిన్ ఉమర్ జమ్ ఖ్షరీ : అల్ కషఫ్ అన్‌హఖాయక్‌ఉల్‌తంజీల్
3. అబూ జాఫర్ ముహమ్మద్ బిన్ రీరుల్ తిబ్రీ : జామిఅ అల్ బయాన్ ఫీ తఫ్సీరుల్ ఖుర్ఆన్, ఈజిప్ట్, మైమనా
4. ముహమ్మద్ అల్ రాజీ, ఫ్రుద్దీన్ : మఫాతీహుల్ గైబుల్ మారూఫ్ బిల్ తఫ్సీరుల్ కబీర్, ఈజిప్ట్, అల్ జహీరియా
5. ఇమాదుద్దీన్ అబుల్ ఫిదా ఇస్మాయిల్ బిన్ కసీర్ దమష్కీ : తఫ్సీరుల్ ఖుర్ఆనుల్ అజీమ్ అల్ మారూఫ్ బాబన్ కసీర్, ఈజిప్ట్, మక్తబ తజారియా
6. అబూబక్ర్ అహ్మద్ బిన్ అలీ ఆర్రాజిల్ జసాస్ : అహ్కాముల్ ఖుర్ఆన్, ఈజిప్ట్.
7. అబూబక్ర్ ముహమ్మద్ బిన్ అబ్దుల్లా అల్ మారూఫ్ బాబన్ అల్ అరబీ : అహ్కాముల్ ఖుర్ఆన్, ఈజిప్ట్
8. అహ్మద్ అస్సాది అల్ మాలికి : హాషియా అస్సాది అలల్‌జలాలీన్, ఈజిప్ట్
9. అబుల్ ఫజల్ షహాబుద్దీన్ మహ్మూద్ అల్ లూసీ : రూహుల్ మానీ ఫిల్ తఫ్సీరుల్ ఖుర్ఆన్ అల్ అజీమ్ వల్ బసీఉల్‌మసానీ
10. సయ్యద్ ముహమ్మద్ రషీద్ రజా: తఫ్సీరుల్ మనార్, ఈజిప్ట్.
11. సయ్యద్ కుత్బ్, ఫీ జలాలిల్‌ఖుర్ఆన్
12. ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ అల్ బుఖారీ, సహీ బుఖారీ
13. అబూ ముహ్సీన్ ముస్లిమ్ బిన్ హజ్జాజ్ నిషాపూరీ, సహీ ముస్లిం, ఢిల్లీ
14. సులైమాన్ బిన్ అషఅస్ అబూదావూద్ అసజస్తానీ: సనన్ అబూదావూద్
15. అబూ ఈసా ముహమ్మద్ బిన్ ఈసా తిర్మిజి : జామిఅ తిర్మిజి
16. అబూ అబ్దుర్రహీమ్ అహ్మద్ బిన్ షుఐబ్ బిన్ బహ్రాన్నుసాయీ : సనన్ నిసాయీ
17. అబూ అబ్దుల్లా బిన్ మాజా ఖజ్‌వీనీ : సనన్ ఇబ్నె మాజా
18. ఇమామ్ దారుల్ హజ్రతు మాలిక్ బిన్ అనస్ : ముతా ఇమామ్ మాలిక్ మఅ తన్వీనురుల్ హవాలిక్

19. అబూ ముహమ్మద్ అబ్దుల్లా బిన్ అబ్దుర్రహ్మానుద్దారి : సనన్ దారీ
20. జకీవుద్దీన్ అబూ ముహమ్మద్ అబ్దుల్ అజీమ్ మంజరీ : అత్తర్‌గీబ్ వత్తర్‌హీబ్
21. అబూ అబ్దుల్లా అహ్మద్ బిన్ ముహమ్మద్ హంబలీ : మస్నద్ అహ్మద్ బిన్ హంబల్.
22. వలీయుద్దీన్ ముహమ్మద్ బిన్ అబ్దుల్లా అల్ ఖతీబ్ తబ్రేజీ : మిష్కాతుల్ మసాబిహ్
23. అలల్ ముత్తఖా అల్లావుద్దీన్ అల్ హిందీ : కంజీలుల్‌అమాల్ ఫీ సనన్ అల్ అఖ్వాల్ వల్ అఫ్ఆల్.
24. షహాబుద్దీన్ ముహమ్మద్ బిన్ హజర్ అల్ అస్ఖలానీ : ఫతవుల్ బారీ,
25. అహ్మద్ బిన్ ముహమ్మద్ అల్ ఖతీబుల్ ఖిస్తానీ : అర్షాదుల్ బారీ బషరీ సహీ బుఖారీ
26. ముహీయుద్దీన్ అబూ జకరియ యహ్యా బిన్ షర్ఫుద్దీన్ నవవీ : షర సహీ ముస్లిం
27. అబూ సులైమాన్ అహ్మద్ బిన్ ముహమ్మద్ ఖితాబీ : ముఆలిముల్ సనన్
28. ముహమ్మద్ బిన్ ఇస్మాయిలులుల్ అమీర్ : సహల్ ఇస్లామ్ షర బులూగుల్ మరామ్.
29. ఫజలుల్లహ్ అల్ జీలానీ, ఫజలుల్లా అల్ సమ్దాని : తౌసీహుల్ అదబుల్ ముఫ్రద్
30. అహ్మద్ బిన్ అలీ బిన్ హజర్ అస్ఖలానీ: ఆద్దారియ ఫీ తఖ్రీజ్ అహాదిసుల్ హిదాయ.
31. షంసుద్దీన్ అబూ అబ్దుల్లా బిన్ ఖయ్యూమ్ : జాదుల్ మ ఆదనీహదీ ఖైరుల్ ఇబాద్.
32. బుర్హానుద్దీన్ అబుల్ హసన్ అలీ బిన్ అబీ బక్ర్ అల్ మర్గియాని : హిదాయ
33. షంసుద్దీన్ అబూ అబ్దుల్లా బిన్ ఖయ్యూమ్ జవాజీ : అల్లాముల్ మౌఖియీన్ అన్ రబ్బుల్ ఆలమీన్
34. అబూ అబ్దుల్లా ముహమ్మద్ బిన్ సాద్ : అత్తబఖాతుల్ క్రిబా
35. అజుద్దీన్ అబుల్ హసన్ హర్‌జమీ మారూఫ్ బాబనుల్ అషీర్: అసదుల్ గాబ ఫీ మారిఫతుల్ సహాబా
36. షంసుద్దీన్ ముహమ్మద్ బిన్ అహ్మద్ బిన్ ఉస్మాన్ జహబీ : సీరుల్లాముల్ నబలా
37. అహ్మద్ బిన్ యహ్యా బిన్ జాబిర్ బలాజరీ : ఫలవుల్ బలదాన్
38. అబుల్ ఖాసిమ్ హుస్సేన్ బిన్ ముహమ్మద్ రాగిబ్ అస్ఫహానీ: అల్ ముఫ్రూదాత్ ఫీ గరీబుల్ ఖుర్ఆన్
39. అబుల్ ఫజల్ జమాలుద్దీన్ ముహమ్మద్ బిన్ ముకర్రమ్ ఇబ్నె మంజూర్ : లిసానుల్ అరబ్

ఉర్దూ

40. అష్రఫుల్ థాన్వి : బయానుల్ ఖుర్ఆన్
41. అబూ అలా మౌదూదీ : తఫ్‌హీముల్ ఖుర్ఆన్

42. అబూ అలా మౌదూదీ : అల్ జిహాద్ ఫిల్ ఇస్లామ్
43. " " : ఇస్లామ్ ఔర్ జదీద్ మాషీ నజరియాత్
44. సులైమాన్ మన్సూర్‌పురీ : రహ్మతుల్లిల్ ఆలమీన్
45. అబుల్ బర్కాత్ అబ్దుల్ రౌఫ్ దానాపురీ: అసస్సీర్‌ఫీహదీ ఖైరుల్ బషర్
46. షిబ్లీ నూమాని : అల్ ఫారూక్
47. ఖాజా అల్తాఫ్ హుస్సేన్ హాలీ : ముసద్దసె హాలీ
48. సయీద్ అహ్మద్ అక్బరాబాది : ఇస్లామ్ మేం గులామీ కీ హకీకత్
49. సయీద్ అహ్మద్ అక్బరాబాది : గులామానె ఇస్లామ్
50. సయ్యద్ సబావుద్దీన్ అబ్దుర్రహ్మాన్ : బజ్మె మమ్లూకియా
51. ముహమ్మద్ నిజాతుల్లా సిద్దీకీ : ఇస్లామ్ కా నిజామ్ ముహాసిల్
52. సయ్యద్ జలాలుద్దీన్ ఉమ్రీ : ఔరత్ ఇస్లామీ మాషిరే మేం
53. మనుస్మృతి, నావల్ కిశోర్, కాన్పూర్
54. శ్రద్ధ ప్రకాష్ దేవ్‌జీ : బుద్ధదేవ్‌జీ కి సవానహ్ ఉమ్రీ ఔర్ బుద్ధ ధర్మ కా బయాన్
55. మౌల్వీ ముహమ్మద్ యాహ్యా తనహా : తారిక్ మగ్రిబీ యూరప్
56. కితాబ్ ముఖద్దస్, అనార్కలి, లాహోర్
57. అబుల్ అలా మౌదూదీ : ఖిలాఫత్ వ ములూకియత్

ఇంగ్లీషు

58. చాంబర్స్ ఎన్‌సైక్లోపిడియా
59. డా. భండారీ : హిస్టరీ ఆఫ్ యూరోపియన్ పొలిటికల్ ఫిలాసఫీ
60. ఫిలిప్ కే. హిటి : ది అరబ్స్ – ఏ షార్ట్ హిస్టరీ
61. మ్యానిఫెస్టో ఆఫ్ ది కమ్యూనిస్ట్ పార్టీ, మాస్కో, 1949
62. జె.యస్.షాపిరో : లిబరలిజం : ఇట్స్ మీనింగ్ అండ్ హిస్టరీ
63. ఇండియన్ కానిస్టిట్యూషన్

పత్రికలు

64. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఢిల్లీ
65. జందగీ, రాంపూర్
66. ఇస్లామిక్ మూమెంట్, ఢిల్లీ
67. ఖుర్‌ఆన్ ఆయతులు తెలుగు అనువాదం
దివ్యఖుర్‌ఆన్, అనువాదం హమీదుల్లా షరీఫ్, తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్.